3,4

| ద్వితీయ సంపుటము. | # గ్రంథాలయ సర్వస్వము. | 3, ౪, భాగములు. |
| --- | --- | --- |

ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘపక్షమున సంవత్సరమునకు నాలుగు సంచికలు చొప్పునఁ బ్రకటింపఁబడు గ్రంథము.

“ సాంఘికులందరు సంస్కారు లగుట
సంఘాభివృద్ధికి సత్సాధనంబు. ”

కార్యస్థానము: బెజవాడ.


చెన్నపురి
ఆంధ్ర పత్రికా ముద్రాలయమున
ముద్రింపఁబడియె.


వార్షికమూల్యము. రు 3-0-0]

[విడిసంచిక వెల రు 0-౧౨-0.

CB

# నవలలు-గ్రంథాలయములకు మంచి తరుణము.

రు 30 ల విలువగల 58 పుస్తకములు రు 20 లకే యిచ్చుచున్నాము.

నిలయమునఁ జందాదారులుగాఁ జేరినచో రు 30 ల పుస్తకములు రు 16 లకే యిచ్చెదము.

గ్రంథనిలయ మీవఱకు పెద్దవియు, చిన్నవియు, క్యాలికోబైండుకలవియు, పేపరుబైండుకలవియునగు 68 గ్రంథములను ప్రకటించినది. వానిలో 10 గ్రంథములు మరల ముద్రింపవలసియున్నది. ఇప్పుడునిలవయున్న 58 గ్రంథములుకూడఁ జాలఁదక్కువగనున్నవి. ముందుగదరఖాస్తుల నంపుకొన్న గ్రంథాలయములవారికే యీ పుస్తకములన్నియు దొరకును. ఆలసించినచో నవియును దొరకనేరవు. కాగితము దొరకకుండుటచే ఒక వత్సరమువఱకును ముద్రించుటకుకూడ వీలులేదు. వలసినవారు వెంటనే మాకు వ్రాసికొనవలయును. ఏవిధముగ చందాదారులుగ చేరకుండగాని, చేరిగాని మా గ్రంథములన్నియుఁ గావలయునని కోరువారు రు 5 లు ముందుగా అడ్వాన్సు పంపవలెను. వలయువారిట్లు వ్రాయుడు:—

కార్యదర్శి, ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయము,

నిడదవోలు, కృష్ణాజిల్లా.

---

# యం. ఆర్. కృష్ణరావు అండు కంపెని,

నెల్లూరు.

## న వ ల లు.

1. అమృతవల్లి వెల రు 1—4—0 లు. శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారిచే రచియింపబడినది. ఒక అరవ నవలనుండి భాషాంతరీకరణము. మిక్కిలి జాలిపుట్టించుచు రసవంతముగనుండును.
2. రంగరాజు వెల రు 0—12—0 గ్రంథకర్త:— ముత్తరాజు సుందరరామయ్యగారు, బి. ఏ. చంద్రగిరి రాజ్యమునకు సంబంధించిన చరిత్రవిషయక నవల.
3. జగన్మోహిని వెల 0—8—0
4. ఇందిరావసుంధరము వెల 0—8—0
5. మంజుమతి వెల 0—10—0

(3–5) ఈ మూడు నవలలను శ్రీయుత సోమరాజు రామానుజరావుగారిచే రచియింపబడినవి.

6. కళావతి వెల 0—12—0 శ్రీయుత దొడ్ల వేంకటరామరెడ్డిగారు రచియించిన నవల.

## జీ వి త చ రి త ము లు.

7. ఐదవజార్జిచక్రవర్తి
8. హార్డింజిప్రభువు
9. గోపాలకృష్ణగోఖలే

(7–9) ఈ మూడు గ్రంథములను శ్రీయుత మన్నేపల్లి రామకృష్ణరావుగారు రచియించిరి. వెల ప్రతి 1-కి 0—8—0. రాపరు బైండు.

10. స్వామిరామతీర్థ యం.ఏ.
11. మహాదేవగోవిందరాణడే

(10–11) ఈ రెండును శ్రీయుత పి. వి. రంగరావుగారు రచియించిరి. వెల ప్రతి 1-కి 0—8—0 రాపరు బైండు.

12. నివేదితాసోదరి గ్రంథకర్త:—శ్రీయుత కో. రా. కృష్ణమాచార్లుగారు, బి.ఏ. వెల ప్రతి 1-కి 0—8—0
13. రంగశతకము శ్రీమతి కంచనపల్లి కనకమ్మగారు రచియించిరి వెల 0—2—0

ఈ గ్రంథములను ఒకేపర్యాయము తెప్పించుకొనువారికి రు 7—8—0 లు వెలగల ఈ 13 గ్రంథములను రు 6 లకే యిచ్చెదము. తపాలా ఖర్చులు కొనువారే భరించవలయును.

RSVM01A107

## రాజపోషకులు

శ్రీ శ్రీ రాజా రావు వేంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దరుగారు

బెల్లంకొండ రాఘవరావుగారు, అగ్రహారంవారు

## పోషకులు

శ్రీ శ్రీ రాజా గోవిందకృష్ణయాచేంద్ర బహద్దరుగారు.

శ్రీ రాజా కొరటగిరి వేంకటకృష్ణారావు బహద్దరుగారు.

మోపాటి గంగరాజుగారు, జమీందారు, విస్సన్నపేట.

రొయ్యూరి రామచంద్రప్రసాదరావుగారు.

చిగురుపాటి వేంకటసుబ్బారావుగారు.

బాసి వేంకటకృష్ణయ్యగారు.

శ్రీ లక్ష్మీకాంత పుస్తకభాండాగారము, కొప్పురపాడు.

నాళం కృష్ణారావుగారు.

కుప్పా శ్రీరామశర్మగారు.

పోణకా పట్టాభిరామారెడ్డిగారు.

## అభిమానులు

చెలికాని లచ్చారావుగారు, జమీందారు, ఎర్నగూడెము వద్దరా.

అనుమంచిపల్లి గోపాలకృష్ణయ్యగారు, ప్రొప్రైటరు.

వెద్దిభొట్ల వీరయ్యగారు, బి.ఏ., బి.యల్.

అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బి.ఏ., బి.యల్.

సూరి వేంకట నరసింహశాస్త్రిగారు, బి.ఏ.

గూటాల లక్ష్మణరావుగారు. ఎం.ఏ.

అద్దంకి సత్యనారాయణ శర్మగారు

గొడ్డపాటి హనుమంతరావుగారు.

చట్టి నరసింహారావుగారు.

## సహాయులు

పోటు వేంకటరత్నం నాయుడుగారు.

# విషయసూచిక


ప్రబోధము (పద్యములు)
రాయప్రోలు సుబ్బారావుగారు ౧౫౩

భారత భాషకును నేఁటి గ్రాంధిక భాషకును భేదము ,,
మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు

కావేరి (పద్యములు) ౧౬౦
అబ్బూరి రామకృష్ణారావుగారు

కట్టావరదరాజేంద్రుఁడు ,,
వంగూరి సుబ్బారావుగారు

విజయనగరాంజనేయము (పద్యములు) ౧౬౩
తాపీధర్మారావుగారు బి. ఏ.

గ్రంధవిమర్శనము:—
రూపలత ౧౬౫
క్రొవ్వుటాకులు ౧౯౬
అపూర్వసంఘసంస్కరణము ౨౨౭
చిత్రలేఖనము ౨౨౯

లవకావ్యము ౧౬౮
రామకృష్ణకవులు

నాల్గవ ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల మహాసభ ౧౭౧
ప్రథమదినచర్య ,,
ఆహ్వానసంఘాధ్యక్షుల ఉపన్యాసము ౧౭౨
అధ్యక్షుల ఉపన్యాసము ౧౭౪
స్వాగతము ౧౮౩
ఆంధ్రదేశగ్రంథాలయ సంఘవృత్తాంతము ,,
ద్వితీయదినచర్య ౧౯౦
ఆహ్వానసంఘముయొక్క జమాఖర్చు ౧౯౩
పత్రికాభిప్రాయములు ,,

బాల్యస్మృతి (పద్యములు) ౧౯౯
వింజమూరి రంగాచార్యులుగారు బి. ఏ.

ఆంధ్రపరిశోధక మహామండలి ౨౦౧

గోదావరీమండల గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ ౨౦౬

గీతాసుమాంజలి ౨౧౦
బసవరాజు అప్పారావుగారు బి. ఏ.

గుంటూరుమండల గ్రంథాలయ ప్రతినిధుల ద్వితీయమహాసభ ౨౧౧

చిన్నినారాజ (పద్యములు) ౨౧౨
అధికార్ల సూర్యనారాయణరావుగారు బి. ఏ. బి. ఎల్.

కృష్ణా జిల్లాయందలి గ్రంథాలయోద్యమము
దుగ్గిరాల వేంకటసుబ్బయ్యగారు ౨౧౩

గ్రంథాలయము ౨౧౫
వల్లూరి సూర్యనారాయణరావు గారు బి. ఏ. బి. ఎల్.

యౌవనము ౨౧౬

గంజాంమండల గ్రంథాలయోద్యమము ౨౧౭

బాపట్లతాలూకా గ్రంథాలయసంఘము ౨౧౮

కాకినాడతాలూకా గ్రంథాలయమహాసభ ౨౨౦

హితార్థదాయినీ గ్రంథాలయము ౨౨౧

శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయము బారువ ౨౨౨

శ్రీకృష్ణదేవరాయ పుస్తకనిలయము చెరుకుమిల్లి ౨౨౪

ఆంధ్రవాణీగ్రంథాలయము ౨౨౫

కన్నెముద్దు (పద్యములు) ,,
అధికార్ల సూర్యనారాయణ రావుగారు బి. ఏ. బి. ఎల్.

భారతీయుల ప్రార్థన (పద్యములు) ౨౨౬
కాళ్లకూరి గోపాలరావుగారు

విజ్ఞప్తి ౨౩౧


---

# చిత్రపటములు

## నాల్గవఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ


౧ ఆహ్వానసంఘాధ్యక్షులగు ఏ. పి. పాత్రోగారు ౧౫౩

౨ అధ్యక్షులగు ఆనరబిల్ భూపతిరాజు వేంకటపతి రాజుగారు ౧౫౩

# ప్రతిపుస్తకభాండాగారమున నుండఁదగిన నాటకములు.

బళ్లారి వార్డ్లా హైస్కూలు ప్రధానాంధ్రపండితులుగ నుండిన బ్రహ్మశ్రీ, పండిత, కే. సుబ్రహ్మణ్యశాస్త్రుల వారిచే రచియింపఁబడి, నాటకసమాజములలో నెల్ల మొదటిదని ప్రసిద్ధిగాంచిన బళ్లారి సరసవినోదినీసభచే చెన్నపురి, బెంగుళూరు, బెజవాడ, విశాఖపట్టణము, మచిలీపట్టణము, నెల్లూరు మొదలగుచోట్ల ప్రదర్శింపఁబడి నాటకరాజములని ప్రసిద్ధివడసినవి.

## ౧. శ్రీకృష్ణలీల.

దేవకి వివాహము మొదలు కంసుని మరణము వఱకు వ్రాయఁబడి యున్నది. పాతివ్రత్యోపదేశము, శ్రీకృష్ణుని బాలక్రీడలు, గోపికల కాతని యుపదేశము మొదలగునవి యిందలి ముఖ్యాంశములు. దేవకీకంసుల సంభాషణమును చదివిన నెట్టి కఠినహృదయముఁ గలవారైనను కంటఁ దడి పెట్టకపోరు. వెల ప్రతి 1-కి రూ 1—4—0

## ౨. లవ - కుశ.

ఇందలి ముఖ్యాంశములు. (1) భరతరాజ్యనివేదనము. (2) ఆంజనేయునిభక్తి (3) చాకలివాని మాటలపై రాముఁడు సీత నడవులకుఁ బంపుట. (4) లక్ష్మణుని దుఃఖము. (5) లవ-కుశకుమారుల ధైర్య స్థైర్యములు మొదలగునవి. ప్రతి బాలుఁడును, ప్రతిస్త్రీయును దీనిని తప్పక చదువవలెను. నాటకమున విశేషభాగము శోకరసముచే నిండి చదువువారిని వినువారిని తప్పక ఏడ్పించినను, లవ-కుశ కుమారుల బాలక్రీడలును, రామలక్ష్మణ శత్రుఘ్నులతో వారి సంభాషణమును కడుపుబ్బ నవ్వుఁ బుట్టించును. శైలిఁ జూపుటకై రెండు పద్యములమాత్ర మిందుఁ జూపెదము:—

"సీ. చిన్ననాఁటనుగోలె నిన్నె దైవముగాఁగ
నెన్నియుండిన భక్తి నెన్నవలదె
అల రావణునిబాధ లన్ని నేనోర్చి నీ
కొఱకునై మనుట యింతరయవలదె
బంధులరాజ్యంబుఁ బాసి నే నీవెంట
కానకువచ్చుట కాంచవలదె
అనదయే, దీనయే, అబల గర్భిణియంచు
నను బ్రోవ సత్కృపఁ గనఁగవలదె
గీ. మనసు రాయియె నీకు నో మనుజపాల
భువననుతనామ రవికులాంబోధిసోమ
దానవవిరామ సత్కృపోదారసీమ
రమ్యగుణధామ శ్రీరామ రామ రామ."

"సీ. నినుఁజూచి కదలనేరని మృగంబులు నీకుఁ
గాపు చేసెడివారె కన్నతల్లి
చరియించు భల్లూకసతులు పేరంటము
ముత్తైదువలె నీకు భువనజనని
కనరాని యీముండ్లకంపల నీడలు
రమణీయనగరులే రామపత్ని
వెక్కసంబుగఁ దోఁచు నక్కలకూఁతలు
పుణ్యాహఘోషమే భూమిపుత్రి
గీ. వేఁడికన్నీట ముంచునీ యేడ్పుదినము
ఒప్పు సీమంత పుంసవనోత్సవంబె
మాత, యో త్రిభువనమాత, మహితజాత
నిరతగుణజాత యోసీత పరమపూత.

వెల ప్రతి 1-కి రూ 1—4—0

ఆంధ్ర గ్రంథాలయము, **The Andhra Publishing House.**

తపాలుపెట్టె 73 సి, చెన్నపురి. **Post Box 73 c, MADRAS.**

## 3. విభీషణ పట్టాభిషేకము.

(లంకాపహారము)

ఇందు శ్రీరాముఁడు వాలిని సంహరించిన పిదప సుగ్రీవుఁడు సీతాన్వేషణమునకై తిన సైన్యముఁబంపునది మొదలు, విభీషణుఁడు రాముని శరణుఁ జొచ్చువఱకు నున్నది. పై రెండు నాటకములను చదివిన వారు దీనిని తప్పక తెప్పించుకొనెదరు. దీని విషయము నే నెక్కువ వ్రాయ నక్కరలేదు. కాగితముల కఱవువలన కొలఁది ప్రతులు మాత్రమే ముద్రింపఁబడుచున్నవి. శీఘ్రముగా దరఖాస్తులు పంపినఁగాని పుస్తకములు దొరకుట దుర్లభము.

వెల ప్రతి 1-కి రూ 1—4—0

బళ్ళారి సరసవినోదినీసభను స్థాపించిన వారలలో నొకరై, ఆ సభకు ప్రెసిడెంటుగనుండి, పెక్కు నాటకముల రచియించి,

"ఆంధ్రనాటక పితామహుఁడు" అను పేరును వహించిన కీర్తిశేషులైన

## బళ్లారి. ధ. కృష్ణమాచార్యులవారి నాటకములు.

(1) చిత్రనళీయము (2) ప్రహ్లాద (3) విషాద సారంగధర (4) ప్రమీల (5) పాదుకాపట్టాభిషేకము (6) చంద్రహాస (7) ముక్తావళి (8) సావిత్రి (9) బృహన్నల (10) వరూధిని. ప్రతి 1-కి రూ 1-2-0

హైదరాబాదు హైకోర్టువకీలు ధర్మవరము గోపాలాచార్యులవారిచే రచియింపఁబడినది.

## రామదాసు నాటకము.

ఇప్పటి కొండపల్లె యనెడి గ్రామమునందు జన్మించి భద్రగిరియందు కైంకర్యముచేసిన గోపన్న యనుపేరుగల రామదాసుగారి వైభవమును తెలుపుచు వ్రాయఁబడినది. అందందు తురుష్కభాష యుపయోగింపఁబడి ప్రక్కననే అర్థము సైతము వ్రాయఁబడియున్నది. ప్రతిహైందవుఁడును దీనిని తప్పక చదువవలెను. వెల ప్రతి 1-కి రూ 1-2-0

## ఇతరుల నాటకములు.

| | |
|---|---|
| (1) శ్రీకృష్ణరాయవిజయము | 1-0-0 |
| (2) శాకుంతలాదుష్యంతము | 0-8-0 |
| (3) శమంతకమణి విజయము | 0-8-0 |
| (4) చెంజియుద్ధము | 0-8-0 |

## రామాయణ సంగ్రహము

ఈ గ్రంథము వాల్మీకిరామాయణము ననుసరించి, సంగ్రహముగా సలక్షణమైన తేటతెనుఁగున వ్రాయఁబడినది. కావున స్త్రీలును, బాలురును, సులభముగా జదివి సువ్యక్తముగ పూర్వ ప్రాచీన గ్రంథాభిప్రాయములను తెలిసికొనుటకు నింతకంటె మించిన పరికర మొకటి లేదు. 10 చిత్రపటములతోడి యీ పుస్తకము మేలైన కాగితములపై నచ్చొత్తఁబడి 584 పుటలను గలిగినది. క్యాలికోబైండు. వెల 1—4—0

అన్నిటికిని పోస్టేజి ప్రత్యేకము.

పై నాటకములే గాక యేలాటి సంస్కృతాంధ్రగ్రంథములు గాని మాయొద్ద దొరకును. క్యాటలాగు ఉచితముగా పంపబడును. ఇంగ్లీషు పుస్తకములనుకూడ మేము సప్లయి చేయగలము. ధరలలో వ్యత్యాసముండదు.

## కావలెను.

పుస్తకములను కమిషను వ్యాపారమున కొనఁగలవారును, నవలలు గాని, నాటకములు గాని మఱి యేలాటి ఆంధ్రగ్రంథములు గాని వ్రాసియిచ్చు పండితులును కావలెను. మాకు వ్రాసి షరతులను తెలిసికొనవచ్చును.

## ఆంధ్రగ్రంథాలయము,

తపాలుపెట్టె 73 సి, చెన్నపురి.

**The Andhra Publishing House,**


**Post Box 73 c, MADRAS.**

Andhra Patrika Press, Madras

חלת

# నాల్గవ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

బారువ



ఆహ్వాన సంఘాధ్యక్షుడు లగు
ఏ. పీ. పాత్రోగారు
బి. ఏ. బి. ఎల్.



అధ్యక్షుడు లగు
భూపతిరాజు వేంకటపతిరాజుగారు
బి. ఏ. బి. ఎల్.

# గ్రంథాలయ సర్వస్వము

## ప్రబోధము

సీ. అమరావతీపట్ట । ణమునబౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాఁడు
ఓరుగల్లున రాజ । వీరలాంఛనముగాఁ
బలుశస్త్రశాలలు । నిలుపునాఁడు
విద్యానగరరాజ । వీథులఁ గవితకు
పెండ్లిపందిళ్లు క । ప్పించునాఁడు
పాటూ్నరికి సమీప । ముననాంధ్రసామ్రాజ్య
దిగ్జయస్తంభ మె । త్తించునాఁడు

గీ. ఆంధ్రసంతతికే మహి । తాభిమాన
దివ్యదీక్షాసుఖస్ఫూర్తి । తీవరించె
నామహావేళ మర్థించి । యాంధ్రులార
చల్లుఁడాంధ్రలోకమున న । క్షతలు నేఁడు.

సీ. తనగీతి యాఱవ జా । తిని పాటకులనుగా
దిద్ది వర్థిల్లిన । తెనుఁగువాణి
తనపోటులు విరోధి । తండంబులకు సహిం
పనివిగా మెరసిన । తెనుగుకత్తి
తనయందములు ప్రాం । తజనులకభిరుచి వా
సన నేర్ప నలరిన । తెనుగురేఖ
తనవేణికలు వసుం । ధరను సస్యశ్యామ
లనుజేయఁ జెలఁగిన । తెనుగుభూమి

గీ. అస్మదార్ద్రమనోవీథి । నావహింప
జ్ఞప్తికెలయించుచున్నాడ! । చావలేదు
చావలేదు ఆంధ్రులమహో । జ్జ్వలచరిత్ర
హృదయములు చీల్చి చదువుడో । సదయులార!

సీ. కృష్ణాతరంగ పం । క్తిఁ త్రొక్కి త్రుళ్లింత
నాంధ్రనాకలు నాట్య । మాడునాఁడు
ఇంటింట దేశ సా । హిత్య దీపములతో
నాంధ్రతేజస్సు రా । పాడునాఁడు
సుకుమారశిల్ప వ । స్తు ప్రపంచమునందు
నాంధ్రనైపుణి పంత । మాడునాఁడు
జార్జిసేనావ్యూహ । జయపతాకల క్రింద
నాంధ్రపౌరుషము చెండాడునాఁడు

గీ. చూచి, సంతోషమున తల । లూఁచి, గర్వ
మూచి, ఆంధ్రపుత్రీపుత్రు । లందఁగలరు
శాంతి నందాక లేదు వి । శ్రాంతి మనకు
కంకణవిసర్జనల । కిది కాలమగునె?

—రాయప్రోలు సుబ్బారావు.

## భారతభాషకును నేటి గ్రాంధికభాషకును భేదము

వ్యావహారికభాషకును, గ్రాంధికభాషకును పరస్పర వైషమ్యము కలిగి, దెబ్బలాడుకొనుచుండే ఈకాలములో ఉభయపక్షాలవారూ తమపక్షమే బలముగలదని నమ్ముకొనుచున్నారు. కాని, వాదమువిషయమై ఎంత దెబ్బలాడుకొనుచున్నా, ఉభయపక్షాలవారికీ భారతమే ప్రమాణమైఉన్నది. నన్నయభట్టుగారి భారతము ౧౧-వ శతాబ్దములో ఉండే వ్యవహారభాష ననుసరించివ్రాయబడ్డా, నన్నయభట్టుగారు భాషను శాసించి వేసినారనీ, అప్పటినుండీ భాష మరిమారలేదనీ, కాబట్టి భాగతము ఏభాషలో వ్రాయబడ్డదో ఆభాషే మనకు ప్రమాణ

మనీ, ఆభాషలో నే గ్రంథాలు వ్రాయవలెననీ, గ్రాంధిక వాదుల ఉద్దేశము. నన్నయభట్టుగారి భారతము ఆకాలములో వ్యావహారికభాషలో వ్రాయబడడమే కాక, తరువాత కవులందరూ వ్యవహారము ననుసరించి భాష మార్చుకొనుచు వచ్చిరనీ, నేటిగ్రాంధిక భాషకూ నన్నయభట్టుగారి గ్రాంధిక భాషకూ చాలా వ్యత్యాసము ఉన్నదనీ, వ్యవహారభాషకు సమీపముగా ఉన్న గ్రంథాలే జనసామాన్యముచే ఆదరింపబడుననీ, కాబట్టి వ్యావహారిక భాషలోనే గ్రంథాలు వ్రాయవలెననీ, వ్యావహారిక భాషావాదుల ఉద్దేశము. నన్నయభట్టుగారి ఆంధ్రశబ్ద చింతామణి భాషనంతా శాసించుననీ మొదటివారందురు. నన్నయభట్టుగారాంధ్రశబ్దచింతామణి వ్రాయనేలేదనీ, నన్నయభట్టీయములో శాసింపబడని ప్రయోగాలు వేలకు వేలు ఇతరకవుల గ్రంథాలలో ఉన్నవనీ, రెండవవారి మతము. ఈవాదాలన్నీ అలాగు ఉంచి, నిజముగా భారతభాషకూ, ఇప్పటి గ్రాంధికభాషకూ, భేదము ఉన్నదా లేదా, అన్న సంగతి ఆలోచింతము.

అయితే, ఇక్కడ పెద్ద చిక్కొకటి ఉన్నది. భారతము-భారతము అని అందరూ పెద్దపెద్ద కబురులు చెప్పెదరు. కాని, నిజముగా నన్నయభట్టుగారి భారతము ఇది, వాగనుశాసనుడి మతము ఇది, అని చెప్పగలిగే భారతము నాకొకటీ కనుపడలేదు. అచ్చుపుస్తకాలు నెల్లూరిప్రాంతాలలో ఉండే తాళగ్రంథాల ననుసరించి, చిన్నయసూరిగారి మతాన దిద్దివేసి సంపాదకులు అచ్చువేసినారు. ఇక, మరోవిరుద్ధమైన మార్పు ఉన్నది. మాతాతగారి తండ్రిగారు, కామకవిగారు గొప్పవిద్వత్కవులు. వారుభారతము స్వయముగా వ్రాసుకొన్నారు. కాని, అచ్చుపడ్డ భారతానికీ, వారి ప్రతికీ ఎంతో భేదము ఉన్నది. వారు విద్వాంసులు గనుక, వారి ఇష్టానుసారము వారు దిద్దివేసినారు. వారి ప్రతిచూచి, వారిశిష్యులూ, స్నేహితులూ, ప్రతులు వ్రాసుకొన్నారు. కాబట్టి పాలతేరు ప్రాంతాలలో దొరికేతాటాకు పుస్తకాలన్నీ కామయ్యగారి మతము అనుసరించే ఉన్నవి. ఇందుచేత మనకో నీతి బోధపడుచున్నది. పండితులు వ్రాసుకొన్న పుస్తకాలు నన్నయభట్టుగారి మతము నిజముగా తెలియ జేయవని కాబట్టి, నేను బహుప్రయాసముతో విద్వాంసుడు కాని వాడొకడు వ్రాసుకొన్న గ్రంథము సంపాదించినాను. ఇది నూరేండ్లకుపూర్వము వ్రాయబడ్డది. దీనిలో లేఖక ప్రమాదాలు విడిచిపెట్టి తక్కినభాగాలుచూచితే అచ్చుపుస్తకాలలో పాఠాలకన్న సరసమైన పాఠాలు కనిపించును. లేఖకుడు సంస్కారికాడుగనుక, సంస్కర్తకూడా కాలేదు.

ఇక, అచ్చుపుస్తకాలకూ ఈతాళగ్రంథానికీ భేదము కొంచెము చూతము. ఈతాళగ్రంథములో వచనభాగమంతా అచ్చుపుస్తకములో వచన భాగము కంటె చాలా భిన్నముగా ఉన్నది. కొన్నిచోట్ల కలియనే కలియదు. అచ్చు పుస్తకములో ఉండే కొన్నిపద్యాలు వ్రాతపుస్తకములో కనుపడవు. వ్రాతపుస్తకములో ఉండే పద్యాలుకొన్ని అచ్చుపుస్తకములో కనుపడవు. కొన్నిపద్యాలు సగముసగము భేదముగా ఉన్నవి. కొన్నిపద్యాలలో కొన్నికొన్ని శబ్దాలు మాత్రమే భేదించును. దాఖలాలు కొంచెము చూపెదను.

౧. అచ్చు: అనవరత మహామహీరాజ్యసుఖంబు లనుభవించుచు

వ్రాత: అనవరతంబును మహారాజ్యసుఖంబు లనుభవింపుచుండి.

౨. అచ్చు: మంత్రి పురోహిత సేనాపతి దండనాయక దౌవారిక మహాప్రధానానంత సామంతే విలాసినీ పరివృతుండై

వ్రాత: సేనాపతి దండనాయక మహా ప్రధానానంత సామంత శ్రీమంతినీ పరివృతుండై

3. అచ్చు: వివిధతర్కవిగాహిత సమస్తశాస్త్ర సాగరగరీయ ప్రతిభులైన తార్కికులును

వ్రాత: వివిధ వితర్కితగాహిత సమస్త శాస్త్ర పారీణ సార గరీయ ప్రవీణులైన తార్కికులును.

౪. అచ్చు: విద్యావిలాసగోష్ఠి సుఖోపవిష్టు డైయిష్ట
కథా వినోదంబులనుండి

వ్రాత: విద్యావిలాసుండును, సుఖోపవిష్టుండు నై
యిష్టనైష్టిక వినోదంబులనుండి

ఈ వైభేదాలన్నీ ఒక్కచిన్న వచనములోనే ఉన్నవి. ఇక, పద్యాలలో భేదాలు చూడండి.

౧. అచ్చు: అచలితతారకా సముదయంబుల నెన్నను

వ్రాత: అమరనదీసుతా సముదయంబుల నెన్నను

౨. అచ్చు: దానములను బహువిధ క్రతుహుతజప
బ్రహ్మచర్యములను బడయఁబడిన
పుణ్యఫలము వడయఁబోలు నశేష పా
ప క్షయంబునగు శుభంబు పెరుగు.

వ్రాత: దానఫలములను బహువిధ క్రతువుల
బ్రహ్మచర్య వ్రతమునను బడయఁబడిన
పుణ్యఫలములఁ బడయుచో భువి నశేష
పాపహారమగుఁ బ్రజకు శుభంబు పెరుగు.

3. అచ్చు: భాను ప్రభులగు పాండు సు
హీనాధాత్మజుల లక్ష్మియెల్లను నీకు
నే నపహరింతు నిపుడు ధ
రానుత etc.

(ఈ వైపద్య మొక్కటియే "నన్నయభట్టారకుఁడు" 'నేను' అను సర్వ నామముపయోగించెనను వారి వాదమున కాధారమైయున్నది.)

వ్రాత: భాను ప్రభులగు పాండు సు
హీనాధాత్మజుల లక్ష్మియెల్లనుదగ నీ
కే నపహరింతు నిపుడు ధ
రానుత etc.

(ఈపాఠమున 'ఏను' అనియే యున్నదిగాని, 'నేను' అని లేదు నన్నయభట్టు 'ఏను' అను రూపమే గాని, 'నేను' అనురూపము నుపయోగింపలేదని మాసిద్ధాంతము.)

౪. అచ్చు: గురుకులమునందు గురులకుఁ
బరిచర్యలొనర్చి తా నపరిమిత నిష్ఠా

వ్రాత: గురుకులమునందు గురులకుఁ
బరిచర్య లొనర్చుచున్న పరిమిత నిష్ఠా

(ఇందు, 'ఉక్సంశ్లేషానాచి ద్రుతస్య' యను సూత్రమునకు విరోధముగా సంశ్లేషము ద్రుతమునకుఁ గను పట్టుచున్నదని సంపాదకు లచ్చులో దిద్దియుందురు. అది నిజమేని, "అన్నిష్టసఖి", "అన్నేటి తరగలు", "ఎన్నఁడున్నేని" అను పాఠము లేల దిద్దలేదో!) ఇట్టి భేదము లెన్నో కలవు. ఇక, సరసములైన పాఠాలు చూడండి.

౧. అచ్చు: రగునిది తగదని యెదలో వగవక.

వ్రాత: తగునని తగదని యెదలో వగవక.

(ఇందు అచ్చుపాఠములో రెండు క్రియలకు ఏకకర్తృవాక మన్వయింపవలసి ఉన్నది. వ్రాత పాఠములో ఆ లోపము లేదు.)

౨. అచ్చు: కృతభోజనుండవై పొమ్మని క్షణియించిన
నొడంబడి.

వ్రాత: కృతభోజనుండవై పొమ్మని క్షణంబిచ్చిన
నొడంబడి.

(ఇందు 'క్షణియించుట' అనేధాతువు "నిమంత్రణముచేయుట" అనే అర్థమున ఉపయోగింపబడ్డది. కాని, సంస్కృతములో కూడ, 'క్షణందత్వా' అని నామరూపమే ఉపయోగింపబడుచున్నది. కాబట్టి 'క్షణియించిన, అనేపాఠముకన్న 'క్షణంబిచ్చి' అనే పాఠమే సరసముగా ఉన్నది).

3. అచ్చు: కుండలమ్ములు వేగకొనిరమ్ము నాలవనా
టికి నని పూనినన్నుఁబనిచెఁ
గురుపత్ని నేఁడ యక్కుండలంబులు దొడ్గ
దివస మీదివస మతిక్రమింప

వ్రాత: కుండలమ్ములు వేగ కొనిరమ్ము నాలవు
నాటికి ననిపూని నన్నుఁబనిచె
గురుపత్ని నేఁడ యకోకమలికడకేగు
దివస మీ దివస మతిక్రమింప

(ఇందులో అచ్చుపాఠముకన్న వ్రాతపాఠము ఎంత సరసముగా ఉన్నదో చూడండి. అచ్చుపాఠములో మూడు లోపాలు ఉన్నవి.

(a) 'నాలవనాటికి' అని ఉన్నది. 'మూఁడవు' 'నాలవు' అని, అవు శబ్దముతో నన్నయభట్టు ఎప్పుడూ ప్రయోగించడము సంప్రదాయము. కాబట్టి అచ్చులో ఉన్న 'నాలవ' అనేది తప్పు. వ్రాతలో ఉన్న 'నాలవు' అనేది ఒప్పు.

(b) 'నేఁడ యక్కుండలంబులుదొడ్గు దివసము' ఇందు, ఉతంకుని నాలుగవనాటికి రమ్మని గురుపత్ని సెలవిచ్చినది. కాని, తాను కుండలము లెప్పుడు తొడుగుకొనునో అసంగతి చెప్పలేదు. కాబట్టి, "నేఁడ యక్కుండలంబులు దొడ్గుదివసము" అని ఉతంకుడు చెప్పడము స్వభావవిరుద్ధము. కాబట్టి, వ్రాతపుస్తకములో ఉన్న "నేఁడ యక్కోఁరులికడకేగు దివసము" అనేపాఠమే సరసమైనది.

(c) 'తొడ్గు' అనే క్లిష్టపదము అచ్చుపాఠములో కలదు. (వ్రాతపాఠములో అదిలేదు.)

౪. అచ్చు: శ్రీమహాభారతంబునందలి యభిప్రాయంబు
విన నభిలాష పెద్దయైయుండు.

వ్రాత: శ్రీమహాభారతంబునందుల యభిప్రాయంబు
తద్దయుం గలిగియుండు.

ఆంధ్రశబ్దచింతామణిలోని "శేరలిచ" అనే సూత్రానికి భారతములో (నన్నయభాగములో) పద్యాలలో ఉదాహరణ కనుపడదు. కాబట్టి "అందలి" అనే అచ్చుపాఠము తప్పు. "అందుల" అనే వ్రాతపాఠము ఒప్పు. ఇక, "మహాభారతంబునందలి యభిప్రాయంబు విన నభిలాష పెద్దయైయుండు" అనేదానికన్న, "మహాభారతంబునందుల యభిప్రాయంబు తద్దయుంగలిగియుండు" అనేది యెంతసరసమైన అర్థమిచ్చుచున్నదో ఆలోచించండి.

౫. అచ్చు: చిత్రలలితగతినొప్పు నేనూరుగాడిదలును
సింధు.

వ్రాత: చిత్రలలితగతినొప్పు నేనూరుగాడీలుసింధుజ

(ఇందు గాడీలు అనేశబ్దము వూండ్లరామకృష్ణయ్య పంతులుగారు మొదలుకొని, కల్లూరు వేంకటరామశాస్త్రిలుగారి పర్యంతముగల విద్వాంసుల కందరికీ అన్యభాషా శబ్దాలనుగురించి ప్రమాణమై ఉండగా గాడిదలని అచ్చులో దిద్దడానికి కారణమేమి? గాడీలు అనగా ఎద్దులబళ్ళు అని అర్థము. ఇది ఉత్తరహిందూస్థానములో వాడుకలో ఉన్నదిగాని, తురక పదము కాదు. తురకపదమని భ్రమపడి, పదకొండవ శతాబ్దములో తురకపదాలు భాషలోకి రావడము స్వభావ విరుద్ధమని ఆలోచించి, సంపాదకులు దిద్ది ఉందురు. ఈలాగు దిద్దివేయుచుంటే, భాషకు ఏమిగతి?)

ఇట్టివి వందలకొద్దీ చూపవచ్చును.

ఇక, విడిచిపెట్టిన పద్యాలు చూడండి.

౧. సుప్రసిద్ధమైన "పాయక పాకశాసనికి" అనే పద్యం వ్రాతలో లేదు. సందర్భముకూడ దాని ననుసరించే మారి ఉన్నది.

౨. "పదిదినము లైదుప్రొద్దులు" అనే పద్యం వ్రాతపుస్తకములోలేదు. ఇది అధర్వణకృతభారతములోనిదని కొందరు లక్షణకర్తలన్నారు. ఇది పునరుక్తి అని కొందరు ఇదివరకే వాదించినారు. అచ్చుపుస్తకాలలో మరల ఎందుకు ఎక్కించినారో తెలియదు.

3. ఆదిపర్వము తృతీయాశ్వాసములోని,

క. లోకోత్తర చరితుండగు
శాకావ్యతనూజ నీకు నారాధ్యను నేఁ
బ్రాకటభూసురకన్యక
నీకట్టినమైలఁగట్ట నేర్తునె యనినన్.

అనేపద్యం వ్రాతపుస్తకములో లేదు. సందర్భము గాని ననుసరించే మారి ఉంది.

పై కారణాలనుబట్టి, నిజముగా నన్నయభట్టు మతము ఇది అని తెలిపేది అచ్చుభారతమా? అప్పకవి, కొమకవి మొదలైన పండితులు దిద్దిన వ్రాతప్రతులా? దిద్దడానికి సామర్థ్యములేని పాఠకులు వ్రాసుకొన్న ప్రతులా? ఈసంగతి మొదట నిర్ధారణఅయి, నిజమైన "నన్నయభట్టుగారి భారతము" ఏర్పడితేగాని భార

తము ప్రమాణముగా అంగీకరించడానికి బొత్తిగా వీలు లేకుండ ఉన్నది. కాబట్టి మాకు భారతము ప్రమాణము, మాకు భారతము ప్రమాణము - అనే పండితులు, అర ణ్యములో పడిపోయిన నన్నయభట్టుగారి భారతము నిజమైనది పైకి తీసుకొనివచ్చి, ఆపైని తమ వాదాలు ఆరంభించితే బాగుండును. ఆపని మానివేసి, ఎవరిపుస్తకాలు వారే ప్రమాణముచేసుకొనుచు, ఒకరితో ఒకరు దెబ్బలాడుకొనుచు, అవసరములేని స్థలాలలోను, తమకు తెలియని స్థలాలలోను, దిద్దివేసి, యిష్టమువచ్చినట్లల్లా పుస్తకాలు అచ్చువేయుచు, సబబుసందర్భము లేని అచ్చుపుస్తకాలన్ని ప్రమాణమని అంగీకరించుచు, నేల విడిచి సాముచేయడము ఎంతమాత్రము ప్రయోజనము లేదు. అది అలాగు ఉండనీయండి.

ఇక, భేదాలు లేకుండ ఉన్న భాగములలో, నన్నయ భట్టుభాషకూ, ఇప్పటి గ్రాంధికభాషకూ, ఎంత భేదము ఉన్నదో చూతము.

౧. ఉ. ఇమ్ముగ సర్వలోక జనులెవ్వనియేని
ముఖామృతాంశుబిం
బమ్మున నుద్భవం బయిన భారత వాగ
మృతంబు, కర్ణరం
ధ్రమ్మను నంజలిందవిలి త్రావుదు రట్టి
మునీంద్రు లోక వం
ద్యుం బరముం బరాశరసుతుం బ్రణమిల్లి
కరంబు భక్తితోన్.

ఇందు, "ఎవ్వనియేని ముఖామృతాంశు బింబమ్మున నుద్భవంబయిన భారత వాగమృతంబు త్రావుదురు" అనే నన్నయ వాక్యము ఈ కాలపు గ్రాంధికభాషలో అలాగే వ్రాయుచున్నారా? "ఎవ్వని వాగమృతంబు త్రావుదురో" అనికదా ఆధునిక గ్రాంధిక రూపము. నన్నయ గ్రాంధికానికిన్నీ, ఇప్పటి గ్రాంధికానికిన్నీ ఎంతభేదము ఉన్నదో చూడండి. ఇదిగాక, "పరాశరసుతుం బ్రణమిల్లి" అని, ప్రణమిల్లి అనే క్త్వార్థకము ద్వితీయతో అన్వయము చేసినాడు. ఇప్పుడెవరైనా అలాగు వ్రాయుచున్నారా! "సుతునకుం బ్రణమిల్లి" అని షష్ఠితోగదా అన్వయించెదరు. ఎంత భేదమో చూడండి.

౨. ఇట్టి మహాత్మునకుం గాంచిం
ఈ రూపమెవరైనా వ్రాయుచున్నారా? "ఈంగల్గిరి" అనేదిగదా ఆధునిక గ్రాంధిక రూపము.

3. పాపులు పంచత్వము నచిరంబునొందుదురని.
దీని ఆధునిక రూపము "పంచత్వము పొందెదురని"

౪. ఇది వడిగలదు మనసుకంటె గొడ్డుకంటె
ఇందు 'కలదు' అనేక్రియకు కర్త 'ఇది' యనే సర్వనామము. ఇప్పటి గ్రాంధికరూపము, "దీనికి వడిగలదు" ఇట్లే, "ఏను నేర్పగలను" అనేది "నాకు నేర్పగలదు" అనీ, "నీవు నేర్పగలవు" అనేది "నీకు నేర్పగలదు" అనీ, మారిపోయినవి.

౫. శాపంబు కారణంబుగం జేసి,
ఇది యిప్పుడు "శాపకారణంబుచేత" అని మారినది.

౬. నాకుం గరుణింపుండని.
ఇది 'నన్నుం గరుణింపుడని' అనిమారినది.

౭. "తనకునురగ భోజనంబు సురపతిచేతంబడసి"
ఇది "తానురగభోజనంబు etc." గా మారినది.

౮. చిరముగ బ్రహ్మరుం దపము చేసెం
ఈషష్ఠిచిత్తగించండి. ఇప్పుడెవ్వరైనా వాడు చున్నారా?

౯. అతివ్యక్తంబులై యాకాశంబువలన వీతెంచిన,
ఇందులో 'వలన' కును, పంచమీ విభక్తి 'వలన' కును, ఎంతో భేదము ఉన్నది.

౧౦. అక్కన్యను మ్రొక్కించి
ఇది, "అక్కన్యచే మ్రొక్కించి" అనిమారినది.

౧౧. అయ్యాయికాలము తప్పకుండంగనీ
అయ్యాయి అనేది ఇప్పుడు బహువచనముతోనే అన్వయి చెదరు.

౧౨. గరుడుని వినతయుం బనులు గొనుచున్నంత
ఇందు తృతీయార్థమందు ద్వితీయ చేతనవాచకాలకుకూడా వాడుకచేసినాడు. వ్యాకరణ

ములో అచేతన వాచకాలకుమాత్రమే చెప్పినాడు. ఇప్పటికవులుకూడ అచేతన వాచకాలకే వాడుక చేయుచున్నారు. (భారతములోని కారకమునకును, అధునాతన గ్రాంధికభాషలోని కారకమునకునుగల భేదము లన్నియుం జూపుచు, విపులముగ నొకవ్యాసము కొలంది కాలములో వ్రాయంబోవుచున్నాండను గావున నిందు విస్తరించి వ్రాయలేదు.)

ఇట్టివి వంద కొలదిగ ఉన్నవి. ఇక, కొన్ని శబ్ద భేదాలు చూడండి.

౧. వగవక-ఆలోచింపక-అని భారతార్థము
ఏడువక-అని ఆధునికార్థము

౨. మొగి-మొత్తము అని భారతార్థము. ఆధునికభాషలో ఇది వ్యర్థపదము.

3. వానినిప్పించు కొమ్మనిన
ఇప్పించుకొనుట యనగా, పుచ్చుకొనుట అని భారతార్థము. ఈశబ్దమిప్పుడు లేనేలేదు.

౪. అలిగి-మిక్కిలి కోపించి-అని భారతార్థము. సామాన్యముగా కోపించి అని ఇప్పటి అర్థము.

౫. వధూసరయను నాటంబుసేసె. అనగా, నాటుముంచెను అని భారతార్థము. ఈ యర్థములోచేయు ధాతువిప్పుడెవరైన ఉపయోగించుచున్నారా?

౬. ధూమవితతుల్ సేసెంబయోదావళిన్. ఇందు 'చేసెన్' అనగా, 'పుట్టించెను' అని అర్థము. ఈయర్థమిప్పుడున్నదా?

౭. అయ్యెర నొకదుందుభంబు-ఇందు 'ఎర' అను ప్రాచీన రూపము ఎడ అను ఆధునిక రూపముగా మారినది.

౮. అతిప్రయత్నంబున రక్షించుకొనియుండె. ఇందులో 'కొని' అనే ఆత్మనేపదానికీ, ఈకాలములో 'కొని' అనే ఆత్మనేపదానికీ భేదమున్నది.

౯. పుడవకచేయు మీవని సమర్పణచేసె. ఇందు సమర్పణ అనగా ఆజ్ఞ. ఇప్పటి సమర్పణకూ, అప్పటి సమర్పణకూ ఎంతభేదమున్నదో చూడండి.

౧౦. తరుణియ లొప్పనాడిరి. ఇందులో తరుణియ అనేశబ్ద మిప్పుడున్నదా?

౧౧. నీతదర్థను- పువ్వులయవ్విధంబునన్ - దానము చేసినతత్ఫలంబు. ఇందులో తత్ అనేశబ్దము ఇప్పుడెవరైనా వాడుచున్నారా?

౧౨. పెద్దవాండుండం గొండొకవాండు. ఇందులో కొండొక అనేది కొండిక అని మారిపోయినది.

ఈలాటివి ఎన్నెన్నో చూపవచ్చును.

'మహానుభావులారా, ఆంధ్రిభాషాభిమానులారా ఈభేదాలన్నీ చిత్తగించండి. నన్నయవ్రాసిన గ్రాంథిక భాషకూ, ఇప్పుడు మీరందరూ వ్రాయుచున్న గ్రాంథికభాషకూ ఏమైనా సంబంధమున్నదా? నన్నయభాషకూ, మీభాషకూ, ఇంతభేదమున్నా, భారతకాలము నుంచీ భాషమారలేదనీ, భారతభాషతోనే వ్రాయవలెననీ దెబ్బలాడడము ఏమైనన్యాయముగా ఉన్నదా? నేనీలాగనుచున్నానని నన్నయ్యమీదగాని, మీమీదగాని నాకు గౌరవములేదని తలచకండి. న్యాయము మాటాడవలసినపుడు దేవుని ముఖముచూచి, నిజము చెప్పవలెను గాని అభిమానము, పక్షపాతము, ఆలోచించి, మనస్సులో ఒకమాట, పైకిఒకమాట చెప్పకండి. ఈసందర్భమున మనమాలోచింపవలసిన మరోసంగతి ఉన్నది. భాష మారేటపుడు దాని ఇష్టమువచ్చినట్లు మారుచున్నదా, లేక, మారడానికి ఏమైనమార్గమున్నదా? అన్నసంగతి ఆలోచింతము. భాషదాని ఇష్టమువచ్చినట్లు మారదు. భాష మారడానికి సాధారణముగా అన్ని భాషలకూ సామాన్యమైన మార్గాలు ఉన్నవి. అవన్నీ ఇపుడు చర్చచేయడానికి కాలముచాలదు. ఒక్కఉదాహరణ చూతము.

నన్నయ్యగారు "ఏను నేర్పగలను" అని ప్రయోగించినారు. ఇప్పుడు మనము "నాకు నేర్పగలదు" అని ప్రయోగింతుము. ఈ భేదము ఏలాగు వచ్చినది?

| | |
|---|---|
| ఉత్తమపురుష | ఏను నేర్పగలను. |
| మధ్యమ | నీవు నేర్పగలవు. |
| ప్రథమ | వాండు నేర్పగలండు. |
| | ఆమె నేర్పగలదు. |
| | అది నేర్పగలదు. |

పై మూటిలో, నన్నయకాలములో చివర క్రియలను, ఏను, నీవు, ఆమె, వాడు, అది అనే సర్వనామాలు కర్తృవాచకాలై యుండేవి. అయితే, ప్రథమపురుష స్త్రీలింగములోను, నపుంసక లింగములోను ఒక చిక్కు వచ్చినది.

ఆమె } నేర్పుగలదు. అనే దానిలో కలదు
అది }

అనే క్రియకు, ఆమె, అది అనేవి కర్తలో, నేర్పు అనేది కర్తో అనుమానము కలిగినది. ఈ అనుమానము తక్కినచోట్ల కలుగలేదు. అయితే, ప్రథమ పురుషలో కర్త ఏదో సందేహము కలుగడముతోనే, సమీపముగా ఉన్న నేర్పు అనే నామవాచకమే కర్త అని భ్రమపడ్డారు. అందుచేత, ఆమె, నేర్పు అనే రెండు ప్రథమావిభక్తులు అనవసరాలులాగు కనుపడ్డవి. కాబట్టి మొదటి ప్రథమావిభక్తి షష్ఠీ విభక్తగా మారిపోయినది. అందుచేత, ఆమెకు నేర్పుగలదు. దానికి నేర్పు కలదు. అనే రూపాలు పుట్టినవి. తరువాత, క్రమక్రమముగా, సామీప్యముచేత, నాకు నేర్పుగలదు, నీకు నేర్పుగలదు, వానికి నేర్పుగలదు, అనే రూపాలు పుట్టినవి. నిజముగా ఆలోచించి చూచితే భేదాలకన్నిటికీ కారణాలు ఈలాగే కనిపించును. అయితే, ఈ భేదాలు ఏ వ్యాకరణాల వల్లను వచ్చినవి కావు. ఈ భేదాలు ఆంధ్ర శబ్ద చింతామణి, అథర్వణ కారికలు, బాల వ్యాకరణము, ప్రౌఢ వ్యాకరణము మొదలైన వ్యాకరణాలేవీ తెలియచేయడము లేదు. వాస్తవముగా ఆ వైయాకరణుల కెవరికీ ఈ భేదాలు గ్రాంథిక భాషలోకి వచ్చినవని తెలియనే తెలియదు. అయితే ఈ భేదాలు భాషలోకి ఏలాగు వచ్చినవని శంక. ఈ భేదాలు మొట్టమొదట సామాన్య జనుల వ్యవహారములో పుట్టి, తెలియకుండ, మెల్లిగా, చల్లగా, గ్రంథాలలోకి ఎక్కిపోయినవి. గ్రంథాలలోకి ఎక్కిపోవడానికి కారణము కవుల చెవులకు ఇంపుగా ఉండడమే. కొమ్ములు తిరిగిన మహాకవులు, "చల్లా అంబలి త్రాగితిరా" అన్నప్పుడును, "సీరాముసేన" అన్నప్పుడును, "అందరికీ దలాయొకటి" అన్నప్పుడును, "చేబదులు దెచ్చి రాచరికమిచ్చిన" అన్నప్పుడును, "మొక్కే సామి" అన్నప్పుడును, "నూనె నా మేలు భాగము సేసినాము" అన్నప్పుడును, "కూడీ కూడని చిన్ని కూకటులతో" అన్నప్పుడును, "వండే నేర్పుల" అన్నప్పుడును, "నయిదా లేవానికి" అన్నప్పుడును, ఆ మహాకవుల చెవులకు ఏపదాదులు ఇంపుగా ఉన్నవో అవే ప్రయోగించినారు. కాని వారు లక్షణగ్రంథాలు లక్ష్యపెట్టినారు కారు. వారు ప్రమాదమువల్ల ఆ పదాలు ప్రయోగించినారని తలచడము తప్పు. ప్రాచీన రూపాలకీ నవీనరూపాలకీ ఇదే భేదము. ఈకాలములో "గ్రాంథిక భాష" అనే భాషలో వ్యావహారిక రూపాలు ఉండడానికి ఇదే కారణము. ప్రాత భాష ముసలివారివంటిది. ముసలివారిని మూలకూర్చుండబెట్టి నమస్కరించెదముగాని, వారు మనతో కలిసి మెలిసి ఆనందించడానికి పనికిరారు. మనకు ఆనందము కలుగజేసేవారు మనతో కలిసిమెలిసి తిరిగే అన్నదమ్ములు. వ్యావహారిక భాష అన్నదమ్ములవంటిది. గ్రాంథిక భాషలో వ్యావహారిక పదాలు దూర్చడము ముసలివాని జుత్తుకు మసిపూసి పిల్లవాడు అనడము వంటిది. కాబట్టి పండితులారా, ఇప్పుడు మీరు వ్రాయుచుండు గ్రాంథిక భాష నిజమైన గ్రాంథిక భాష కాదనీ, గ్రాంథిక వ్యవహార భాషల మిశ్రమమనీ తెలుసుకొనిమీ గ్రాంథిక భాష ఇప్పటివారికి కొంతవరకు కర్ణరసాయనముగా ఉండడమునకు కారణము, అందులోని వ్యావహారిక పదసమ్మిశ్రణమే అని గ్రహించి - నిజమైన వ్యావహారిక భాషే పూర్ణముగా కర్ణరసాయనముగా ఉండగలదని నమ్మి - వ్యవహార భాష స్వేచ్ఛగా, తెలిసి (తెలియక కాదు) గ్రంథాలలో వాడుక చేయండి. అటిగా వ్రాసిన గ్రంథాలు మాకూ, మాకూ, జనసామాన్యానికి కూడా ఉపయోగకరములై, సంతోషదాయములై ఉండును. ఇదే నా ప్రార్థన.

—మండపాక పార్వతీశ్వరశాస్త్రి.

# కావేరి

## (అగస్త్యకుమారుని వియోగరాగము)

ఉదయారుణ్యము లీ వనాంగణ తరువ్యూహమ్ములందుఁ రమా
స్పదమై యల్లుకొనంగ, నస్ఖలిత పూజాపుష్ప సంపాదివై
తుదలార్ద్రమ్మగు మూర్ధజాళి విడిపోఁద్రోవన్ గరంబెత్తి, నా
యెద కానందము గూర్చు లక్ష్మి విడిపోయె న్నేటికిన్ నాటికిన్.

త్రోపుడు వట్టిపాఱెడు ఝురుల్ పులకింపఁగఁబాడ చంద్రికా
స్నాపితరాత్రులందు తరుణమ్మగు నీమృదుపాణి నాచెయిన్
దోపికొనంగ మేమెయినొదుంగుచు, నాయనురాగమూర్తి వ
ద్దీపికవోలె యెన్నడరుదెంచెదవో! ననుఁగూడి తోడుగన్.

ఓ తేజస్విని! మానమోహనమ యయ్యెన్ నీదు నెమ్మోమ్ము, నీ
నాతిక్రాంత శరీరశోభ లతి సాంద్రంబైననుం గప్పఁ జేరి
మాతిథ్యమ్మొక్కయింత కాసపడి, సాయంవ్యాప్తమాదేహ వ
ల్లీ తారుణ్యముతోడ రమ్మనెద, కేళీలోలవై యుండఁగన్.

అబద్ధంబయినట్టు లీ చరమ సంధ్యారాగ సూత్రంబులం
దో బింబోష్ఠి! విశాలపర్ణకుటి స్నాయుచ్ఛేదమై, పంజరం
బై, బాధాజనకమ్ముగాఁ దలఁతు; ప్రేమాశ్లేష బంధమ్ము లీ
లాబాహ్యాప్తయి యేగుచో జగములెల్లన్ శృంఖలాకారముల్.

—అబ్బూరి రామకృష్ణారావుగారు.

# కట్టా వరదరాజేంద్రుఁడు

## శ్రీరంగ మాహాత్మ్యములు.

శ్రీరంగ మాహాత్మ్యము పెక్కుమంది తెలుఁగులో రచియించియున్నారు. సంస్కృతమునందిది గరుడ పురాణము నందును, బ్రహ్మాండ పురాణమునందును గూడ రచియింపఁబడియున్నది. తెలుగులో నీగ్రంథము ననువదించిన కవులను, కావ్యస్వరూపమును ఈ క్రింద స్వల్పముగఁ దెలియఁజేసెదను.

తెలుగు శ్రీరంగమహాత్మ్యములు వ్రాసినవారు:—

(౧) భైరవుఁడు (పద్యకావ్యము)
(౨) వరదరాజేంద్రుఁడు (డిటో)
(౩) ముకుందయోగి (ద్విపద)
(౪) నరసన్న (కందపద్యములు)
(౫) గుండుపల్లి జగన్నాథకవి (పద్యకావ్యము)
(౬) (పేరులేదు) (వచనము)
(౭) భాగవతుల రామకవి (బ్రహ్మాండపురాణమునుండి)
(౮) పులిపాక రామన్న (వచనము)

ఇంక నెవ్వరెవ్వరు చేసియున్నారో? దీనినిఁ బట్టి మనకు శ్రీరంగ మాహాత్మ్యము వైష్ణవ భక్తు లెక్కువ భక్తితోఁ బఠియించెడు గ్రంథమని తెలియుచున్నది. అనేక నూతన రూపముల వ్రాయుటవలన విషయ మొక్కటియైనను, నూతన రూపము నిచ్చుటయే వారు వారుచేసిన కార్యముగఁ గన్పట్టుచున్నది.

భైరవుని గ్రంథమును శ్రీ మా. రామకృష్ణయ్య గారు ప్రకటించియున్నారు. భైరవుఁడు క్రీ. శ. ౧౫౦౦ లకుఁ బూర్వుఁడని వారి యభిప్రాయము. ప్రస్తుతము దొరికిన విషయములనుబట్టి యిది సిద్ధమని నిర్ణయించుటకు వీలులేకున్నది.

వరద రాజేంద్రుఁడు "అళియ రామరాయల పెద తల్లి కుమారుఁడు" అని వారు వ్రాయుచున్నారు. దీనికాధారమేమో తెలియఁబరుపరైరి. వరదరాజీక్రింది పద్యములవలన దనకుముందీ గ్రంథము నెవ్వరును వ్రాసి యుండనట్లు వ్రాయుచున్నాఁడు. కవితో స్వప్నమున భగవద్వాక్యము

క. కృతిసేయుము గారుడ సం
హిత హితమది మాకు గాఁకు డేలాధర మా
శ్రిత నిజ ధామంబగుటన్
బ్రతిపత్తి విశేషమగుచుఁ బాటిలునందున్.

ఉ. సేయరె తొల్లి సత్కవులశేష పురాణ
ములున్ దెనుంగులున్
నీ యితిహాసమెందు రచియింపమి తా
వక పుణ్యమింతె యా
మ్నాయచతుష్కసారము సనాతన గారు
డ సంహితా శతా
ధ్యాయి తెనుంగుసేయ నొకఁడున్ గనఁడే నేఁటి
కవీంద్రకోటిలోన్.

క. అని యానతిచ్చి గరుడా
ద్రి నివాసుఁ డదృశ్యుఁడైన."

దీనినిఁబట్టి వరదరాజేంద్రునకుఁ బూర్వము శ్రీరంగ మహాత్మ్యము నెవరు రచియింపనట్లు భగవద్వాక్యము వినఁబడుచున్నది. భైరవుఁడే వరదరాజేంద్రునకుఁ బూర్వుఁడైనయెడల నీపైమాటలెట్లు సత్యములగును? వరద రాజేంద్రుఁడు ౧౫౩౦ ప్రాంతములయందున్న యళియ రామరాజు పెదతల్లికుమారుఁడగుట నిజమేని యించుక పూర్వుఁడైనను ౧౫౦౦ సం॥ ప్రాంతమున నుండవలెను. భైరవుఁడంతకుఁ బూర్వమే తన గ్రంథమును రచియించినన జెల్లునా? ఒకవేళ భైరవునికృతి వరదరాజేంద్రుఁడెఱుఁగఁడా? లేకయిరువురు సమకాలికులై యుందురా? భైరవునికృతి యాతనికి మిక్కిలి దగ్గఱకాలములోనున్న వరదరాజేంద్రునినాటికి వ్యాప్తినొంది యుండదా? ఇవి చరిత్రకారులు సమర్థింపవలసిన విషయములు.

ప్రస్తుతమాంధ్ర పరిశోధక మహామండలి వారికిఁ జిక్కిన వరదరాజేంద్రుని శ్రీరంగమాహాత్మ్యమునుండి వివరణములు తెలిసికొందము.

[గ్రంథము తాటియాకులది. పొడవు 1 అ 5 అంగుళములు. వెడల్పు అం 1¼లు. పత్రములు 139. ఇరుప్రక్కల వ్రాయఁబడియున్నది. పుటకు 6 పంక్తులున్నవి. గ్రంథముమంచి స్థితియందున్నది. పీఠిక పద్యములలో వంశవర్ణనము కొంతవ్రాసి విడిచినట్లు తోఁచుచున్నది.]

వరదరాజేంద్రుని కవిత బ్రాహ్మణునిది కాదని 'చేపల బుట్టయల్లినట్లున్న'దని మా. రామకృష్ణయ్యగా రనుచున్నారు. కాని నేనది సహింపను. వరదునికవితకూడ భావ ప్రౌఢిమ కలదియ యని వారేయంగీకరించి నాలుగైదు పంక్తులలో స్వవచన వ్యాఘాతము లొనరించుకొనుట మంచిపనికానేరదు. ఐనను వారికలము సడ్డఁగల వారెవ్వరు? వరదుని కవిత వారికిబాగుగ నుండనప్పుడది యీ యీ కారణములచే నట్లు లేదనుట న్యాయమనియే నా వినయపూర్వక విజ్ఞాపనము. తాము ప్రకటించుకొను గ్రంథములవ్యాప్తికి తెరుల గ్రంథము లప్రశస్తములని వ్రాయుటమాత్రము ధర్మముకానిపని.

వరదరాజేంద్రుఁడాది కవుల నీక్రిందివిధముగ స్తుతించి యున్నాఁడు.

ఉ. నన్నయభట్టు దిక్కడను
నాచనసోముని, సార్వభౌము తి
క్కన్నను పెద్దిరాజు మొదలై తగు
నాంధ్రకవీంద్ర ముఖ్యులన్

సన్నుతిచేసి వారు రచ
నల్ పొసంగించిన త్రోవఁ గాంచి యా
యెన్నిక నేను గొంత రచి
యించుటకున్మది యుత్సహించినన్.

ఇందలి ప్రెగ్గడ యెఱ్ఱాప్రెగ్గడయని కవియభిప్రాయమైనట్లు తోఁచుచున్నది విచార్యము. కృష్ణరాయనికాలమునందలి వారిని గాని, శ్రీనాథునిఁ గాని తలపెట్టక పెద్దిరాజునేల వర్ణించెనో? ఈ పెద్దిరాజు విన్నకోట పెద్దిరాజా? లేక 'అలసాని పెద్దన'యా? తెలిసినది కాదు. పెద్దన్నను పెద్దిరాజని వాడిన దిదివఱకుఁ జూడలేదు. చరిత్రకారులు సహాయ్య మొనరింతురు గాక!

"శ్రీరంగస్వామియు వేంకటేశ్వరుఁడు" రక్షించునని కావ్యమారంభించి స్వప్నకథ వ్రాసి, యాముక్తమాల్యదయందుబోలె తన స్వప్నమాటలను వినుపింప వారు తనవలన వర్ణన మొనరించినట్లు వ్రాసెను. ఈతని వంశవృక్షమీ విధముగ నున్నది.

కరికాలచోళవిభుఁడు
|
తెలుఁగుబిజ్జశేఖరుఁడు
|
రంగిరాజు ?
|
కట్టారంగరాజు

(1) కట్టరాజు
(2) పెద్దిరాజు
(3) హరిదాసు
(4) రఘునాథరాజు
(5) లచ్చిరాజు

తనతండ్రి హరిదాసని కవి చెప్పుకొనియున్నాఁడు. కావున నీపైన తనకును పైవంశమునకును గల సంబంధము వర్ణించియుండవలెను. అది లేఖకుఁడీ ప్రతియందు విడిచివేసినట్లు తోఁచుచున్నది.

గద్యమిట్లున్నది. "ఇది శ్రీవేంకటేశ్వర వరప్రసాదాసాదిత చాటుధారా నిరాఘాట సరస చతుర్విధరచనా చమత్కార సకలవిద్వజ్జనాధార కట్టా హరిదాసరాజ గర్భాబ్ధిచంద్ర, వరదరాజేంద్ర ప్రణీతంబైన గారుడ పురాణ శతాధ్యాయి శ్రీరంగమాహాత్మ్యంబను మహాప్రబంధంబునందు సర్వంబును దశమాశ్వాసము". ప్రతి ౧౮౫౯ క్రీ. శ. న వ్రాయఁబడినది. గ్రంథపాతము, శైథిల్యములు లేవు. వ్రాతిచక్కనిది. దోషములున్నవి.

శైలి తెలియుటకొకటి రెండు పద్యములు చూపుచున్నాను.

మ. గరిమన్ కణ్వమునీంద్రుఁడిట్లను కళా
కాష్ఠాముహూర్తంబులన్
దిరుగన్ గాలము స్థావరంబు లసురల్
తిగ్వాజ్మనుష్యావళుల్
గడయో కాలములోని వారలె త్రిలో
కభర్త శ్రీరంగ భా
స్వరశయ్యాశయుఁ డీతఁడొక్కఁడు సుమీ
కాలాధికుండెన్నఁగన్.

శా. దీనిన్ చట్టలుజీరి యుంగిలమునన్
ద్రెళ్లించి పొర్లింపు మన్
నానా రౌరవ ఘోర రూపములలో
నన్వోచి మర్దింపు (మన్)
శ్యానోలూక బలోగికా ప్రముఖ ప
క్షివ్రాత కాలాయసా (?)
నూన త్రోటుల గ్రిచ్చఁజేయు మవు డె
న్నం దొంటిదుష్కర్మముల్.

—వంగూరి సుబ్బారావు.

# విజయనగరాంజనేయము

## (చరిత్రాత్మక గీతమాలిక)

పథిక, క్షణమాత్ర మాగుము ; పరుగు లిడక ;
నీవు మెట్టుచు నున్నది పావనంబు
సకల జనులకుఁ గన్న దేశంబు, వీర
విజయనగరంబు నమ్మ ; మావీటనున్న
చోద్యములనెల్ల కలయంగఁ జూడవేమి ?
చూచి కాలచక్రంపు విశుద్ధ ఫణితిఁ
గాంచి, జగదధీశుని లీలఁ గాంచవేమి ?
నగెద వేటికి ? హాస్యంపు పగిదియేల ?
శిథిలమై, పాడువడి యు, విశేషదైన్య
మంది యుండిన యిచటఁ జోద్యంబదేమి
కలుగు నంచును నవ్వితో ? కాక, నాదు
కార్యమునఁ బోవ నిత్తఁడిట్లు గట్టుఁబాటు
సేయుచేమని హాసంబు సేసితొక్కొ ?

ఎఱుఁగవో ! ఆంధ్రజనులకు నెల్ల యొక్క
కార్య ముండుట ? యీ రాజ్య గణనయందు ;
నింక శైథిల్యమును గూర్చి శంకవలదు.

స్తంభశకలంబు లివి గావు, శాసనములు ;
శిథిల నిలయంబులివి గావు, శిల్పశాల ;
లివి దళితకుడ్యములుఁ గా, వహీనచరిత ;
లివ్వి తాలుగా, వక్షర బృంగములగు.
వీనిఁ దద్రాజ్యసామ్రాజ్య విస్తృతిఁ గని,
'హాయిరే ! రాజ్యముల ప్రోడ హా ! విజయన
గర మహారాజ్య మిదిగో జోహారు' లటంచు
నంజలి యొనర్పనివాఁడు నాంధ్రుఁడగునె ?
మఱలు ; మిటు జూడు మిచటి యావరణలోన
వెలసి యున్నాఁడు, ఘన మహా బలనుతుండు;
ఆంజనేయుండు, ప్రఖ్యాత వీరాగ్రగణ్యుఁ,
డతుల తేజుండు, భువనసమార్చితాంఘ్రుఁ,
డితని సేవింపఁ బలితుండు నతినెసంగు.
“ఆంజనేసుత జోహారు లందికొనుము
ఏమి, దల గాయ మెటులయ్యె నీముఖమున ?
వదనమెంతగ నసివాళ్లు వాఁడెనయ్యె !
క్రూరుఁడెవ్వాఁడు నిన్నిట్లు రూపుచెఱచె ?
పాపి యెవ్వాఁడు నిన్నిట్లు భంగపఱచె ?
ద్రోహి యెవ్వాఁడు నీకిట్టి దొసఁగుజేసె ?
హృదయభేదన మొనరించు నిట్టికృత్య
మెట్టిశాలిసచేసెనో యెఱుఁగఁదెల్పు ;
నొక్క త్రుటిలోన నవ్వాని యుక్కడంచి,
పట్టిపోకార్చి, ముక్కలు గొట్టి, కాక
కులములకునెల్ల తుష్టిగా బలియొసంగి,
గుండియలమీఁదఁ జేయిడి, పండుకొనెద ;
మాంధ్రరుధిరంపుఁ దేజంబు నంతరించి
పోవలేదింక ; నాంధ్రుల భూరివిక్ర
మంబు నడుగంటగా లేదు ; మహితకీర్తిఁ
గాంచినారలు మావారు, గండుమగ ల
టంచు నింకను మఱవరీ యాంధ్రు లిట్టి
ఘోరకృత్యంబు సైచెడి వారుగారు.
తెలుపు మవలీల నెవ్వఁడా తెంపరీఁడొ ?”

... ... ...

“బాల, యీలీల నీవేల జాలి వడెద ?
వాంధ్ర తేజంబు గలదె యీయవని నింక ?
సింగియం బయ్యె ; నెటులైన సరియె; కాని,
సావధానత వినుమెట్లు జరిగెనో యిది.
కామినీరాజ్యమల తుంగభద్ర కుత్త
రమున నేనూరు సంవత్సరముల క్రిందఁ
గర్వితాత్ముల పాలనఁ గాంచి వెలసె
నందుఁ దెలియునా చరితలయందు మీకు ?
అట్టియున్మత్త మ్లేచ్ఛ నృపాధముండు,
చపలుఁడు, ముజాహిదను నొక్కపాపియుండె,
నితని జనకునిగూర్చి మీరెఱుఁగరేని,
తెలిపెద వినుండు; మధుపాన మలినహృదయుఁ
డగుచు, దన్నెదిరిఁ గూడ నరయలేక,
నయవిహీనుఁడై జెడఁద్రాగి, భయమునీగి,
లజ్జ దిగనాడి, రిత్తమేలంబులాడి,
పాటకుల కీయవలసిన పైకమెల్ల

విజయనగరంబు చెల్లింప విధియటంచు
ముక్కనంపిన శుంఠ మామూదు సుమ్ము.
(అంపఁగా నేమి యాయె, క్షైపఁణగిపోయె)
చలముడిగిపోయె, గర్వంబు సమసి పోయె,
తుదకు రాయల సఖ్యంబె దొడ్డదాయె.)
అట్టి తులువకు జనియించినట్టి వీఁడు
మిట్టి పడుచు, పసుచు చేష్ట లుట్టిపడఁగ,
సాహసంబునఁ దత్పూర్వ సఖ్యమెల్ల
మంటఁ గలియఁగ రాయల మఱలనాఁపె.
ఊఁపి, యూపిరిఁ గొల్పవ నుండెఁ గాని,
బొమిడికం బొండు గాచె నాబోడి తలను.
లేకయుండిన-శత్రుల మూకకెల్ల
మిత్తియన, నెత్తు రేరులై మెలఁగ, ఘోర
చండకరవాల ఖండిత శత్రుఁడగు మ
రాయ లత్యుగ్రుఁడై రణరంగమందు
లోకభీకర గతినుండఁ దాకలేక —
ఛత్ర మిటదాఁచి, యటవైచి చామరంబు,
బ్రదికియుండినఁ దినవచ్చు బలుసుకూర
ననుచుఁ బరుగిడునాఁడు, నాయకుఁడొకండు
వేచి, తటినూచి, వేసిన వ్రేటుతోడ
శిరములే వ్రక్కలై నేల దొరుచకున్నె?
ఈ ముజాహిదు పేరంతరింపకున్నె?
తప్పెఁదప్పెను, విధి యన్యధాతలంచె.
మేన మూనాళ్ల ప్రాణముల్మిగిలియుండె,
క్రోధ మగ్గలమై బలిఁ గోరుచుండె,
చేయఁదగు యత్నములు వేయి చేసినాఁడు,
పాప మేమిచేసినగాని ఫలములేదు.

ఏడుప్రాకారములలోన నెసఁగు కోట
యిన్ని యత్నంబులను నీసడించుచుండె.
దేశభక్తైకచిత్తత ధీరవర్యు
లసువుఁ గసవుగఁ జూచుచు నప్రమత్త
బుద్ధిఁ బోరాడ మార్గంబు పుట్టకుండె.
మొగలు సగమాయె, క్రోధంబు మిగిలిపోయె,
బలము తొలఁగెను, చలమింకఁ జెలఁగుచుండె.
ఎట్టకేలకు నొకగోడ మెట్టఁజారె,
నదియె యీయావరణమంచు మదినెఱుఁగుఁడు.

అంత, మ్లేచ్ఛుఁడు పొచ్చెనే యకట యనుచు,
ముష్కరతురుష్కుఁడీ త్రాగు ప్రచ్ఛకాళి,
పావనికి నెగ్గుసేయగాఁ బోవునేమొ,
మొఱకుతురకకు మర్యాద లెఱుఁగరావు,
దేశగౌరవం బెగిన దేహమేల?
లెండు, రండంచు, త్రుటిలోన దండవాక
నిండినాచుట్టు కుతుకాన నుండి, రంత,
ద్రోహి, నీచ ముజాహిదు పాహి లసదు
సేనతోడుత నన్నెట్టులైన ముట్టి
భంగపఱచినఁ జాలు నాపగ నశించు
నన్న దండాన, చలపట్టి, నన్నుముట్టి
చుట్టునుండిన వారలఁ గొట్టుచుండె.

ఒక్కవంక నుబన్నంబు, నొక్కవంక
మతవిరోధంబు, క్రోధంబు మఱొకవంక
ముప్పిరిఁగొని తురుష్కులఁ బ్రోత్సహింపఁ
బ్రాణముల నాసయింక లేదంచుఁ బెనఁగి
మొరకు తురకలు కరకులై పరగి; రిచట
విమత విద్వేషమును, మతావేశ, మాంధ్ర
దేశభక్తి పాపులకు నుద్రేకమిచ్చె,
నఱకుఁ డింకేల జాలంబు నఱకుఁడనుచు,
నార్చిపైఁ బడుచేగాని యాంధ్రులయ్యొ!
'శిక్షితులుఁజూడఁ దురకలు; చేత మనము
పట్టి యెఱుఁగము కత్తిని; బవరమునకు
సాహసించుట తగ' దని సైన్యమునకు
వార్తఁబంపఁగ వలె నన్నవారు లేరు.
తురకలన గడ్డిపోచలన్ కరణి నాంధ్రు
లెంచి వారలసంఖ్య మేలెంచరైరి.
పెక్కురణముల నవలీల నుక్కడంచి
వారి నోడించుటను గాంచినారు గాన
తురకలన్నను తృణములై తోఁచి; రపుడు.

తెగల దీన్ మవులాదీను దీనటంచు
జేయ్ మహాజనేయా జేయిజేయటంచు
రోదసీకుహారం బెల్ల మ్రోగుచుండ,
ఘోరలీలల జరిగె నాపోరు ఘడియ.
ఒక్కఁడొక్కఁడు పదుగురి లెక్క మ్లేచ్ఛ
భటులఁ ద్రెంపుచు దేశీయ భక్తిఁ జూపి,

స్వర్గసామ్రాజ్య మందంగఁ జనిరి విప్రు;
లంత నీవార్త నెఱింగి సాయంబుసేయ
నరుగుదెంచెను నాంధ్రసైన్యంబు గాంచి,
'ఇంకఁ బ్రాణంబుతోఁ బోవు టెచట' యనుచు,
షాహి యొకకొంత చింతించి సాహసమున
వారువము డిగ్గ నురికి కుఠారమెత్తి
నన్ను మొత్తంగ, క్రోధంబు మిన్నుముట్ట,
కటము లదురంగ, విస్ఫులింగములు చెదర,
పండ్లు పటపటఁ గొఱకుచు వచ్చుచుండె,
అంత నట సొమ్మసిలి యుండు నట్టివాఁడు,
వృద్ధవిప్రుఁ డొకఁడు నివారింప వాని
నడుమ చనుదెంచి, "తగదు నీవు మగుమిట్టి
పాలఁతితనమేల? విగ్రహంబులను గొట్టఁ
గండక్రొవ్వున్న నీసాటి దండిమగలఁ
దలపడగ రాదె?" యనుచుండఁ దులువ వాని
నొక్కదెబ్బను గొట్టి; మఱొక్కసారి
యా కుఠారంబు పైకెత్తి యానికొట్టె,
నన్ను. ఆగాయమే యిది చిన్నకుఱ్ఱ
వదనమునఁ గానవచ్చె నేఁడదియెసుమ్ము.

అవసరంబింతతోఁ దీఱె; నైన బాల
యవలి వృత్తాంత మొక్కింత యాలకింపు;
మటుల నగ్గొట్టగా విప్రుఁడలిగి, తనదు
బలమునంతయు గూర్చియు నిలువలేక,
బడలి, శ్రమతోడ మోచేతి పైనిలేచి,
"ఓరి దుర్మార్గ, తుచ్ఛుఁడా, యోరి పాపి,
నేఁడు నీవొనర్చిన పని కీడు గుడుప
కుండఁబోవునే? చూడు, నీయూరు మట్టి
కుండ ప్రాణంబు బాయుదీవుండు తుచ్ఛ"
యనుచు నసువులఁ బాసె నాయనఘుఁ డటులె
యాంధ్రులకు నోడి పాఱును హైన్యవృత్తి
షాహి యిలుసేరకుండంగఁ జచ్చెఁ ద్రోవ.
రణములోఁ గాదు, శత్రుకరమునఁ గాదు,
తనపటకుటీరమందున, తనదు చుట్ట
మైన దావూదుచే; నిట్టి యధము మరణ
మర్హమే గదా చెవటియా పతని కిలను?"

అహ్హహా నహ్హహా నహ్హహాను భళిర
రాజపుత్రోత్తముల శరీరంబులందు
గానవగు దెబ్బ యొక్కొక్క గాథఁ దెల్పఁ
జాలునని చాటి గల కరీంచంద్ర, పృథ్వి
భూమిపాలాదు; లామాట పొల్లో నిజమొ
తెలిసికొన లేదు మార్గమేదియును మనకు
కవుల వాక్యంబులన్నియు కల్లలన్న
కల్లరుల నోరుమూయింప గలియు లేదు.
చక్షురక్షుర సంయోగ పక్షపాతు
లేమియడిగిన సాధింప బుజువులేదు.
ఐననేమాయె, నిజమెట్టులగును కల్ల.
పురుషమూర్తికిఁ దగు నలంకరణ మన్న
పట్టముంగాదు స్వర్ణవిభూషగాదు.
బూటకపు సొమ్ములిట్టివి కోటియైన,
యుద్ధభువిలోన నిజదేశ ముద్ధరింప
నరులడీకొని ప్రాణంబు సరకుసేయ
కతి భయంకర లీల పోరాడు నపుడు
వినుతకరవాలమున నైన వ్రేటు వచ్చు
కొక్కదానికిఁ జాలవే యుద్దిఁగనిన.
వీరులిలఁగోరు నా యలంకారము లివె
యంచు లోకంబు తెలియఁగఁ జాటించినావు
అంజనీసుతే నిన్నెన్న నగును మాకు.
ఆంధ్రులకు నెల్ల నాదర్శమైతి వీవు.

—తాపీ ధర్మారావుగారు, బి. ఏ.

## 'రూపలత'*

కావ్యములలో రూపకము రమ్యమని భారతలాక్షణికుల మతము. సాహితీసాహితికి నది పరమావధి. రాజకీయ మంత్ర నిర్వహణమును, నాటకతంత్రనిర్మాణమును తుల్యములని యొకానొక కవిరత్నము వచించెను. అనగా రూపక మెంతరమ్యమో తన్నిర్మాణ మంత కష్టమనుట. రసోన్మీలనపాటవము, పరస్పరభిన్నములైన పాత్రముల స్వభావముల గమనించుట, ఏకకాలమందనేకుల విభిన్నప్రకృతులను భావనాపథమున నిలుపు నవధానశక్తి,

* పిఠాపురమునందలి గ్రంథకర్తగారగు శ్రీకూచి నరసింహము పంతుల గారియొద్ద దొరకును. వెల ౮ అణాలు.

సంవిధానచాతుర్యము, మొదలగు గుణములలో నేది కొఱఁతవడినను నాటకకర్త కృతార్థుఁడు కాఁజాలఁడు. ఈగుణములెంత సహజములో యంతకన్న నెక్కువ యభ్యాసానుభవలభ్యములు. ఈ విషయము నంతగా గమనింపకపోవుట నేఁటినాటక కర్తలలో ననేకులకు గల లోపము. ఒకానొక రెడ్డిదొరను దర్శించి యతనిపై నాలుగుపద్యములల్లఁ గలిగినేని యతఁడు తానిఁక నాటకరచనకు సమర్థుఁడని భావించును. భావించుట మాత్రమే కాక సత్యముగా నొక నాటకమును రచించి, యందందు నాలుగు పారసీసంగీతపుఁ బాటలను దగిలించి యేసభవారిచేతనో యాడించి విడుచును. 'రూపలత' వంటి నాటకము వ్రాయఁగలశక్తి యుండియు నది యిన్నాళ్ళకుఁగాని బయలుపఱుపక యణఁచుకొని యుండిన శ్రీకూచి నరసింహము పంతులు గారు నిజముగా నట్టివారికి నూతనబోధ యొసఁగినారన్న నతిశయోక్తి గాదు.

ఇది తొమ్మిదంకములు గలది. పద్ధతియంతయుఁ బ్రాచీనము. నవీనులకు విసుగుఁబుట్టించు ప్రస్తావనను గూడఁ దామే వ్రాయకున్నను దమమిత్రులచేఁ గవిగారు వ్రాయించిరి. అందను నాందీపద్యమున సరిగా పదునెనిమిది పదములు గలవు! అంకములన్నియుఁ బ్రాచీనరీతిని మధ్యవిచ్ఛేదములులేనివి. ముఖ్యకథయు మ బృహత్కథనుండి కైకొనఁబడినదగుటచే సంవిధానముగాని పాత్రములుగాని నవనాగరకతావాసన యేమాత్రమును లేనివి. నాయకుఁడు, ఉపనాయకుఁడు, ప్రతినాయకుఁడు, నాయిక, ఉపనాయిక మొదలగు వారందఱును మనమిదివఱకుఁ గథలలో నెఱిఁగినవారే కాని నవీనులుగారు. ఇట్టి యుపకరణములతో నపూర్వరసభరితమగు నీనాటకము నల్లి, గ్రంథకర్తగారు, ప్రతిభాబలమునకు ప్రాచీన నవీన భేదములు లేవను న్యాయమున కుదాహరణ మిచ్చియున్నారు.

వీరశృంగారరసములు రెండును సమానముగ నీ నాటకమున నిర్వహింపఁబడినవి. శృంగారరసమును నిర్వచించుటలోఁ గవిగారౌచిత్యమునుగాని యావశ్యకతను గాని మఱచియుండమి యొక విశేషము. ప్రబంధముల యందలి యర్థములేని శృంగారముగాని, నవీనుల యర్థముకాని 'స్వర్గీయప్రణయము' గాని యిందులేవు. ఇందలి దంపతుల ప్రథమప్రణయమునకును బొమ్మలే యాధారములు. ఐనను రచనయందలి నవ్యత కల్పనయందలి ప్రాఁతఱికమును మాపివైచినది.

పాత్రములన్నియు ముద్దుగాఁబోషింపఁబడినవి. అందును హృదయము నెక్కువలోఁగొనునవి రెండు. పౌండ్రకుఁడు, అతని మిత్రుఁడు ధర్మాచార్యుఁడు. మొదటివాని చరిత్రము 'అబ్బా!' యని యాశ్చర్యపఱుచును. రెండవవాని నడత 'అయ్యో!' యనిపించును. ఈ యిరువురను గమనించిన రావణ విభీషణులు జ్ఞప్తికి వత్తురు. కాని యొకవిశేషము. రావణునియందు లేని సుగుణములీ పౌండ్రకునియెడఁ గలవు. విభీషణునియెడ గల దుర్గుణములీ ధర్మాచార్యునియెడ లేవు. రూపలతను గామించి, యామె తన్ను వలవక యెన్నివిధముల నిందించినను బదులొక కఠినపుమాటయైన నాడక, తుదకు యుద్ధమునఁ దన్నామె చంపవచ్చినపుడు తానామెను గొట్టఁ జేయాడక శస్త్రాస్త్రముల దిగవిడిచి యామెచేతనే మరణించెను! మఱియు మరణించుటకుఁ బూర్వము తన రాజ్యసంపద్ద మామెకుఁ జెల్లవలయునని వ్రాసియుంచెను! తన్ను వలవని కాంతను వలచుట ప్రియమును హితమునుగాదని తనమిత్రుఁడు ధర్మాచార్యుఁడు మొగమోటలేక యెంత కఠినముగా నెన్నిమాఱులు తన్ను నిందించినను అతనిపైఁ గోపపడలేదు సరిగదా, యట్టి యతని నడలియందలి యార్జవమునకై సంతసించి తనరాజ్యమందలి నాలవపాలతనికిఁ జెల్లవలయునని యేర్పఱచెను!! నాస్తికత్వము, ఇంద్రియముల జయింపలేమి, క్రూరత, మొదలగు దోషము లెన్నియున్నను పై సుగుణములతని జీవితపుటద్దమందలి మైలను దుడిచివైచినవి. మఱియు నీ సుగుణములే ధర్మాచార్యుని విభీషణునికన్న మేలువానిఁగాఁ జేసినవి. పౌండ్రకుని వలన రూపలతచే వరింపఁబడిన పృథ్వీరూపాదుల కపాయము కలుగునని తలఁచి యట్టి యధర్మము నణచుటకై న్యాయబుద్ధిచే భగవంతునిపై భారము వైచి పని చేయుచుండినవాఁడైనను, విభీషణునివలె ధర్మాచార్యుఁడు తిన్నయుప్పును మఱవలేదు. చెప్పఁగలయంతాఁకఁ జెప్పి, తుదకుఁ దనప్రాణములనే యుద్ధమున నతని

కొఱకై సమర్పించెను! యుద్ధమునకుఁ బోవుటకుము
న్నతఁడు వచించు పద్యములు హృదయద్రావకములు!

"ధర్మపరులకుఁ గష్టముల్ తప్పవనుట
కేనె తార్కాణ; మాజన్మమెన్ని కష్ట
ములకులోనైతి! నేఁటితో ముగిసెను సకల
బాధలేఁ జొరఁబోయెడు భండనమున.

న్యాయమని శివవర్మకు సాయమైతి;
నయభయంబుల బోధయొనర్చి నాఁడ
నవనిపతి; కంతయును వృథాయయ్యెఁగాని,
యిప్పుడసువులుగూడ నర్పింపనుంటి.

ధర్మపథమును దప్పినఁ దప్పునాది
కాదనెదు ధైర్యమున్నది కర్మఫలద!
మంచిదనుకొన్నదే నొనరించినాఁడ,
నెట్టిగతి నాకొసంగెదో యెఱుఁగ నీశ!"

కాని, గ్రంథకర్తగారు పురుషపాత్రములంత చక్కఁగా స్త్రీపాత్రముల నిర్మింపరైరి. ముఖ్యపాత్రములగు రూపలతా కాత్యాయను లిరువురును పేరుకు స్త్రీలే కాని నిజమైన స్త్రీస్వభావములు వారియెడ లేవు. మాటలు, చేఁతలు, మనసులు, నన్నియు మగవే. లజ్జయను భావము వా రనుభవించియే యెఱుఁగరు. మఱియు వివాహము గాకమునుపే, అనఁగాఁ జిన్నతనమందే, వారు నేర్చిన విద్యలివి: నీతిశాస్త్రము, ప్రకృతిశాస్త్రములు, శిల్ప సంగీత భరతశాస్త్రములు, వేదాంత శాస్త్రము, తర్కశాస్త్రము, కరితురగారోహణాదికళలు, ధనుర్వేదము - ఇంకను ఇత్యాదులు! కథ ప్రాచీనమైనను పాత్రములన్నియు మనుష్యులే కావున నింత చదువుల మోఁత మోయు నమానుషశక్తి రూపలతా కాత్యాయనులకు లేదు. వారును నేదో శాపవశమున జనియించిన యే సరస్వతులో యని యేమూలనైన గ్రంథకర్తగారొక మాట సూచించి యుండిరేని యీ తొందరయుండి యుండదు. ఇట్లే పౌండ్రకుని 'దున్నపోతువలె స్థూలశరీరుని'గాఁ దయారుచేసిన గ్రంథకర్తగారి యుద్దేశ మేమో యెఱుఁగను. 'ఆకారసదృశప్రజ్ఞ' యను న్యాయము సార్వత్రికము గాదుగదా!

ఈనాటకపు రామణీయకమునకు ముఖ్యకారణము సల్లాపములయందలి సహజమాధురి. శైలి కఠినమును గాదు; పేలవమును గాదు. భావములన్నియు నవ్యములు. హృదయరంజకములు. అందందు మృదువైన హాస్యరసము హృదయము నాకర్షించును. పద్యములు సర్వసుందరములు. తొడకులు లేనివి. వ్యర్థపదములు దుర్లభములు. చవిచూడుఁడు.

"ఆ. చదువు చదువులొకటి; చరితంబులొక్కటి;
దుస్తులొకటి; తొడఁగు తొడవు లొకటి
యునికి యొకటి; పడిన యుపదేశమొక్కటి
మనసుమాత్ర మెట్లు మాఱుపడును?"

"ఉ. ఈ విపరీతసంగరము నెయ్యెడఁ జూడ
ము; వ్యాఘ్రిసంహతిన్
గోవులు సాఁచి ప్రాణములు గ్రోలుచు
నున్నవి; లేఁతలేఁత కై
దీవలనుండి పూల్వడక తీక్ష్ణశరార్చులు;
వచ్చి క్రమ్మెడున్
గావఁగరారె! సిగ్గగును గాంతలు
వీరుఁ జంపుటయ్యయో!"

తక్కిన వృత్తములకంటె తేటగీతిని గ్రంథకర్తగారు చాలముద్దుగా వ్రాయఁగలరని తోఁచెడిని. మొత్తముపై ప్రస్తావన వ్రాసిన శ్రీపానుగంటి లక్ష్మీనరసింహ రావు, గారు

"కంజమరందమంజులాలాపము, లాలితనీతియుత
ము, నవ్యగాథాపటిమాభిరామము"

అని యీ నాటకమును గూర్చి వ్రాయుట స్నేహార్ద్రమగు నతిశయోక్తి గాదనియు సర్వవిధముల సత్యమనియు ధారాళముగా వచింపవచ్చును.

—(రా. అ.)

# లవకావ్యము

## ప్రథమ లవము

క. అనుదినమగస్త్యు, బడబా
గ్నిని, శమినిం, గుంభకర్ణు ♦ ని, వృకోదరునిన్
గొనియాడుచుండెదను నా
తినెడు పదార్థములుపరిణ ♦ తింగనుపొందెన్.

ఉ. పాపవిచారుఁ డిల్వలుఁడు
బ్రాహ్మణులన్ భుజియింపఁబిల్చి, వా
తాపినిగోసి పెట్టి యటఁ
దమ్ముఁడ! రమ్మని చీర, వాఁడు నా
బాపల పొట్ట వ్రయ్యలుగ
బైటికివచ్చు; నగస్తి, వానినిన్
సాపడిత్రేఁచె; నాతపసి
జాఠరవహ్నిమహత్త్వమెట్టిదో!

క. జడనిధినంతయు నీవొక
పుడిసిటఁగొని త్రావఁ, బడిసె ♦ ముంబట్టకయే
కడ తేరెఁ గలశజా! యట
బడబానల గుటికయునికిఁ♦బడెఁగాఁబోలున్.

క. అత్యంబుపానమనుచిత
కృత్యంబని వైద్యకమున♦ నెఱుఁగమె? కుంభా
పత్యమవగు నీకద్ది ని
రత్యయ కారణమ యైన ♦ నగుఁగాక! ఋషీ!

ఉ. వింజము నాఁక పెట్టుటకు
వెళ్ళననీవల దక్షిణమ్మనం
దుం జిరముంటయాడు; సరి
తూఁగఁగఁజాలక యుత్తరమ్ముపై
కింజెడలేవ, భూమితల
క్రిందులుగాఁదొడఁగన్ దివౌకసుల్
నెంజెలికొయ్యి వెట్టుకొన;
నీ పడికట్టుగఁ బెట్టికొంట కీ
యంజనె నీకమందులు; వ
టన్న సముద్రము నాచమింప నీ
కంజకయున్నె? యేమి వెఱఁ
గందము నీయెడఁ! గుంభసంభవా!.

సీ. తనవైభవ మ్మవం ♦ ధ్యమ్ముగా నెవఁడు లో
పాముద్రఁబత్నిగాఁ ♦ బ్రేముడించెఁ
దనగౌరవంబు సా ♦ ర్థకముగా నెవ్వాఁడు
వింధ్యాద్రిగర్వంబు ♦ వీటఁబుచ్చెఁ
దనమహత్త్వము ప్రసి ♦ ద్ధంబుగా నెవఁడు వా
తాపిని దిని బొజ్జఁ ♦ దడవి త్రేఁచెఁ
దనజన్మమభివర్ణ్ణి ♦ తమ్ముగా నెవ్వఁ డం
భోరాశియుత్తింకఁ ♦ బుడిసిలించె

గీ. నెవ్వఁడుదయింపఁగలుషము ♦ లెల్లఁబాసి
యంబువులు సర్వలోకహి♦ తంబు సేయు
నట్టివాని నగస్త్య మ ♦ హా మునీంద్రుఁ
బ్రస్తుతింపుదు రామేర ♦ పరిణతికయి.

## ద్వితీయ లవము.

క. ఎడనెడ నదీ సహస్రముఁ
గుడుచుటచే నంబునిధికిఁ ♦ గూడిన జాడ్యం
బడఁగింప నెవ్వఁడోపును?
బడబానల రసమెయొంటఁ ♦ బట్టకయున్నన్.

క. చెడఁద్రాగి, కడుపుబ్బొంగఁగఁ
గడలద్రువఁగ మూల్గుచున్న ♦ కడలికి నెవఁడో
గడుసరివైద్యుఁడొసంగిన
బడబానల మాత్ర యెంత ♦ పనిఁజేసెనురా!

ఉ. దప్పికయైన నామయము
దగ్గనటంచు నజీర్ణరోగికిం
జెప్పుదురార్య వైద్యు; లది
సిద్ధమె; నూతనవైద్యుఁడెవ్వఁడో
యప్పలికిచ్చినట్టి బడ
బానలమాత్రనిజ ప్రమాణముం
దప్పెనొ కొక యూరక వి
దాహముగల్గునె వానికక్కటా!

గీ. అమృతమును దీసికొనివచ్చి ♦ నంతమాత్ర
నాశ్వనేయులుఁదీర్పలే ♦ రన్నరుజలఁ;
గడలిఁదడవుగ నలయించు ♦ కడుపోటు
మాను నేబడబానల ♦ మాత్రఁగాక?

గీ. జడనిధిసముద్రమైనను ♦ గడుపుపొంగు
మానమిని బడబానల ♦ మాత్రనొసఁగి
రక్షనీదేవతలు; దాని ♦ సార్వభౌమిని
చెడుగు పౌరాణికు; లిఁకేమి ♦ చెప్పఁకొందు!

క. ఉర్వీసురులు భుజించిన
తర్వాతం బ్రతిదినమ్ముఁ ♦ దాత్పర్యముతో
సౌర్వముఁదలంచి యభిమత
నిర్వాహముఁ గాంచుచుండ్రు ♦ నిజభావమునన్.

## తృతీయ లవము

క. విమతప్రణాశినిఁ బృథా
కుమారగాండీవచాప ♦ గోప్త్రి, రఘూ
త్తమహృదయ ప్రియదర్శిని
శమిఁదలఁచిన యేనిఁ గలుష ♦ సమితి శమించున్.

చ. కుసుఁదగి పాదమాత్రపరి
కల్పిత భోజనమై స్వకీయ గ
ర్భమునఁ గలట్టి వహ్నికప
రాధముఁ జేయకయున్కిఁ జెక్కు వ
క్షములు సుఖంబుగా బ్రదుకు —
జమ్మివిశమ్ము కరమ్ము జీర్ణ లో
కమునకు మార్గదర్శకము
గాదొకొ తారెఱుఁగంగ నేర్చినన్.

క. నియతాహార విహారుల
రయి, శములయి, యగ్ని ♦ రక్షణాసక్తులరై
మెయికొనుఁ డయ్యా మీకును
నయుతాయుర్దాయలక్ష్మి ♦ యాగు శమికిబలెన్.

క. శ్రీరామునికిం బ్రియముం
గూరిచి, యర్జునునిధనువుఁ ♦ గొనిడాఁచె
శమీభూరుహము; దానినెవఁడో
నేరకయయుతానువనిమె ♦ నెఱవాదికలెన్.

ఆ. బ్రతికియున్నయేని ♦ భద్రముల్ గనవచ్చు
ననుటనిజము; జమ్మి ♦ యయుతజీవి
యగుటచేతనే గ ♦ దా? రామకృష్ణుల
చెలువుఁ గాంచి, మేలు ♦ సేయఁగలిగె?

గీ. జమ్మికఱ్ఱను సరణిగా ♦ సంతరింప
నగ్నిపడుఁ; గానఁదద్గర్భ ♦ మందువహ్ని
డాఁగెననికథ వుట్టె బా ♦ డబులు దాన
నభినుతింతురు జరణార్థు ♦ లగుచు శమిని.

## చతుర్థలవము

చ. తినునొకనాఁడు పుట్లకొలఁ
దిం; బడి నిద్దుర వోయె నేని యా
ఱునెలలు నిద్రయే, యొడలె
ఱుంగఁడు యత్తఱి నిండు లంటు కొ
న్నను వెడకుంభకర్ణుఁడు, ది
నంబును విప్రులు వాని చెంతను; భో
జనశయనమ్ము లేకద ప్ర
శస్యము లెప్పుడు బ్రాహ్మణాళికిన్.

ఉ. నిద్దప్రభక్తి సాంబశివు
నిం గుఱియించి తపించి నిర్దయున్
నిద్దురగా వరించితివి
నీకదిమంచికె యయ్యె నొక్కలా
గద్దిర! నీదుతిండికి స
హాయము నిద్రయె తక్కువైనచోఁ
దద్ద యజీర్ణబాధను వ్య
థంబడియుందువు కుంభకర్ణుఁడా!

క. ఆహార నిద్రలకు ని
న్నాహాయనుచున్నవాగ ♦ మంతియ;
యుమ్మ న్మాహాత్మ్యముఁ గని యస్మ
ద్వ్యవహారముగాదు రావ ♦ ణాసుర సహజా.

ఉ. కుంభభవుం డగస్త్యముని
కుంజరుఁ; డీవును గుంభకర్ణ సం
జ్ఞం ధరియింతు లిర్వురు న
ఖండులె భోజన పాన వేళ; నం
చుం భవదీయ తౌల్యమును
జూచినుతించుట లేదు; మాదు వా
గ్గుంభము నీదుఘస్మరత
కున్ వలగొన్నది రావణానుజా!

గీ. మంచియో, చెడ్డయో, యసా ♦ మాన్యమైన
గుణమె గణనీయ మయ్యెడుఁ; ♦ గుంభకర్ణ
తిండిపోతు తనంబె ను ♦ తింపఁబడెడి
నింతకంటెను విపరీత ♦ మేమిగలదు?

## పంచమలవము

ఉ. అన్నములో విషమ్మిడిన
 నారయ వైతివి; దానికేమివో
తిన్నపుడేనియుం దెలియ
 దేరుచి? లొగ్గడితిండి కాఁడ! నీ
పున్నముచే నెటో యరిగి
 పోయెను గాకది యెట్టి గండ మాఁ
కొన్నపుడేమి పెట్టినను
 గుటుక్కున మ్రింగెదవే? వృకోదరా?

మ. జడియేతెంచుచున్న యప్డు ఘనగ
 ర్జారావముల్ మీఱుచోఁ
బిడుగుల్ రాలెడు వేళ నీవు నరుతో
 భీతిల్ల కింటింటికిన్
బడి బిక్షం బడుగంగఁ జొచ్చితివి నీ
 ప్రారంభమున్నవ్వరే?
గడుసుంబోకడ లేదుగాక కడుపే
 కైలాసమా భీముఁడా!

ఉ. అర్థిని జోలిగట్టుకొని
 యన్నయుఁ దమ్ములు దెచ్చి నన్నమం
దర్థము భీమసేనునకె
 యయ్యెఁడు పాపము! ధర్మపుత్రుఁడుం
బార్థుఁడు నక్కవల్ కడమ
 భాగము నెటులో తిందు; రింతగా
వ్యర్థుఁడిఁ గాలుబిడ్డలకు
 నన్నముఁ బెట్ట గలాఁడె వచ్చినన్?

క. కడుపునకుఁ జాలునన్నము
గడియించుకొనంగఁ జేతఁ ♦ గాని బడుగ వాఁ
డడికొఱకుఁ గాక రాక్షసి
హిడింబఁ బెండ్లాడి కూడు ♦ నిడుదె? వడముఁడే!

చ. కొడుకులకన్న నెక్కుడుగఁ
 గూరిమితోఁ బెదతండ్రి పెంచు న
ప్పుడు కడుఁ బాండు నందనులు
 పొందిక కల్గినయట్టి వారలే
చెడికడ నేకచక్ర పురిఁ
 జేరుచు మాధుకరంబు నెత్తుచో
వడముడి తిండి వీథిఁబడె
 వారును వీరును గేలిసేయఁగన్.

గీ. తిండి వలపంతకంతకు ♦ మెండుగాఁగఁ
బరులువండిన చో సరి ♦ పడమిఁ జేసి
రాచపుట్టువ ననెడు సం ♦ కోచము విడి
వంట సేయంగ నేరిచి ♦ కొంటె? భీమ!

ఉ. తోఁచక పెద్దతండ్రి సుతు
 తోఁ గలహించిన దాది తిండికిన్
వాఁచినవాఁడ వీవు బకు
 వాతబడంజను విప్రబాలకుం
గాచెద నంచు సిద్ధపడి
 గంపెడు కూడును మెక్కి గట్టునం
ద్రేఁచిననాఁటి నీ తెలుఁగు
 దెల్పెడు సర్వము వాయునందనా!

ఉ. కొండిక నాఁడు తల్లియగు
 గొంతమ యడ్డమునుండి పడ్డచోఁ
గొండయుఁ బిండియయ్యెనని
 కొండొక పండితుఁ డాడినట్లుగాఁ
బిండబలంబునం గలఁడు
 భీముఁడు, దానికిఁ దగ్గయట్లుగాఁ
దిండియు మెండు, గాన విను
 తింతురు నిత్యము వాని బ్రాహ్మణుల్.

## షష్ఠలవము

ఉ. కాదనకైచ్చికమ్మగను
 గంధి రసాయనమైదో యాఱో మో
తాదులు పుచ్చుకొంటను, బ
 దంపడి యేరికో చేసినట్టి హిం
గ్వాదిక చూర్ణ మన్నమున
 యందతిమాత్రము వేసికొంటఁ నా
మీఁద భయమ్మునం, దెలియ
 మిన్ హితమంచు నపథ్యభేషజం
బాదృతిఁ గొంటఁ గృష్ణకవి
 కయ్యెనజీర్ణము పెక్కుతప్పులన్.

ఉ. అరయఁగ బట్టె తెచ్చికొని
నట్టి యజీర్ణము మాన్పికోఁగఁ బో
ర్గూరికి నేగి కృష్ణకవి
యున్నెడ నక్కట! యాతఁడెంతయుం
గూరుచు బిడ్డలందుఁ గడ
గొట్టు, లవుం డొక విద్దె మేనియుర్
నేరనివాఁడు "దొలఁగఁ జ
నెంగనరాఁ" డని వార్తవచ్చుడున్.

చ. తనదు నజీర్తి హేతువున
దగ్గఱనుండమి సంభవించెఁ; గా
వున లవుఁడట్లు దూరమయి
పోయెనటంచు విచార సాగర
మ్మునఁబడి, రామ కృష్ణకవి
పుంగవుఁ డంతట నాప్తకోటి పం
పున మురమళ్ల చెంతఁగల
పోలవరమ్మునకేగి, యచ్చటన్.

సీ. గంగాఫలమ్ముఁ జె ♦ న్నంగి మున్నగువాని
నాఁటించి కొబ్బరి ♦ తోఁటఁ బెంచ
బంగానపల్లి గో ♦ వా యనంగఁ బ్రశస్త
ములనంటు మామిళ్లఁ ♦ బ్రోదిచేసెఁ
దిరుపతి వేంకటే ♦ శ్వరుల దేవీ భాగ
వతమునందొక్క ప ♦ ర్వంబుఁ గూర్చ
మధునపంతుల వంశ ♦ మణి సత్యనారాయ
ణాదుల కార్య వై ♦ ద్యంబుఁ గఱపె

గీ. గణుతికెక్కిన పండితా ♦ గ్రణులను గవి
పుంగవులను నారోగ్యము ♦ వొందఁజేసి
తాతతంత్రములకన్న వి ♦ ఖ్యాతిఁ గాంచె
రమ్యగుణపూర్తి యాకుండి ♦ గామమూర్తి.

క. ఆకర్ణనీయగుణుఁ డ
య్యాకుండ్యన్వయుని కరుణ ♦ నారోగ్య శ్రీఁ
జేకొనుచు మానసవ్యథఁ
బోకడ పెట్టుకొను తెరువు ♦ పుట్టక యునికిన్.

సీ. కముఁజుపిట్టయుఁబోలెఁ ♦ గరిరి మనోహర
మ్ముగ నెలుంగించెడు ♦ ముద్దుపట్టి
తాతయాలాగు పో ♦ దము రమ్మనుచుఁ బిల్వఁ
జేతులందిచ్చెడు ♦ చిన్నిపాప
చల్లారునందాఁక ♦ సైఁప "కాఁఆఁ" యని
పొంటియుక్కఱదిను ♦ చంటిబిడ్డ
తల్లిపాలుక్కఱుఁడెచ్చు ♦ ద్రావ సైగణఁదాను
గొన్న పాలును గ్రోలు ♦ కొడుకుఁగుఱ్ఱ

గీ. చక్కనగువాఁడు పచ్చని ♦ చాయవాఁడు
మెత్తనగువాఁడు నిడుపాఁటి ♦ మేనివాఁడు
వాలుకన్నులు గలిగిన ♦ వాఁడు లవకు
మారుఁడూరక పోవునే ♦ పేరులేక.

క. అని వగచి యజీర్ణోద్వా
పన మను లవ కావ్యమును ప్ర ♦ పంచంబగ్గిం
చిన లవ కుమారు పేరుగ
నొనరిచియూఱట వహించెనొక్క విధముగన్.

ఇది శ్రీపీఠికాపుర సంస్థాన విద్వత్కవులగు రామకృష్ణులచే రచింపఁబడిన లవకావ్యము.

# నాల్గవ ఆంధ్ర దేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ

## బారువ - గంజాంజిల్లా

౧౯౧౭ సం॥ మేనెల ౫-వ తేదీనాడు మధ్యాహ్నము రయిలు మీద ఈసభకు అగ్రాసనాధిపతులగు భూపతిరాజు వేంకట పతిరాజుగారును, వివిధజిల్లాల నుండి ౨౦౦ మంది ప్రతినిధులును విచ్చేసిరి. వారిని బహుకరించుటకు ఏ. పి. పాత్రోగారును ఇచ్ఛిక సేవకులును సన్మాన సంఘ కార్యదర్శులును రైలు స్టేషనుకు డకుపోయి, ఉపాహారా...దులతో సేదదేర్చి, బారువకు తోడ్కొనివచ్చిరి. గ్రామస్థులును సన్మాన సంఘమువారును ఈమహాజనులకు ఎదురువచ్చి తూర్యారావములు చెలంగ, కర్పూరహారతులివ్వటిల్ల, వ్యగ్రోత్సాహ పూరితములగు వందేమాతరాది ధ్వనులతో జాతీయగీతములు చెలరేగ, తండోపతండములుగ జనులు

వెంటరాగ, బసలకు జేర్చిరి. ౬-వ తేదీ ప్రాతఃకాలమున ప్రతినిధులందరును మహేంద్ర తనయ నదియందు స్నానముజేసి, బాజాభజంత్రీలతో గ్రామమంతయు నూరేగి సభామంటపమును జేరిరి. బోర్డు పాఠశాలభవనమునకు ముందున్న విశాలమగు ఖాళీస్థలమునందు, వెయ్యిమంది జనమునకు సరిపోవు గొప్ప మంటపమును నిర్మించిరి. సభామంటపమంతయు పచ్చని తోరణముల తోడను, కదళీ స్తంభములతోడను అలంకరింపబడి కన్నులపండువగ నుండెను. మద్రాసు, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, గోదావరి, విశాఖపట్టణము, గంజాము మున్నగు జిల్లాలనుండి 300 మంది ప్రతినిధులును ౨౦౦ మంది ప్రేక్షకులును విచ్చేసిరి. సభనలంకరించిన ప్రముఖులలో కొందరి నామములు:-బుఱ్ఱా శేషగిరిరావుగారు, రావుసాహేబు గిడుగు రామమూర్తిగారు, వెలిదండ శ్రీనివాసరావుగారు, జగన్నాథపాడిఖండంగారు, సెట్టి లక్ష్మీనరసింహంగారు, బులుసు రామజోగారావుగారు, అయ్యగారి రామచంద్రరావుగారు, మల్లాది కృష్ణమూర్తిగారు, వి. గోపాలరావుగారు, నూరి వేంకట నరసింహంగారు, కుప్పా శ్రీరామశర్మగారు, బిక్కని వేంకటరత్నంగారు.

ప్రథమమున సోంభొట్ల వెంకయ్యగారు సంస్కృతమున ప్రార్థనను సల్పిరి. పిమ్మట పుల్వల నారాయణమూర్తి గారును కొందరు బాలురును భారతమాతను గూర్చియు ఆంధ్రమాతనుగూర్చియు జాతీయగీతములను బాడిరి. ఆహ్వాన సంఘాధ్యక్షులగు అన్నాప్రగడ రామదాసుపాత్రోగారు ప్రతినిధుల నాహ్వానము జేయుచు ఈక్రింది యుపన్యాసమును జదివిరి:—

## ఆహ్వాన సంఘాధ్యక్షుల యుపన్యాసము

ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభయొక్క చతుర్థసమావేశ సందర్భమున గంజాంమండలము పక్షమున బారువగ్రామమునందు మీకందరకు నాహ్వానపూర్వక స్వాగతము నిచ్చుటకై నాకవకాశము కలిగినందుకెంతయు ఆనందమగుచున్నది. ఈమండు వేసవికాలములో తీవ్రనిదాఘతాపమునకోర్చి కడు దూరమునుండి మిక్కిలి ప్రయాసములతో ప్రయాణము చేసి మాయాహ్వానమును గౌరవించి ఇచ్చటికి దయచేసిన తమకెల్లరకు తగిన సౌకర్యములను కలుగజేయలేనందులకు మిక్కిలి చింతించుచు లోపములను మన్నింప వేడుచున్నాను.

కృష్ణవేణీతీరమునందుద్భవించి, గౌతమీ - ఉత్తర పినాకినీ తీరములందు ముద్దు ముచ్చటలను జరిపిన ఈఆంధ్రదేశ గ్రంథాలయప్రతినిధుల సభను నాలవయేట ఊసరక్షేత్రమున కాహ్వానించితిమని యనుకొనకుందురుగాక. ఈమండలము ఆంధ్రదేశము యొక్క ఉత్తర సరిహద్దును కలిగియుండుట మాత్రమే గాక తామిప్పుడు సమావేశమయిన యీబారువగ్రామము, చరిత్రనుబట్టి చూడగా, సుప్రసిద్ధమయినదని మీకందరకు తెలియ జేయుటకు మిక్కిలి సంతసించుచున్నాను. ఈ గ్రామమునకు దక్షిణమున ప్రవహించుచున్న "మహేంద్రతనయ"యను పేరుగొప్ప పుణ్యనది యిచ్చటికి ౨౦ మైళ్ళదూరమున పశ్చిమము గానున్న మహేంద్రగిరినుండి యుద్భవిల్లి తన పవిత్రోదకముచే చుట్టుపట్ల భూములను ఫలవంతముగను పవిత్రముగను నొనర్చుచు యీగ్రామమున సాగరసంగమమగుటచే పుణ్యదినములయందు వేలకొలది జనుల నాకర్షించుచున్నది. పంచ పాండవులు అరణ్యవాసము చేసినప్పుడు ఈమహేంద్రగిరియందు కొంతకాలము గడపినట్లు ప్రసిద్ధికలదు. వారొకానొక నైమిత్తిక పుదివసమున భోక్తలకు మాంసమిడుటకై మహేంద్రగిరినుండి, వన్యమృగమనుకొని ఒక కపిలగోవును వేటాడిరి ఆ కపిలగోవు పడినచోటు యిప్పటికిని "కపిలగుడ్డి"యను నామముతో ఈ గ్రామము నంటియున్నది. దీనిచేరువనే స్మశానముగలదు. ఇచ్చట ప్రేత సంస్కారమయిన మృతకళేబరముల శల్యములు బూడిద, మహేంద్రనదిలో గలుపుటచే నాశల్యములు సగము శిలగను, సగము శల్యముగను యేర్పడునట్లు కనబడుచున్నవి. కపిలగోవును సంహరించిన పాపనివారణార్థమై పాండవులు యజ్ఞమునొకదానినిసల్పి, జనార్దనస్వామిని కోటిలింగేశ్వరస్వామిని ప్రతిష్ఠజేసి, బ్రాహ్మణులకు సువర్ణదానముజేసినట్లు వాడుకగలదు. యజ్ఞముజరుపబడినస్థలము శ్రీజనార్ధనస్వామి వారి యాలయమునకు పశ్చిమమున "యజ్ఞంబట్టి" యనునామముతో యిప్పటి

కిని వాడబడుచున్నది. పాండవులు భూరిసువర్ణదక్షిణ లొసంగిరని జనులనుకొనుటకు నిదర్శనముగా నిప్పటికిని వర్షకాలమున వీనులలో "సువర్ణవంగపరకలు," "నంది పరకలు" దొరకుచున్నవి. నేడవి గ్రంథాలయ ప్రదర్శనమున కొసగబడినవి. మరియు ఈప్రాంతమున పరశురాముడు ఉద్యానవనమువేసి తపస్సుచేసినట్లు ప్రతీతి గల 'ఉద్దాన' మను గ్రామము ఈశాన్యమూలగా సముద్రప్రాంతమున నారికేళ, కదళీ, పనసాది ఫలవృక్షములతోడను-పోకచెట్లు, తమలపాకుల తీగెలు గల తోటలతోడను అలరారుచు, రెండవ కోనసీమయో యన్నట్లు నేత్రోత్సవముగ విరాజిల్లుచున్నది.

మహాజనులారా! మనదేశ మిప్పు డనుభవించుచున్న సర్వానర్థములకు మూలకారణము ప్రజలయందుగల యజ్ఞానమేయని కీర్తిశేషులయిన దేశభక్త గోపాలకృష్ణ గోఖలే మహాశయుడు బాగుగా గ్రహించి ప్రజలకై నిర్బంధోచిత ప్రారంభ విద్యాపద్ధతిని నెలకొల్పదలచి మహాప్రయత్నము చేసియుండెను. ఆయన యుద్దేశ్యము నెరవేర్చుటకు గ్రంథాలయము లెంతయు సాధనములు. ప్రస్తుతము విద్యావ్యాప్తికి పాఠశాలలే సాధనములుగా నున్నవి. అందు హెచ్చుజీతము లిచ్చుకొనినగాని కొంది గ్రంథములనయినను చదువుకొనుటకు వీలులేదు. గ్రంథాలయములన్నచో - అవి సాధారణముగా సర్వజనులును ఉచితముగ చదువుకొనుట కవకాశమిచ్చుటచే బీదసాదలగు సామాన్య ప్రజలెల్లరును వ్యయప్రయాసలు లేక అనేక గ్రంథములను పఠించి విశేష జ్ఞానము సంపాదించుటకు వీలును కలిగించును. ఈ విషయమును మనవారు బాగుగా గ్రహించినచో ప్రతి గ్రామమునందును గ్రంథాలయమును స్థాపించి జ్ఞానమును ప్రజలలో వ్యాపింపచేయుటకు తప్పక ప్రయత్నింతురు. ప్రస్తుతమున ఆంధ్రదేశమునగల పాఠశాలలెంత యుపయోగకరములుగా నుండగలవో ఈ క్రింద పట్టికవలన తెలియనగును.

| జిల్లా | | విస్తీర్ణము | జనసంఖ్య | పాఠశాలలు | గ్రామములు |
|---|---|---|---|---|---|
| ౧ | | ౨ | ౩ | ౪ | ౫ |
| | | చ. మైళ్లు. | | | |
| ౧ గంజాము | ... | ౮,౩౮౦ | ౨౨,౨౧,౨౯౨ | ౧,౮౬౭ | ౬,౨౧౦ |
| ౨ విశాఖపట్నము | ... | ౧౭,౨౨౧ | ౩౧,౮౯,౮౨౧ | ౧,౭౧౯ | ౧౨,౬౮౦ |
| ౩ గోదావరి | ... | ౬,౨౨౧ | ౧౬,౫౨,౮౫౯ | ౧,౩౯౬ | ౧,౯౩౫ |
| ౪ కృష్ణా | ... | ౫,౯౦౭ | ౧౯,౯౭,౫౩౫ | ౨,౪౧౦ | ౧,౭౧౫ |
| ౫ గుంటూరు | ... | ౫,౭౩౫ | ౧౬,౯౭,౫౫౧ | ౨,౨౦౨ | ౯౪౫ |
| ౬ నెల్లూరు | ... | ౭,౯౭౩ | ౧౩,౨౮,౧౫౨ | ౧,౩౯౯ | ౧,౬౦౨ |
| ౭ చిత్తూరు | ... | ౫,౬౭౬ | ౧౨,౩౮,౭౪౨ | ౮౬౪ | ౨,౪౪౭ |
| ౮ కడప | ... | ౫,౮౯౨ | ౮,౯౩,౯౯౮ | ౧,౧౭౮ | ౮౮౨ |
| ౯ కర్నూలు | ... | ౬,౫౮౦ | ౯,౩౫,౧౯౯ | ౧,౦౮౭ | ౮౦౯ |
| ౧౦ అనంతపురము | ... | ౬,౭౧౮ | ౯,౬౩,౨౨౩ | ౯౫౬ | ౮౪౬ |
| ౧౧ బళ్లారి | ... | ౫,౭౧౪ | ౯,౬౯,౪౩౬ | ౮౯౩ | ౯౩౧ |

దేశమునందు జ్ఞానవృద్ధియయిన కొలదిని దేశజనులు విశేషనాగరికతను బొందుట సహజము. పూర్వము "గ్రీసు" "రోము" రాష్ట్రముల నాగరికతకు అచ్చటి గ్రంథాలయములే ముఖ్యసాధనములైయుండెను. జపాను, జర్మనీ, అమెరికా రాష్ట్రములయందు గ్రంథాలయవ్యాప్తి అపరిమితము. మన దేశమునందును ఎరోడా సంస్థానమున గ్రంథాలయవ్యాప్తికయి జేయుచున్నపని అత్యద్భుతము. అచ్చట నొక కేంద్ర గ్రంథా

లయముగలదు. అందు సుమారు అరువది వేల గ్రంథములు గలవు. ఈ కేంద్ర గ్రంథాలయము నాధారము జేసికొని ఆ సంస్థానమునందంతటను అనేకవందల గ్రంథాలయములు స్థాపింపబడెను. అటువలెనే మన ఆంధ్రదేశమున కంతటను ఒక కేంద్ర గ్రంథాలయ ముండుట యవసరము. ఇట్లు గ్రంథాలయములవలన సామాన్య ప్రజలలో విద్యావ్యాప్తియు నాగరికతయు గలుగుటయేకాక - ప్రతికాపఠనమువలన ప్రాపంచిక జ్ఞానమును, పూర్వకవి ప్రణీత గ్రంథపఠనమువలన వారి యున్నత భావనాగ్రహణమును, అన్యదేశ చారిత్రపఠనమువలన మనోవికాసమును, తప్పక కలుగును. ధనికులును, పట్టణ వాస్తవ్యులును అగు కొందరికిని ప్రస్తుతమున్న పాఠశాలలవలన ఒకవేళ సాధ్యమైనను, అజ్ఞానాంధకారమున మునిగియున్న విశేషమందిగల బీదసాదలగు సామాన్య ప్రజకివి సాధ్యముకావు. వారికి ఉచిత గ్రంథాలయము లవసరములు. బరోడాయందువలె ఈ గ్రంథాలయములయందు బాలశాఖలు, క్రీడాశాఖలు, ప్రదర్శనశాఖలు మొదలగునవి కూడ నుంచుట అగత్యము.

నిరుడు ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు ప్రచురించిన నివేదన ననుసరించిచూడగా ఆంధ్రదేశమున ౨౦౯౯ గ్రంథాలయములు గలవనియు అందు ౭౯ గ్రంథాలయములు నామమాత్రములై యున్నవనియు తెలియుచున్నది. ఇట్టి నామమాత్రములైన గ్రంథాలయము లింక నెన్నియోయున్నవని నాకు తోచుచున్నది. మన గ్రంథాలయ సంఘమువారు మాసవేతనముపై నొక సంచారకార్యదర్శిని ఏర్పరచి, ఆయిన సంవత్సరమున కొకతూరియయినను అన్ని గ్రంథాలయములను వీక్షించి వాటివాటికి దగిన సలహాలనిచ్చి మంచి స్థితిలోనుంచుటకు ఏర్పాటు చేయుటమేలు. ఏయే గ్రంథాలయములయందు ఏయేగ్రంథములు కలవో తెలుసుకొనుటయు యవసరము. మఱియు ఆంధ్రభాషయందు గల గ్రంథనామము లన్నిటిని చేర్చి వాటిని వివిధ తరగతులుగ విభజించి విశేషాంశములతో నొక పట్టికను తయారుచేసి గ్రంథరూపమున ప్రచురించుట మిక్కిలి యవసరము. ఈ పనిని ఈ మండలములోని శ్రీ బ్రహ్మ పురాంధ్ర భాషాభివర్ధనీ సమాజ సభ్యులలో నొకరగు శ్రీ వెలిదండ శ్రీనివాసరావుగారు కొంతవరకు నిర్వహించినట్లును, దానిని ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ సహాయ కార్యదర్శులగు శ్రీ పురాణం సూరిశాస్త్రులవారు పూర్తిచేయ నిశ్చయించినట్లును వినుటకు చాల సంతోషముగనున్నది. మహాజనులారా! మీ విలువయయినకాలమును నేనిక తీసికొనను. మీ రందరు దయచేసి మాయాహ్వానము నంగీకరించి యిచ్చటి సమావేశమయినందులకు పునరభివందనము లర్పించుచు యింతటితో విరమించుచున్నాను.

పిమ్మట గౌరవనీయులగు భూపతి రాజు వేంకటపతిరాజుగారిని సభాధిపత్యమునకు ఉపపాదించుచు రావుసాహేబు గిడుగు రామమూర్తి పంతులుగారు, రాజుగారిని కొనియాడుచు నుపన్యసించిరి. ఈ తీర్మానమును ఊటుకూరి గోపాలరావు, అయ్యగారి రామచంద్రరావుగార్లు బలపరచిరి. అంతట వేంకటపతిరాజుగారు కర్పూర మాలాలంకృతులై అగ్రాసనాధిపత్యమును వహించి ఈ యుపన్యాసము నిచ్చిరి:—

## అధ్యక్షుల ఉపన్యాసము

విద్వజ్జన శోభితమైన యీ మహాసభయందు నే నధ్యక్షత్వము వహింప నంగీకరించుటకు కారణము దేశసేవాపరాయణత్వము తప్ప వేరొండు కాదు.

“మనమునకు ప్రియంబును, హిత
మును, బథ్యముం, దథ్యమును, నమోఘము, మధురం
బును, బరిమితమును నగు పలు
కొనరంగం బలుకునది ధర్మయుతముగ సభలన్.”

అను భారతనీతి ననుసరించి ప్రసంగించు సామర్థ్యము లేకున్నను మాతృభాషాభిమానంబుచే నా నేర్చుకొలందిని ఉచితంబులని తోంచిన విషయంబులు కొన్ని మనవి చేయసంసిద్ధుండనైతిం గాన ఆదరభావముతో తామవి ఆకర్ణింప ప్రార్థించెద.

అనతికాలమునుండి ఆంధ్రదేశాభివృద్ధికొఱకు పలువురు మహానుభావులు పలువిధముల పాటుపడుచున్నారు. సామాన్య జనులకు జ్ఞానము సమకూర్చుట, రాజ్యాంగ వ్యవహారములలో నలయు మార్పులు దేశ

క్షేమమునకై ప్రభుత్వము వారామోదించు నట్లొనరించుట, ఆర్థిక విషయములలో తగిన యేర్పాట్లు కావించి పారిశ్రామికాభివృద్ధిచే దేశస్థులను ధనవంతులుగ చేయుట, శౌర్య సాహసాది గుణాతిశయముతో దేహపరిశ్రమవలన ప్రజలను బలవంతులుగ నొనర్చుట, అవసరములగు సంఘసంస్కారము లొనరించుట, వ్యవసాయాద్యభివృద్ధివలన పాడిపంటలు వృద్ధిచేయుట, అనుకూల పారిశుద్ధ్యోద్యమముల వలన జనులకాయురారోగ్య భాగ్యంబులు లభింపజేయుట మున్నగు వివిధ సంస్కరణముల వలన మన ఆంధ్రదేశము పూర్వోన్నతస్థితికి దెచ్చుటకై అన్యోన్య సాహాయ్యమువలన సమస్తకార్యములు సఫలములగుటకు చేయు మహాయత్నములకు సహాకారులుగాని ఆంధ్రులెవ్వరుందురు? అందులో, ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమము దినదిన ప్రవర్ధమానమయి సాఫల్య మొందుటకు దగు ప్రయత్నము సలుపుట దేశాభ్యుదయము గోరు మన కెల్లర కత్యావశ్యక మని చెప్పనొప్పు.

## ఆంధ్రశబ్దార్థ విమర్శ.

ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమునుగూర్చి ముచ్చటించుటకు ముందు, చిరకాలమునుండి వాడుకలోనుండి ఇప్పుడు విమర్శనములోనికి వచ్చిన ఆంధ్రశబ్దార్థమును పరికించుట ముఖ్యము.

ఆంధ్రశబ్దము ప్రజలనుబట్టియా, దేశమునుబట్టియా, ప్రభువులను బట్టియా వాడుకలోనికి వచ్చినదని పండితులు ఆలోచింపవలసియున్నది. భరతఖండ పూర్వ చరిత్ర వ్రాయుచు ఆంధ్రులనుగూర్చి వి. ఏ. స్మిత్తు దొరగారు వ్రాసిన విషయములను మ-రా-రా- పీ. టీ. శ్రీనివాసయ్యంగారు కొన్ని యుక్తులుచెప్పి ఖండించియున్నారు. ఆంధ్రచరిత్రకారులను ఈఖండనమును గూర్చి విపులముగ విమర్శచేయుట కర్తవ్యము.

ఆథర్వణాచార్యుని త్రిలింగానుశాసనములో, స్వాయంభువమనువుకాలమున విష్ణువు ఆంధ్రరాయుడై శ్రీకాకుళములో సుచంద్రరాజునకు పుత్రుడై ఉద్భవించెననియు, మహేంద్రపర్వతములతో శ్రీశైల భీమేశ్వర కాళేశ్వరములనుచేర్చి గొప్ప ప్రాకారము కట్టించి, దానికి మూడు ద్వారములుంచి, అందు మూడులింగములు స్థాపించుటచేత వానినడుమనుండు దేశము త్రిలింగము యినదనియు, ఆంధ్రరాయని కాలమునకు పూర్వము వాడుకలోనుండిన భాష అచ్చ (అచ్చ తెలుగు) అనియు ఉదాహరించె కాంటెబదొరగారు అది ప్రమాణముగా తీసికొనుచు ప్రథమాంధ్ర వైయాకరణుడగు కణ్వునిప్రభువు సుచంద్రుడే అనికూడ చేర్చినారు. ఇందలి సత్యాసత్యములు నిర్ణయించు సాధనములు నాకు లేనందున గ్రంథస్థములైన విషయములను మాత్రమిందు పొందుపఱచితిని.

ఆంధ్రశబ్దమువాడిన ప్రాచీనగ్రంథములలో ఐతరేయబ్రాహ్మణము మొట్టమొదటిది. ఆంధ్ర- పుండ్ర- శబర-పుళింద- దస్యులు విశ్వామిత్ర పుత్రసంతానమని తెలియవచ్చును. సాంఖ్యాయన సూత్రములో కూడ ఆంధ్రశబ్ద ప్రయోగముకలదు. అప్పుడు, ఆంధ్రులు వింధ్యపర్వత ప్రాంతములందు వసించిరని తలంపనగును. పిమ్మట, అశోకుని పదుమూడవ శిలాశాసనములో ఆంధ్ర పుళిందులు బౌద్ధధర్మమవలంబించినట్లు కనబడుచున్నది. అతడు మృతిపొందిన కొలదికాలములోనే ఆంధ్రులు ప్రసిద్ధికెక్కిరి. క్రీ. పూ. ౨౨౦ సం॥ములో ఉండిన రాయశీముఖ శాతవాహనుడు ఆంధ్రవంశమువారిలో మొదటిరాజు. పిదప, ఆంధ్రరాజులు పశ్చిమసముద్రము మొదలు తూర్పుసముద్రమువఱకును మగధము మొదలు కృష్ణాతీరమువఱకునుగల దేశము పరిపాలించియుండవచ్చును. కళింగదేశరాజగు ఖారవేలుడు తన పరిపాలనకాలములో రెండవ సంవత్సరమగు క్రీ.పూ. ౧౬౯లో శాతకర్ణి అను ఆంధ్రరాజు పశ్చిమదిశను పాలించువాడు తనకు చతురంగబలముపంపి సాయముచేసినటుల తెలిపెను. మత్స్యపురాణములో ఆంధ్రరాజుల పేర్లు కానవచ్చుచున్నవి. తరువాత పితల్ఖోరా శాసనములో ప్రతిష్ఠానపుర రాజునుగూర్చి కలదు. తదనంతరము మనకు తెలియవచ్చిన ఆంధ్రరాజు 'స్మిత్తు'చరిత్రనుబట్టి క్రీ.శ. ౭౮ సం॥ములో ఉండిన హాలుడు. క్షేమేంద్రుని బృహత్కథామంజరికి మూలమగు 'బృహత్కథ'యను, సోమదేవుని కథాసరిత్సాగరము'ను హాలునిభార్యకొఱకు పైశాచిభాషలో వ్రాసినట్లు తెలియవచ్చుటచేత ఆమె

ఉత్తరదేశపు రాచకుమార్తె అయియుండును. సుప్రసిద్ధమయిన సప్తశతి మొదట మహారాష్ట్రభాషలో హాలుఁడు వ్రాసినాఁడట. దీనినిబట్టియు, ఆంధ్రరాజుల శాసనములన్నియు ఏదోయొకవిధమగు ప్రాకృతభాషలో ఉండుటంబట్టియు ఆంధ్రుల మాతృభాష ప్రాఁత మరాటీ అని అయ్యంగారు వాదించుచున్నారు.

మ-రా-రా- కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు, "హిందూదేశ లిపులకు బ్రాహ్మీలిపి మాతృక" అనియు, 'అశోకలిపినుండి గుహాలిపియు, గుహాలిపినుండి, వేంగిలిపియును, వేంగిలిపినుండి పూర్వచాళుక్యలిపియును, పూర్వచాళుక్యలిపినుండి తెలుఁగులిపియును క్రమక్రమముగ వికసించినవి.'' అనియు సెలవిచ్చియున్నారు

కావున, ఆంధ్రులకు అసలు జన్మస్థలమేదో, వారి మాతృభాష ఏదో, వారిలిపి ఏదో తెలిసికొని తెలుపుటకు పండితులు పూనుకొందురు గాక !

క్రీ. శ. 22 సం॥ములో "ప్లయినీ" భరతఖండమును గూర్చివ్రాయుచు, "ఆంధ్రరాష్ట్రము తక్కిన రాష్ట్రములకంటె బలవత్తరమై, పెక్కు గ్రామములతోడను, ప్రాకారశోభితములగు ముప్పది పట్టణములతోడను, లక్ష కాల్బలముతోడను, రెండువేల గుఱ్ఱపుదళముతోడను, వేయి యేనుఁగులతోడను వెలయుచున్నది." అని వ్రాసియున్నాఁడు. ఆకాలపు నానాదేశ శాసనములందు ఆంధ్రులనుగూర్చి ఉదహరించి యుండుటచే వారప్పుడు భరతఖండమందంతట ప్రబలులయియుండవలెను. పడమటి సముద్రము మొదలు తూర్పుసముద్రమువరకును, ఉత్తరమున సాంచివరకును మధ్యభారతఖండమును వారుపాలించుచుండిరి. "ప్లయినీ" వ్రాసిన కాలములోనే "పెరిప్లస్స"ను చారిత్రకారుఁడు, బారిగజ (బ్రోచి) కు దక్షిణమునందలి దేశము దక్షిణాపథమని వ్రాసియున్నాఁడు. ఆంధ్రదేశమును దక్షిణాపథమని స్పష్టముగా తెలుపుటకు ఇదే మొదలు. అదే ఇప్పటి దక్కను. దక్షిణాపథపదము ఋగ్వేదములోను, సౌరాష్ట్రపదముతో కలిసి బౌధాయన ధర్మసూత్రములోను కానవచ్చుచున్నది. అది మహాభారతమున సభాపర్వములోను, మహాభాష్యములోనుగూడ ఉన్నది. ప్రతిష్ఠానపురమును, కళ్యాణనగరమును దక్షిణాపథములోని ముఖ్య వర్తకస్థలములని చెప్పుటచేత దక్షిణాపథము ఆంధ్రదేశమే అని ఒప్పుకొనక తప్పదు. ✓

శకవంశస్థులకును ఆంధ్రులకును చిరకాలము యుద్ధములు జరిగి, నానాఁటికి ఆంధ్రరాష్ట్రము క్షీణించినది. శకక్షాత్రపుఁడగు రుద్రదమనుఁడు క్రీ. శ. ౧౫౦ సం॥ములో రెండవ విలివాయకురుని కుమారుఁడును - తన అల్లుఁడును, 'దక్షిణాపథప్రభువు' నగు పులిమాయితో పోరి, అతనిని జయించెనుగాని, బంధుత్వమునుబట్టి అతనికి హానిచేయక వదలివేసెను.

ఆంధ్రరాజుల నాణెములమీఁది భాషకూడ ప్రాకృతమే. మొదటి నాణెములు కొల్హాపురములోను, తరువాతి నాణెములు కృష్ణా గోదావరీ మండలములలో మాత్రము దొరకినవి. పడమటినుండి శకులును, దక్షిణమునుండి పల్లవులును రాష్ట్రముల నలముకొనినపుడు వారి యేలుబడిలో ఉండిన దేశము ఆ రెండుజిల్లాలే. అదే వేంగిదేశము.

క్రీ. శ. మూడవ శతాబ్దములో, ఆంధ్రుల పడమటి రాష్ట్రములు ఉజ్జయినీ నగరమున పరిపాలనము చేసిన శకవంశస్థులకు స్వాధీనములైనవి; తూర్పుననుండు ఆంధ్రరాష్ట్రము పల్లవులాక్రమించుకొనిరి. నాల్గవ శతాబ్దారంభమున ధాన్యకటకము పల్లవ రాష్ట్రాధికారికి రాజధానిగా ఉండె. 380 సం॥ములో సముద్రగుప్తుఁడు దిగ్విజయము చేసినపుడు పెదవేఁగి రాజధానిగా ఉండిన పల్లవరాజప్రతినిధి అగు హస్తివర్మను అతఁడు జయించె. కాని, మూఁడవశతాబ్దము నుండియు ఆంధ్రరాజులను గూర్చికాని ఆంధ్రజాతులనుగూర్చికాని ఎక్కడను ఏజాడయును కనఁబడదు. అప్పుడు ఆంధ్ర శబ్దము దేశనామముమాత్రమయ్యె. ఏడవ శతాబ్దములో వచ్చిన చీనాబాటసారి హ్యూయనుత్సాంగు ఇప్పుడు బీరారు అని వాడుకలోనున్న దక్షిణ కోసలమునుండి తాను ఆంధ్రదేశమునకు వచ్చితిననియు, దానిరాజధాని 'వేఁగినాఁడు' అనియు, భాష భేదమనియు, లిపి ఇంచుమించుగా కోసలదేశస్థుల లిపివంటిదే అనియు వ్రాసియున్నాఁడు. వేఁగినాఁటిలో వాడుకలో నుండిన

అప్పటిభాషయే తరువాత నన్నయాదులు ఆంధ్రమహాభారతములో వాడినభాషకు మాతృక అనియు, తాము కనిపెట్టినంతవఱకు తెలుఁగుభాషకు ఆంధ్రము, అని మొదట పేరుపెట్టినవాఁడు నన్నయభట్టే అనియు అయ్యంగారి అభిప్రాయము. ఆంధ్రశబ్దము మొట్టమొదట ఒక జాతికిని, పిమ్మట పడమట రాజ్యముచేసిన రాజవంశమునకును, అటుపిదప పదునొకండవ శతాబ్దమునకు పూర్వముతూర్పున ఏర్పడినభాషకును పేరయ్యెనని ఆయన చెప్పిన విషయము - మ-రా-రా- చిలుకూరి వీరభద్రరావుగారు "ఆంధ్రుల చరిత్రము పూర్వయుగము"లో వ్రాసినదానికి విరుద్ధముగ ఉన్నది; కావున అది నిజమో కాదో పండితులు నిర్ణయింతురుగాక.

## ప్రాచీన గ్రంథాలయోద్యమము

గ్రంథములన్న మనవారికి మొదటినుండియు ప్రాణముకంటె ప్రియమగునప్పుడు ధనముకంటె ప్రియమని వేఱే చెప్పనక్కఱలేదుగదా! అందుచేత పండితుల గృహములేకాక పామరులగృహములును గ్రంథాలయములుగా విలసిల్లుచుండినవి. ఇవి గృహస్థగ్రంథాలయములు. ఇఁక, రాచనగరులు - దేవాలయములు - మఠములు గ్రంథాలయములుగా ఒప్పెడివని చెప్పనక్కరయే లేదు. ఇవి సార్వజనిక గ్రంథాలయములు. మన దేశపు గ్రంథాలయవిభాగ మిట్టిదే అనవచ్చును. దేశమునకు తటస్థించిన ఉపద్రవములచే మన సార్వజనిక గ్రంథాలయములు చాలవరకు నశించినవి. పోఁగా మిగిలిన వానిలో పురాతనమై పసిద్ధికెక్కి మన తల్లిభాషతో సంబంధించినది తంజావూరి గ్రంథాలయము; ఇది పదునేడవ శతాబ్దారంభములో వెలసినది. దీనితరువాతిది, చెన్నపురిలో బ్రౌనుదొరగారి ప్రోత్సాహమువలన స్థాపితమైన ప్రాచ్యలిఖితపుస్తక భాండాగారమని నాగేశ్వరరావు పంతులుగారు నిరుడు తమ అధ్యక్షోపన్యాసమున తెలుపుచు, ఇవి రెండే ఆంధ్రపుస్తక భాండాగారములందు ప్రాచీనములనికూడ సెలవిచ్చియున్నారు. పరికించి చూడఁగా మఱికొన్ని గ్రంథాలయములుకూడ ఉండినట్లు స్పష్టమగుచున్నది. భరతఖండపు సర్వేయర్ జనరల్‌గా ఉండిన మకెంజీ దొరగారు తయారుచేసిన ప్రాచ్యలిఖితపుస్తకములజాబితా ౧౮౨౮ సం॥ములో హెచ్. హెచ్. విల్సనుదొరగారు ప్రచురించిరి. దానిలో తెలుఁగున పురాణాదులు 3౬, చరిత్రలు-జీవితములు మొ॥ ౨3, పద్యకావ్యములు-నాటకములు-కథలు మొ॥ ౮౨, లక్షణగ్రంథములు ౯, జ్యోతిషము - వైద్యము మొ॥ ౬, కలసి మొత్తము ౧౫౬ గ్రంథములు లభించినట్లు కానవచ్చుచున్నది. ఇతర భాషాగ్రంథములును పెక్కులు జాబితాలో కలవు ఇన్నిగ్రంథములు చేరినపుడు గ్రంథాలయమేర్పడకుండునా? ఇది అటుండనిండు. ౧౮౬౮ సం॥ము నవంబరు తే 3 దీని సంస్కృత లిఖితగ్రంథములను గూర్చి ఇండియాదొరతనమువారు చేసిన తీర్మానము ననుసరించి గస్టవ్ ఆపర్టు దొరగారు చెన్నపురిదొరతనమువారి సెలవుమీఁద దక్షిణహిందూదేశమున సంచారము చేసి ప్రచురించిన 'సంస్కృత లిఖిత గ్రంథముల జాబితాలు' అను సంపుటములలో ఆయన కనుఁగొనిన గ్రంథాలయములను పేర్కొనియున్నారు. అందులో విశాఖపట్టణముజిల్లాలోనివే సుమారు 30 కలవనిన, తెలుఁగు జిల్లాలన్నింటిలోను ఎన్నో ఉండుననుట స్పష్టమే. దొరగారుచూచిన గృహస్థగ్రంథాలయములలో కొన్ని అయినను ఇప్పటి మన గ్రంథాలయములవంటివి కావని చెప్పవలనుపడదు. విజయనగరమహారాజుగారి గ్రంథాలయమును, బొబ్బిలి రాజుగారి గ్రంథాలయమును పలువురికి ప్రతిదినమును పనికివచ్చునవే కాని ఒకరికే ఎప్పుడో పనికివచ్చునవి కావు. అట్టిదే విశాఖపట్టణములోని పరవస్తువారి గ్రంథాలయమును. ఇప్పుడు 'అర్ష పుస్తక భాండాగారము' అను పేరఁ బరగుచున్న దీని ఉత్పత్తినిగూర్చి కనుఁగొనఁగా ౧౮౦౦ సంవత్సర ప్రాంతమున ఏర్పడినట్లు తేలినది. పరిశీలించినచో ఇట్టివి మఱికొన్నికూడ బయలుపడవచ్చును. ప్రాచీన గ్రంథాలయముల నలంకరించినవి తాటాకు గ్రంథములే.

## నవీన గ్రంథాలయోద్యమము.

౧౮౦౬ సం॥ మున తెలుఁగు అచ్చు వచ్చినది. ౧౮3౮ సం॥మున తెలుఁగు గ్రంథములు అచ్చుపడ మొదలుపెట్టినవి. అందుచే క్రొత్త గ్రంథములును బయలు

దేఱినవి. అచ్చుగ్రంథములు హెచ్చినకొలఁదిని ఇప్పటి పద్ధతిని గ్రంథాలయములు పొడచూపదొడఁగినవి. పాఠశాలాకళాశాలా గ్రంథాలయములు, గృహస్థ గ్రంథాలయములు, సార్వజనిక గ్రంథాలయములు వృద్ధిపొందినవి. దేశమున సంస్కరణాభిలాష అంకురించి అందుకు సాయపడినది. ఏర్పడినకాలము తెలిసినవానిలో, అంతకు పూర్వమే ఏర్పడినను ౧౮౮౬ సం॥ మున విశాఖపట్టణమున 'సరస్వతీనిలయము' సార్వజనిక గ్రంథాలయమైనది. ౧౮౮౯ సం॥ములో పులివెందులలో 'సరస్వతీవిలాసము' పొడమినది. ౧౮౯౦ సం॥న వంగవోలులో సీ. వీ. ఎన్. లైబ్రరీ బయలుదేఱినది. ౧౮౯౪ సం॥ములో విజయనగరమున 'సింహాచలపతిరావు లైబ్రరీ' స్థాపితమైనది. ౧౮౯౫ సం॥మున ఉండిలో నౌరోజీక్లబ్బు ఉద్భవిల్లినది. ౧౮౯౭ సం॥ములో కుముదవల్లియందు 'వీరేశలింగకవిసమాజము' వెలసినది. ౧౮౯౯ సం॥మున కొల్లూరిలో 'ర్‌డింగుక్లబ్బు' వెడలినది. ౧౯౦౦ సం॥ములో గుంటూరియందు 'యంగ్ మెన్స్ లిటరరీ అసోసియేషను'— రాజమహేంద్రవరమున 'వీరేశలింగ పుస్తక భాండాగారము' విలసిల్లినవి. ౧౯౦౪ సం॥మున హైదరాబాదులో 'కృష్ణదేవరాయాంధ్రభాషానిలయము.' ఏర్పడినది. అప్పటినుండియు గ్రంథాలయోద్యమము క్రమక్రమముగ వృద్ధిపొందుచు వచ్చినది. అంతలో భరతఖండమందంతటను జనులమనంబుల నూత్నోత్సాహ ముత్పత్తి అయినది; వివిధసంస్కరరూపములతో విజృంభించినది. ౧౯౦౭-౮ సం॥ములలో గ్రంథాలయములసంఖ్య పెచ్చుపెరఁగినది; అందుచే మరల కొంతతగ్గినది. ౧౯౧౧ సం॥మున బెజవాడలో రామమోహన ధర్మపుస్తకభాండాగారము పొడచూపినది. ౧౯౧౩ సం॥ములో 'ఆంధ్రోద్యమము' ప్రారంభమైనది. దానితో ఆంధ్రుల ఉత్సాహము హెచ్చినది. గ్రంథాలయసంఖ్యయును తిరిగి పెరఁగినది. ౧౯౧౪ సం॥మున రామమోహన ధర్మపుస్తక భాండాగారము వారు ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ జరుప యత్నించినారు; బెజవాడలో జరిపినారు. రెండవ సభ రాజమహేంద్రవరమునను, మూడవది నెల్లూరిలోను జరగినవి. మొదటి మూడుసంవత్సరములును పట్టణములలో జరిగి, ఈసంవత్సరము ఈ బారువ గ్రామములో జరుగుటయే గ్రంథాలయోద్యమశక్తిని వేనోళ్ళ చాటుచున్నది. మొక్కకు జీవశక్తి బాగుగా ఉండినఁగాని వేళ్లువేయఁజాలదు. అటులే ఏ ఉద్యమముగాని తగినంతబలము కలిగియున్నఁగాని పట్టణములనుండి పల్లెలకు రానేరదు. మనఉద్యమములలో పల్లెలయందు బాగుగా వ్యాపించినది గ్రంథాలయోద్యమమే. కాన, మనజలనపు మొక్కలన్నింటిలో బాగుగా వేళ్లుదన్నిన మొక్క గ్రంథాలయోద్యమమే అని చెప్పకతప్పదు; ఒప్పుకొనక లిప్పదు.

మహేంద్రగిరికి సమీపమున సముద్రతీరమున ఉండుటచేతను, 'మహేంద్రతనయ' అనునది దక్షిణమున ప్రవహించుచు దీనిదగ్గఱనే సముద్రముగామి అయి పర్వదినములందు వేలకొలఁది జనుల నాకర్షించుచుండుటచేతను, ఈ బారువగ్రామము ఇదివఱకే సుప్రసిద్ధమైనది.

పరశురాముఁడు మహేంద్రగిరియందు తపస్సు చేసికొనుచుండునను పురాణప్రసిద్ధమే. అతని తపోవనము 'ఉద్దానము' అను పేర ఈ గ్రామమునకు ఈశాన్యభాగమున-సముద్రప్రాంతమున కొబ్బరి-అరఁటి-పనస-తములపాకులతోఁటలతో చెలువారుచు కోనసీమను తలఁపించుచు కన్నులపిందుగా వన్నె కెక్కుచున్నది. ఈ గ్రామమునంటియున్న 'కపిలగుడ్డి' పాండవులు మహేంద్రగిరియందు నివసించునప్పుడొక నాఁడొక మృగమనుకొని కపిలగోవును వేటాడ అది పడినచోటనియు, 'యజ్ఞము బట్టి' తత్పాప పరిహారమునకై వారు యజ్ఞముచేసిన స్థలమనియు, జనార్దన స్వామివారిని-కోటిలింగేశ్వరస్వామివారిని వారు ప్రతిష్ఠించిరనియు చెప్పుదురు. పాండవులు సువర్ణదానము చేసిరనుటకు నిదర్శనముగా వర్షకాలమున వీధులలో ఇప్పటికిని దొరకుచున్న 'సువర్ణవంగ పరకలు' ను, 'నందిపరకలు'ను నేడు సభ్యులకు కనఁబఱచి, గ్రంథాలయ ప్రదర్శనమునకు సమర్పించుచున్నారు.

౧౯౧౪ సంవత్సరము మేనెల తే ౧౦ దిని శ్రీకృష్ణదేవరాయ గ్రంథభాండాగారము స్థాపించి, ఈ సంవ

త్సరము ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభను ఇచ్చట జరపి ఆదరించుటచే దీనిపేరాంధ్ర దేశమున శాశ్వతముగా నెలకొనఁగలదు.

మన ప్రయత్నములలో వాఙ్మయాభివృద్ధి ప్రయత్నము జ్ఞానదాయకము; స్వయంసాహాయ్యముచే చాల వఱకు సఫలము చేసికొనఁదగినది. దీనికొఱకు బంగాళీలు మహారాష్ట్రులు మొదలగువారు పాటుపడుచున్నారు; ఫలము పొందుచున్నారు. మనవారును, మాసపత్రికలు-వారపత్రికలు-దినపత్రికలు- గ్రంథమాలికలు-విద్యావిషయిక సంఘములు స్థాపించి పనిచేయుచున్నారు. దీనితోపాటు గ్రంథాలయములును బయలుదేఱినవి. ఇప్పటికి నాల్గువందలకు పైఁగా లెక్కకువచ్చినవి. కాని, ఇవి మిక్కిలి తక్కువ. విద్యార్థులుగాక చదువనేర్చినవారు నూఱుమంది ఉన్న ప్రతిగ్రామమునందును గ్రంథాలయములు స్థాపించుట ఆవశ్యకము. ఇంగ్లాండు-ఫ్రాన్సు - జర్మనీ - జపాను, దేశములలోను, ముఖ్యముగా అమెరికా సంయుక్తరాష్ట్రములలోను గ్రంథాలయములు పెక్కులుకలవు; కొన్ని కోట్లకొలఁది విలువగలవియును ఉన్నవి. అందుచే సమస్త విషయములను తెలుపు గ్రంథములతోను పటములు చిత్తరువులు మొదలగు సాధన సామగ్రితో డను నిండి పిల్లలకును పెద్దలకును ఉపయోగపడుచున్నవి. భరతఖండమున బరోడాసంస్థానములో గ్రంథాల యోద్యమము చక్కఁగా వర్ధిల్లి జనోపయోగకరముగా పనిచేయుచున్నది. ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము వ్యాపించినను ధనలోపముచేతను, ఉత్సాహలోపముచేతను జరుగవలసినంతపని జరిగి కావలసినంత సాయము జనులకు సమకూడకున్నది. ఉత్సాహలోపమునకు కారణము మనమే. 'శ్రేయాంసి బహువిఘ్నాని' అనుమాట మనకు క్రొత్తదికాదు. ఎన్ని విఘ్నములు వచ్చినను తగ్గకనిలుచునదే సరి అయిన ఉత్సాహము. అట్టి ఉత్సాహశక్తి మనకున్నచో రెండవ లోపముకూడ త్వరలోనే చాలవఱకు తీఱును. కావున, గ్రంథాలయ కార్యనిర్వాహకులారా! తక్కిన ఉద్యమములను పూనుకొను వారికంటె మీరు ఎక్కువ ఉత్సాహముగలవారగుడు, మీ ఉద్యమమే ఎక్కువగా వ్యాపించినదనియు, ఎక్కువగా స్థిరపడినదనియు సంవత్సరము పొడుగునను ఎక్కువగా పనిచేయుచున్నదనియు పేరుపొందినది. కావున మీరిఁక సంఘాగ్రణోత్సాహము కనఁబఱుపుఁడు; పనిచేయుఁడు; గ్రంథాలయోద్యమము సఫలముచేయుఁడు; ఇతరులకు మార్గదర్శకులగుఁడు; ఆంధ్రులు సంస్కారప్రియులు-నూతనోత్సాహము చూపువారుగాక కార్యశూరులనికూడ మెప్పుతెండు.

ఇప్పటి స్థితినిబట్టి విద్యార్థులకు పాఠశాలలలోను- కళాశాలలలోను భాండాగారములు కలవు గాన పై గ్రంథాలయములందు హెచ్చుగా పెద్దలకు పనికివచ్చు గ్రంథములే కొంతకాలమువఱకు సమకూర్చుట కర్తవ్యమని తోఁచుచున్నది. రామమోహన ధర్మపుస్తక భాండాగారము పిల్లలకుకూడ పనికివచ్చునటు లేర్పాటుచేసిన తత్కార్యనిర్వాహకుల ప్రయత్నము శ్లాఘనీయము. గ్రంథాలయములకు పత్రికాసమూహ మొక అంగము. కాన, అది బలపఱుచుటకును, గ్రంథాలయ కార్యనిర్వాహకులు తోడ్పడవలసియున్నది. అందులో, ఆంధ్రపత్రికయే మనకున్న దినపత్రిక. ఎంతో నష్టము భరించి నాగేశ్వరరావు పంతులుగారది జరపుచున్నారు. దాని ప్రచారము హెచ్చింప యత్నించినఁగాని వారి నష్టము తగ్గుట దుర్లభము.

## వాఙ్మయాభివృద్ధి

ఏ దేశమునందుఁగాని, వాఙ్మయ మభివృద్ధిపొందని స్థితిలో గ్రంథాలయోద్యమము ఫలించుననుకొనుట నీరులేక పంట పండుననుకొనుటయే. కావున, మన గ్రంథాలయములు మంచిస్థితిలోనికి వచ్చుటకు మంచి గ్రంథములు పెక్కులు కావలయును. ఇదివఱకున్నవి చాల తక్కువగాన క్రొత్తవి ఎన్నో వ్రాయవలసి ఉన్నది. అవి సులభశైలిలో ఉండవలెను. ఈశైలికి రావుబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులుగారు మార్గదర్శకులయిరి. వారి ననుసరించి మ-రా-రా-శ్రీ, వేమూరి విశ్వనాథశర్మగారు మొదలగువారు రసాయనశాస్త్రము మొదలగు కొన్ని మంచి గ్రంథములు వ్రాసి దేశమునకు చాలమేలుచేసినారు. ...

ములనుగూర్చి పద్యకావ్యములుగాని గద్యకావ్యములు గాని హృదయ రంజకముగా రచించినప్పుడే వాఙ్మయ మభివృద్ధి చెందును. ప్రచురించిన గ్రంథములు తగినవగు నపుడవి చెల్లునటుల చేయుట భాషాభిమానులకు విధి. ఉన్న గ్రంథములే చెల్లనపుడు ప్రోత్సాహములేక కృతి కర్తలు క్రొత్తవి ప్రచురింపజంకుదురు. గ్రంథరచనకు మితియేలేదు, కావున సమర్థులకు విషయములు లేక పోవు. చదువరులు హెచ్చినకొలఁదిని గ్రంథములను హెచ్చుగా బయలుదేఱును; మంచి గ్రంథము లున్న కొలఁదిని చదువరు లెక్కువగుదురు. కాన, చదువరులును - కృతికర్తలును తమ ధర్మ మొనరించి వాఙ్మయాభివృద్ధి చేయవలయును.

పైభాషలలోనున్న వివిధశాస్త్రగ్రంథములు మన భాషలోనికి తెచ్చుట బాగు. అర్థముకాని క్రొత్త సంస్కృతపదములు వాడుటకంటె వాడుకలోనున్న అన్యభాషాపదములు వాడుటయే మేలు. పావులూరి గణితము, క్షేత్రగణితము, లీలావతి- మొదలగు కొన్నియే మనకిప్పటికున్న గణితశాస్త్ర గ్రంథములు. వీనిలో ఉన్న అంశములు చాలతక్కువ. గణితశాస్త్ర సంబంధములగు అంశము లనేకములు తెలిసికొనవలసియున్నది. కాన వానిని తెలుగుగ్రంథములు వ్రాయుట ఎంతో ఉపయోగకరము. ప్రజల హక్కులను తెలుపు గ్రంథములు తక్కువగా ఉన్నవి. ఈ విషయమును గూర్చి తెలుపు ఆంగ్లేయభాషలోని పెక్కుగ్రంథములు సులభశైలిని తెనుఁగు చేయవలసియున్నది. అందుకు అనుగుణమైన శబ్దజాలము దొరకనపుడు సుప్రసిద్ధములైన అందలి పదములే ఉపయోగించుట యుక్తము. ప్రవేశపరీక్షవఱకును శాస్త్రములు దేశభాషలో నేర్పుట యుక్తమని చాలమంది అభిప్రాయపడుచున్నారు. అందుకు ఉపయోగపడునట్లు బాలురుచదువవలసిన గ్రంథములు నిర్జీవముగా తర్జుమా చేయుటకంటె మృదుమధురమగు శైలిని వ్రాయుట కర్తవ్యము. ఇప్పటికి మనము వాఙ్మయాభివృద్ధికి చేసినపని వాకిలి దాఁటి వారణాసి ఎంతదూరమను స్థితిలో ఉన్నది. కాన, పట్టుదలతో పనిచేసినఁగాని కావలసిన గ్రంథము లన్నియు వెలువడవు. అందుచే వాఙ్మయాభివృద్ధి గాని కాదు. కావున భాషాభిమానులందఱును ఈ విషయమున తగిన ప్రయత్నము చేయనగును.

### గ్రాంథికభాష - వ్యావహారికభాష.

ఈసందర్భమున నేనొక విషయమునుగూర్చి మనవి చేయఁదలఁచుకొన్నాను. మనలో కొందఱు మేము గ్రాంథికభాషావాదులము, మేము వ్యావహారిక భాషా వాదులము - అనిభేదము కల్పించుకొని, వైమనస్యములు పెంచుకొని ఒండొరులనుశత్రువులనుగా చూచుకొనుచు వ్యవహరించుచున్నారు. ఉభయపక్షముల వారును పండితులే; అంతేకాక దేశాభిమానులు. అట్టిస్థితిలో అవసరమగు భాషాసంస్కారము చేయరాదా? అవసరములగు మార్పులు మానరాదా? సామాన్యులగు చదువరులకును తెలియునటుల గ్రంథములలో వ్రాయుచు వచ్చిన భాషకు బదులుగా దూష్యములై జనాదరణీయములుగాని పదములు కష్టపడివెదకిచేర్చిన భాష వాడుకేల? భాషనుబట్టి వ్యాకరణముండును. వ్యాకరణమునుబట్టి భాషానిబంధనలు విద్యార్థులకు నేర్పవలసియుండును. కాని, మార్పఁదగిన అంశమైనను ఎప్పటికిని మార్పరాదనుట అనుచితము. అన్నిభాషలలోను కాలక్రమముగ మార్పులు జరగుచునే ఉన్నవి. ఆంధ్రభాషలో గ్రంథములు వ్రాయువారు సాధారణముగా సంస్కృతపండితులగుటచేతను,సహజమగు దేశభాషలలో గ్రంథములు వ్రాయుటవలన విశేషగౌరవములేదని కొందఱు, తలఁచుటచేతను,ఆంధ్రగ్రంథములు చాలవఱకు సంస్కృతపదములతో నిండిపోయినవి. అంతేకాదు. నన్నయభట్టకృతమని చెప్పు 'ఆంధ్రశబ్ద చింతామణి' సంస్కృతమందే ఉండుట తటస్థించినది! లేకున్న తెనుఁగువ్యాకరణము పైభాషలో ఉండుట ఏమిన్యాయము? మొన్న మొన్న వ్రాసిన చిన్నయ్యసూరి వ్యాకరణము తెలుఁగుభాషలో ఉన్నను సంస్కృతవ్యాకరణ పరిభాషతోకూడి సంస్కృత పదములతో నిండియే ఉన్నది. మార్పు సజీవభాషకు సహజము. స్థలభేదమును బట్టి పదములకు అర్థభేదము కలుగవచ్చును. క్రొత్తపదములు వాడుకలోనికి వచ్చుచుండును. క్రొత్తరూపములును వచ్చును. 'మోటారుబండి', 'గ్యాసులైటు' 'రేడి

యం', 'రామస్వామి' మొదలగు పదములకు ఎప్పుడును ఎవరును వాడని క్రొత్తపదములు కష్టపడి కల్పించుట వలని ప్రయోజనము కానరాదు. అటులే మనభాషలో 'విమానము' అను పదము వాడుకలో ఉన్నప్పుడు 'ఎయిరోప్లేన' అనియు, 'వేళ ఎంతయినది' అనుటకు బదులు 'టైమెంతయినది' అనియు, అక్కరమాలిన అన్యభాషాపదములు వాడుటయు హాస్యాస్పదమే. కాన అతిసర్వత్ర వర్జయేత్ అను నీతినిబట్టి ఉభయపక్షముల వారును సహజలక్షణము చెడకుండ భాష నభివృద్ధి చేయ పూనుకొనుట ఉత్తమము.

ఇంగ్లీషుపదములు కలిపి వాడిన భాషయు సులభముగ బోధపడునపుడు ఉపన్యాసకులు డొంక తిరుగుడుగా సభలలో ప్రసంగింపవలసిన నిర్బంధమేమి? అన్యదేశ్యములు మన పూర్వకవులే స్వేచ్ఛగా వాడినారు. పత్రికాధిపతులును - పత్రికావిలేఖకులును తోడుపడిన మన భాష చాలవరకు అభివృద్ధి కాగలదు.

స్వభావసిద్ధములగు వర్ణనలతోను - చక్కని ఉపమలతోను సులభశైలిని గ్రంథములు వ్రాయుట పూర్వపద్ధతి. ఆ సదాచారమును వదలి మధ్యకవులు తమ పాండిత్యమును కనబరచుటకో, ప్రభువుల మెప్పు నొందుటకో అతిశయోక్తులు - ఉత్ప్రేక్షలు పెంచి, శబ్దాడంబరముతో కఠినశైలిని గ్రంథములు కూర్చ మొదలిడిరి. ఆ దురాచారము పెక్కురు కవులకు రుచ్యమైనది. అయినను ఇప్పుడిప్పుడు మనకృతికర్తలు కొందఱు స్వభావసిద్ధముగా గ్రంథములు వ్రాయు పూర్వాచారము నవలంభించుట మెచ్చదగినది. కవులందఱును ఈ మంచిదారి త్రొక్కి భాషకును - దేశమునకును మేలు చేయుదురుగాక! కవులు నిరంకుశులే కాని వారు తమ స్వాతంత్ర్యము మంచికై ఉపయోగించిన మేలుగదా!

ఆంగ్లేయభాషలో పాండిత్యముగల మహాదేవ గోవింద రనడేగారు మాతృభాష అగు మహారాష్ట్రములోను, రమేశచంద్రదత్తుగారును, రవీంద్రనాథ ఠాకురుగారును స్వభాష అగు బంగాళీలోను - ఇటులే ఇంగ్లీషు భాషయందారితేరిన స్వదేశపండితులు పెక్కురును గ్రంథములువ్రాసి పేరుపొందిరి. అట్టివారు మనవారును కొందరీపద్ధతి ననుసరించి వ్రాయుచున్నారు. కాని పలువురీ పనికి పూనుకొనినంగాని త్వరలో వివిధ విషయములను గూర్చి తెలుగుగ్రంథములు గ్రంథాలయముల నలంకరింపవు కాని, ఇంగ్లీషు తెలుగుభాషలు రెండును తెలిసిన పండితులు మంచిగ్రంథములు వ్రాసినచో చాల మేలు.

## గ్రంథసంపాదనము

అచ్చుపడిన పుస్తకములు చేర్చుటతోనే గ్రంథాలయముల పని పూర్తి కానేరదు. మన దేశమున తాటాకు పుస్తకములు పలువురియిండ్లలో ఉన్నవి. కొందఱు తాము ప్రాణమువలె చూచుకొనుచు దాచుకొని గ్రంథములీయరనుట నిజమే కాని, తగినంత ప్రయత్నము చేసి జాగ్రత్తగా ఉండునను నమ్మకము కలిగించిన యెడల చాలమంది మన గ్రంథము లీయకపోరు. అచ్చుపడినంతమాత్రమున గ్రంథముల వ్రాతప్రతులు వదలవేయరాదు. ప్రాచీన వ్రాతప్రతులవలన లిపిభేదములు తెలియవచ్చుటయే కాక, పాఠాంతరములుకూడ బయలుపడును. ఆంధ్రసాహిత్యపరిషత్తు వారీవిషయమున చేయు ప్రయత్నము మిక్కిలి మంచిది. వ్రాతప్రతులు సంపాదించుటకు చేయు యత్నమే అచ్చుపడిన వానిని గూర్చికూడ చేయనగు. భాండాగార నిర్వాహకులు కొందఱు కొంతవఱకు పై పద్ధతులవలంబించి పని చేయుచున్నారు; కాని, హెచ్చు మేలు కలుగవలెనన్న ఇది వఱకు చేసినదానికంటె హెచ్చు ప్రయత్నము చేయవలసి ఉన్నది.

## దొరతనమువారి సాయము

గ్రంథాలయములకు దొరతనమువారు సాయము చేయవలసియున్నది. కావున 'కోఆపరేటివ్ సొసైటీల' వలెనే ఇవియును ధనవ్యయము లేకుండ రిజిష్టరీ చేయించుకొనుటకు అవకాశమిచ్చి, రిజిష్టరీ అయినవానికి వ్యవసాయము - ఆరోగ్యము - పరిశ్రమలు - మొదలగు వానినిగూర్చి తాము చేయు ప్రచురములు పత్రికాపతులకిచ్చునట్లె ఇచ్చుచు, గ్రంథాలయముల వృద్ధికొఱకు క్రొత్తగా కొను గ్రంథముల విలువలో సగము ప్రభుత్వము వారుగాని, మ్యునిసిపాలిటీ వారుగాని,

బోర్డువారుగాని ఉచితముగా దయచేయుదురు కూడ ముఖ్యముగ నా అభిప్రాయము. బరోడామహారాజా వారు గ్రంథాలయాభివృద్ధికై ఎంతో ఖర్చు పెట్టుచున్నారు. మన ప్రభుత్వము వారటులేల చేయరాదు?

మన గ్రంథాలయములలో ప్రాచీనమయినదగు తంజావూరు భాండాగారము ఇంగ్లాండునకు తీసికొనిపోవు ప్రయత్నము జరుగుచున్నట్లు తెలియవచ్చుచున్నది. అది నిజమే అయినయెడల దయచేసి దొరతనమువారీ దేశమునుండి అది తొలఁగి పోకుండఁజేయ ప్రార్థితులు.

## గంజాము విశాఖపట్టణము జిల్లాల స్థితి

గంజాము జిల్లాలోన - విశాఖపట్టణము జిల్లాలోను ఉండవలసినన్ని గ్రంథాలయములు లేకపోవుట శోచనీయము. రెండు జిల్లాలలోని పెద్దలును శ్రమతీసికొని, ఎక్కువ గ్రంథాలయములు స్థాపింప ప్రయత్నించుట కర్తవ్యము. విశాఖపట్టణముజిల్లా శృంగవరపుకోట తాలూకా గొల్జాము గ్రామములో ఆంధ్రబాల సరస్వతీ పుస్తక భాండాగారమునకు కార్యదర్శిని యగు శ్రీమతి కూర్మాపాటి సన్యాసమ్మగారు శూద్రస్త్రీ. ఆ గ్రామములో శూద్రులు మాత్రము కలరు. విద్య నేర్చినవారు చాల తక్కువయుండి. అట్టిస్థితిలో ఆమె గ్రంథాలయము స్థాపించుట-౧౧౦౦ గ్రంథములు చేర్చుట- పెక్కుమంది అక్కడకువచ్చి చదువునట్లు చేయుట - చదువులేనివారికి గ్రంథములు చదివి వినిపించుట శ్లాఘనీయములు. పాపము! ఈ నడుమనే ఆమెభర్త పరలోకప్రాప్తి చెందెనఁట. పరమాత్ముఁడామెకు ధైర్యమొసఁగి, దేశసేవాపరాయణత్వమున భర్తృశోకమునకు లోనుగాకుండఁ జేయుఁగాక! స్త్రీలే ఉత్సాహముతో పనిచేయుచున్నపుడు పురుషులీవిషయమున అశ్రద్ధచేయుట ధర్మముకాదు.

## గ్రంథాలయ సర్వస్వము.

ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు గ్రంథాలయాభివృద్ధికై చేయు ప్రయత్నములు సర్వజన సమాదరణీయములు. అందులో గ్రంథాలయ సర్వస్వము ప్రచురింపఁబూనుకొనుట మిక్కిలి యొన్నఁదగియున్నది ప్రథమసంపుటము నాలుగుభాగములుగా ప్రచురించినారు. దానివల్ల రు. ౫౦౪-౪-౦ నష్టమువచ్చినను వెనుకదీయక రెండవసంపుట భాగములు ప్రచురించుచున్నారు. గ్రంథాలయముల పక్షమున ఏదో పత్రిక ఉన్నయుక్తముగా నుండునని ఈ మహాసభా ద్వితీయాధ్యక్షోపన్యాసమున సూచింపబడినది. గ్రంథాలయ సర్వస్వము బయలుదేరి ఆలోపము తీర్చినది; దానియందలి అచ్చు - చిత్రపటములు-మనోహరముగా ఉన్నవి. విషయములు జ్ఞానదాయకములు. కాని, దానికి నష్టముకలుగుటచూడ తగినవానికి తోడ్పడు నేర్పు మన వారికింకను కలుగలేదుగదా అని చింతిల్లవలసివచ్చుచున్నది. త్వరలో మనకీ లోపము తొలఁగుఁగాక! ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమువారు కార్యశూరులు; మార్గదర్శకులు; అట్టి వారెవరికి పూజ్యులు కారు? ఇఁక, తమ సహజౌదార్యముతో గ్రంథాలయసర్వస్వమునకు నూఱురూపాయల వార్షికమేర్పఱచి వారికి తోడ్పడి ఇతరధనవంతులకు మార్గదర్శకులైన శ్రీ పిఠాపురము రాజుగారు మనకందఱకును మాననీయులని వేఱే చెప్పనక్కఱలేదుగదా!

## గ్రంథాలయముల ముఖ్యపుపని.

గ్రంథాలయములు బయలుదేఱినవి; బయలుదేఱును; పనిచేసినవి; చేయుచున్నవి; చేయును. కాని, అవి ముఖ్యముగా చేయవలసినపని ఏమి? గ్రంథ సంపాదనమా? అదేకాదు; బడులుపెట్టుట పురాణములు చదువుట, మొదలగు వానివల్ల జ్ఞానదానమా? అదియును ఇప్పటివలెకాదు; అనఁగా దీనితోను దానితోను ఏదో మిడిమిడి జ్ఞానము కలిగించుట మాత్రము కాదు; ఒక్కొక విషయమునందు కావలసినంత జ్ఞానముకలిగించి, అది లాభకరముగా చేయుటయే గ్రంథాలయముల ముఖ్యపుపని. ఎట్లందురా? దయచేసి వినుఁడు, గ్రామములందును పట్టణములయందును గదా గ్రంథాలయములుండును. గ్రామములయందలి జనులకు ఏవోకొన్ని వృత్తులే ముఖ్యములుగా ఉండును. పట్టణములయందలి వారలకు పెక్కువృత్తులున్నను, అక్కడను అందులో కొన్నియే ముఖ్యములగును; ఒక్కొకచోట ఒకటియే ముఖ్య

మయి ఉండును. మన దేశపు ముఖ్యవృత్తి వ్యవసాయము. పట్టణములకంటె పల్లెలే భరతఖండమున ఎన్నోరెట్లు హెచ్చు. అందుచే మనదేశమనఁగా పల్లెలే. అందుచే వ్యవసాయమే పెక్కు పల్లెలలో ముఖ్యవృత్తి; కాన, అట్టిచోట్లనుండు గ్రంథాలయములు వ్యవసాయముతో సంబంధించిన గ్రంథసామగ్రి సాధ్యమగునంత వఱకు సంపాదించి, క్రొత్తసంగతులు బోధించి, ఆ వృత్తి అభివృద్ధి చెంది లాభకరమగునటుల చేయవలె. కొన్ని గ్రామములయందు నేఁత ముఖ్యవృత్తిగా ఉండును; ఆ స్థలములందుండునవి నేఁతను గూర్చిన పుస్తకములుచేర్చి, క్రొత్తసులువులు నేర్పి, అవృత్తి కొంత వఱకైనను నిలిచి లాభము కలిగించునటుల చేయవలె, ఇటులే వడ్రము-కమ్మరము-కంచుపని-రాగిపని-వెండిపని-బంగారుపని-వెదురుపని-మట్టిపని-దంతపుపని-వాణిజ్యము-వైద్యము-కవిత్వము-సంగీతము-నాటకము-చిత్రలేఖనము-మొదలగు వృత్తులలో ఒకటి ముఖ్యముగా ఉన్న ఒక దానిని గూర్చియు, కొన్ని ముఖ్యములుగా ఉన్న కొన్నిటిని గూర్చియు, పెక్కులు ముఖ్యములుగా ఉన్న పెక్కింటినిగూర్చియు తెలుపు గ్రంథములును పనిముట్లును వీలు కొలఁదిని ఒక్కసారియే కాకున్న క్రమక్రమముగానైనను జాగ్రత్త పెట్టి, ఆయావృత్తు లవలంబించు వారికి సాయపడి, వారికిసుఖజీవనోపాధి కలిగించుటయే గ్రంథాలయోద్యమపరమావధిగా ఉండవలెనని నాకోరిక! గ్రంథాలయము లిదే తమ ముఖ్యపుపనిగా ఎంచి పనిచేయుటకు తగిన సదుపాయములు పరాత్పరానుగ్రహమున లభించుఁగాక!

పిమ్మట అధ్యక్షులయిన రాజాగారి గుణగణములను బాలకవి భోగరాజు నారాయణ మూర్తిగారు ఆంధ్రపద్యములతో ప్రశంసించిరి. తదుపరి కృష్ణదేవరాయ ఆంధ్రభాండాగారము యొక్క స్త్రీ చదువరియగు శ్రీమతి సీరం సుభద్రయ్యమ్మగారు స్వాగతము నిచ్చిరి.

స్వాగతము.

స్వాగతంబిదె బావనకేగుదెంచి
నట్టి భాషాభిమానుల కార్యులకును
పండితజనాళికి కవిప్రకాండములకు
స్వాగతంబు ముమూటికి స్వాగతంబు
చిన్నగ్రామంబిదని గరసింపకుండ
వ్యయమని ప్రయాసమని మదినరయకుండ
మా సమాజాహ్వానమున మీరు మా పురికరు
దెంచుటన్ సంతసంబు పొందితిమి మేము
ఇటకు మీరు భాషాసేవయే ప్రధాన
మని తలచి వచ్చితిరిగదా యయ్యలార
యిది యెందటి పున్నికగావున నిందుగల్గు
కొరతలను క్షమించి గడుపుకొనగ వలయు
కవిజనంబులు పండితుల్ ఘనులు ప్రభులు
మొదలుగాగల యిందరి మూలపల్లె
కిటకు జనుదెంచుటం జేసి యీపురంబు
నేటినుండియు తలయెత్తి నెగడగలుగు
బావనపురిజనార్దన స్వామియు మరి
కోటిలింగేశ్వరుడు నిమ్ము కోటిగతుల
గాచుచుందురు గాక; మంగళము తెలుగు
బాసయును దేశమును గూడ బడయుగాక.

అనంతరము ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు గౌరవకార్యదర్శులగు అయ్యంకి వేంకటరమణయ్యగారు, ఈసంఘముయొక్క గత సంవత్సర నివేదికను ఈవిధముగ చదివిరి.

## ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము.

### 1916-1917 సంవత్సర వృత్తాంతము

కడచిన సంవత్సరమునందు అనగా ౧౯౧౬-సం॥ మే నెల ౧౨, ౧౩ తేదులయందు నెల్లూరు పురమున తృతీయ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ జరిగిన సంగతి మీ కెల్లరకును విశదమైయున్నది. ఆంధ్రదేశముయొక్క దక్షిణపు కొసనుండి ఒకసారిగా ఉత్తరపు కొసకు వచ్చి, 'బావన' గ్రామస్థుల యాదరణవలన నేడిచట నాల్గవ సమావేశమును జేయగలిగితిమి. కడచిన సమావేశము జరిగినది మొదలు

నేటివఱకు ఈ యుద్యమ వ్యాప్తినిగూర్చి కొంచెము ముచ్చటించెదను.

## గ్రంథాలయముల చరిత్ర

౧౯౧౪-వ సంవత్సరమునందు ప్రకటింపబడిన గ్రంథాలయముల చరిత్రవలన ఆంధ్రదేశమునందు అమితముగ ఉత్సాహము జనియించి, రాగల వత్సరము విశేషముగ అభివృద్ధిని జూపవలెనను పట్టుదల కలిగినది. ఈ సంగతిని గ్రహించినవారమై ౧౯౧౫-వ సంవత్సరమునకుగూడ ఆంధ్రదేశమునందున్న గ్రంథాలయముల చరిత్రను ప్రకటించితిమి. ౧౯౧౪-వ సంవత్సరమునందు అచ్చుపడిన చరిత్రకు ౧౪౦ గ్రంథాలయముల చరిత్రమాత్రము దొరకగా, ౧౯౧౫-వ సం॥ మున చరిత్రయందు ౨౧౦ గ్రంథాలయముల చరిత్ర ప్రకటింపబడియుండు టెంతయు సంతోషదాయకము. ఇదిగాక చరిత్రల నంపని ౭౯ గ్రంథాలయములుగూడ గలవు. ఈ యంకెలనుబట్టి ఈయుద్యమ ప్రారంభమునుండియు గ్రంథాలయము లెట్లభివృద్ధి నొందుచున్నవియు సులభముగ గ్రహింపనగును. ఈ చరిత్రయొక్క ప్రయోజనముగూర్చి మదరాసునందు ప్రకటింపబడుచున్న "న్యూ ఇండియా" పత్రిక ఇట్లు వ్రాసినది:—"ఈ గ్రంథమువలన ఆంధ్రజన ప్రబోధమును, ఆంధ్రుల స్వధర్మాచరణ పరాయణత్వమును తేటపడుచున్నవి" "నళ" నామసంవత్సరమునకు ఆంధ్రదేశ గ్రంథాలయముల చరిత్రను ప్రత్యేకముగ గ్రంథరూపమున బ్రకటింపక, గ్రంథాలయ సర్వస్వమునందే అచ్చువేయవలెనని తలంచుచున్నారము.

## గ్రంథాలయ సర్వస్వము

ఈ సంఘపక్షమున గ్రంథాలయముల యభివృద్ధికై "గ్రంథాలయ సర్వస్వ" మను నామమున మూడు మాసముల కొక గ్రంథమును ప్రకటించుచున్న సంగతి మీకు తెల్లమేను. గ్రంథాలయోద్యమ మందలి వివిధ దశలనుగూర్చి విపులముగ బోధించునట్టి వ్యాసములు ప్రతి భాగమునందును ఆయా విషయములనుగూర్చి ప్రత్యేక పరిశ్రమ జేసిన సమర్థులచే రచింపబడియున్నవి. ఈ వ్యాసములయందు, పాశ్చాత్య దేశము లందును బరోడా రాజ్యమునందును గ్రంథాలయోద్యమ మెట్లు పనిచేయుచున్నదియు చూపబడినది. మఱియు ఆయా దేశముల యందీ యుద్యమ ప్రచారమునకు అవలంబింపబడుచున్న అభివృద్ధి మార్గములు మన దేశమునకు అనుగుణముగ నుండునటుల అనుభవ సిద్ధముగ బోధింపబడినవి. గ్రంథాలయములకు కావలసిన నిబంధనలు, పట్టికల నమూనాలు కూడ ఇందు ముద్రింపబడినవి. ఆంధ్రదేశమునందు స్వంత భవనములు గలిగియున్న గ్రంథాలయముల చరిత్రములనుగూడ క్రమముగ నిందు ముద్రించుచున్నారము. ఇంతియేగాక వాఙ్మయము, చరిత్ర, మొదలగు విషయములనుగూర్చిన వ్యాసములును, గ్రంథములవిమర్శనములును సమర్థులగు పండితులచే వ్రాయబడుచున్నవి. విశేష వ్యయప్రయాసలకులోనై గ్రంథాలయములకు సంబంధించిన చిత్రపటములనేగాక, ఇతర విషయములకు సంబంధించిన వానినిగూడ నిందు ముద్రించితిమి. ఐనను ప్రథమ సంపుటమునకు రూ. ౫౦౪-౪-౦ లు నష్టమువచ్చినది. ద్వితీయ సంపుటమునకైన ఇంతకన్న తక్కువ నష్టము వచ్చునటుల గాన్పించదు. ఐనను సొమ్ము ముందుగా పెట్టుబడి పెట్టి కాగితము మొదలగు వానిని దెప్పించి నిలవయుంచినను, అనివార్యములగు ఇతర ఇబ్బందులవలన ఈ వత్సరము రెండు సంచికలకన్న నెక్కువ వెలువడి యుండలేదు. ఈసభ జరిగిన వెంటనే మిగిలిన రెండు సంచికలనుగూడ ప్రకటింపవలెనని యత్నించుచున్నారము. ఈసందర్భమునందొక సంగతి మనవిచేయవలసి యున్నది. గతవత్సరము ఒంగోలు తాలూకా కొప్పెరప్పాడునందున్న శ్రీలక్ష్మీకాంత గ్రంథాలయమువారు తమ గ్రామమునకు మమ్ములను దోడ్కొనిపోయి ఏబది రూప్యముల నిచ్చిరి. ఈవత్సరము మనకివచ్చిన నష్టమునుగూర్చి విన్నవారై తెనాలి తాలూకా యందున్న పెదపాలెంగ్రామమునందున్న ఆర్యబాల సమాజ గ్రంథాలయము వారు రూ. ౧౦ లను తీసకొనివచ్చి యిచ్చిరి. హృదయపూర్వకముగ అవశ్యకతను గ్రహించి యిచ్చిన ఈసొమ్మే పదివేలు.

## ఉద్యమ వ్యాపన.

గ్రంథాలయోద్యమ వ్యాపకమునకై గతవత్సరము నందువలెనే ఈవత్సరమున గూడ కార్యదర్శులు పలు తావులకు బోయి ఉపన్యాసముల నిచ్చుచుండిరి. మఱియు నిబంధనల నేర్పరచుకొనుటయందును, భవనములు నిర్మించుకొనుటయందును, తగాదాలు తీర్చుకొనుటయందును, రిజిష్టరీచేయించుకొనుటయందును, గ్రంథాలయములకు ఉచితమైన సలహాలనిచ్చి తోడ్పడియుండిరి.

## జిల్లాబోర్డు, మ్యునిసిపాలిటీల సహాయము.

కృష్ణా జిల్లాబోర్డువారు, గుడివాడ తాలూకా అంగలూరునందున్న శ్రీబాల సరస్వతీ పుస్తక భాండాగారము వారికి నెల ౧-కి పదిరూపాయ లిచ్చుచున్నారు. మఱియు బెజవాడ మ్యునిసిపాలిటీ వారు, ఆపట్టణమునందున్న శ్రీరామమోహన ధర్మపుస్తక భాండాగారమువారికి గతసాలున ౬౦ రూపాయిల నిచ్చిరి. ఈసాలున రు. ౧౦౦ ల నిచ్చుట కేర్పరచిరని వినుచున్నారము.

## జిల్లా గ్రంథాలయ సంఘములు.

ఇది వరలో కృష్ణా జిల్లాకు, జిల్లాగ్రంథాలయ సంఘమున్నది. ఈవత్సరమున గుంటూరు జిల్లాయును, గోదావరి జిల్లాయునుగూడ జిల్లాగ్రంథాలయ ప్రతినిధుల మహాసభల కూర్చి, జిల్లాసంఘముల నేర్పరచి కొనినవి. జగ్గయ్య పేటయందు ఈవత్సరము జరిగినజిల్లా గ్రంథాలయ ప్రతినిధుల ద్వితీయ మహాసభ అన్నివిధముల జయప్రదముగ జరగినదని దెలుపుట కానంద మగుచున్నది; సభయందు ప్రతినిధులు తమ స్వానుభవములను నిష్కల్మషములగు వాక్కులతో నుద్ఘోషించుచున్నప్పుడు సభ్యులెల్లరును ఆలోచనా ప్రవృత్తులయి ఊరక చూడసాగిరి; ఇతర సభలకును గ్రంథాలయ ప్రతినిధుల సభలకును గల తారతమ్య మప్పుడు సభ్యులకు గోచరింప సాగినది; సభ ముగియ మునుపే, ఆగ్రామమునందు గ్రంథాలయమును స్థాపించుటకై నూరు రూపాయిల నిచ్చెదనని యొకరనిరి. అంతట వెంటనే ౫౦౦ రూపాయిల చందాలు వసూలయ్యెను.

కృష్ణాజిల్లా గ్రంథాలయ సంఘమునకు కార్యదర్శులగు దుగ్గిరాల వేంకటసుబ్బయ్యగారును కొడాలి సత్యనారాయణగారును, వివిధ ప్రదేశములకు బోయి గ్రంథాలయములను దర్శించియు ఉపన్యాసముల నిచ్చియు పాటుపడుచున్నారు- గుంటూరు జిల్లా గ్రంథాలయ సంఘమునకు కార్యదర్శులగు తాడంకి వేంకయ్యగారును, కర్ణపాలెం వేంకట నారాయణప్పగారును ఆజిల్లాయందున్న రేపల్లె, బాపట్ల తాలూకాలకు తాలూకా గ్రంథాలయసంఘముల నేర్పాటు జేసి-ఈ యుద్యమాభివృద్ధికై విశేషముగ పాటుపడుచున్నారు. గోదావరిజిల్లాయందు అద్దంకి సత్యనారాయణ శర్మగారి ప్రోత్సాహమువలన ప్రథమజిల్లా గ్రంథాలయ ప్రతినిధుల సభ కడచిన ఏప్రియలు నెలయందు జరగినది. ఈజిల్లా గ్రంథాలయసంఘమునకు శ్రీ శర్మగారును చింతపెంటి వేంకట రమణయ్యగారును కార్యదర్శులుగ నేర్పడి యున్నారు.

ఇంతేగాక గంజాంమండలము గూడ జిల్లా గ్రంథాలయ సభ నేర్పాటు గావించుకొనుట కాలోచించుచున్నటుల కర్ణాకర్ణిగా వినుచున్నారము. ఇది శుభసూచకము.

## తాలూకా గ్రంథాలయ సంఘములు

ఇదివరకు గోదావరి జిల్లాయందున్న రామచంద్రపురం, కృష్ణాజిల్లాయందున్న బెజవాడ గుడివాడ తాలూకాలకు మాత్రము తాలూకా గ్రంథాలయ సంఘములుగలవు. ఈ వత్సరమున గుంటూరు జిల్లాయందున్న తెనాలి, రేపల్లె, బాపట్ల, ఒంగోలు తాలూకాలకుగూడ తాలూకా గ్రంథాలయసంఘము లేర్పాటు గావింపబడినవి. గుడివాడ తాలూకా గ్రంథాలయ సంఘమునకు దాసరి లక్ష్మీనారాయణగారును, ఆరెకపూడి రామశాస్త్రులుగారును; బెజవాడ సంఘమునకు రాయప్రోలు రామచంద్ర ప్రసాదరావుగారును, చిగురుపాటి వేంకట సుబ్బారావుగారును; ఒంగోలు సంఘమునకు పసుమర్తి నరసింహంగారును యం. వి. ఎన్. శర్మగారును; రేపల్లె సంఘమునకు అబ్బినేని రాఘవయ్య చౌదరిగారును విశేషముగ పాటుపడుచున్నారు.

ఒంగోలు తాలూకా సంఘమువారు ఈ వత్సరమున తాలూకా గ్రంథాలయ ప్రతినిధుల మహాసభనుగూడ జరపిరని దెలుపుట కెంతయు సంతసిల్లుచున్నారము.

## మార్గదర్శకత్వము

గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమందు వ్యాపించుచు సర్వ జనాదరణమును పొందుటయేగాక మన యరవ సోదరుల మనంబులగూడ నాకర్షించి, ఈ యుద్యమమును తమ జిల్లాలయందుగూడ వ్యాపింపజేయవలయునను ఉత్సాహమును వారలలో నాయకులకు కలుగజేసినది. ఈసంగతి మనకు గౌరవావహముకాక మానదు గదా! ఈ వత్సరమున "తంజావూరు" నందు జరగిన మండలసభలో, ఆ సభాధ్యక్షులును, మద్రాసు హైకోర్టునందు ప్రసిద్ధిజెందిన న్యాయవాదులలో నొకరును అగు సి. పి. రామస్వామయ్యరుగారు - అరవదేశమునందు గ్రంథాలయోద్యమ మన నేమియో తెలియకుండుట కడు శోచనీయమనియును, ఈ విషయమున ఆంధ్ర సోదరులనుండి తాముతప్పక నేర్చుకొనవలసి యున్నదనియు సభికులను హెచ్చరించుచు, ఆజిల్లాయందు ఈయుద్యమమును వ్యాపింప జేయుటకై ఉపసంఘమునొకదానిని స్థాపనచేయించిరి. మఱియు చెన్నపట్టణమున స్థాపింపబడిన స్వరాజ్య సమితియొక్క నిబంధనలనుగూర్చి చర్చించుచు, ఆంధ్రదేశమందలి గ్రంథాలయ సంఘములుకూడ స్వరాజ్యసమితియొక్క యుద్దేశములలో కొన్నిటిని ఆచరణలోనికి తెచ్చునవియైయున్నవిగనుక, ఆ సంఘములనుగూడ ఇందునుగూర్చి నేర్పరచబోవు నిబంధనలకు లోబడి స్వరాజ్యసమితికి జేర్చవచ్చునని జెప్పిరి.

## బరోడా యాత్ర

కడచిన జనవరినెలయందు బరోడారాజ్యమున జరగిన వ్యవసాయ పారిశ్రామిక ప్రదర్శనము నందొకభాగముగ గ్రంథాలయ ప్రదర్శనముగూడ జరుపబడినది. ఆ ప్రదర్శనమునుచూచి వచ్చుటకై ఈ సంఘపక్షమున నేను బరోడాకు వెళ్లియున్నాడను. ఈ సందర్భమునందొక మనవి జేయవలసియున్నది. చాలకాలమునుండియు కొందరు గ్రంథాలయ నిర్వాహకులును నేనునుగలసి బరోడాయాత్రను జేయవలెననియుత్సాహపడుచుంటిమి. మేమందరమును కలసియే వెళ్ళవలయునని ఆలోచనలను జేసితిమి. అట్టి స్థితియందు ఆయాస్నేహితులను తీసికొని వెళ్లకయే, ఏరికిని జెప్పకయే, నేనొక్కడనే బరోడా యాత్రను జేసియుంటిని. "బారువ" యందు జరుగు గ్రంథాలయ సభతో బాటుగ గ్రంథాలయ ప్రదర్శనము నేర్పాటు జేయవలయునని తలంచుచుంటిమనియు, ప్రదర్శించుటకు కొన్ని వస్తువులను పంప వలసినదనియు బరోడా కేంద్ర గ్రంథాలయమువారికి వ్రాసియుంటిమి. అందుమీద వారు జనవరి ౨-వ తేది మొదలు ౯ తేదివరకు బరోడాయందు గ్రంథాలయ ప్రదర్శనము జరుగవలసియున్నదనియు, దానికి వచ్చిన ఎక్కువ ఉపయోగకరముగ నుండుననియు వారు డిశంబరునెల ఆఖరువారమునందు వ్రాసిరి. ఈయుత్తరమువచ్చునప్పటికి నేను బెజవాడయందులేను. డిశంబరునెల ౨౯-వ తేదీన నేనింటికి వచ్చువరకును ఈ యుత్తరము సంగతి నాకుతెలియనే తెలియదు. అప్పుడైన నాకు దేహము కొంచె మస్వస్థతగ నుండుటచే బయలుదేరు స్థితిలోలేను. స్నేహితుల కుత్తరములు వ్రాసి కనుగొనుటకన్నవో వ్యవధిలేదు. ఈ కారణములచేత స్నేహితుల కెవ్వరికిని జెప్పకయే బరోడా యాత్ర జేయుట తటస్థించినది. అనేకమంది స్నేహితులు నాతోగూడ తమ్ముల నెందుకు తీసికొని వెళ్లలేదని నామీద నిష్ఠురములను వేయుచున్నారు. అందుచేత ఈవిషయమింత విపులముగ జెప్పవలసి వచ్చినది.

## బాలశాఖ.

బరోడాయందు జరగిన ప్రదర్శనమును జూచినవాడనై, బెజవాడకు వచ్చిన వెంటనే రామమోహన ధర్మపుస్తక భాండాగారమునందు బాలశాఖను ప్రారంభింపవలెనని సంకల్పించి, అందుకు కావలసిన గ్రంథములు ఆదిగాగల వస్తువులనెల్ల బొంబాయియందు కొంటిని, పిమ్మట ఫిబ్రవరి నెలయందా గ్రంథాలయమున బాలశాఖను ప్రారంభించి జయప్రదముగ నిర్వహించుచున్నారు. ఇంతేగాక "ఏలూరు" నందున్న హిందూ

యువజన సంఘమువారు తమ గ్రంథాలయమునందు బాలశాఖను ప్రారంభింప వలెనని తలంచి, అందులకు కావలసిన సంగతులనెల్ల నేర్చుకొని వచ్చుటకై బెజవాడ రామమోహన ధర్మపుస్తక భాండాగారమున కొక ప్రతినిధినిగూడ బంపిరి.

## గ్రంథవిభజన పట్టిక.

ఈసంఘపక్షమున ఆంధ్రగ్రంథ విభజనపట్టికను బరంపురం వాస్తవ్యులగు శ్రీ వెలిదండ శ్రీనివాసరావుగారు విశేషపరిశ్రమకులోనై తయారుజేసి యుండిరి. దానిని పూర్తిజేయుటకై పురాణం నూరి శాస్త్రిగారు పూనుకొనియుండిరి. ఈసభ జరగుకాలమునకు దానినిపూర్తి జేయవలెనని శ్రీ శాస్త్రిగారు తలంచియుండిరి. కాని నేను బరోడావెళ్ళి వచ్చుటతోడనే ఇదివరకు జేయుచున్న గ్రంథవిభజనపద్ధతి సరియైనదిగాదనియు శాస్త్రసమ్మతము గాదనియు గోచరించినది. ఒక్కగ్రంథ విభజన విధానమునుగూర్చియే వివిధశాస్త్రవేత్తలువ్రాసిన గ్రంథములు ఆంగ్లేయభాషయందు పెక్కులుగలవు. వీనిలో కొన్నిటిని దెప్పించితిమి. గుజరాతి, మహారాష్ట్రభాషలయందు జేయబడిన గ్రంథవిభజన పద్ధతులను సంపాదించితిమి. ఇవియన్నియు జూచునప్పటికి, గ్రంథవిభజనపద్ధతిని (Scheme of classification) నిర్ణయముజేయనిదే, గ్రంథవిభజనపట్టికను తయారుజేయుటకవకాశము కాన్పింపలేదు. ఈ సంగతుల నన్నిటిని శ్రీ శాస్త్రిగారితో మనవిజేయగా, వారీ పొత్తములనన్నిటి శ్రద్ధతోబరికించి, మనభాషకనువుగ నుండునటుల గ్రంథవిభజనపద్ధతి నొకదానిని సిద్ధముచేయుచున్నారు. దానిని మీరందర రంగీకరించినయెడల, ఆప్రకారము గ్రంథవిభజనపట్టికను తయారుచేయుదురు.

## గ్రంథాలయ ప్రదర్శనము

బరోడాయాత్రకు ఫలితముగ నేను మీరటనట మొదటి ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రదర్శనమును దెచ్చి పగలిగితిరి. హిందూదేశము నంతకును ఇదియే ద్వితీయగ్రంథాలయ ప్రదర్శనమని చెప్పిన మీ కానంద జనకము నుండదా! మొదటి గ్రంథాలయప్రదర్శనము 'బరోడా' రాజ్యమునందు జరిగినది. రెండవది నేడిచట జరుగుచున్నది. ఈప్రదర్శనమును మీరందరును జూడబోవుచున్నారు గాన నేనిచట వివరముగా జెప్పబసిలేదు. ద్రవ్యాభావముచే ఈప్రదర్శనమునింకను ఎక్కువజయప్రదముగా జేయజాలమైతిమని మాత్రము విన్నవించుకొనుచున్నాడను.

## ఆదాయ వ్యయములు

౧౯౧౬ సం. మేనెలమొదలు ౧౯౧౭ సం|| ఏప్రియలు ఆఖరువరకు ఈసంఘముయొక్క ఆదాయవ్యయములను నివేదించుచున్నాడను.

ఆదాయము

| | రు. | అ. | పై. |
|---|---|---|---|
| గత సంవత్సరముతా|| నిల్వ | ౪౪ | ౦ | ౯ |
| గ్రంథాలయ చరిత్ర అమ్మకము | ౧౪౯ | ౮ | ౦ |
| నెల్లూరు గ్రంథాలయ సభవారు | ౪ | ౧౧ | ౦ |
| ఆంధ్ర మహాజనసభ స్థాపితోప సంఘమువారు | ౨౫ | ౦ | ౦ |
| శెడింబి హనుమంతరావు పంతులుగారు | ౫౦ | ౦ | ౦ |
| నూరి వేంకటనరసింహ శాస్త్రిగారు | ౧౦ | ౦ | ౦ |
| వెరశి జమ | ౨౮౩ | ౩ | ౯ |

ఖర్చు.

| | రు. | అ. | పై. |
|---|---|---|---|
| పోష్టు ఖర్చులు | ౧౨ | ౧౫ | ౬ |
| గ్రంథాలయ చరిత్రకు పోష్టుఖర్చులు | ౧౦ | ౦ | ౦ |
| అచ్చు | ౭ | ౧౦ | ౦ |
| రైలుచార్జి | ౦ | ౪ | ౦ |
| గ్రంథాలయచరిత్ర ముద్రణము మొదలగునవి | ౧౪౦ | ౧౩ | ౬ |
| గ్రంథాలయ శాస్త్రమును గూర్చిన గ్రంథములు | ౩౪ | ౭ | ౦ |
| గ్రంథాలయములను గూర్చిన పత్రికలు | ౨౫ | ౧ | ౦ |
| చిల్లర సామానులు | ౪ | ౦ | ౦ |
| ప్రయాణపు ఖర్చులు | ౯౮ | ౮ | ౬ |
| గ్రంథముల పట్టిక మేకులు | ౪ | ౧౫ | ౦ |
| బైండింగు | ౧ | ౭ | ౦ |
| వెరశి ఖర్చు. | ౩౪౦ | ౧ | ౬ |
| జమగాక అప్పుతెచ్చినది రు. | ౫౬ | ౧౩ | ౯ |

## సంచార కార్యదర్శి.

ఈవత్సరము సంచార కార్యదర్శి నొకనినైన నియమింపవలయునని విశేషముగ ప్రయత్నములను జేసి యుంటిమి. ఆంధ్రమహాజన సభాస్థాపితోప సంఘము వారు ౧౫౦ రూపాయలనిచ్చెదమనిరి. ఈసొమ్ము చాలదు. సంచార కార్యదర్శియొక్క జీతమునకును ప్రయాణవ్యయములకును సంవత్సరమునకు రు ౫౦౦ లైన కావలెను. ఇదివరకే విన్నవించిన ప్రకారము ఈవత్సరాదాయము రు ౭౮౩-౩-౮ లనియు, వ్యయము ౩౪౦-౧-౬ లనియు, గాక అప్పు తెచ్చివ్యయపరచినది రు ౫౬-౧౩-౮ లనియు మీరు తెలిసియే యున్నది. అయినప్పటికిని, ఈసంఘమునకు ఉపాధ్యక్షులగు శ్రీ సూరి వేంకట నరసింహశాస్త్రి గారును, నేనును ఎట్లనో యుండి ధైర్యమునుజేసి. సంఘమువారి నొప్పించి, కాకినాడ వాస్తవ్యులగు దువ్వూరి జగన్నాథ శర్మగారిని సంచారకార్యదర్శిగ నేర్పాటుజేసితిమి. వారింకను పనిలో ప్రవేశింపలేదు. త్వరలోనే ప్రవేశింపగలరు.

## గ్రంథాలయ శాస్త్ర గ్రంథములు - పత్రికలు.

పాశ్చాత్య దేశములయందు గ్రంథాలయములు ఎట్లు నడుపవలయునో, ఎట్లు జనుల నాకర్షింపవలెనో, ఎట్లు గ్రంథములనంపవలయునో, ఎట్లు గ్రంథములను విభజింపవలయునో, ఎట్లు భవనములను నిర్మింపవలయునో, ఈవిషయములన్నియు ప్రత్యేక మొకశాస్త్రమై విలసిల్లినది. అందుచేత గ్రంథాలయ శాస్త్రమును గూర్చిన గ్రంథములు పదివేల రూపాయలకంటె నెక్కువ విలువగలిగినవి అమెరికా, ఇంగ్లాండు దేశములయందు ప్రకటింపబడినవి. ఇంతేగాక సాలునకు మూడువందల రూపాయిలకంటె నెక్కువ చందా గలిగిన పత్రికలాదేశములందు ప్రకటింపబడుచున్నవి. ఆదేశమునందు గ్రంథ భాండారి పరీక్ష యొకటిగలదు. బి. ఏ. ప్యాసయినవాడు రెండుసంవత్సరముల కాలము అందుకొరకై ప్రత్యేక మేర్పడిన పాఠశాలయందు విద్యాభ్యాసమును జేసినగాని, ఆపరీక్షయందుత్తీర్ణుడు కాజాలడు. ఈ గ్రంథములన్నిటిని, ఈపత్రికల నన్నిటిని దెప్పింపవలెనని నేను చెప్పుటలేదు. కాని ఇది ప్రత్యేకశాస్త్రమగుటచే ఆయావిషయములను నేర్చుకొనుటకై కొన్ని గ్రంథములను, కొన్ని పత్రికలనైన తప్పక దెప్పింపవలసి యున్నది. వీనిని దెప్పింపకుండుట వలని లోపము నేను బరోడాకు బోయివచ్చిన పిమ్మట దెలిసినది. మనము కడచిన మూడువత్సరములనుండియు గ్రంథ విభజన విషయమై జేసిన పనియంతయు, శాస్త్రజ్ఞానము లేకపోవుటచేతనే గదా నేడు వృధాయైనది. ఇట్లని ఆంగ్లేయ భాషయందున్న గ్రంథాలయ శాస్త్రమంతయు, మనదేశస్థితి గతులకును, మన భాషకును పనికి వచ్చునని నాయభిప్రాయము కాదని మీరు గమనింపవలెను. మన మా శాస్త్రము నభ్యసించి, అందు మనకు ఉపయుక్తములగు సంగతులను, మనదేశ భాషా స్థితిగతులనుబట్టి మార్చుకొని ఉపయోగింప నగును.

## భవిష్యత్తు

సోదరులారా! ఇంతవరకు ఈసాలున జరిగినపనిని క్లుప్తముగా మీకు విశదీకరించితిని. గ్రంథాలయోద్యమముయొక్క ప్రాశస్త్యమునుగూర్చి నేనిచట మీకు విశేషముగ జెప్పనక్కరలేదు. ఏగ్రామమునందైన నేమి పట్టణమునందైన నేమి నిత్యజీవనమునుగలిగి, నిత్యమును జనుల నుద్బోధింపశక్తిగలిగిన వీ గ్రంథాలయములేయని జెప్పిన యతిశయోక్తి కాదు. ఈయుద్యమమును దేశమునందంతటను ప్రచారము చేయవలయునన్న, ఈయుద్యమమును సరియైనమార్గములద్రిప్పి నిజముగా దేశాభివృద్ధిని జేయవలయునన్న అధమము జిల్లాకొక సంచార కార్యదర్శినైన భరింపలేకుండు టెంతయు శోచనీయము.

సోదరులారా! గ్రంథాలయ సర్వస్వమునకు వచ్చుచున్న నష్టము మాటటుంచినను, సంచార కార్యదర్శి యొక్క వ్యయములకును, గ్రంథాలయ శాస్త్రవిషయమైన గ్రంథములను దెప్పించుటకును, సాలునకు అధమపక్ష మొక వెయ్యి రూపాయలైన అత్యావశ్యకమని నివేదించుచున్నాడను. కావున తాము ఈసభయందు ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ సభ్యత్వమునకు కొన్ని నిబంధనల నేర్పరచి, ఈసంఘమునకు కొంతవరకైన ఆదాయమును గల్పించెదరని ప్రార్థించుచున్నాడను

నిబంధనలనగా, సంఘముయొక్క పనిని ఆటంకపరచునట్టి కఠినమైన నిబంధనలు గావు. ఈయుద్యమము ప్రారంభమై మూడు సంవత్సరములు మాత్రమైనది. అట్టిస్థితియందు కఠినమైన నిబంధనలనుజేసి, సంఘముయొక్క యభివృద్ధి నరికట్టిన లాభములేదు. కావున స్వల్పముగ నిబంధనలనేర్పరచి, ఆదాయమును గల్పించెదరని మనవి చేయుచున్నాడను."

పిమ్మట, మహాసభకు రాజాలమికి వగచుచు, పోలవరం జమీందారు, రావుబహద్దరు కందుకూరి వీరేశలింగం పంతులు, రావుబహద్దరు కిలాంబి రామానుజాచార్యులు, నిశ్రను దేవవర్మ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి; ఏ. వి. రామయ్య, ఆదూరి వెంకటస్వామిశెట్టి, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయము, వరహాగిరి వెంకట జోగయ్య గార్లు వ్రాసిన లేఖలు జదువబడెను.

తరువాత గ్రంథాలయ ప్రదర్శనము నందలి బాల శాఖనుగూర్చి, జయంతి జగన్నాథముగారు సంక్షేపము గా జెప్పిన పిమ్మట, గ్రంథాలయ ప్రదర్శనము దెరువబడినది.

## ప్రథమ గ్రంథాలయ ప్రదర్శనము

సభామంటపమునకు వెనుక భాగమందున్న బోర్డు పాఠశాల భవనమునందు ఈ ప్రదర్శన మేర్పాటు గావింపబడినది. అమెరికా, ఐరోపా, మున్నగు పాశ్చాత్య దేశములయందును, బరోడా రాజ్యమునందును, ఆంధ్రదేశము నందును ప్రాముఖ్యత వహించియున్న గొప్ప గ్రంథాలయములయొక్క బయటి ఆకారములను లోపలి యాకారములను జూపు పటములును ప్లానులును అనేకములు గోడలయందు వ్రేలాడ గట్టబడి చూపబడి యున్నవి.

ఆయాదేశములందు గ్రంథాలయములనుగూర్చి ప్రత్యేకముగ ప్రకటింపబడు పత్రికలు, గ్రంథాలయశాస్త్రమును గూర్చి ఆంగ్లేయభాషయందున్న ఉద్గ్రంథములు అనేకము ప్రదర్శింపబడినవి. ఇంతేగాక ప్రపంచమునందు ప్రబలియున్న వివిధములగు గ్రంథవర్గీకరణ పద్ధతులను తెలుపు గ్రంథములును, వర్గీకరణమునుగూర్చి ఆంధ్రదేశమునందు జరిగినపనిని దెలుపు గ్రంథములును చూపబడినవి. పలువిధములైన గ్రంథములపట్టికలు తయారుచేయు పరికరములు తేబడినవి. ఇవిగాక ప్రత్యేకముగ బాలశాఖ ప్రదర్శింపబడియున్నది. ఈబాలశాఖయందు బాలుర హృదయముల నాకర్షించి వారికి జ్ఞానాభివృద్ధి జేయు అనేకవిధములైన ఆటలు, ఆంగ్లేయభాషయందు బాలురకై ప్రత్యేకముగ వ్రాయబడిన పలుగ్రంథములు, గుడ్డలమీద ముద్రింపబడిన గ్రంథములు, ప్రదర్శింపబడినవి. ఇంతేగాక, ఆంధ్రభాషయందు బాలురు ఉపయోగించుకొనుటకు అనువుగనున్న గ్రంథములన్నిటిని సేకరించి ప్రదర్శించిరి. బాలశాఖయందు ప్రదర్శింపబడిన వస్తువులు గ్రంథములు అన్నియును బెజవాడ రామమోహన ధర్మగ్రంథాలయమువారు ప్రదర్శించిరి. గుంటూరుజిల్లా తెనాలితాలూకా పెదపాలెముగ్రామము నందున్న బాలసమాజమువారు తమగ్రంథ భాండాగార భవనముయొక్క ఆకారమును ప్రదర్శించిరి. ఈప్రదర్శనమునందు ప్రదర్శింపబడిన వివిధమైన వస్తువులను గూర్చియు గ్రంథములనుగూర్చియు, అయ్యంకి వెంకటరమణయ్యగారు ఎల్లరకును మిక్కిలి ఓపికతో తెలియజెప్పిరి. ఇంతేగాక వీరి ప్రత్యేక పరిశ్రమవలననే ఈ ప్రదర్శనమింత జయప్రదముగ జరిగినదని జెప్పవచ్చును.

ప్రతినిధులును, ప్రేక్షకులును, ఈప్రదర్శనమును జూచి, అనేక అమూల్యవిషయములను దెలిసికొనిరి. గ్రంథాలయములనుగూర్చి ప్రత్యేకముగ ప్రకటింపబడునట్టి పత్రికలిన్ని ఆంగ్లేయభాషయందుగలవా యని ప్రశ్నించువారు కొందరు. గ్రంథాలయ శాస్త్రమును గూర్చి ప్రదర్శింపబడిన ఆంగ్లేయ గ్రంథములను ప్రశంసించువారు కొందరు. గుడ్డలమీద పిల్లలకొరకై ముద్రింపబడిన పుస్తకములనుచూచి ఆశ్చర్యపడువారు మరికొందరు. ఆటలమూలమున పిల్లలకు జ్ఞానాభివృద్ధిని విద్యయందాసక్తిని గలుగజేయుట ఎన్నడైన జూచితిమా యని ప్రశ్నించువారు ఇంకొక కొందరు. ఇట్లు ఈ ప్రదర్శనము అమితమైన ఉత్సాహమును గలుగజేసినది.

మధ్యాహ్నము ప్రతినిధులు [illegible] విషయములను పరస్పరము దెలుపుకొనిరి. పిమ్మట సాయంకాలము

౫ గంటలకు మహాజనసభ ప్రారంభమైనది. అప్పుడు భారతభాషకును నేటి గ్రాంథికభాషకునుగల భేదమును గూర్చి మండపాక పార్వతీశ్వర శాస్త్రిగారును, గ్రామ్యభాషనుగూర్చి గిడుగు రామమూర్తి పంతులు గారును, సారస్వత విమర్శనమును గూర్చి బుర్రా శేషగిరిరావు పంతులుగారును, ఇంకనుపలువురు భాషావిషయములను గూర్చి మహోపన్యాసములను గావించిరి. అంతటితో నాటికి సభ ముగింపబడినది.

# ద్వితీయ దినచర్య.

౨-వ తేదీ ఉదయము ౭ గంటలకు తిరిగి కార్యక్రమము ప్రారంభింప బడినది. ప్రథమమున వివిధజిల్లా సంఘములయొక్కయు, తాలూకా సంఘములయొక్కయు వృత్తాంతములు జదువబడినవి. గ్రంథాలయముల వలనగలుగు దేశాభివృద్ధినిగూర్చి చింతపెంట వేంకటరమణయ్యగారును, గ్రంథాలయములు - సాంఘిక సేవను గూర్చి న్యాపతి నారాయణ మూర్తిగారును, గ్రంథ విభజనను గూర్చి పురాణంసూరి శాస్త్రిగారును, గ్రంథాలయముల అభివృద్ధినిగూర్చి కుప్పాశ్రీరామశర్మగారును, గ్రంథాలయోద్యమమునుగూర్చి సూరివేంకట నరసింహం గారును, విద్యాభివృద్ధిని గూర్చి ఓంప్రథమున మహాంతు రాఘవానంద దాసుగారును ఉపన్యాసముల నొసంగిరి. అంతటితో ప్రాతఃకాలసభ ముగిసెను.

తిరిగి మధ్యాహ్నము ౨ గంటలకు సభప్రారంభమయ్యెను. అప్పుడీ తీర్మానములు ఉపపాదింప బడి అందరిచే నేక గ్రీవముగ నంగీకరింప బడినవి:—

౧

ప్రకృతము ఐరోపాయందు జరుగుచున్న ఘోర సంగ్రామమున మన చక్రవర్తిగారికి సంపూర్ణ విజయ సంప్రాప్తి త్వరలో కలుగు గాకయని ఈ సభవారు పరమేశ్వరుని ప్రార్థించుచున్నారు.

అగ్రాసనాధిపతిగారిచే ఉపపాదింపబడి, అందరిచే ఏకగ్రీవముగ నంగీకరింపబడినది.

౨

రాజమహేంద్రవర నివాసులును శ్రీ వసురాయ పుస్తక భాండాగారాధ్యక్షులును, ద్వితీయాంధ్ర గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ కాహ్వాన సంఘాధ్యక్షులును, భాషాభిమానులు ఉదారులును అగు మ-రా-రా బారు శ్రీరామ నరసింహారావుగారి అకాలమరణము వలన గ్రంథాలయోద్యమమునకు కలిగిన నష్టమునకీ సభవారు చింతిల్లుచు, వారి కుటుంబమునకు తమసానుభూతిని తెలుపుచున్నారు.

ఉ. చింతపెంట వేంకటరమణయ్యగారు.

ఆ. సూరి వేంకటనరసింహంగారు.

3

జన సామాన్యమందు విద్యాభివృద్ధిని జేయుటకు గ్రంథాలయములు ముఖ్య సాధనములు గనుక,

(క) ప్రస్తుతము ఆంధ్రదేశమున స్థాపింపబడిన గ్రంథాలయములకు పఠన మందిరములకును, మునిసిపాలిటీ డిస్ట్రిక్టు తాలూకా బోర్డులయొక్క ద్రవ్యమునుండియు, ప్రావిన్షియల్ రివిన్యూలనుండియు ద్రవ్యసహాయమును జేయుటకు సదుపాయములను కలుగజేయవలసినదని ప్రభుత్వము వారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

(చ) పుస్తక భాండాగారములను పఠన మందిరములను ౧౮౬౦ సం॥ ౨౧ నెం. ఆక్టును అనుసరించి రిజష్టరు చేయుటకు చెల్లింపవలసిన రుసుము లేకుండగనే రిజష్టరు చేయించుటకు ప్రభుత్వము వారి నీ సభవారు ప్రార్థించుచున్నారు.

(ట) దొరతనమువారిచే ప్రచురింపబడు వ్యవసాయ విషయిక పరిశ్రామిక ఆరోగ్యవిషయిక ప్రచురముల నన్నింటిని, జిల్లా గెజటీలను, ఆంధ్రభాషయందు ముద్రింపబడు గ్రంథముల పట్టికలను, ఆంధ్రదేశమునందలి గ్రంథాలయము లన్నింటికిని ఉచితముగా దయచేయింపవలెనని ఈ సభవారు ప్రభుత్వమువారిని ప్రార్థించుచున్నారు.

(త) విద్యాశాలలకు సంబంధించిన ఉద్యోగస్థుల దగ్గర ఉండునట్టి మ్యాజిక్కులాంతరు మొదలగు పరికరములను జనసామాన్యము నందు విద్యాభివృద్ధి చేయుటకై గ్రంథాలయములకు ఎరువిచ్చు సదుపాయములను గలుగజేయ వలసినదని ప్రభుత్వమువారి నీ సభవారు ప్రార్థించుచున్నారు.

ఉ. సోంభొట్ల వెంకయ్యగారు, బారువ.

ఆ. బళ్ళమూడి వెంకట రమణమూర్తిగారు, గోపాలపురం.

౪

ఆంధ్రవాఙ్మయములోని ముద్రితాముద్రితగ్రంథములను సాంగస్వసాధనములను సేకరించుటకు తోడు ఆంధ్రదేశ గ్రంథాలయములన్నియు, ఆంధ్రుల ప్రత్యేకవ్యక్తిని కలిగిన ఆచారములను పండుగలను వర్ధంత్యుత్సవములను ఇత్యాది పరమ సాధనములను అవలంభించుటకును, వానికి సంబంధించిన రాత్రి పాఠశాలలు మున్నగు వానియందు ఆంధ్రుల ప్రత్యేక వ్యక్తిని కళాస్వరూపమునను తెలుపు విద్యావిధానముల నవలంభించుటకును ఈ సభవారు తీర్మానించుచున్నారు.

ఉ. పురాణం సూర్య శాస్త్రిగారు, మచిలీపట్టణము.

ఆ. సెట్టి లక్ష్మీనరసింహంగారు, విశాఖపట్టణము.

గరికిపాటి అప్పయ్య శాస్త్రిగారు, ఆగిరిపల్లె.

౫

ఆంధ్రభాషయందు ప్రచురింపబడు గ్రంథములన్నిటిని-పత్రికలన్నిటిని - చెన్నపట్టణమునందలి ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమందలి ఇతర అముద్రిత గ్రంథముల ప్రతులనన్నిటిని జేర్చి, ఆంధ్రదేశమునందలి ఇతర గ్రంథాలయములకు సహాయభూతముగ నుండునటుల, ఆంధ్రదేశ మధ్యమున అనుకూలమైన స్థలమునందు గ్రంథాలయమునొకదానిని ప్రభుత్వమువారు నెలకొల్పుట అత్యావశ్యకము గనుక, అట్టి గ్రంథాలయము నొకదానిని త్వరలో స్థాపించుటకు ప్రభుత్వమువారిని సభవారు ప్రార్థించుచున్నారు.

ఉ. గిడుగు రామమూర్తి పంతులుగారు పర్లాకిమిడి.

ఆ. గాడేపల్లి సూర్యనారాయణ శర్మగారు పిఠాపురం.

గరిమెళ్ల సీతారామయ్యగారు. బరంపురం.

౬

ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము వ్యాపింపజేయుటకును, గ్రంథాలయములను సర్వజనోపయోగకరముగను జనాకర్షముగను చేయుటకును కావలసిన విధానము దేశమందంతటను వ్యాపింపజేయుటకు ఏర్పడిన ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమును నడపుటకు కావలసిన చిత్తుచట్టములను తయారుచేసి, రాబోవు గ్రంథాలయ ప్రతినిధుల సభలో తీర్మానము నిమిత్తము సిద్ధపరచుటకు ఆంధ్రగ్రంథాలయ సంఘమువారిని ఈసభవారు కోరుచున్నారు.

ఉ. సూరి వేంకట నరసింహంగారు.

ఆ. అయ్యంకి వేంకట రమణయ్యగారు.

౭

(క) ఆంధ్రదేశమందున్న అన్ని పట్టణములయందును పల్లెలయందునుగూడ గ్రంథాలయములనుగాని పఠనమందిరములనుగాని స్థాపింపవలెనని జనుల నీ సభవారు ప్రార్థించుచున్నారు.

(చ) ఆంధ్రదేశమందున్న గ్రంథాలయములన్నియు గ్రంథాలయముల అభివృద్ధికొరకై ప్రకటింపబడుచున్న గ్రంథాలయ సర్వస్వమును తెప్పించుకొనవలెనని ఈ సభవారు తీర్మానించుచున్నారు.

ఉ. బుర్రా శేషగిరిరావుగారు, విజయనగరం.

ఆ. జయంతి వెంకట కృష్ణయ్యగారు,

గాడేపల్లి సూర్యనారాయణ రావుగారు.

అద్దంకి సత్యనారాయణ శర్మగారు.

౮

ఆంధ్ర గ్రంథాలయ సంఘమునకు ఈసంవత్సర మందు పదవులు నధిష్ఠించిన వారు కార్యనిర్వాహక సభ్యులుగ నెన్నుకొనబడిరి:—

అగ్రాసనాధిపతి:—

మోచర్ల రామచంద్రరావుగారు.

ఉపాగ్రాసనాధిపతులు:—

చిలకపర్తి లక్ష్మీనరసింహముగారు.

నూతి వేంకటనరసింహముగారు.

నెమలి సుబ్బారావుగారు.

కార్యదర్శి:—

అయ్యంకి వేంకటరమణయ్యగారు.

సహాయ కార్యదర్శులు:—

పురాణం సూరిశాస్త్రులుగారు.

అవసరాల వేంకటరెడ్డి పంతులుగారు.

అద్దంకి సత్యనారాయణ శర్మగారు.

ఇతరసభ్యులు:—

రాయప్రోలు రామచంద్రప్రసాదరావుగారు.

గోపరాజు బ్రహ్మానందగారు.

బాలసరస్వతీసంఘము, అంగలూరు.

కొడాలి శివరామకృష్ణారావుగారు మచిలీపట్నము.

బెల్లకొండ రాఘవరావుగారు, పమిడిపాడు.

చల్లా శేషగిరిరావుగారు, గుంటూరు.

పొన్నలూరి రాఘవయ్యగారు.

పులిపాక వేంకట్రామారావుగారు, ఈమని.

అంగలూరి శివయ్యగారు. ,,

కుప్పా శ్రీరామశర్మగారు, అనంతవరం.

జొన్నలగడ్డ పున్నయ్యగారు, తెనాలి.

రామానుజ పుస్తకభాండాగారము, తుని.

భాగి సుబ్రహ్మణ్యంగారు, సికిందరాబాదు.

అదిరాజు వీరభద్రరావుగారు. ,,

ఇ. సుబ్బకృష్ణయ్యగారు, కాకినాడ

ఆంధ్రబాల సరస్వతీనిలయము, నెల్లూరు

ఏ. వి. రామయ్యగారు, సంగం.

పేనకా పట్టాభిరామరెడ్డిగారు, పోట్లపూడి.

మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు, విశాఖపట్నం.

భమిడిపాటి చినయజ్ఞ నారాయణ శర్మగారు, మాడుగుల.

ఆంధ్రభాషాభివర్ధనీసంఘము, బరంపురం.

శ్రీజగన్నాథపాఢి ఖడంగగారు, బారువ.

సోంభొట్ల వెంకయ్యగారు. ,,

తిత్తిబలరామయ్యగారు. ,,

ఆంధ్రభాషాభివర్ధనీ సంఘము, ప్రొద్దుటూరు, కడపజిల్లా.

దేశపాండ్య సుబ్బారావుగారు నంద్యాల మిత్రమండలి, బళ్లారి.

ఐ. రామదాసు నాయుడుగారు, చిన్నముష్టూరు.

యం. సన్నప్పనాయుడుగారు, ఇంద్రావతి

గాడేపల్లి సూర్యనారాయణ శర్మగారు.

గోనుగుంట్ల వేంకట సుబ్రహ్మణ్యంగారు.

జయంతి వేంకటకృష్ణయ్యగారు, విజయనగరము.

పాటిబళ్ళ వేంకట తిరుపతిరావుగారు, అన్నవరం

వివిధ జిల్లాలగ్రంథాలయ సంఘములయొక్కయు, తాలూకా సంఘములయొక్కయు కార్యదర్శులును, ఉద్యోగులును.

ఉ. బిక్కిని వేంకటరత్నంగారు, చోడవరం.

ఆ. గోనుగుంట్ల వేంకటసుబ్రహ్మణ్యంగారు చెన్నపురి.

౯

రాబోవు సంవత్సరము ఈ సభను విశాఖపట్నము నందుజరుపుటకు తీర్మానించడమైనది.

ఆహ్వానము చేసినవారు; శెట్టి లక్ష్మీనరసింహంగారు

రాబోవు సభను గుంటూరు జిల్లా కొండవీడు నకును, బాపట్లకును, పిఠాపురమునకును, ఆయా ప్రదేశములనుండి వచ్చిన ప్రతినిధులచే పిలువబడినది. కాని, విశాఖపట్నము వారి యాహ్వానమునే సభ్యులందరును అంగీకరించిరి. అనంతరము అగ్రాసనాధిపతికిని ఇతరులకును, మంగళగీతముతోడ సభ ముగింపబడినది.

## చతుర్థ ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభ యొక్క ఆదాయ వ్యయముల పట్టిక.

### ఆదాయము.

| | రు. | అ. | పై. |
|---|---|---|---|
| ౧. గ్రామస్థులవల్ల విరాళములు | ౪౪౧ | ౪ | ౯ |
| ౨. ప్రతినిధుల కట్నములు | ౬౩ | ౦ | ౦ |
| ౩. వస్తువుల విక్రయంవల్ల | ౯౪ | ౧౪ | ౦ |
| ౪. శ్రీకృష్ణ దేవరాయ గ్రంథభాండాగార సంఘమువారివల్ల | ౩౫ | ౦ | ౩ |
| మొత్తం రు | ౬౩౪ | ౩ | ౦ |

### వ్యయము.

| | రు. | అ. | పై. |
|---|---|---|---|
| ౧. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు యిచ్చినది | ౬౩ | ౦ | ౦ |
| ౨. భోజనము, ఫలహారములకు | ౨౨౬ | ౧౩ | ౬ |
| ౩. వంటబ్రాహ్మణులకు | ౪౫ | ౦ | ౦ |
| ౪. కూలీలకు | ౪౨ | ౧౦ | ౩ |
| ౫. బండ్లు అద్దెలకు | ౪౭ | ౧౦ | ౦ |
| ౬. సభ, బసలు, నిమిత్తంకొన్న సామగ్రి | ౩౬ | ౫ | ౦ |
| ౭. పందిరి ఖర్చులు | ౭౬ | ౦ | ౬ |
| ౮. తపాల తంతిఖర్చులు | ౩౬ | ౧౨ | ౯ |
| ౯. అచ్చుఖర్చులు | ౨౬ | ౯ | ౦ |
| ౧౦. దీపంఖర్చులు | ౧౦ | ౧౫ | ౦ |
| ౧౧ ప్రయాణ ఖర్చులు | ౯ | ౩ | ౦ |
| ౧౨. చిల్లరఖర్చులు | ౧౩ | ౪ | ౦ |
| మొత్తం రు. | ౬౩౪ | ౩ | ౦ |

ఈసభకు శ్రీజగన్నాథపాడి ఖడంగగారు రు. ౧౫౩ లును, శ్రీమందసారాజువారు ధాన్యం-పందిరి నిమిత్తం కర్రలు, కుర్చీలు, బెంచీలు నొసంగిరి. బరంపురం తాలూకాబోర్డువారు సభనిమిత్తము బారువబోర్డు పాఠశాల నొసగుటయేగాక, సోంపేట పాఠశాల మూడు దినములు మూయించి కుర్చీలు బెంచీలు నొసంగిరి. తెలుకుల ప్రహ్లాదగారు అరటి, కొబ్బరి, పనసకాయలను ఒసంగిరి. గ్రామ ప్రముఖులలో తదితరులుగూడ కాయగూరలు, పాత్రసామగ్రి వగైరాల సహాయము జేసిరి. రహితులుగూడ సహాయము చేయుటయేగాక గ్రామస్థులు విరాళములను గూడ ఒసగియుండిరి. శ్రీజనార్ధన పాడిగారి దివాను ఒకేషీ మహాపాత్రోగారు వచ్చిన ప్రతినిధులకు ఒక దినమున ఉపాహారములొసగిరి. ఈవిధముగ గ్రామస్థులు సర్వవిధముల తోడ్పడి సభ జయప్రదముగ చేయించినందుకు వారలకు మాకృతజ్ఞతాభివందనము లర్పించుచున్నాము.

ఇట్లు,

బారువ ౧౦-౯-౧౯౧౭ } తిత్తి బలరామయ్య. ఆహ్వానసంఘ కార్యదర్శి.

### పత్రికాభిప్రాయములు

ఈసభనుగూర్చి పత్రికలువ్రాసిన యభిప్రాయముల నిట బొందుపరచెదము.

“ఆంధ్రపత్రిక” ౧౯౧౭. సం॥ మే నెల ౭-వ తేదిన ఇట్లు వ్రాయుచున్నది:—

మానవవికాసమునకు లోకమునందు మాతృభాషయె మూలసాధనము. మాతృభాషయందు గలిగిన విజ్ఞానము సహజమై ప్రజలయందువ్యాపించి సంఘవికాసమునకు వినియోగపడుచున్నది. ఆంధ్రోద్యమ తత్త్వమునకీ సిద్ధాంతము ప్రాణము. ఆంధ్రభాషా వికాసమున కుపయుక్తములైన సకలోద్యమము లాంధ్రోద్యమప్రాప్తికి జ్ఞానాంగములు. మనుజులకు మానవత్వము జ్ఞానము మూలముననె సాధ్యముగావలసి యున్నది. జ్ఞానోపార్జనమునకు భాష ముఖ్యసాధనము. భాషవికసించిన సంఘము వికసించును. విజ్ఞానము వ్యాపించును. కళలు వృద్ధినిజెందును. సంపదలువర్ధిల్లును. మానవులు చిరకాలపరిశ్రమవలన నుపార్జించిన విజ్ఞానము భాషారూపమునను లిపిరూపమునను గ్రంథస్థమై విజ్ఞాన సంరక్షణంబునకును విజ్ఞాన వికాసంబునకును సాధనంబగుచున్నది. ఒక వ్యక్తికిగల విజ్ఞాన మావ్యక్తితోను ఒకజాతికిగల విజ్ఞాన మాజాతితోను ఒక యుగమునందుగల విజ్ఞాన మాయుగముతోను నంతమునొందిన, మానవ వికాసము విశ్వజనీన మానవసభ్యత దుర్లభమైయుండును. మహాకవుల

కావ్యములు అవతారపురుషులు దివ్యచరిత్రములు ఆచార్యవర్యుల తత్త్వోపదేశములు గ్రంథస్థములై మానవ వికాసమునకు విజ్ఞానవ్యాపనమునకు సాధనంబులైనవి లోకమునందు విజ్ఞానదాయకంబులైన గ్రంథముల కంతము లేదు. ఒకభాషయందుగల గ్రంథముల నామములైనను సమగ్రముగ నెరుగుటదుర్లభము. నామములు తెలిసినను వానినిచూచి చదివి యానందించుట సామాన్యమానవులకు దుర్లభము. ఒకభాషయందుగల గ్రంథసముదాయమును సయితము సమీకరణముచేయుట శ్రీమంతులకు సయితము సాధ్యముగాదు. శ్రీమంతులు ధనమునువ్యయముచేసి గ్రంథసమీకరణము చేసినను వారికి సదసద్గ్రంథనిర్ణయమును జేయుట సాధ్యముగాదు. ప్రజలుచేరి స్థాపించిన గ్రంథాలయములం దీయుభయ కార్యములు సాధ్యములగు చున్నవి. హిందూదేశమునం దే యితర భాగములందు లేని నూతనభావ మాంధ్రదేశమున నుదయించినదనుట కాంధ్రదేశమునందు వ్యాపించుచున్న ఆంధ్రగ్రంథాలయోద్యమము నిదర్శనముగ నున్నది. మాతృభాషా ముఖమున ప్రజలయందు విజ్ఞానమును వ్యాపింపజేయుటయె ఆంధ్రగ్రంథాలయోద్యమమునకు ప్రయోజనము. భాషాప్రయుక్త రాష్ట్రమును స్థాపించి ఆంధ్రప్రజావికాసమునకు దోడ్పడుటయె ఆంధ్రోద్యమమునకు పరమార్థము. ఆంధ్రోద్యమమున కాంధ్రగ్రంథాలయోద్యమ మొకప్రధానాంగము. ఆంధ్రోద్యమమునకు ఫలములైన దేశవికాసమునకు భాషా వికాసమునకు ప్రజా వికాసమునకు గ్రంథాల యోద్యమము ప్రయోజనకారియై యున్నది. ఏపండితుడు ఏవార్తాపత్రిక ఏపాఠశాల నిర్వహింప జాలని మహాకార్యములు గ్రంథాలయములునిర్వహించుచున్నవి. ఆంధ్రోద్యమ సాధ్యము లైన సకలాదర్శములును నాంధ్రగ్రంథాలయములందు విస్పష్టము చేయబడుచున్నవి. భాషాప్రయుక్త రాష్ట్రోద్యమమునకు వలె గ్రంథాలయోద్యమమునకును భరతఖండమునం దాంధ్రదేశము మార్గదర్శిగ నున్నది.

ఇపు డాంధ్రదేశమునందు ౨౪౯ గ్రంథాలయములు గలవు. మూడు గ్రంథాలయ మహాసభలు గూడినవి. నాల్గవ గ్రంథాలయ మహాసభ శార్వరియందు వైశాఖ శుద్ధ ౧౪ భానువాసరంబునందు గూడినది. అన్నేప పరశురామ పాత్రోగా రాహ్వాన సంఘాధ్యక్షులు. భూపతిరాజు వేంకటపతిరాజుగారు సభాధ్యక్షులు. ఆహ్వాన సంఘాధ్యక్షులు "గ్రంథాలయముల వలన సామాన్య ప్రజలయందు విద్యావ్యాప్తియు నాగరికతయు గలుగుటయే కాకను, పత్రికాపఠనమువలనను ప్రాపంచికజ్ఞానమును, పూర్వ కవి ప్రణీత గ్రంథపఠనమువలన వారి యున్నత భావానుగ్రహణమును, అన్యదేశచారిత్రపఠనమువలన మనోవికాసమును తప్పక కలుగగలదు." అని తెలిపిన భావమును ప్రజలు గ్రహించుట సమంజసము. సభాధిపతి వారి యుపన్యాసమునందు "ఆంధ్ర" శబ్దోత్పత్తిని నిర్ణయించుట సమంజసమని తెలిపియుండిరి. ఆంధ్రశబ్దోత్పత్తిని నిర్ణయించుట వలనను చరిత్రవిషయక జ్ఞానము కొంత స్థిరపడగలదు. ఆంధ్రదేశనామ మాంధ్రరాజులవలనను ప్రజలవలనను గలిగినదని యితరదేశ చరిత్రలవలన సాధింపదగి యున్నది. ఆంధ్రభాష ద్రావిడ భాషగ బరిగణింపబడు చున్నది. పైశాచిభాషకును నాంధ్రభాషకును ప్రాచీనకాలమునందు సన్నిహితసంబంధము గలదని గుణాఢ్యుని బృహత్కథా వృత్తాంతమువలన నిర్ణయింపదగి యున్నది. పైశాచీభాషకును ద్రావిడభాషలకును గల సంబంధమును నిర్ణయించి ఆంధ్రభాషోత్పత్తిని జేయుట భాషాపండితులు నిర్వహింపవలసిన పనియై యున్నది. ఆంధ్రపదమునకు తెలుగుపద మిటీవల యేర్పడిన నామాంతర మనియును ఆంధ్రపదము పూర్వమునందు వాడుకయం దున్నదనియును చరిత్రవలన విశదమగుచున్నది. ఆంధ్రశబ్దము ప్రజలవలన గలిగినను దేశమువలన గలిగినను వర్తమాన కాలమునందు ప్రజలకు భాషకు దేశమునకు నన్వయించుచున్నది. సభాధ్యక్షుడు గ్రంథాలయోద్యమమును గురించి "ఆంధ్రదేశమున భాండాగారోద్యమము వ్యాపించినను, ధనలోపముచేతను ఉత్సాహాలోపముచేతను జరుగవలసినంత పని జరిగి-కావలసినంత సాయము జరు

లకు సమకూడకున్నది. ఉత్సాహలోపమునకు కారణము మనమే. గ్రంథాలయ నిర్వాహకులు తమ కెన్ని విఘ్నములు వచ్చినను ఉత్సాహమును వదలక పని చేయవలెను.'' అని యభిప్రాయమును తెలిపిరి. గ్రంథాలయోద్యమమును వ్యాపింప జేయుటవలనను మాతృభాషావికాసమును విజ్ఞానవ్యాపనమును సాధ్యముగా గలదు. గ్రామ్య గ్రాంథిక సమస్యనుగురించి విమర్శించుచు "ఉభయ పక్షముల వారును పండితులే; అంతేకాక దేశాభిమానులు; భాషాభిమానులు. అట్టిస్థితిలో అవసరమగు భాషాసంస్కారము చేయరాదా? అనవసరములగు మార్పులు మానరాదా? తెలియునటుల గ్రంథములలో వ్రాయుచువచ్చిన భాషకు బదులుగా దూష్యములయి జనాదరణీయములు గాని పదములు కష్టపడి వెదకి చేర్చినభాష వాడుటేల?''

అని రాజుగారు తెలిపియుండిరి. నిర్జీవభాషలు మారవు గాని సజీవభాషలు నిరంతరము మారుట ప్రకృతిధర్మము. మానవవికాసమునకు సాధన భూతంబులైన సాంఘిక రాజకీయ నైతిక ధార్మికార్థిక విషయములందు మార్పు లేర్పడినపుడు వాని నిర్వహణమున కేర్పడిన భాషయందు మార్పు లేర్పడకుండుట యసంభవము. మార్పులు భాషాతత్త్వము ననుసరించి జరుగుట మాత్రము భాషా శుభస్థితికి ముఖ్యసాధనము. వంగదేశమునందు రమేశచంద్రబాబు లెను, మహారాష్ట్రదేశమునందు మహాదేవ గోవిందరానడే బాలగంగాధరతిలకు వలెను మాతృభాషయందు గ్రంథములను వ్రాయగల యుభయభాషాపండితు లాంధ్రభాషయందు గ్రంథములను వ్రాయుటకు బూనుకొనకుండుట యాంధ్రుల గౌరవమునకు కళంకమును గలిగించుచున్నది. భూపతిరాజు వేంకటపతిరాజుగారు వారి యుపన్యాసమునం దాంధ్రుల ప్రాచీన యౌన్నత్యమును బాగుగా వివరించిరి. ఆంధ్రదేమునందలి గ్రంథాలయోద్యమ మితర యుద్యమములవలె మూడునాళ్ళ ముచ్చటగాదు. నాయకుల యధీనమునందున్న యుద్యమమును గాదు. గ్రంథాలయములందు సంవత్సరమునందంతటను పని జరుగుచుండును. నవ్యోత్సాహభరితులైన యువజనులీ యుద్యమమునకు మూలకారకులు. గ్రంథాలయములు కేవలము చర్చారంగములే కాకను కార్యరంగములుగ నున్నవి. గ్రంథాలయోద్యమము వలనను భాషకు దేశమునకు ప్రజలకు మహోపకారము గలుగవలయును. గ్రంథాలయములు మూలమూలలను వ్యాపించినచో గ్రంథకర్తలకు పోషణ మేర్పడగలదు. ప్రజలకు విజ్ఞానము గలుగగలదు. దేశమునందు సేవారంగము లేర్పడగలవు. కృష్ణవరదల సందర్భమునందు బెజవాడయందలి రామమోహన గ్రంథాలయము వారు చేసిన సేవయే దీనికి బ్రమాణము. ఆంధ్రగ్రంథాలయములు సరస్వతీనికేతనములై సేవారంగములై వ్యాయామాలయములై భాషానిలయములై విద్యాలయములై ఆంధ్రోద్యమ ప్రాప్తికి దోడ్పడునటులు గ్రంథాలయ నిర్వాహకులు స్వకీయధర్మమును నిర్వహింతెదరుగాత! బారువయం దాంధ్రభాషాభిమానులైన కళింగగారు తిత్తి బలరామయ్యగారు చతుర్థాంధ్ర మహాసభ నాహ్వానముచేసి జయప్రదముగ జరిపినందుల కాంధ్రగ్రంథాలయ నిర్వాహకులును నాంధ్రులును వారికి కృతజ్ఞులు.''

౧౯౧౭-వ సం॥ మే నెల ౧౦-వ తేదిన ఆంధ్రపత్రిక ఇట్లు వ్రాయుచున్నది:—

"ఆంధ్రగ్రంథాలయ మహాసభ బారువయందు జయప్రదముగ జరిగినది. గ్రంథాలయములు దేశమునకు మహత్తరమైన సేవను చేయుట కవకాశములుగలవు. గ్రంథాలయములు జనోపయోగకరములుగ నుండుటకు మంచి వార్తాపత్రికలు గ్రంథములు గ్రంథాలయములందుండవలయును. గ్రంథాలయములందు గ్రంథములు వార్తాపత్రికలుండియును పాఠకులు లేనపుడు గ్రంథాలయములవలన నగు ప్రయోజనము గలుగదు. దేశముయొక్క వర్తమాన విద్యావిహీనస్థితియందు గ్రంథాలయ నిర్వాహకులు విద్యాభిరుచిని గలిగించుటకై పాటుపడుటకు విశేషమైన యవకాశములు కలవు.

విద్యావంతులూ విద్యాగంధము లేనివారలను చేరదీసి వార్తాపత్రికలనో పురాణములనో చదువుచు జ్ఞానాభిరుచిని గలిగించిన ప్రజలు విజ్ఞానవంతులగుట కవకాశములు గలవు. గ్రంథాలయములు కేవలము పవిత్రములైన సరస్వతీ నిలయములు. సరస్వతీనిలయములందు జాతి కులాభిమానములకును, ధనాభిమానమునకును నధికారాభిమానమునకును నవకాశములేదు. సరస్వతీదేవి నుపాసించుటకై గ్రంథాలయములకుపోవు వారందరును సోదరులు. సరస్వతీ మందిరంబులందు కక్షలకును స్పర్ధలకును నవకాశములేదు. ఈ భావముతో గ్రంథాలయముల సభ్యులు కలిసి పనిచేసిన, వారు భాషాసేవను దేవసేవను జేయుటకు మంచి యవకాశములు గలుగగలవు. గ్రంథాలయములకు సహాయమును జేయగల భారము పాలకులమీదను ప్రజలమీదనుగలదు. గ్రంథాలయముల ప్రయోజనము వ్యాప్తమగుటకై ప్రతిమండలమునందును కేంద్రగ్రంథాలయమును స్థాపించుట యవసరము. ప్రతిమండలమునకేకాకను ప్రతిరాష్ట్రమునకును నారాష్ట్రమునందుగల దేశభాషలందుగల గ్రంథము లన్నిటినిజేర్చి యొక కేంద్ర గ్రంథాలయమును స్థాపించుట యవసరము. గ్రంథాలయములకై మ్యూనిసిపాలిటీలు, లోకలుబోర్డులు తగిన సహాయమును జేయుటయుక్తము.''

# గ్రంథవిమర్శనము: క్రొవ్వుతాళ్లు

బరంపురమునందున్న వేగుంజుక్క గ్రంథమాలవారు క్రొవ్వుతాళ్లు అను గ్రంథమును ఇటీవల ప్రకటించియుండిరి. తొలిపుటలుదీయ 'ఇందురత్నము లున్నవి.' అనుమాటను జూచితిని. అవియెట్టిరత్నములో చూచెదగాక యనిచదువ మొదలిడినాడ. ప్రప్రథమముననే "రానురానవస్థ మిక్కిలి దుర్భరమగుచున్నది'' అనుమాటలు చదివినంత నాయూహాలతి విచిత్రంబుగ భ్రమించెను. "ఏమిది! నవలకా చదువరులకా యీదుర్భరావస్థ'' అని యెగతాళిచేయుచునే చదువు సాగించినాడను. కాని మొదటి ప్రకరణములోపలనే సంగతులు బోధపడినవి. నాయెగతాళి యంతయు గౌరవముగ మారిపోయెను.

గ్రంథకర్త కుశలుడు. శ్రీనివాసమును గూర్చి కాని, వేంకటేశము గూర్చికాని యిదమిద్ధమని యొక్కమాటయైన దానువ్రాయలేదు. సందర్భమునావంతము తప్పించి పాత్రలు ప్రసంగము చేయలేదు. కాని, మూడుపుటల సహజ సంభాషణంబులో నాపాత్రల చరితమునంతయు గరతలామలకముగ చదువరుల కెఱింగించెను. వారివారి లౌకికస్థితుల దెలియపఱచుటయేకాక వారి మనోప్రకృతులనుగూడ నీ సంభాషణంబులనే వెల్లడి చేసెను. శ్రీనివాసము అవస్థ యంతయు దుర్భరముగనేతోచెను. తానుచేసిన తప్పులకీలోకముననే శిక్షలనుపొందెను. వేంకటేశము నాత్మతన్ను కనిపెట్టుచు నేయుండెను. అవి నాయనమ్మకథలు కావని శ్రీనివాసముబాగుగా గుర్తెరిగెను. ధనాశయను పిశాచమును దానుతప్పించుకొనజాలడయ్యెను. ఇట్టివస్తునిర్దేశము నాటకముల నాందీపద్యములలో నటనట కొంతవఱకునుండుట చూచుచున్నాము. గ్రంథము మొదటివాక్యములలోనే, మొదటి ప్రకరణముననే, కథావస్తువిట్టులని నిర్దేశించి పుస్తకము నాద్యంతములు నొక పాశంబునగట్టి పరిపూర్ణభావము నందినట్టులుండుట మిగులప్రశస్యము. మహాకవుల గ్రంథముల నియ్యదియొక్క మాననీయమగు లక్షణము; ఇట్టి వస్తుసూచన ఒక్క యీ పాత్రలయందేకాక, క్రొవ్వుతాళ్లయందును స్పష్టముగ గానిపించును. క్రొవ్వుతాళ్ళనుగూర్చి మొదటి యుచ్చారణమును జూడుడు. 'కొంపలు దీసిన క్రొవ్వుతాళ్ళు' నిశ్చయముగ నవి శ్రీనివాసము కొంపయును సుబ్రహ్మణ్యము కొంపయును దీసిన క్రొవ్వుతాళ్లేయని యనని పాఠకుడుండునా? తప్పక అయ్యావిచిక్కల పెట్టిన చేటురాళ్లే. ఇట్టి యుచ్చారణలవలననే రాబోవు విషాదాంశమును ప్రతిబింబించుచు పాఠకుని మానసమును భావిని రానున్న ఘోరములకు సంసిద్ధముగా నుంచుచున్నాడు. గ్రంథకర్త ఉపమానములయందును, తక్కిన

యన్ని విషయములను నిట్టి యమూల్య సూచనలున్నవి. చూడజూడ గ్రంథకర్త ఘోరంబులను లేఖిని ముంచి వ్రాసిన యట్టులదోచుచుండు. అయఃపిండములు, ఇనుప ముక్కలును ఉపమానములు; దీనినే భావైక్యముగా నెంచుచుందురు. షేక్స్పియరు తన విషాదాంత నాటకములలో హత్యను పర్యవసానముగనుంచి యాదినుండియు రక్తపర్యాయములతోడనే నింపుటయు నీవిషయమునకు ప్రాముఖ్యము నిచ్చుచున్నది.

ఈకథకు నాయకుడు శ్రీనివాసము. ౨౫ ఏండ్లు మర్యాదగ జీవించిన కార్యపరుడు. ఊహాసమృద్ధి గలవాడు. తొలిపుటలలోనే యాతని యూహాసమృద్ధిని గ్రంథకర్త విశదీకరించెను. దానినారూపమున వ్యక్తీకరింపనియెడల నీకథావిధానమంతయు ధ్వంసమయియే యుండును. అంత యమయాతనను శ్రీనివాసమునకిచ్చినది యా యూహాసమృద్ధియే. అట్టి యూహాసమృద్ధి లేని మొఱకెంత మర్యాదగ బ్రతికినను నెంత ఘోర ద్రోహ మొనర్చినను నీరీతి పరివేదన నందజాలియుండడు. ఈపాత్రను ద్రోహపరిణామమును దాని నిరూపణమును నత్యద్భుతములని వ్రాయుట పేలవమగును. ఆంగ్లేయ భాషాగ్రంథములయందు సైతము నిట్టి నిరూపణము చాల యరుదు. గ్రంథమునందు ప్రాముఖ్యము వహించిన విషయ మొక్కటి కలదు.

దోషపరిణామము, ఇయ్యది మహావేగమున సాగుచు షేక్స్పియరు మహాకవి వ్రాసిన మేక్బెత్తును స్మరణకు దెచ్చుచున్నది. గ్రంథకర్త యనినట్టులనే యీ వేగము భావనాతీతము, అశనిపాతమైన వేగము. ఇంత మహావేగముతో భావము మార్పు జెందుచుండెను. శ్రీనివాసము కార్యపరతంత్రుడు. కార్యాలయము మానుటయన నొప్పువాడుకాడు. విపరీతములగు నష్టములు, తా నెఱుంగకున్నను నూహ క్రొవ్వు త్రాళ్లపై కేగెను. ఏమిచేయవలయునో తానూహించికొన జాలకుండెను. ప్రవాహమున దేలుచున్న గడ్డిపోచయట్టుల, నేదిక్కునకు స్థితిగతులీడ్చిన నాదిక్కునకే కొట్టుకొనిపోయెను. ద్రోహము తొలుతయుండిన యవ్యక్తస్థితి నుండి ముందునకొక్క యడుగు వేసెను. కృష్ణమూర్తి రాకయే దీనికి కారణము. వీనిని తనదారినుండి తప్పించుట కర్తవ్యము. అటుల దాను నిశ్చయించుకొనిన కార్యమును చేయుటకు అంతరాత్మ కాలిసంకిలిగా దోచెను. సమాధానముల నెమకజొచ్చెను. ఇదియొక ముఖ్యాంశము. ద్రోహపర్యవసానమునకు మొదటి మెట్టు. అందుననే గ్రంథకర్తయు నీమాటలను జిన్నయక్షరములతో ముద్రింపించి చదువరుల నాకర్షించెను. ద్రోహము ఊహారూపంబుగ నున్నయప్పుడే యింతపరితాపమునందుచున్న నాయకుని యవస్థ క్రియారూపంబుగ ద్రోహము చేసిన యప్పుడెట్టు లుండునోయని యువ్విళ్లూరుట సహజమేకదా. నిధానమున దనపేరున నేబదివేలు వేసిన దినము శ్రీనివాసమునకును, పాఠకులకును దుర్భరము. ఇచ్చోట గ్రంథకర్త కౌశలమంతయు గాననగును. ఇట్టి భాగములే యెట్టికనినైనను భీతిగొల్పును. ఇట్టి సందర్భంబున సరస్వతీనారసింహుల యేకాంత సంభాషణము సమకూడినది.

ఇప్పటికప్పుడే గ్రంథకర్త యూహాలన్నియు—లేఖినియు, దానును—విషాదసంభరితమాయెను. ఆ చోట నీపావనానురాగ సంభాషణమును కవి యనదగిన యీ గ్రంథకర్త వ్రాయజాలకుండెను. గ్రంథకర్త కూర్చుండినచోటు వాతావరణమంతయు విషాదాంశసంభరితముగా మారిపోయెను. శృంగారరసంబునందు కవులకుగల పక్షపాతంబున నావంతయైన వారల ప్రణయసంభాషణంబుల నానందించియుండినచో గ్రంథకర్త వట్టిపుస్తకలేఖకుడనియే యనవలసివచ్చును. ఇయ్యదియే యీతని మహాకవి నామార్హునిగా దెల్పుచున్నది. గ్రంథమునందీభాగము మిగుల చమత్కారము. ఆ యాభీలావస్థయందు శృంగారరసము నిరూపించి విషయైక్యతను బోగొట్టలేదు. అట్టులని, శృంగారరసంబును, నాయువకుల పావనానురాగమును—ఇంతకును బెద్ద—కవికి పావనప్రణయంబునగల మహాగౌరవంబును, చదువరులకు చూపకపోలేదు. అత్యంత శృంగారంబున దోగుచుండు సంభాషణము నిరువది పుటలు వ్రాసిన వ్రాయనిమ్ము. ఇంత స్ఫురద్రూపముతో నాయంశముల పాఠకమానసమున కెక్కుట దుర్లభము. ఇట్టి ఘనకార్యమును సమయోచితవాక్య

ముల నాల్గింట నిర్వర్తింపగలిగెను. ఇట్టి మహాచమత్కారములు గ్రంథమందంతటను గానవగుచు, నించుక మానసికావస్థను గమనించు నెట్టివానికైన, సంమోద గౌరవంబుల నొసగుచుండును.

కథాభాగంబున జరుగు ప్రత్యంశమునకు నుంగల గూఢమనోభావంబుల నాయాచోటుల నుగ్గడించిన క్రమము కడుంగడు శ్లాఘ్యము. ఒక్కొక్కచోట నాయాపాత్రల సంబోధించి వ్రాయు నేర్పునజూడ గ్రంథకర్త కాయా సమయంబుల పాత్రలు తమ మనోభావములతో నెట్టయెదుటనుండిరనుట నిస్సందేహము. నరసింహారావు వివాహమునుగూర్చి చర్చించుచు, శ్రీనివాసము నధిక్షేపించు సమయమున, సరస్వతీ విగ్రహము గ్రంథకర్తకన్నుల గట్టినట్లయి "ఏమిది, కవిగారూ, నరసింహారావునకీయ యోచించు శ్రీనివాసము నింతగా నిందించుచున్నారు?" అని ఖిన్నయై ప్రశ్నించునట్టులదోచుట నిశ్చయము. కావుననే సరస్వతికి మనవియొనర్చి తన విమర్శనావిధానమును తెలియబరచెను. ఒక్కొకచోట ముఖాముఖి నాయాపాత్రలతో తర్కించుచున్నట్టులనే తోచునుగాని, పాఠకులు చదువ వ్రాయుచుంటిననుమాట కవి స్మరణయందున్నట్టు కానరాదు. మరికొన్నిచోటుల, నత్యంతవిషాదస్థితియందు పాత్రలు పరివేదననందుచు జాలిపుట్టించుచుండ, కమనిర్దాక్షిణ్యభావముతో చమత్కారవచనంబుల వారిని హేళనముచేయుట గల్గును, స్వీఫ్ట్ మొదలగు మహనీయులు జ్ఞప్తికివచ్చుచుందురు. ఇట్టి భయానక చమత్కారమునకు కారణము, దౌర్మార్గ్యమునందు కవికిగల యేవయనియే చెప్పవలయును. పవిత్రవిషయంబుల కవికిగల గౌరవము మహాఘనము. సీతారామ్ సుబ్రహ్మణ్యములు మాటలాడుకొనుచు స్నేహము అను పదమును పాపపంకంబున దొర్లించినయప్పుడు కవి వ్రాసిన నాల్గుపల్కులు నీతని గౌరవమును వెల్లడిచేయును. ఈ శూరులే దొంగతనము చేయుచు నుచ్చరించిన దేవుని నామమొక్కసారి కవిని విస్మయామర్షంబులముంచి, నిశ్చయముగ నాతనికి దేవసాక్షాత్కారమును గలుగజేసెననియే చెప్పవలయును. ఆచోటిపల్కులన్నియు నత్యంతపవిత్రంబులు. ఈపవిత్రాశయములు కవికి సహజములును నైసర్గికములును నని నిర్ధారణచేయుటకు నిదర్శనంబుల నేకములున్నవి. ప్రతికార్యంబునను, ప్రతిసంభాషణయందును, భావార్థంబుల నెమకి జగదీశ్వరుని లీలలనాలోకించుభాగ్యము కవికి యభ్యాసరూపంబుగ నలవడెనని తోచుచున్నది. మిగుల సంస్తవనీయము. తుదకు రంగమున పడియున్న మృతకళేబరములనుజూచి విచారించుటయు దైవదూషణమని వ్రాసెనే. ఇంతకన్నను దేవునియందలి పరమోత్కృష్టమయిన యూహ మరియొకటిలేదనియే వ్రాయవలయునుగదా. భావస్వరూపమును దాచుటకు ప్రయత్నించిన శ్రీనివాసమునందు గానవచ్చిన యసహ్యతయు, విధిని క్రమముగ నిర్వర్తింపని రక్షకభటునియందలి కోపమును, స్వలాభచింతనమున పూనిన పూనికని మరచిన సుబ్రహ్మణ్యమునందుగలయేవయు లోనుగాగల విషయములు పఠనీయంబులు. వేయేల, సరియగు నూహతో నీగ్రంథమును జదివి, పునఃపఠనమొనర్పకుండ జాలుట దుర్ఘటమనవలసినదే.

లోకంబంతయు ద్రోహభూయిష్టంబను దురూహయీ కవికి గల దనుకొనుట దోషము. కృష్ణమూర్తి కయిన పరిణామమీ యూహను ద్రోసి రాజుచేయును.

గ్రంథమునందంతటను గాంచనగు విశేషమింకొక్కటిగలదు. ఆది నుండి యంతమువరకును భావప్రకృతినే యుగ్గడించెనుగాని యొక్క చోటున నయిన బాహ్యప్రకృతిని వర్ణింపలేదు. గ్రంథమ్మున నిట్టి దెవ్వరకు భావ్యమో యూహ్యము. కాని యీగ్రంథమున మాత్రము ఇయ్యదిలోపముగా గానరాదు. ఇందులకు కారణము: పాఠకునకు ప్రకృతియే యవశ్యంబుగ దోచునుగాని యదిభావమా, బాహ్యమా యను విచక్షణలేదు. ఈరెండు ప్రకృతులలోను భావప్రకృతి యమోఘంబుగ నీగ్రంథమున నుండుటచే రెండవ దాని లోపము దృగ్గోచరంబు కానేరదు. ఉపోద్ఘాతమున వ్రాసినయట్టుల నియ్యది మార్గదర్శక గ్రంథముగుటచే గాబోలు, కవి యిట్టుల బాహ్యప్రకృతిని త్యజించెను. ఇట్లు త్యజించుట యుద్దేశపూర్వకమే కాని పొరపాటునట్టులాయెనను కొనరాదు. ఆయాచోటుల భావససంబంధమగు ప్రకృతిని విశదీకరించుచు మహాప్రకృతిని గూర్చి వ్రాసిన వచనంబులన్నియు మహాపావనంబులు.

గ్రంథమునందలి ప్రతిపాత్రయు బాగుగ పోషింపబడెను. భావోన్మీలనంబున కియ్యది యాదర్శమన నొప్పును. కార్యకారణసమన్వయం బత్యంత శ్రద్ధతో నిర్వర్తింపబడెను. గ్రంథకర్త ఇట్టి గ్రంథముల మనోవినాశము - చిత్రనాటకము - నింకను బ్రకటించి యాంధ్రులకు వన్నె దెత్తురుగాక యని మనవి యొనర్చెద. ఇన్ని సుగుణంబులున్నను గ్రంథమునందలి శైలి మాత్రము శ్లాఘనీయముగాఁ దోపకున్నది.

(గో.కృ.)

## బాల్యస్మృతి.

క. గడియార మొకటి గొట్టెను;
పొడమదు కనుఁగొనల లేశమును నిద్దుర; యి
ప్పుడ మెల్లఁ గూర్కుకొనె; నె
య్యెడ మనుజుల చప్పుడింత యెసఁగక యుండెన్.

క. హోరుమను కడలిమ్రోఁతయు
దూరంబునఁ గూయు నక్క దూరావము, ని
ద్రారతుల పిన్న శ్వాసముఁ
జేరం గర్ణముల నిద్ర చేరక యుండెన్.

క. కూరుకలు నేమిఁ దోఁపమి
చే గహి గదివీడి బయటఁ జేరి కనుఁగొనన్
ఘోరాంధకార ధారలు
గాలుకొనెన్ బృహ్వ భీతి గలుగ నెడందన్.

క. ఘోరాంధ కారధారలు
గాలుకొనం బృధ్విఁ జూడఁగా భయమగుచున్
గోరకయ యత్తు నెత్తగ
నారసితిన్ నల్లనైన యాకాశంబున్.

తే-గీ. నల్లనగు నాకసంబున మొల్లమైన
రిక్క లెలనవ్వులం గళల్ గ్రక్కుచుండె;
నింగి యనియెడి నీలి చాందినిఁ బసిండి
పూలు నిల్పిరినాఁ గాంతిఁ బొలుపుమీఱి.

తే-గీ. అమలవేదాంతి మానసం బట్లు శాంత
మగుచు జ్ఞానంపు రిక్కల నలరె నింగి
విమల శాంతోదకలితమై వెలసివిక చ
జలజములతోడఁ జెలువొందు కొలనువోలె.

తే-గీ. నిర్మలంబయి శాంతమై నెగడు నింగి
కడు మనోహరమై యుంటఁ గాంచి, కూరు
చుండి, నింగి దెసం గాంచు చుండఁగలిగెఁ
దలఁపు లెన్నియో మదిని వింత తెఱఁగొప్ప.

తే-గీ. చిన్ననాఁటి సఖుఁ డొక్క పిన్నవాఁడు
మున్ను సాయంతనము వచ్చియున్నవాఁడు
తలఁపునకు రాఁగ నతనితోఁ దలఁపులెన్న
పిన్ననాఁటివి రా నిట్టు లెన్నుచుంటి:—

ఉ. చిన్నతనంబునన్ జగతిఁ
జెట్టుల ముట్టడి నుండి రక్షణం
బున్నలువొప్పఁ జేయుటయె
పూజ్యమటంచుఁ దలంచి, భూప్రజా
భ్యున్నతి నాత్మఁ గోరి యిఁకఁ
బున్నెము పండ మదీయజన్మమా
యన్నలకై వ్యయింతు నని
యాత్మఁ దలంచితి;— నేమి చేసితిన్?

ఉ. ఇరువదియేండ్లుఁ గడచె;
నింతవఱకుఁ జేసినదేది లేద; యు
ర్వర జనియించి తోడిజన
వారము వంతల మున్గుచుండ నే
వెఁవుచు జూడనైతి; మతి
వెన్కటిచింతన నాఁడు నాఁటికిన్
మఱవఁగడంగి తే నిసిరో!
మానిసినే యిటు లూరకుండినన్?.

ఉ. మానవసేవ! సేవ! యని
మాటికి మాటికిఁ జిన్ననాఁడు వి
జ్ఞానియవోలె మిత్రుల క
కల్మషబుద్ధిని బోధసేసి, నే
నానయ మొప్ప జీవితము
నంతయుఁ బుచ్చెద నంచుఁ బల్క, నేఁ
డీ నియతిం జరింపఁ దగ
వే? మును మిత్రులు నేమి యెంతురో?

సీ. దేశసేవయె యాత్మదేహసేవ యటంచుఁ
దలపోయుఁడీ యని పలికి పలికి
అజ్ఞాన తిమిరాస్ప్రతావ నీతల మెల్ల
తొలఁగింపవలెనంచుఁ దెలిపి తెలిపి

సర్వసౌభ్రాతృత స్థాపించు టావశ్య
కంబంచు నెన్నొ వాక్యముల నాడి
ఈజగంబును నుద్ధరించు భాగ్యము మన
దే రండనుచుఁ బ్రోత్సహించిమించి
సాహసంబును వింత-యుత్సాహమొదవ
నఖిల మానవసేవ నేయందలంచి,
మిత్రులను బ్రోత్సహించి; తామిత్రులిపుడు
ఏమి తలఁచుచున్నారో? యేమొ ?యకట!

ఉ. ఆతఁడె నట్టులాడి, యిపు
డాతలఁ బెల్లనువీడి, స్వార్థమే
నీతిగనెంచి, వెన్కటి వి
నీతిని గంగనుడించి, పాకృత
వ్రాతము మాటయే మఱచి
పావన చింతనలెల్లమాని, యీ
రీతిగ నూరకుండ నర
రే! జగమొప్పునో ? దైవ మొప్పునో ?

ఉ. ఒప్పునె? ఒప్పునే దయివ ?
మొప్పునె యెప్పటికేని యాతఁడీ
తప్పుగుత్రోవ? లీగతిని
ధర్మమువీడి చరించుచుండులా
గొప్పనెయామహాత్ముఁడు? "న
రౌరా! యిటులైతివిరా కుమార!" యం
చప్రకృతిన్ వచించు నతఁ
డల్లదె! యెల్లెడనున్న రూపుతోన్.

ఉ. సారములేని వ్యర్థపు వి
చారము లెన్నియొచేసి తిప్పు డా
ధీరమువీడి స్వార్థమను
పీడకులాంగితె ? ఛీ! యటంచు గం
భీరత నబ్ధియున్ బ్రళయ
భీకర ఘోర గభీరలీల వా
ఘూర్ణుఁడవేకదా! యనుచు
ఘోషిలుచున్నది భీషణంబుగన్.

ఉ. ఎత్తఁటి నీకు లోఁబడఁజు
మీ! యని బీరము లాడినట్టి నీ
యత్తఁటి పల్కు లేమియగు
నయ్య? మహాత్ముఁడ వీవుకాని నీ
చిత్తము నీకు లోఁబడదు;
చేసెడిదేమిఁక నంచు నుబ్బునన్
జిత్తులనక్క స్వార్థము హ
సించెడుఁ గర్ణకఠోర వాక్కులన్.

ఉ. హాసము చేసె నక్క; యవు
రా! యని కిన్కవహించెనబ్ధి; స్వా
ర్థాసవమత్తుఁడయ్యె నితఁ
డంచనియార్తితమోనిమగ్నయై
యీసున మాటలేక ప్రకృ
తెల్లను శబ్దవిహీనయయ్యె; నే
జేసిన పాపమేమి ? యిది
చెల్లెడిమార్గమిఁకెద్ది? యక్కటా !

ఆ-వె. తల్లఁపుపైఁ దలంపు లలమి యీరీతినన్
గలఁతవెట్ట దిక్కు గాంచలేక
బిక్కవోయి యక్కటక్కటా! యేమి సే
యంగలాఁడ నింక ననుచుఁగుంది.

ఆ-వె. బ్రదుకదొక్కకాకి బహువత్సరంబులు?
బ్రదికి యేమి ఫలము పొందుబ్రదుకు?
కూఁత లెల్లఁ జేయు చేఁతలం జూపని
బ్రదుకు గూడ నొక్కబ్రదుకె? యనుచు.

ఆ-వె. బ్రదుకుపైన రోసి పరిపరివిధములఁ
ద్రిప్పికొనెడి మనసు ద్రిప్పలేక,
ముంచుకొనెడి శోకమును, లజ్జ, భయమును
వెల్లిగొనఁగ, మనసు దల్లడిల్ల.

తే-గీ. అంధకారావృతమగు కాఱడవిలోన
దిక్కు తెలియక తిరిగెడు తెరువరియన
వ్రయ్యలయ్యెడి నెడఁదతోఁ బాలుపోక
యొడ లెఱిఁగియు నెఱుఁగక యుంటినపుడు.

తే-గీ. ఎంతసేపిట్టు లుంటినో యెఱుఁగ; నంతఁ
దెలివి యొక్కింత వొడమి కన్నులను దెఱవ—
అరుణరాగంబు లాకసం బల్లుకొనియె
నుదయమందుచునుండె సూర్యుండు ప్రాచి.

తే-గీ. కావుకావని కూసెను కాకిమూఁక;
కొక్కరొక్కో యటంచును గోడికూసె;
కలకలం బొప్పె జగతి నెవ్వలన; లేచి
మెలఁగఁ జొచ్చితి నెప్ప టట్టులనె నేను.

వింజమూరి రంగాచార్యులుగారు.

# ఆంధ్ర పరిశోధక మహామండలి

## ప్రారంభోత్సవ సమయమున కార్యదర్శి నివేదనము

నేను సుదినము. అనేక కారణములచే సుదినము. ఆ కారణములు చెప్పుటకైన వ్యవధి చాలని యుత్సవ పరంపరలు గల సుదినము!! ప్రాచీనోత్కృష్ట గ్రంథములను సంపాదించి యొక భాండాగారము స్థాపించుటకు ౧౯౧౬ వ సం॥రము నవంబరులో నే స్థిర ప్రయత్నములు జరిగినవి. భాషాభివృద్ధికొఱకుఁ జేతనైనంతవఱకు విశేషోత్సాహముతోఁ బ్రయత్నించుచున్న మా ప్రభువులగు శ్రీ శ్రీ చెలికాని లచ్చారావుగారు తామిదివఱకు స్థాపించిన శ్రీరామవిలాస గ్రంథనిలయము పక్షమునఁ బ్రకటించుచున్న యామునికా ఖ్యాయికా సమూహముతో సంతృప్తినొందక, యొకదినమున తమ సోదర బంధుమిత్రసమక్షమున నీ ప్రాచీన కావ్యరక్షకాగారము స్థాపించి నడుపుటకుఁ బూనుకొనిరి. ఆయలు నాఁడే వారి గృహమునందుఁ బుర్వులపాలగుచు నటుకలపై జీర్ణించుచున్న పెక్కు గ్రంథములఁ గ్రిందికి దింపించి, పని ప్రారంభింపఁజేసిరి. శ్రీ రామవిలాస గ్రంథనిలయము పక్షమునఁ బనిచేయుచున్న ప్రతినిధుల నా పనిమాని తాటియాకుల పుస్తకముల సంపాదింప నాజ్ఞాపించిరి. బంధుమిత్రుల కుత్తరములు వ్రాసిరి. ఉద్యోగుల నియమించిరి. అనుదినము గ్రంథముల పేరులు వ్రాసి జాబితాలు సిద్ధముచేయుచు నాబోంట్లకు పని దుస్సాధ్యమగు నట్లొనరింపఁ గలిగిరి. ప్రాచీన కావ్యపరిశీలన యొక సంతోషదాయకమైన కార్యము. నూతన గ్రంథముల సంపాదింపవలెనను కోరికతో నుండువారికి కొన్ని గ్రంథము లున్నను జాలవు మఱియుండవలయు ననియే యుత్సాహ మినుమడించుచుండును. అట్టివారి కొక్క దినమున ప్రతినిధులంపిన గ్రంథములు మూఁడుదినములవఱకుఁ బరిశీలింపవలసినంత పని కలిగినప్పుడుండు సంతోషము చెప్పవలయునా? ఈ విధముగ నేఁటికి రమారమి పండ్రెండువందల గ్రంథములు సంపాదింపఁగలిగితిమి. ఇంకను నేఁటివఱకు దినదినము క్రొత్తగ్రంథములు వచ్చుచున్నవి. ఈదినముగూడ దేశమునందుఁ బెక్కుచోట్ల మా ప్రతినిధులు గ్రంథసంపాదన మొనరించుచున్నారు.

నేఁటివఱకు సంపాదింపఁబడిన గ్రంథములు ౭, ౮ బండ్లపైనుంచి గొప్ప యుత్సవము చేయుచు నగరమునకు వచ్చినది మొన్న మొన్న నేకదా! ఆ సందర్భము పురజనులందఱు నెఱిఁగియున్న విషయమే! నాఁడు మీ పురమునందలి భాండాగారములవారును, కవులును, పండితులును, పురజనులును, వందలకొలఁది యెదురు వచ్చి- మమ్ము పెండ్లివారివలె నెంచి పానకములనిచ్చి- చందన కర్పూర తాంబూలము లొసఁగి - మీ పురమునఁ గల కొన్ని పుస్తకములు హారతులతో మహామండలికి సమర్పించి - మీ యాదరమును జూపి- మమ్ము పరమానందభరితులుగ నొనరించిరి. అందులకు మహామండలి వారు పురజనులకుఁ గృతజ్ఞులు. చెన్నపురియం దిట్టి భాండాగారములు ప్రభుత్వమువారును, పరిషత్తువారును స్థాపించియుండెఁగాఁ బిఠాపురమున నిది మరల నేల యని కొందరనఁగవచ్చును. భాషాసంరక్షణ భారమంతయుఁ బ్రభుత్వముపైనుంచి ప్రజలూరకుండుట యనుచితము. కావుననే పరిషత్తువారట్టి పనికిఁ బూనుకొనిరి. అందులకై యాంధ్రులందఱు పరిషత్తునెడల మిగులఁ గృతజ్ఞులై యుండవలయును. కాని పరిషత్పుస్తక భాండాగార మాంధ్రదేశమధ్యమున నుండుట సిద్ధించినది కాదు. పైగా వారీ ప్రాచీన గ్రంథసంపాదనము మాని వేసియున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయము వేఱుగఁ దెలుఁగుదేశము నడుమ మనవారికి సులువుగ విద్యరమ్ముట కెట్లవసరమో అట్లే యిట్టి భాండారము తెలుఁగుదేశ భాషా వాఙ్మయ చరిత్రాభివృద్ధికి రెండువందల లక్షల జనసంఖ్యగల మనదేశము నడుమ నుండుట యవసరము. ఇచ్చటనే యిట్టి భాండాగారము స్థాపించినచో, తెలుఁగుదేశముననే యిట్టి గ్రంథాలయమున్నచోఁ, బెక్కు గ్రంథములు సంపాదింపవచ్చును. దీనికిఁ దార్కాణ మొక్కటి చూడుఁడు! గోదావరి మండలమున ౧౦ సంవత్సరముల

క్రిందట బ్రౌను దొరగారు గ్రంథములు సంపాదించి యుండిరి. సరస్వతీ పత్రికాధిపతులు ౧౦ సం॥ముల క్రిందట ప్రాచీన గ్రంథములకై దేశము గాలించిరి. పరిషత్తువారి ప్రతినిధులు తిరిగిరి. ఇంకను బలువురు భాషాభిమానులు గ్రంథములు సంపాదించి యుండిరి. సంస్కృత గ్రంథములే కాని తెలుఁగు గ్రంథములు లేవని నిరుడు ప్రభుత్వమువారి ప్రతినిధులు కొన్నివేల గ్రంథములఁ దీసికొనిపోయిరి. ఇఁక గ్రంథము లెక్కడ నున్నవని యంద అనుకొనిరి. పిఠాపురమునందే స్థాపించిన మామండలికిఁ జూఁడుడు. బెల్లమువండిన పొయ్యివలె మూఁడు మాసముల ప్రయత్నముతో మాకు దొరికిన ౧౨౦౦ గ్రంథములలో దాదాపుగా ౧౦౦౦ గ్రంథములు గోదావరి మండలములోనే చిక్కినవి. కావునఁ దెలుఁగు దేశము నడుమ భాండాగార మిట్టిది స్థాపించుట యావశ్యకమైనట్లు కనఁబడుచున్నది.

అట్లయిన చరిత్రస్థానమగు, నన్నయభట్టారకుని స్థానమగు, రాజమహేంద్రవరమున నిది యుండవలెనని యీనడుమ నొకానొక సాహిత్యసభయందువలెఁ గొందఱనవచ్చును. నన్నయతో సమకాలికుఁడగు సావులూరి మల్లన నవఖండవాడ వృత్తాంతమును - రాజమహేంద్రవరము నిర్మింపఁబడుటకుఁ గొన్ని శతాబ్దములకుఁ బూర్వమే రాజధాని నగరముగనుండి, సత్యాశ్రయసముద్రగుప్తులంతటివారు దండెత్తి రావలసిన ప్రధాననగరముగ నున్న చరిత్రాంశము మీరట్టివారికి జ్ఞప్తికిఁ దెచ్చి, యిప్పటికిని విద్యాస్థానముగనున్న పిఠాపురమునందు- భాషాభిజ్ఞులగు కవిపండితులుం, భాషాపోషకులగు ప్రభువులుగల పిఠాపురమునందు - గ్రాంథికభాషావధూటీ విజయపతాకమును స్థాపించిన యీ పిఠాపురమునందే యీ భాండాగార ముండవలెనని మనము వారితోఁ జెప్పలేక పోలేము. రాజమహేంద్రవర నిర్మాణమునకు ౫౦ సం॥రములకుఁ బూర్వమే మన పిఠాపురము రాజధానినగరముగ నుండెను కదా! ఇప్పటికి నీ రాజ్యమునకిదియే ముఖ్యనగరము. పిఠాపురమునం దిట్టి భాండాగార ముండవలసిన కారణములు ప్రథమప్రకటనలలోనే తెల్పియుంటిమి.

ఇఁకఁ బ్రస్తుతాంశము. ప్రభువులయొద్దఁ జేరి సుస్థిరముగఁ బిఠాపురముననే యుండునట్లు నేఁటికి గ్రంథాలయమునకుఁ బ్రారంభోత్సవము చేయు సుదినము వచ్చినది. ఆంధ్రకవుల చరిత్రము వ్రాసియు, ననేక తాళపత్ర సంపుటముల విశేష శ్రమమొనర్చి పరిశీలించి ముద్రించి తెలుఁగువారికి మహోపకార మొనరించిన శ్రీశ్రీ రా॥బ॥ కందుకూరి వీరేశలింగము పంతులుగారును, పరిషత్కార్యనిర్వాహక సభాధ్యక్షులును పరిశోధకాగ్రగణ్యులునగు శ్రీజయంతి రామయ్యపంతులుగారు మొదలగు పెద్దలు నేఁడీ సభకు విచ్చేసి, శ్రీశ్రీ రాజావారి ప్రక్కనుండి యీ కార్యము నడిపించు భాగ్యము మహామండలికిఁ గలుగుటయే యిది సుస్థిరమగుననుటకుఁ బ్రబల నిదర్శనము.

మహామండలివారికి క్రింది ప్రభువులు రాజపోషకులుగఁ జేరియున్నారు. ౧. శ్రీశ్రీ రాజా రావు చెల్లయ్యమ్మారావు బహదూరు వారు. ౨. శ్రీశ్రీ రాజా వేంకటరంగయ్యప్పారావు బహదూరుగారు. 3. శ్రీశ్రీ రాజా వేంకటాద్యప్పారావు బహద్దరుగారు. ౪. శ్రీశ్రీ రాజా సూరానేని వేంకటపురుషోత్తమ జగన్నాథ గోపాలరావు బహద్దరుగారు ౫. శ్రీశ్రీ రాజా దామెర కోదండరామస్వామి గారు. సంఘసంస్థాపకులగు శ్రీశ్రీ చెలికాని వేంకటధర్మారావు బారిస్టరుగారు, వారి సోదరులు ఉద్ధారకులై రాజపోషకులై యున్నారు. మ॥రా॥ శ్రీ, పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారును, కూచి నరసింహము పంతులుగారును యెప్పటికప్పుడు మాకు మంచిమార్గములఁ జెప్పి నడపించుచున్నారు. ఇంక నితరులు పలువురు మిత్రులు తోడ్పడి పలువిధముల సాయమొనరించుచున్నారు. మహామండలివారు సేకరించిన గ్రంథములలో సంస్కృత గ్రంథములు కూడ నున్నవి. వీని కన్నిఁటికి గ్రంథనామములు మాత్రము చూచి యొకవిధముగఁ జాబితా సిద్ధమొనరించి యుంటిమి. పరిశీలింపఁబడిన తెలుఁగు గ్రంథములలో నీ క్రింది గ్రంథములపరూపములుగఁ దోచినవి. వీని నన్నిటిని సంఖ్యలువేసి, సరిచేయుటకు ౨, 3 మాసములైనఁ బట్టును.

## అధోక్షజ భక్కికలు

ఇంతవఱకు నన్నయభట్టారకునకుఁ బూర్వమాంధ్రమున గ్రంథజాలము లేదని యొక వాదముకలదు. ఇటీవలఁ గొందఱది కాదని ఋజువు చేసియున్నారు. అథర్వణుఁడును, ఆంధ్రకౌముది వ్రాసిన నృసింహాచార్యుఁడును గూడ-రావణ, పుష్పదంత, హరి, కణ్వాది, ప్రాచీనులలో గొందఱను యాంధ్రవ్యాకరణములలో నాదివ్యాకరణ కర్తలని స్తుతించియున్నారు. ఇవి యన్నియుఁ గల్పిత నామములనియు, అట్టివారు తెలుఁగు వ్యాకరణములు వ్రాసియుందురా యని కొంద ఱాక్షేపించియున్నారు. ఏభాష కాని, ఏభాషయందలి గ్రంథజాలము కాని, ఒకఁడు కూర్చుండి ఒక్కసారి యేదేని పెట్టెనో తలుపునో చేసినట్లు చేయుటకు వీలయినదికాదు. ఒక్కసారియేభాషగాని యేవాఙ్మయము కాని సృష్టింపబడుటకు సాధ్యము కాదు. స్వభావమును గాదు. వేదకాలము నుండియు నాంధ్రభాషయుండ వాఙ్మయము లేదనుటకు వీలులేదు. ఈయధోక్షజ భక్కికలయందు ప్రాచీనవ్యాకరణ కర్తలస్తుతిమటయే గాక బృహస్పతి రచియించిన శారదా దర్పణమునుండియు పుష్పదంతుని వ్యాకరణము నుండియు సాహిత్యకౌముది నుండియు కణ్వుని వ్యాకరణము నుండియు సూత్రము లెత్తి వ్రాయఁబడియున్నవి. వారు రచియించిన ప్రాచీన వ్యాకరణములు తెలుఁగునకు సంబంధించినవే! దీని వలన నన్నయకుఁ బూర్వ మనేక శతాబ్దములకుఁ బూర్వము లక్షణగ్రంథము లున్నట్లు ప్రబల నిదర్శనములు కన్పట్టుచుండగా, లక్ష్యగ్రంథములు లేవనుట యెట్లు? అరవ వాఙ్మయముకంటెను దెలుఁగు మిక్కిలి ప్రాచీనమైనదని మన మిప్పుడు నిశ్చితముగ నీ గ్రంథమువలన ఋజువు చేయవచ్చును. ఇదివఱ కీగ్రంథనామము మాత్ర మప్పకవీయమునందుఁ జెప్పఁబడినది. చరిత్ర కీగ్రంథ మసమానమైనది.

## సీమంతినీ కళ్యాణము

ఇది పిల్లలమఱ్ఱి పినవీరభద్రుని వంశములోనివాఁడును, పూసపాటి తమ్మభూపాలుని మంత్రియునగు సోమన వ్రాసినది. దీనివలనఁ బిల్లలమఱ్ఱి పినవీరనచరిత్ర యెంతయో తెలియుచున్నది. మన మీవఱకుఁ గట్టుకథగాఁ జెప్పుకొనుచున్న జైమినిభారత మొక్కరాత్రిలో వ్రాసిన సంగతియు, 'వాణినారాణి' యని చెప్పిన విషయమును సీమంతినీ కళ్యాణమున వర్ణింపఁబడియున్నవి. పూసపాటి తమ్మభూపాలుఁడు మాధవవర్మ వంశములోనివాఁడు. నారాయణకవి పంచతంత్రములోని తమ్మభూపాలుఁడో, కృష్ణవిజయకర్త యగు తమ్మభూపాలుఁడో పరిశీలింపవలసి యున్నది.

## నారదీయ పురాణము

ఇది అల్లాడ నరసింహాకవి విరచితము. పిల్లలమఱ్ఱి పినవీరన యొక నారదీయము వ్రాసియుండెను. ఇది మఱియొకటి. అష్టాదశ పురాణములలో నొకటియగు దీనిని గూడ మన పూర్వులు భాషాంతరీకరించియున్నారు. ఇది గాక మా కనేక పురాణములు దొరికియున్నవి.

## భార్గవ పురాణము

కొండూరి వేంకటదాస ప్రణీతము. ఇందు విష్ణుచిత్తీయము, విప్రనారాయణ చరిత్రాది విష్ణుభక్తి ప్రతిపాదకములగు కథలన్నియుఁ గలవు. ఇతఁడు తిరుమల తాతాచార్యుల శిష్యుఁడట. కృష్ణదేవరాయని కాలమునందున్న తిరుమల తాతాచార్యుఁ డితఁడేయైనచో నీ కవి కృష్ణరాయని కాలమువాఁడని తోఁచుచున్నది. కొన్ని యాశ్వాసములు మాత్ర మున్నవి.

## కామ కళానిధి

ఇది వాజీవంశీకులకుఁ గృతియిచ్చినది. యాదవ రాఘవ పాండవీయ గ్రంథకర్తయగు వీరరాఘవుని పుత్రుఁడగు నెల్లూరి శివరామకవి కర్త. ఇందు శివాజీ చరిత్రము వర్ణింపబడినది.

## జాహ్నవీ మహాత్మ్యము

ఏనుఁగు లక్ష్మణకవి కృతము. రాజమహేంద్రవరము చిరకాలము దుర్గాధిపతులై కాకినాడ, శిలపాక, సీమల నందూరివారు పాలించిన చరిత్రమిందున్నది. గ్రంథము పూర్తిగ నున్నది. (పీఠికగల భర్తృహరివాడ జిక్కినది.)

## మిత్రవిందా పరిణయము

ఇది పూర్వము బొబ్బిలిమహారాజా వారి సోదరుఁడగు శ్రీరావు జనార్దనరాయణింగారు రచియించిరి. శైలి మృదులమై ప్రబంధ కవిత్వమునకుఁ దీసిపోక యున్నది. వీరి తండ్రిగారగు రాయడప్ప రంగారాయణింగారి సంకల్ప సూర్యోదయము కూడ నున్నది.

## విఘ్నేశ్వరాభ్యుదయము

ఇది చవితికథ. వారణాసివారు వ్రాసినది. పరిశీలింపఁబడవలెను.

## హయలక్షణ విలాసము

కేంపభూపాలునకుఁ గృతియిచ్చినది. అశ్వలక్షణ చికిత్సలు వర్ణింపబడినవి. భైరవాచార్య పుత్రుఁడగు మనుమంచ భట్టారకుఁడు కర్త. ఇది కృష్ణరాయనికి బూర్వపుగ్రంథమే యైనట్లు తోఁచుచున్నది.

## ద్విపద నలచరిత్రము

విజయవిలాస కృతికర్తయగు తంజాపూరి రఘునందభూపాల విరచితము. "చినచెవ్వయాచ్యుత క్షితిపాలతనయుఁ"డనని కవి చెప్పికొనినాఁడు. ఇంతవఱకెక్కడ దొరకని పిఠాపురపరిసరమున నీప్రభుని గ్రంథము దొరకుట వలననే యీ ప్రక్కల విద్యాభివృద్ధి స్థితి గ్రహింపనగును.

## నీలాచల మహాత్మ్యము

తెన్నేటి సీతారామకవి విరచితము. ఇదియొక శిష్టుకరణమునకు (కాయస్థునకు) కృతియీయఁబడినది.

## శేషవాత్స్యాయన సంవాదము

గద్య॥ ఇతి శ్రీసీతారామచంద్ర కరుణాకటాక్షవీక్షణ, పరిలబ్ధ సకలసామ్రాజ్య విరాజమాన యిరుగంటి వంశ కలశ పారావార పరిపూర్ణచంద్ర సమాన శ్రీమన్నిశాథూరి శ్రీనివాసాచార్య చరణారవింద మిళిందాయమాన మానస తత్కటాక్షలబ్ధ, సకలశాస్త్ర సంస్కారసముచిత విజ్ఞాన శ్రీరాజా సీతారామపుత్ర శ్రీ చల్లమాంబికాగర్భ శుక్తిముక్తాఫలోపమాన సకల రాజగజ కంఠీరవ శ్రీమన్మహీమండలేశ్వరాది బిరుదాభిధేయ సమరపరాజిత శత్రునికాయ మహారాజశ్రీ రాజా రామరాయ నామధేయ ప్రణీతంబైన శ్రీ పద్మపురాణోత్తర ఖండంబున శేషవాత్స్యాయన సంవాదంబునందు సర్వంబును దశమాశ్వాసము. అని వ్రాయఁబడియున్నది. ఆముక్తమాల్యదయందువలెనే విష్ణుని యాయుధములు కూడ స్తుతింపఁబడినవి. శా॥ శ॥ ౧౭౭౦ లో నీగ్రంథము వ్రాయఁబడెను. ప్రభుసాంప్రదాయములును, ప్రభుకవితా మార్గములు నిందుఁ గన్పట్టుచున్నవి.

## లక్షణ గ్రంథములు

కవికల్పకవల్లి:—ఇందనేక లక్షణగ్రంథములు— అనఁగా నప్పకవి కలవ పేరులు మాత్రము వినిన కవిసర్పగారుడము, కవిమూషిక మార్జాలము, కంఠపాశము మొదలగు గ్రంథములనుండి సూత్రము లెత్తి వ్రాయబడియున్నవి.

అంతుని ఛందము.

భీమన ఛందము. ఇందు భీమన రచియించినట్లు కలదు.

మల్లన ఛందము. ఇది కవిజనాశ్రయమే!

త్రిలింగ శబ్దానుశాసనము.

సుబ్రహ్మణ్య భక్తికలు.

మొదలగు పెక్కులక్షణగ్రంథములుకూడ మనకు దొరికినవి. స్థలమిలేనందున విషయ వివరణ సంక్షేపణ మొనరింపవలసి వచ్చినందులకు సభ్యులు మన్నింతురుగాక!

## వైద్యము

రసరత్నాకరం: తెలుగు ప్రబంధ మార్గమున వ్రాయఁబడినది. ఆంధ్రవైద్య చింతామణి మొదలగు నముద్రితములు నపూర్వములగు తెలుఁగు వైద్యగ్రంథములేగాక- యోగార్ణవము మొదలగు మిక్కిలి యుపయోగములును, పరిశీలనార్హములు నగు రమారమి నూరు వైద్యగ్రంథములు మన భాండాగారమునకుఁ జిక్కినవి.

ఇంక (౧) నీలాపరిణయము, (౨) పాపులూరి గణితం, (3) శ్రీరంగ మాహాత్మ్యము, (౪) శ్రీరంగ మా

మాహాత్మ్యవచనము, (౫) సభాపతి వచనము, (౬) సత్యానందము, (౭) అజ్ఞాన తిమిరభాస్కరం (విద్యారణ్యుల వారి తెలుఁగు వచనము), (౮) ఖలకర్ణవిషాయనము, (౯) గౌతమీమాహాత్మ్యం, (౧౦) నారాయణాచల మాహాత్మ్యం, (౧౧) రాజయునందన విలాసము, (౧౨) సానందోపాఖ్యానము, (౧౩) సారంగధర చరిత్రము, (౧౪) శివరాత్రీమాహాత్మ్యము, (౧౫) వైశాఖమాహాత్మ్యం, (౧౬) కవిలోకచింతామణి, (౧౭) ఆకాశరాజు కథ, (౧౮) విష్ణుమాయావిలాసం, (౧౯) విష్ణుచిత్తీయ వ్యాఖ్య, (౨౦) శ్రీశైలమాహాత్మ్యం, (౨౧) బద్దెనీతులు, (౨౨) తత్త్వసంగ్రహ రామాయణం, (౨౩) సీసపద్యరామాయణం, (౨౪) భోజరాజీయం వచనం, (౨౫) సానంద గణేశ్వరము, (౨౬) మహాభారతశూలంకష వ్యాఖ్య, (౨౭) విచిత్రరామాయణవచనం.

మొదలగు గ్రంథనామము లయిన చదువుటకు వ్యవధి లేనన్ని గ్రంథములు చిక్కినవి. ఇంకను శతకములు, ద్విపదలు నెన్నియో కలవు. వచనకావ్యములు చాలఁ గలవు. వేదాంత గ్రంథములున్నవి. పరిశీలింప వలసి యున్నది.

ఇవి తెలుఁగు భాషలోనివి. ఇంకను సంస్కృతములోఁ జాలవిషయములఁ దెలుపు గ్రంథములు, వేదములు, ఉపనిషత్తులు, పురాణములు, కావ్యములు, ధర్మ తంత్ర శాస్త్ర గ్రంథములు, వ్యాఖ్యానములు, నిఘంటువులు నెన్నియో యపూర్వగ్రంథము లున్నవి. తెలుఁగు, అరవము, లలో వ్రాయబడిన యముద్రిత నిఘంటువులున్నవి. ఇవి యన్నియుఁ బరిశీలించి, సరియైన పట్టిక సిద్ధపఱచి, వీనివాని సిద్ధమైన పిమ్మట క్రొత్త సూత్రములు కట్టి వానిపైనుంచి, ప్రజలుపయోగించుకొనునట్లు చేయుసరికి రెండుమూడు మాసములైనఁ బట్టును. ఈలోపున మరల నూతన గ్రంథములు వచ్చుచుండును. ఇదివఱకువలెనే మిత్రులు నుద్యోగులును కష్టపడి సహాయ మొనరించినచో నొక సంవత్సరములోపుననే యీభవనము నిండిపోవును. ఇప్పటికే గ్రంథములు చదువుకొను వారికి సదుపాయము లేకుండ గ్రంథములే స్థలమాక్రమించినవి. ఇరువదియైదువేల రూపాయలు భవనమునకును భాండాగారమున నుంచవలసిన యావశ్యకము ముద్రితగ్రంథములకును ప్రస్తుతము వ్యయ పెట్టినచో, నీ గ్రంథాలయ మాంధ్రదేశభాషా వాఙ్మయ చరిత్రములు వ్రాసుకొనుట కనువగు మహోపకార నిలయము కాఁగలదు. పిమ్మట నెలకు రు ౪౦౦లు కావలసి యుండును. ఒక సంవత్సరమునకు వలసిన మొత్తమును ప్రభువులు ప్రసాదించి ప్రజలొనర్పఁగల పనిఁ బరీక్షించి యాంధ్రలోకము నుద్ధరింతురు గాకయని కోరుచున్నాను. ప్రస్తుతము పిఠాపురమునం బ్రారంభింప బడిన యీ కార్యమునం దుత్సాహ మారంభ శూరత్వము కానీయక, పిఠాపురమే యిట్టి భాండాగార ముండుటకుఁ దగిన నగరమని పరిసరముల సాయమున ప్రజలుపనిఁజేసి చూపి - తమ నగరమునకు సుస్థిరమగు కీర్తిని సంపాదింపగల యీ మహామండలిని, సుస్థిరమొనరింతురు కొందరు గాక. భాషాపోషకుఁడనియు, నాంధ్రభోజుఁడనియుఁ గీర్తినందుచున్న శ్రీ శ్రీ పిఠాపురము రాజావారు ప్రారంభోత్సవము చేసిన యీ విద్యామహోద్యమము దినదినాభివృద్ధి నభివృద్ధినందునట్లు పరమేశ్వరుఁ డనుగ్రహించును గాక.

ప్రభుభక్తిపరాయణులును పీఠికాపురవాస్తవ్యులును భాషాభిమానులునగు ప్రజలీ మహోద్యమమునకు సాయపడి పీఠికాపురమే సరస్వతీ పీఠమునకు - పీఠికాపురాధీశుఁడు ప్రారంభోత్సవము చేసిన యీ నగరమే సరస్వతీ పీఠమునకు - చల ముండఁ గూడని స్థిరమగు తావని యాంధ్రలోకము గనుకొనునట్లు పనిచేయుదురు గాక! మీనగరమునకు కీర్తిసంపాదింతు రొందురుగాక! అని ప్రార్థించుచు, సభ్యులకు వందన సహస్రము లొనరించి నే నింతతో విరమించుచున్నాను.

ఈ కేంద్ర గ్రంథాలయము యొక్క ఉద్దేశముల నిచట వివరించుచున్నారము:—

౧. ఆంధ్రగీర్వాణ భాషలయందుఁ గల గ్రంథములన్నియు, వలనుపడినంతవఱకు నాంగ్లేయ గ్రంథములను, అందు ముఖ్యముగ హిందూదేశ సంబంధమైన గ్రంథాదులను సంపాదించుట.

౨. ఆముద్రితము లగు ప్రాచీ నాంధ్ర మహాకవి ప్రణీత గ్రంథముల దొరకినంతవఱకు సేకరించి అవి యెల్లరకు నందుబాటులో నుండునట్లు పత్రికలను వికిణ గ్రంథములను ప్రకటించుట.

౩. గ్రంథములను పత్రికలను మహామండలికి చనుదెంచు చదువరులెల్లఁ జదువుకొన నిచ్చుట.

౪. పూర్వలిఖిత పుస్తకములను శాసనములను చరిత్రసాధనములను సంపాదించి రక్షించుట. ప్రదర్శనశాల నొకదానిని క్రమముగా నేర్పరచుటకుఁ బ్రయత్నించుట.

౫. దేశభాషా వాఙ్మయచరిత్ర కారులకు తగిన ప్రోత్సాహ మొసంగి వ్రాయించుట, ప్రజలయందు చరిత్రవాఙ్మయాభిరుచి యొదవించి జనసామాన్యమునకుఁ గూడ సులభము లగు చరిత్రోపన్యాసాదు లిప్పించుట మొదలగునవి.

# గోదావరీమండల గ్రంథాలయ ప్రతినిధుల ప్రథమ మహాసభ

౧౯౧౭ సం॥ ఏప్రియల్ నెల ౭ వ తేది ఉదయము ౭ గంటలకు అమలాపురమున ప్రథమగ్రంథాలయ ప్రతినిధులమహాసభ "గోదావరిమండలసభ" జరుపబడిన భవనమున సమావేశమైనది. రాజవోలు, రాజమహేంద్రవరము, రామచంద్రపురము, కాకినాడ, పెద్దాపురము, పీఠికాపురము తాలూకాలనుండి ౪౦ ప్రతినిధులును, ౧౫౦౦ ప్రేక్షకులును, సభ నలంకరించిరి. బ్రహ్మశ్రీ, వడ్డాది సుబ్బారాయకవిగారు చేసిన దైవప్రార్థన పద్యములతో సభ ప్రారంభమైనది. తదనంతరము ఆహ్వానసంఘాధ్యక్షులగు విస్సా అప్పారావు ఎం. ఏ. ఎల్. టి. గారు ప్రతినిధులకు స్వాగతమొసంగుచు ఈయుపన్యాసము నిచ్చిరి: —

## ఆహ్వానసంఘాధ్యక్షుని యుపన్యాసము

పుస్తకాలయ నిర్మాణము తొలుత భారతవర్షమునందు మహారాజుల ఔదార్యము వలన దేవాలయముల యందును రాజనగరుల యందును జరిగి, క్రమాభివృద్ధి నొంది మహమ్మదీయుల కాలమున అంతరించినది. తిరిగి మన భాగ్యవశముచేత కొన్ని సంవత్సరములనుండి దేశమున పునరుద్ధరింపబడుచున్నది. బరోడాదేశమందు శ్రీ శాయాజీ గాయక్‌వార్ మహారాజుగారు ౧౯౧౦ సంవత్సరమునుండి ఆ గ్రంథాలయోద్యమమును దేశమందంతటను వ్యాపింప జేయుచున్నారు. ఈ యుత్సాహబలమే ఆంధ్ర గ్రంథాలయోద్యమమునకు మహత్తరమైన మూలకారణమని నమ్ముచున్నాను.

ఆంధ్రదేశగ్రంథాలయ ప్రతినిధుల ప్రథమ సభ విజయవాటికయం దారంభమైనది. రెండవదియు మూడవదియు ప్రాచీన ఆంధ్రమహాకవులును కవికుల భూషణములును జగదేక పూజ్యులు నగు నన్నయ తిక్కనల కీర్తి నిలయములగు రాజమహేంద్రవరమునను నెల్లూరుపురమునను వరుసగ జరుపబడినవి. ఈ సంవత్సరము నాల్గవది గంజాంజిల్లా యందలి బారువయను గ్రామమున జరుగనయి యున్నది. రెండు సంవత్సరముల నుండి వివిధ మండలముల యందు కూడ ప్రతినిధుల సభ లేర్పాటు చేయబడుట కారంభమై, గంజాం, కృష్ణా, గుంటూరు, కడప జిల్లాలలో అట్టివి జరిగినవి. గోదావరి మండలమున నట్టి మండల గ్రంథాలయ ప్రతినిధుల సభ జరుపు విషయమున మన మిపుడే అమలాపుర గ్రామమున ప్రథమ సమావేశమైనాము. ఈ ప్రదేశము, గోదావరి జిల్లాకంతటను గోదావరీ జిల్లాకే కాదు అన్ని తెలుగు జిల్లాలకును నాయకమణియై - నారికేళాదిఫల వృక్షోపేతమై సమశీతంబై గోదావరీ మహాజలముచే పావనమై ఫలవంతమై - చిరకాలమునుండి జగద్విఖ్యాతి గాంచిన వేదవేదాంగ పారంగతులును షట్శాస్త్ర వేత్తలునగు మహాపండితుల కాలవాలమై సరస్వతీ ప్రసాదమును సులభసాధ్యము జేసికొనిన మహానుభావులకు జన్మస్థానమైన, కోనసీమ. ఇట్టి మహాక్షేత్రమున మండల సభ ప్రారంభమగుట గొప్ప శుభసూచకము.

### మండల గ్రంథాలయముల స్థితి

౧౯౧౫ సంవత్సరాంతమున గోదావరి జిల్లాయందు సరిగా పనిచేయుచున్న గ్రంథాలయములు ౪౩ ను, చరిత్రలు తెలియనట్టి ౧౦ ఉన్నటుల ఆసంవత్సరాంధ్రదేశ గ్రంథాలయ చరిత్రవలన గనబడుచున్నది. ఇటీవల, నేటి వరకు సరిగా పనిచేయుచున్న గ్రంథాలయములు ౫౩ వరకు పెరిగినటుల ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘ కార్యనిర్వాహకులలో నొకరిచే తెలియవచ్చు చున్నది. చరిత్ర తెలియనట్టివి తెలిపిన వానిలో కొంచెము తక్కువగా నాల్గవ భాగమని దీనివలన స్పష్టము. దీనికి కారణమేమని ఆలోచించిన యెడల తగిన పూనికయు ఉత్సాహమును గలిగిన కార్యదర్శులు లేకుండుటయే యని నా నమ్మకము. గ్రంథాలయ పాలకుని సామర్థ్యము మీదనే గ్రంథాలయాభివృద్ధి నిలచియుండును. కార్యదర్శి స్వార్థత్యాగియై దేశసేవయందు దీక్షగలవాడై పట్టుదల గలిగియుండిన గాని కార్యానుకూలము గానేరదు. అతడు సర్వదా స్వగ్రామ వాసులకు గ్రంథాలయ విషయమున అమితోత్సాహము కలిగింప సమర్థుడయి వారికి అనేక విధముల తోడుపడుచుండవలయును. ఇట్టిపని నిర్వహించుటకు ఈ యుద్యమము తప్ప, నిర్బంధకరమైన వేరువ్యాపార ముండిన వీలుపడదు. ఆరంభమం దట్టి వారు లభింపకున్నను ప్రస్తుతపు గ్రంథాలయ పాలకులు అట్టివారిని గ్రామమున ఒకరిద్దరు తరుణవయస్కులను సిద్ధపరచి వారికి తాము మార్గదర్శులయి సర్వవిషయములను బోధచేసి తప్పుకొనవలయును. అట్టిదీక్షగలవారు బయలుదేరిన గాని గ్రంథాలయముల స్థితి ఔన్నత్యము వహించదు. కొన్ని చిన్న గ్రామముల యందు గూడ రెండుమూడు గ్రంథాలయము లున్నట్టు గ్రంథాలయచరిత్రవలన గనిపించు చున్నది. దుమ్ముగూడెము గ్రామమునందు మూడు గలవు. అందు ఒకటి ౧౯౦౯ సం॥ రముననే స్థాపింపబడి స్వంతభవనము కలిగియున్నది. అట్లుండగా మహమ్మదు మసూద్ సాహేబుగారు కార్యదర్శిగా ఉన్న సంఘ మొకటి ౧౯౧౨ లోను, వైశ్యులచే స్థాపింపబడిన యింకొకటి ౧౯౧౪ లోను, బయలుదేరినవి. ఇందులకు కారణమేమో స్ఫురించుట లేదు. ఇట్టివి సమంజసములుగావు. మన ఉద్యమమునకు సహకారులును కావు. ఇటీవలివి రెండును- స్వంతభవనమును గలిగినట్టిదియు, చిరకాలస్థాపితమును అయిన మొదటి దానితో కలసిన ఎంత బాగుగా నుండును. గ్రామస్థుల పురోభివృద్ధికిని పౌర జీవితమునకును ఎట్టి సాహాయ్య మొనర్చును! కాకినాడ తాలూకా అంద్రంగి గ్రామములోని రెండు గ్రంథనిక్షేపములకు కార్యదర్శి ఒక్కడే యున్నటులు గానవచ్చుచున్నది. కార్యదర్శి ఒకరైనప్పుడు రెంటిని కలిపివేయరాదా! భేదబుద్ధి లేక గ్రామస్థులు ఏకీభావమును బొందియుండిన అన్నివిధముల చేతను అనుకూలముగా నుండునని విన్నవించుచున్నాడను. ఇట్టి లోపములు లేకుండ మనము ప్రయత్నించుట ముఖ్యాంశమని నొక్కి వక్కాణించుచున్నాను. ఆంధ్రదేశ గ్రంథ భాండాగారము లన్నిటిలోను ప్రాముఖ్యము గాంచిన సర్వజన పుస్తక భాండాగారము యొక్కయు వసురాయ పుస్తక భాండాగారముయొక్కయు కార్యనిర్వాహకులు వారి గ్రంథాలయములను రెంటిని జేర్చి గొప్ప భాండాగారమును రాజమహేంద్రవరమున స్థాపింప నాలోచించుచున్నారు. అట్టి కార్యము మిక్కిలి సంస్తవనీయము. గ్రామమందు మంచిస్థితిలో నున్న గ్రంథభాండాగారము ఒక్కటియే చాలును. అందరి తోడ్పాటుచేతను క్రమాభివృద్ధి బొందగలదు. పఠనమందిరములు మాత్రము కావలసినయెడల అక్కడక్కడ స్థాపించుకొనవచ్చును. ఈ రీతిని అందరును ఒకరికొకరు తోడ్పడి ఉద్యమమును సర్వోత్కృష్టతకు దెత్తురని నమ్ముచున్నాను.

### ప్రాత వ్రాతపుస్తకములు.

పూర్వమునంగు సంస్కృతాంధ్ర వాఙ్మయమంతయు తాళపత్రలిఖితపుస్తకములయందు సేకరింపబడిన సంగతి అందరకును విశదమే. ఆగ్రంథములు ఆంధ్రదేశమందు నెక్కడెక్కడనో మూలమూలలను దాగి ఖిలమగుచున్నవి. వాని నన్నిటిని జేర్చి యందలిసంగతులను వెల్లడిజేయుట మహోత్కృష్టమైన దేశసేవ- అది ఈ గ్రంథభాండాగారోద్యమముయొక్క ముఖ్యాం

గము. అట్టి తాళపత్రములను సేకరించు కేంద్రగ్రంథాలయములు ప్రస్తుతము నాకు తెలిసినవరకు నాల్గుగలవు. తంజావూరియందలిది మిక్కిలి ప్రాచీనము. తరువాతిది మదరాసునందు దొరతనము వారిచే నేర్పరుపబడిన ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారము. కొలది సంవత్సరముల క్రిందట ఆంధ్రసాహిత్యపరిషత్తువారు వేరొకటి స్థాపించినారు. కాని ఇవి అన్నియును ఆంధ్రదేశ మధ్యమందు లేకుండుటచేత అట్టి లోటును దీర్చుకొరకు దేశసేవాధురంధరులును యొన్నగూడెం జమీందార్లు నగు మహారాజశ్రీ శ్రీ చెలికాని ధర్మారావు లక్ష్మారావు సూర్యారావు గార్ల పీఠికాపురమున ఈనడుమనే ఆంధ్రపరిశోధక మహామండలి యను పేర ఒక కేంద్రలిఖిత గ్రంథాలయమును స్థాపనచేసిరి. దొరతనమువారు ప్రాచీనగ్రంథములను సేకరించి అముద్రితముల నచ్చొత్తుటకు గాను ఉద్యోగస్థుల నేర్పరచి తగిన ప్రయత్నములు జరుపుచున్నారు. దొరతనము వారి ఉద్యోగస్థులు మన జిల్లాయందు తిరిగి కొన్ని క్రొత్త గ్రంథముల సంపాదించినారు. అందులో ముఖ్యముగా ఈ కోనసీమయందు నెక్కుడు సంపాదింపబడినట్లు వారి ౧౯౧౬-౧౯౧౭ సం॥ర కార్యనివేదనము వలన తెలియుచున్నది. అందులో రాజవోలు తాలూకాయందలి రావిగొప్పపాడు, ర్యాలి గ్రామములలోని వారిద్దరియొద్ద చరిత్రవిషయములును, శబ్దతత్వవిషయములు నగు అపూర్వగ్రంథములున్నటులు విని వారి నెన్నివిధముల బ్రతిమాలినను ఆ గ్రంథముల పరిశోధన జేయనీయలేదనియు, మేము ఆ గ్రంథములను అగ్నిదేవున కర్పింతుముగాని మీకుమాత్ర మియ్యమనియు, చెప్పినటుల నివేదికలో ప్రకటితమై యున్నది. చూచితిరా! మనవారి స్థితి. అంతపట్టుదల వారికేల కలిగెనో ఈపని దేశాభివృద్ధికొరకు గదా యను చింత వారికేల లేకపోయెనో యను సంశయములు అందరకును కలుగకమానవు. ఇకముందైన మహాజనులలో వారి నెరిగినవారెవ్వరయిన నున్నయెడల వారికి నచ్చజెప్పి తత్ప్రకటన మహాకార్యమును నిర్వహింప ప్రార్థించుచున్నాను.

ఈ మండలమందలి ప్రతి గ్రంథాలయమువారును తమ చుట్టుప్రక్కల దాగియున్న తాళపత్ర గ్రంథములను సేకరించి జాగ్రత్తపెట్టుట ముఖ్యాంశము. తంజావూరియందలి యాంధ్రలిఖిత గ్రంథములు అక్కడి వారికి అనుపయుక్తము గనుక ఆ గ్రంథములను ఎక్కడను చెదరిపోకుండునటులు ఆంధ్రదేశమునకు తెప్పించుకొనుటకు గాను ఈసభవారు దొరతనమువారిని ప్రార్థించుట అత్యంత ఆవశ్యకమని తోచుచున్నది.

ఇంక జరుగనయియున్న కార్యక్రమమునందు మనము ఆచరణీయములు అత్యావశ్యకములు నగు తీర్మానములను గురించియే చర్చింపవలయును. మన సామర్థ్యములను మీరిన తీర్మానములను చేసి ప్రతిసభయందును చర్వితచర్వణముగా తీర్మానించుట యెంతయు శోచనీయమును హాస్యాస్పదమును నై యున్నది. మన మీ మండలసభను ప్రథమమున జరుపుచుంటిమి. కనుక కార్యములు కొలదికొలదిగా తలపెట్టి పూర్తిచేయు సన్నద్ధులము కావలెగాని యెన్నెన్నియో ఆరంభము లొక్కమారే పెట్టికొనినయెడల ప్రయోజనముండదు.

పిమ్మట గంటి లక్ష్మన్న, కూచిమంచి సాంబశివరావు, చిక్కాని వేంకటరత్నము, యస్. గోపాలశాస్త్రి, రామభట్లసోమశేఖరరావుగార్లు దుగ్గిరాల సూర్యప్రకాశరావు బి. ఏ గారిని అగ్రాసనాధిపత్యమును వహింపుడని కోరుచు ముచ్చటించిన అనంతరము శ్రీసూర్యప్రకాశరావుపంతులు బి. ఏ. గారు సభాధిపత్యమును వహించి తమ ప్రారంభోపన్యాసమునందు ప్రాచీనగ్రంథరాజములను గురించి నుడివి, లిపి ప్రశంసచేసిరి. "భూర్జపత్రములమీదను, తాళపత్రముల మీదను రానురాను లోహములమీదను, తుదకు కాగితములమీదను లిపి వ్రాయబడుచు వచ్చినది. మగధదేశము నుండియు, దక్షిణదేశమునుండియు, న్యాయమీమాంస శాస్త్రములు లిఖితరూపమైనవి బయటబడినవి. లిపిలేఖనము ప్రాచీనకాలమునం దెంత దుర్లభముగా నుండెడిదో. ౧౦ సంవత్సరముల క్రితమువఱకు మనము పాశ్చాత్య గ్రంథాలయములే సాధనములని దలచుచుండెడి వారము. ఆంధ్రోద్యమమునకు పూర్వము కొన్ని గ్రంథాలయము లున్నను, ఈనూతనోద్యమము వలన నీమండల గ్రంథాలయోద్యమము బాగుగా వ్యాపించినది. కూచిమంచి

తిమ్మకవియే గ్రామ్య భాషను ఉపయోగించినాడు. ౧౯౦౭ సం॥నకు పూర్వ మొక గ్రంథమయినను యూరపుదేశమునకు బోలేదు. పాశ్చాత్యులలో అందు ముఖ్యముగ పరాసువారు, జర్మనీవారు, యిందువిషయమయి యనేక మాయలను పన్ని గ్రంథరాజముల నన్నిటిని ఐరోపాకు గొనిపోయిరి. ౧౦ సం॥ క్రిందట నేపాలదేశమున నున్న ౫౦౦౦ వ్రాతగ్రంథములు కేంబ్రిడ్జిగ్రంథాలయమునకు సమేరు సింగు బహద్దర్ గా రిచ్చిరి. పాట్నాలో రుద్రాక్ష మాలిక రూపముగా కొరాను గ్రంథమును, వ్రాసిరి. తునిలో నామాదిరినే భగవద్గీత వ్రాయబడినది" అని యిట్లు చాలయంశములను విపులముగ విశదీకరించుచు సమాజగంభీర ధోరణిని ౨ గంటలకాలము ఉపన్యసించిరి.

## తీర్మానములు

౧ (క) గోదావరిమండలము నందున్న అన్ని పట్టణములయందును, పల్లెలయందును గ్రంథాలయములను, పఠనమందిరములను స్థాపింపవలెనని మండల ప్రజలను నీసభవారు ప్రార్థించు చున్నారు. (చ) గోదావరిమండలమునందున్న గ్రంథాలయము లన్నియు, "గ్రంథాలయసర్వస్వ" మును తెప్పించుకొనవలెనని ఈ సభవారు తీర్మానించు చున్నారు.

౨ తంజావూరు మహారాజుల దివాణములోని లిఖితపుస్తక భాండాగారమున నున్న వాఙ్మయ మాంధ్రనాయకుల యొక్కయు, మహారాష్ట్ర ప్రభువుల యొక్కయు, కాలమున బుట్టినవి. గ్రంథరాజములు వారి కాలమున స్వీకరింపబడినవి. కావున నది ప్రజల యుపయోగార్థము చెన్నపురిలో స్థాపింపబడిన ప్రభుత్వము వారి ప్రాచ్యలిఖిత పుస్తకభాండాగారమున చేర్చుట ఉపయోగకరము. కావున ప్రభుత్వమువారు ఈ భాండాగారము విదేశములకు బోకుండ నరికట్టి దేశజనుల కుపకార మొనర్చుట యత్యవసరమని ఈసభవారు దొరతనము వారిని కోరుచున్నారు.

3 ఇప్పుడు స్థాపింపబడియున్న గ్రంథాలయముల వారు తమ తాలూకాయందును, సమీపగ్రామములందును, గల తాళపత్రాది లిఖితగ్రంథములను సంపాదించి తమ యొద్ద భద్రపరచి భాషాభివృద్ధికి ప్రోత్సాహము గలిగింపవలెనని ఈసభవారు తీర్మానించు చున్నారు.

౪ ప్రస్తుతము గోదావరి మండలమున స్థాపింపబడిన గ్రంథాలయములకును పఠన మందిరములకును, గోదావరి జిల్లాబోర్డు వారిని తాలూకాబోర్డు వారిని మునిసిపాలిటీ యూనియనులను ద్రవ్యసహాయమును చేయుమని ఈసభవారు ప్రార్థించుచున్నారు.

౫ మనమండలములోని ప్రతితాలూకాకును ఒక గ్రంథాలయ సంఘము నేర్పరచుటకు ఆయా తాలూకాల గ్రంథాలయ సభ్యులను ఈసభవారు కోరుచున్నారు.

౬ మనమండలమునకు గ్రంథభాండాగార సంఘము కార్యదర్శిలేని లోటును తీర్చుచు ధనవ్యయమునకును, శరీరకష్టమునకును, ఓర్చి మండలమునగల గ్రంథాలయములన్నియు పరీక్షించుచు గడచిన రెండుసంవత్సరములనుండి ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకు రిపోర్టును, పంపుచున్న శ్రీ అద్దంకి సత్యనారాయణశర్మగారికి ఈసభవారు తమ కృతజ్ఞతా వందనములను సమర్పించుచున్నారు.

౭ ఈసభవారి తీర్మానములను ఆచరణలోనికి పెట్టుటకును గ్రంథాలయోద్యమమును మన మండలమున వ్యాప్తిజేయుటకును యీదిగువ నుదహరించిన ప్రకారము ప్రతిసంవత్సరము సభ్యుల నేర్పరుపవలెనని ఈసభవారి యభిప్రాయము:--౧ అధ్యక్షుడు,౧ ఉపాధ్యక్షుడు ౨ కార్యదర్శులు, తాలూకాకొక ప్రతినిధి.

(చ) ఈసంవత్సరము యీదిగువ నుదహరింపబడిన సభ్యులను సంఘ కార్యనిర్వాహమును నెరవేర్చుమని ఈసభవారు గోరుచున్నారు: మ. రా. శ్రీ దుగ్గిరాల సూర్యప్రకాశ రావుగారు అధ్యక్షులుగను, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారు ఉపాధ్యక్షులుగను, అద్దంకి సత్యనారాయణ చింతపెంట వేంకటరమణయ్యగార్లు కార్యదర్శులుగను, కొరుకొండ లింగమూర్తి, బిక్కని వేంకటరత్నము, తూతగిరి లక్ష్మీవేంకటరమణ, మహీధర సూర్యనారాయణ, అరసరాల వెంకటరెడ్డిపంతులు, వి. రంగాచార్యులు, గంటి బ్రహ్మానందము, గాడేపల్లి

సూర్యనారాయణరావు, తవ్వా పిచ్చయ్యగార్లను సంఘసభ్యులుగను నియమించిరి.

ఈ తీర్మానములన్నియు ముగిసిన తదనంతరము మనలో కొందరు నవీనగ్రంథములను సృష్టించి పూర్వకవి విరచితములని ప్రకటింప సాహసించుచున్నారనియు అట్టి చోరత్వము దేశానర్థదాయకములని కొన్ని యుదాహరణములను చూపి అట్టిగ్రంథములను నిరసించునటుల యాంధ్రులను కోరుచు వేమూరి విశ్వనాథశర్మగారు చక్కగ నుడివిరి. కొత్తపేట స్కూలు ప్రధానోపాధ్యాయులు కూచిమంచి జగన్నాథరావుగారు గోదావరిమండల గ్రంథాలయములలో నగ్రస్థాన మలంకరించి కార్యరూపమును దాల్చు పుస్తకాలయమునకు సాలున కిరువదిరూపాయ లిచ్చెదమని వాగ్దాన మొనర్చిరి. తదనంతరము, అధ్యక్షులకును, ప్రతినిధులకును, సభ్యులకును, సభజరుగుటకు తగు నేర్పాటులను కావించిన మండల సభా సన్మానసంఘమువారికిని, ఆహ్వానసంఘాధ్యక్షులగు విస్సా అప్పారావుగారు అనేక కృతజ్ఞతాభివందనములను ఒనర్చిరి. రాబోవువత్సరము ఈ మహాజనసభ రాజవోలులో జరుపుటకు ఆహ్వానము చేయగా సభ్యులెల్లరు అంగీకరించిరి.

~~~~~~~~~~~

# గీతాసుమాంజలి.

## ౧. గానసుందరి

వీణె చే జారిపడిపోవు, వ్రేళ్ళుకృతుల
నింపుగా మీటి రాగ మొప్పింపకుండె,
గొంతు బొంగురువోయెడు, నెంతచించు
కొంచు బాడిన నీవు గానివ్వవేమి?
హాయిలో మున్గి మాయమైపోయినావొ?
పవళము జెంది ప్రేయసి మరచినావొ?
దేవ! నాకింక నెపుడు నీదివ్యదర్శ
నంబు నిచ్చెదు? నాపాట కంత మెపుడు?

## ౨. విరహిణి

దీపకళికలు చిన్ననై తెల్లబాఱె
పాన్పుపైనిడ్డ పూవులు వాడిపోయె,
పక్షులెల్లరు తమగూండ్లు వీడి పఱచు
స్వామి, నీవాసికడకింక వచ్చుటేమి?
కనులు మూతలువడి నిద్ర గ్రమ్ముచుండె,
బడలికంజేసి అవశత నొడలుతూలు.
పరవశగజూచి, నాసిగ్గు తెరను జీల్చి,
చోరువలె పట్టుబడకుండ పారిపోవు
నప్పుడైనను దయయుంచి, అంతరంగ
మందు నాప్రేమనున్నించి, మరచిపోక
లేపి నీముద్దు మోమును జూపి, వేగ
నా మనోలోలతను బాపు, నాథ, దేవ!

## 3. ప్రోషిత (బిలహరి - జంపె)

ఎవరు సంతోషింప నీయలంకారంబు
ఎవరు గని మెచ్చుకొన నీసొమ్ములెల్ల
ప్రవిలాత్మక, దేవ, ప్రాణేశ నీవుగా
కెవరుసంతోషింప.

నిదుర బట్టక రేల నీమనోహర రూప
మెదనిల్పి నా జీవితేశ్వరుడ వీవె యని
పదిలముగ నిన్ను నేబట్టుకొని కౌగలిడి
మదిపొంగి కను విప్ప మాయమైపోతి విం
కెవరు సంతోషింప.

బాలసూర్యుని కాంతి గేలిసేయగ జాలు
ఫాలమున తేజస్సు ప్రభవిల్లుచుండగా
లీలలొప్పెడు మూర్తిదాల్చి నాదగు మనో
లోలత్వముగ బాప జాలిగొని రావైతి
ఎవరు సంతోషింప నీయలంకారంబు
ఎవరుగని మెచ్చుకొన నీసొమ్ములెల్ల
ప్రవిమలాత్మక! దేవ! ప్రాణేశ! నీవుగా
కెవరు సంతోషింప.

## ౪. పాడుసిగ్గు

దేవ! నాకనుల ముందు
తేజరిల్లు మెప్పటటుల. దేవరా.
~~~~~~~~~~~

ప్రణయపూర్ణ హృదయుడవై
భాసమాన దేహుడవై
భావమందు నన్నుగోరి
వచ్చిన నిను జూడనైతి. దేవనా.

వెల్లివిరియు తేజముతో
వెల్లమబ్బునంచువీడి
మెల్లన దిగివచ్చు నిన్ను
మేల్కొనియుం గాచనైతి. దేవనా.

వలపున నాయిల్లు జేరి
తలుపు మెల్లతట్టనీదు
పిలుపు వినియు నిన్నెఱిగియు
వలపు నిలుపజాలనైతి. దేవనా.

పాడుసిగ్గు వీడదాయె
ప్రాణేశా, దేవా, నీ
చూడ చక్కనైన మోము
చూడలేక వెఱగువడితి. దేవనా.

జీవితంపు మేలిఫలము
చేత జిక్కి జారిపోయె
మండిపోవెడాకలోన
నెండమావి యట్ల దోచె. దేవనా.

అస్తమితదినేశంబై
అంధకార బంధురమౌ
మిన్నుపై హఠాత్తుగాను
మెఱుపు మెఱసినట్టులయ్యె. దేవనా.

వలపునిండి వచ్చిన నీ
వాంఛ దీర్పనైతి నంచు
మెలవేసుకుపోవు హృదయ
మెట్లు బ్రతుకుదాన నింక? దేవనా.

ప్రణయపూర్ణ హృదయుడవై,
భాసమాన దేహుడవై
దేవ! నాకనుల ముందు
తేజరిల్లు మెప్పటట్టుల. దేవనా.

—బసవరాజు అప్పారావు. బి. ఏ.

# గుంటూరు మండల గ్రంథాలయ ప్రతినిధుల ద్వితీయ మహాసభ

ఈ సభ ౨౮ - ౫ - ౧౭ తేదీ సాయంకాలము ౪ గంటలకు రేపల్లె యందు మండల సభకయి ప్రత్యేకముగ నిర్మింప బడిన మండపమునందు ప్రారంభమైనది. దుగ్గిరాల కాపురస్తులు చింతంనేని గోపాలకృష్ణయ్యగారు దైవప్రార్థనజేయగా, ఆహ్వాన సంఘాధ్యక్షులు చింతలపాటి దక్షిణామూర్తి (బి. ఏ.) గారు ప్రతినిధులకు స్వాగతము నిచ్చిరి. తెనాలివాస్తవ్యులు పెద్దిభొట్ల లక్ష్మీనృశింహంగారు ఉపపాదించగా, మాధవ పెద్దికాళిదాసుగారు, యం. వి. ఎన్. శర్మగారు ఆమోదించగా శ్రీమాన్ ఒంగిపురపు కృష్ణమాచార్యులుగారు అగ్రాసనాధిపత్యమును వహించి, తమప్రారంభోపన్యాసమును గావించిరి. తదుపరి గత సంవత్సర నివేదికను సంయుక్త కార్యదర్శి కర్ల పాలెం వేంకట నారాయణప్పగారు చదివిరి. ఈ మండలములో ౧౯౧౬ సం॥ ఆఖరున చరిత్రలు పూర్తిగా తెలిసిన గ్రంథాలయములు ౫౨ ను, నామములు మాత్రము తెలిసినవి ౨౭ ను, వెరశి ౭౯ గ్రంథాలయములు గలవనియు, ఈవత్సరము క్రొత్తగా ఏర్పడిన ౨౬ గ్రంథాలయములతో ఈమండలమునందు మొత్తము ౧౦౫ గ్రంథాలయములున్నవనియు వీనియొక్క అభివృద్ధినిగూర్చియు తాడంకి వేంకయ్యగారు విపులముగా చెప్పిరి. గ్రంథాలయములయొక్క అభివృద్ధినిగూర్చి పెదరావూరునుండి విచ్చేసిన, చెరువు వెంకట సుబ్రహ్మణ్యంగారు వ్యాసమును చదివిరి. గ్రంథాలయోద్యమ వ్యాప్తిని గూర్చి క్రొత్త సంగయ్య, చింతంనేని భావయ్యగార్లును, తాలూకా సంఘములను గురించి చోరగుడి వెంటాద్రి, యం. వి. ఎన్. శర్మగార్లును ఉపన్యసించిరి. పిమ్మట ఈతీర్మానములు జేయబడినవి:—

౧. ఇపుడు జరుగుచున్న యుద్ధమునందు మన చక్రవర్తిగారికిని, వారిమిత్ర బృందమునకును జయము

గలుగుటకు ఈ సభవారు శ్రీ పరమేశ్వరుని ప్రార్థించుచున్నారు.

౨. ప్రతితాలూకావారును, మండల గ్రంథాలయ సంఘమునకు సహాయముగానుండి, తాలూకాసంఘముల నేర్పాటుచేసి, గ్రంథాలయోద్యమాభివృద్ధికి సహాయభూతులయ్యెదరని ఈ సభవారు గోరుచున్నారు.

3. తంజావూరు నందున్న సుప్రసిద్ధ ప్రాచీనాంధ్ర గ్రంథాలయము పశ్చిమఖండమునకు తీసికొనిపోబడునని ప్రవాదము కలిగినందున, ఆ గ్రంథములను అట్లుతీసికొనిపోబడకుండ, అచ్చటనే ఉంచునట్లును - లేక, సాధ్యమగునేని మద్రాసు నందున్న ఆంధ్రసాహిత్యపరిషత్తువారి గ్రంథాలయమునకు గాని, ప్రాచ్యలిఖితగ్రంథాలయమునకు గాని చేర్పించవలయుననియు ఈసభవారు చెన్నపురి ప్రభుత్వము వారిని ప్రార్థించుచున్నారు.

౪. ఈ మండలము నందు స్థాపింప బడినట్టియు, స్థాపింపబడ బోవునట్టియు, గ్రంథాలయములకును పఠన మందిరములకును తాలూకా బోర్డుల ద్రవ్యమునుండియు ప్రావిన్షియల్ రివిన్యూలనుండియు మునిసిపాలిటీల నుండియు ద్రవ్యసహాయము చేయుటకు సదుపాయములు చేయవలెనని ప్రభుత్వమువారిని ఈ సభవారు ప్రార్థించుచున్నారు.

౫. దొరతనమువారిచే ప్రచురింపబడు పరిశ్రామిక ఆరోగ్యవిషయిక, వ్యవసాయక ప్రచురములను - జిల్లా గెజటీలను - ఆంధ్రభాషయందు ముద్రించబడు గ్రంథముల పట్టికలను గ్రంథాలయములన్నిటికిని ఉచితముగా దయచేయవలెనని ప్రభుత్వమువారి నీసభవారు ప్రార్థించుచున్నారు.

౬ ఈ మండలములోని అన్ని గ్రామములలో నుండెడు తాళపత్ర గ్రంథములను, ప్రాచీన తామ్రశిలాశాసనములను ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రంథాలయమునకు చేర్చుటకయి ఈ మండలవాసుల నీ సభవారు ప్రార్థించుచున్నారు.

౭. అనాదినుంచి పూర్వులవల్ల ఆచరింపబడు హిందూమత సంబంధ గ్రంథములను ప్రతి గ్రంథాలయము వారును తమ గ్రంథాలయములో నుంచవలెనని ఈసభవారు అభిప్రాయ పడుచున్నారు.

౮. ప్రతిపట్టణ గ్రామములయందు స్వంత భవనములుగ గ్రంథాలయములవారు పాటక జనములకై ఉచిత రాత్రిపాఠశాలలను తప్పక స్థాపించి పోషించుట ప్రథమ కర్తవ్యమనియు, అట్టిపాఠశాలలను గ్రామ గ్రంథాలయమువారు దీపావళి పండుగ వసూళ్లు చేసి పోషించ వలెననియు ఈసభవారు కోరుచున్నారు.

# చిన్ని నారాజ!

మా మనస్సులలోని మరుగు కోరికలు
చెప్పగా వశమౌనె చిన్ని నారాజ!
స్వాతంత్ర్యమునుగన్న ప్రణయ కాలాన
పండువై తివినీవు బంగారుతండ్రి!
ఇష్టపడుదువటంచు నెట్లొయూహించి
కూడ పెట్టితినీకు కొన్ని చిత్రాలు
నీవుపుట్టకముందె నీకు జుబ్బాలు
కోరికల్ చిగురెత్త కుట్టియున్నాను.
నీవుపుట్టకముందె నీకు కన్నియను
కోరికల్ చిగురెత్త కూర్చియున్నాను.
నాగనిల్లపుడే మీ నాన్నతోగూడ
నిన్నుముద్దాడితిని చిన్ని నాతండ్రి!
మూగినోములబట్టి సాగించు వేళ
మనసులోనీతోడ మాటాడుచుంటి;
ఎవ్వరోతల్లియన నెరుగ నేలేవు,
పిన్నవాడా! యింత ప్రేమయెందుకురా?

నిన్నెత్తుకొనియుండ చిన్ని నారాజ!
సాటివారలలోన మాటపడకుంటి.

మబ్బుమనసుకు చంద మామవే నీవు,
మా రెండురూపాల సారూప్యమీవు,
మనసుమనసునుగట్టు మహితుండవీవు,
ప్రణయరాగముకెల్ల ఫలమవే నీవు!
నా చిన్ని ప్రాయంబు నీచిన్ని మేన,
నాకన్నుగవకాంతి నీకన్నుగవను,
నా జీవితఫలంబు నీజీవితమున,
నాయన్ని నారాజ నీయందె జూతు.

రాజాధిరాజవై రంజిల్లుమయ్య,
వరహాలతండ్రివై వర్ధిల్లవోయి!

—అధికార్ల సూర్యనారాయణ రావుగారు,
బి. ఏ; బి. ఎల్.

# కృష్ణాజిల్లాయందలి గ్రంథాలయోద్యమము

దేశమందంతట నలుముకొనియున్న నవశక్తియే ఈ గ్రంథాలయోద్యమ వ్యాపనకై మనకింతభక్తి శ్రద్ధలను, విశ్వాసవాత్సల్యములను గల్గించినదని నొక్కి వక్కాణింపవచ్చును. ఆశక్తియే, రాజ్యాంగమునకేమి, ఆర్థికమునకేమి, మతమునకేమి, వేయేల, సంఘప్రచారమునకు సర్వకార్యార్థసాధనకు మూలస్వరూపిణియగు సరస్వతీ మహాదేవియొక్క యనుగ్రహ ప్రసాదముల సంపాదించుకొనుటకు ప్రోత్సహించినది. బహురూపధారిణియగు, ఆమె లీలా విలాసముల గాంచుట కుద్యమింపఁజేసినది. సాంఘిక శరీరములందు, జ్ఞానజ్యోతి, ధగద్ధగాయమానముగ ప్రజ్వరిల్లుచున్న గాని మానవయంత్రములు చలింప నేరవు; ముందుకు సాగ నేరము. రాజ్యాంగాందోళనమునకెట్లు సామ్రాజ్యసభలు, రాజధాని సభలు, మండలసభ లావశ్యకములని గ్రహింపగల్గితిమో ఈగ్రంథాలయోద్యమమునకు గూడ, ప్రత్యేకపు సభలును- శాసనసభలను- డిస్ట్రిక్టు తాలూకా బోర్డులను, ప్రతినిధులు, కార్యనిర్వాహకులు ముఖ్యులైనట్లు, గ్రంథాలయ ప్రతినిధులు, తాలూకా, జిల్లా కార్యదర్శులు, ముఖ్యులని బోధపడి, కార్యాచరణమందు బెట్టగల్గితిమి. అట్టి ప్రతినిధులాచరింప వలసిన కార్యములను, నిర్వర్తింపవలసిన విధులును, ఇదివరకే నిర్ణయింప బడియుండుటచేతను, వ్యాసవిస్తర భీతిచేతను- విరమించుచు- ఆ కార్యదర్శులలో నొక్కరుడనై, జిల్లా మొత్తమున- నే చేయగల్గిన పనిని, గ్రహించిన క్రొత్తవిషయములను, గుర్తెరింగిన జిల్లా కార్యదర్శుల లోపములను, క్లుప్తముగ వచించెదను. మాకృష్ణాజిల్లాలో లోగడ వత్సరము 52 గ్రంథాలయములును, ఈవత్సరము 80 గ్రంథాలయములును గలవు. స్వంతభవనములు కలవి రకలవు మొత్తము, ముప్పదింటిని మాత్రమే సందర్శింపగల్గితిని. అందుయెనిమిదిచోట్ల, సభలు జేయించి, నేనును మాబాల విద్యార్థి సాంఘికులును, ఉపన్యాసములు గావించియుంటిమి. మూడు భాండాగారములను, నే వెడలి స్వయముగ స్థాపించితిని. కొందర మిత్రుల, ప్రోత్సహించి, యింకను, రెండు భాండాగారములను, స్థాపింపజేసితిని. మాచుట్టుపట్ల కొన్ని, భాండాగారములకు, వెయ్యిగ్రంథములకు బైండును, నేనును మాసాంఘికులును కలసి, కట్టితిమి. కొన్ని గ్రంథాలయములకు, సుమారు నూరింటిని నాస్వంత గ్రంథముల నొసంగియు- కొందరికవుడు కొందరి గ్రంథవిక్రేతలను ప్రార్థించి, సగముఖరీదునకు గొని తెచ్చియిచ్చితిని. ఇదంతయు తప్పక చెప్పవలసివచ్చినందుకు మన్నింతురు గాక. స్వాతిశయప్రకటన మని భావింపకుందురు గాక. ఇంక, ప్రస్తుతాంశమునకు వత్తము. నే నెరిగినంతవరకీ వత్సరము, కృష్ణాజిల్లాలో, మంతెన, పెనుమచ్చ, గొల్వేపల్లి, పెడన, బొమ్ములూరు, కైకలూరు, వుయ్యూరులో రెండు, గుడ్లవల్లేరు, దొండపాడు, వెంట్రప్రగడ, మొత్తము పది భాండాగారములు, నూతనముగ, స్థాపించబడినవి. ఇందు, దొండపాడునందలి, శ్రీ రామచంద్ర పుస్తక భాండాగార చరిత్ర ప్రశంసనీయంబు. ఏడువందల పొత్తములు గలవు; యువకుల సాహాయ్యసంపత్తి గలదు పదిమంది, కలసి మెలసి పట్టుదలతో పనిజేయు సంఘీభావము గలదు. ఒక రాత్రిపాఠశాల కలదు. పెనుమచ్చలో, నిన్న, మొన్న నే, స్థాపించినప్పటికిని, రెండువందల గ్రంథములను, రెండువందలపాతిక రూప్యములను, వెంట నే సంపాదింపగల్గిరి. దేవాలయములో వేరుగ భాండాగారమునకొక చిన్నభవనమును కట్టించిరి. కైకలూరి భాండాగారము చిన్నదే కాని నాల్గువేల, రూప్యములతో పురమందిరమునకు భాండాగారమునకు వినియోగపడున ట్లొక పెద్దభవనమును, కట్టించుచున్నారు. ఉయ్యూరు, గుడ్లవల్లేరు, బొమ్ములూరు, మంతెన, మొదలగు, గ్రామములందలి, గ్రంథాలయములు సామాన్యముగ నున్నవి. పెడన, వెంట్రప్రగడ, లోనివి త్వరలో వృద్ధికి రావచ్చును. గొల్లేపల్లి భాండాగారము, నామమాత్రావసిష్టముగ నున్నది. తాలూకాల మొత్తములో, వరుసగా గ్రంథాలయచరిత్రలో ప్రచురింపబడిన భాండాగారములలో ప్రముఖములైనవాటి, క్లుప్తచరి

త్రను మాత్రమే వివరించెద నిపుడు. బెజవాడ తాలూకాలో, సుప్రసిద్ధ మగు, రామమోహనభాండాగారము నట్లుంచి, వల్లూరు పాలెమందలి ఆంధ్రభాషాభ్యాసజ్ఞానోదయానంద పుస్తకభాండాగారచరిత్ర గమనార్హము. ఇచ్చట యేడువందల లోపుగ గ్రంథము లున్నవి. పాఠకులు విశేషముగ గ్రంథములు వినియోగించుకొను చున్నారు. కొందరు సంఘీభావముతో భాండాగారాభివృద్ధికై పాటుపడుచున్నారు. గత వార్షికోత్సవమునకే, మూడువందల రూప్యముల వ్యయ మొనర్చుట జూడ నా కాశ్చర్యమును గల్గించినది. ఆ గ్రామస్తులలో, కొందరీ భాండాగారమును నిర్మూలించుటకై కక్షగా నేర్పడి, నిలబడినట్లు వినుట కెంతయు చింతిల్లుచున్నవాడ. రొయ్యూరినందలి ఆంధ్రవిజ్ఞానపుస్తకభాండాగార కార్యనిర్వాహకుల, కార్యక్రమము ప్రశంసనీయము. ౮౫౦ గ్రంథములుకలవు. ఈ భాండాగారమూలమున పెక్కురీతుల నిజముగ సాంఘిక సేవ సల్పుచున్నారు. వీరే, ఒకస్వరాజ్యసమితిని గ్రామపంచాయితిని, ప్రైవేటుపాఠశాలను స్థాపించి, సక్రమముగ పనిచేయుచున్నారు. ఒక రాత్రిపాఠశాల కలదు. ౩౦ విద్యార్థులుకలరు. తోట్లవల్లూరినందలి శారదావిద్యానిలయ సంఘమువారు, గ్రంథవినియోగము అంతగా సల్పుచుండలేదుగాని, బాడ్మెంటన్ కోర్టునందు మిక్కిలి శ్రద్ధ గల్గియున్నారు. ఏటేట వార్షికోత్సవములను, తప్పక జరుపుచున్నారు. పులిపాక బొడ్డపాడునందలి సత్యనారాయణవరప్రసాద పుస్తకభాండాగారచరిత్ర కూడ, గమనార్హముగను సక్రమముగను, సంతోషకరముగ నున్నది. తెన్నేరునందలి, భక్తసమాజమువారు, భాండాగారమం దంత భక్తి గనుపర్చుటలేదు. ఈడుపుగల్లునందలి కార్నేషన్ రీడింగురూముసంగతి విచారించగా పర్వతనేని చినకామయ్యగారు మొదలగువారు, అంతరించిన దని సెలవిచ్చిరి. కాని, ఈమధ్య పునరోద్ధారణ గావింపబడినదని తెల్పుటకు సంతసమగుచున్నది. గుడివాడతాలూకా, భాండాగారస్థితిగతులు మా తాలూకాసంఘ కార్యదర్శిగారి, రిపోర్టువల్ల బహిర్గతములు గాగలవు. కాని గురజయందలి హనుమంతపఠనమందిర మంతరించినట్లు, విచారింపగా శ్రీయెర్నేని లక్ష్మీనారాయణగారు మొదలగువారు, సెలవిచ్చిరి. పనుమర్తి గ్రామములో, సభజేసి పల్వురిని ప్రోత్సహించినను విముఖత్వము వహించిరని తెల్పుటకు విషాద మంకురించుచున్నది. దీవితాలూకాయందలి, భట్లపెనుమర్రు గ్రామములోని, విజ్ఞానవర్ధనీ పుస్తకభాండాగార ముచ్ఛదశయందే యున్నది. వేయిగ్రంథములు గలవు. సమర్థులగు పదిమంది పట్టుదలతో భాండాగారాభివృద్ధికై, ప్రయత్నపడుచున్నారు. కాని, గ్రంథోపయోగ మంతగా కావించుటలేదు. బందరునందలి కమ్మవిద్యార్థిసంఘము కలతలకు పుట్టినిల్లయి జమాఖర్చు లెక్కలు సరిగాలేక, పట్టుకొనివెళ్లిన గ్రంథముల మరలగైకొనక అంతరించునా యన్నట్లున్నది. నూజివీడు తాలూకాలోని తాడంకియందలి యువజనసంఘము సామాన్యముగ నున్నది. పాఠశాలయందుంచిరి. ముస్తాబాదాయందలి మైత్రేయ పఠనమందిరము సంగతి యెందరనడిగినను తెలియదన్నారు. రెండుదినంబు లుండి మీటింగు జేసి భాండాగార స్థాపనకు ఉత్సాహపరచితి. కారణాంతరములచే కొనసాగలేదు. మున్ముందు ప్రయత్నించిన నెరవేరవచ్చును. ముదునూరునందలి హిందూపుస్తకభాండాగారమును మా కార్యదర్శిగారు రెండుసార్లు ప్రయత్నించియు దర్శించు భాగ్యమునే బడయలేదు. కైకలూరు తాలూకాలోని దొడ్డిపట్లయందలి ఆంధ్రవిద్యార్థినీ పుస్తకభాండాగారము వారు మిక్కిలి శ్రద్ధతో పనిచేయుచున్నట్లు మా కార్యదర్శిగారు సెలవిచ్చిరి. దివితాలూకాలోని చినముత్తేవి గ్రామమునందలి వేణుగోపాల పఠనమందిరము మృతజీవియైనట్లును భాండాగారపు పేర ఉచితముగవచ్చు పత్రములమాత్రము త్రిప్పివేయక, ఒరులపహరించుచున్నటులును తెలియవచ్చెడిని. ప్రయత్నించిన ఫలము చేకూరగలదు. ఇంకను నే వీక్షించిన గ్రంథాలయములు కలవు. కాని విస్తరభీతిచే విసర్జించితి. ఇక్కార్యమునందే గాక పవిత్రభావ పుష్పమంజరులను ఆంధ్రమాతృ పాదారవిందముల కడ నిడి యథాశక్తిని దేశసేవసల్పుచు ప్రతికార్యము

నకు నాకు చేయూతనొసంగు మాబాలవిద్యార్థి సంఘ సాంఘికులకు నావందనములు. భాండాగార సంచార కార్యదర్శులఁగూర్చి కొంచెముగ మనవిఁజేసెద - మేము పామఱ్ఱు పసుమఱ్ఱు కైకలూరు పెనుమచ్చ మంతెన ముస్తాబాదు దొండపాడు మొదలగు గ్రామములం దుపన్యసించితిమి.

సామాన్యముగ జనసామాన్యమున నుపన్యాసముల మూలమున నలవడు నుత్సాహము వర్ణనాతీతము. ఈ సంచార కార్యదర్శులు కేవలము భాండాగారముల దర్శించి విమర్శించుటతోడనే, తృప్తివహించిన లాభము లేదు. నేను కొన్ని భాండాగారములందలి లోపముల వ్యక్తపరచి పరిష్కరించుకొన ప్రార్థించితి. వినియు విననట్లు విని చేసెదమని తలలూపిరే కాని మరొక్కసారి వెళ్లిచూడ, మాపని మాకే ఒప్పజెప్పిరి. ఉపన్యాసము లొసంగిన కొన్నిచోట్ల ఎంతయో ప్రయోజన మలవడినది. ఇందుచే నొండొక కర్తవ్యాంశము పొడకట్టుచున్నది. మంచివక్తలగు సంచారకార్యదర్శులు బయల్వెడలి ఒక్కొక్కచోట రెండేసిదినంబు లుండి గ్రామస్థుల సమావేశపరచి భాండాగారప్రయోజనముల ప్రబోధింపుచు తాము జెప్పిన ట్లొనర్పుచున్నారా యని రాకపోకలచేతను ఉత్తరప్రత్యుత్తరములచేతను గుర్తెరుంగవలసియున్నది. ఇందుచే నెంతయో లాభము సంప్రాప్తింపగలదు. లేనిచోట్లగూడ పెక్కునెలకొల్పవచ్చు. ప్రయాణపు ఖర్చుల కధమపక్షము నూఱురూపాయలేని కావలసివచ్చును. ఇతరవ్యాపృత్తులుగల మాబోంట్లు జిల్లా మొత్తముమీద యొక్కొక్కచోటనే యిన్నినాళ్లుండి, ప్రయాణవ్యయమును కూడా భరింపుచు సంచార మొనర్చుట దుర్భరము. ధనమును సేకరింపక, కేవల మభిమానముతో సావకాశమున్నను లేకున్నను పనిచేయువారల తాలూకా సంఘకార్యదర్శులుగా నియమించిన జిల్లానంతను పదిసార్లు చుట్టివచ్చుటకంటె యిబ్బడియగు లాభమును జూపింపవచ్చును. ఇది నా గట్టినమ్మిక.

దుగ్గిరాల వేంకటసుబ్బయ్య

సంయుక్త కార్యదర్శి.

# గ్రంథాలయములు

గ్రంథాలయములను గూర్చి ముచ్చటించ వలసివచ్చినపుడు గ్రంథాలయముల యందుండవలసిన గ్రంథము లెట్టివి, ఈ యుద్యమము యొక్క యాజమాన్య క్రింద జరుగతగిన కృషి ఏది, అట్టి కృషి జరుగుటకు ఏ యేమార్గముల నవలంబించవలెను, అను నీ ముఖ్యాంశములను గూర్చి చర్చించుట యావశ్యకము.

గ్రంథాలయముల యందుండవలసిన గ్రంథము లెట్టివి? గ్రంథాలయాధికారులు జనసామాన్యమునకు ప్రతి విషయమును గురించియు అనుభవజ్ఞుల యభిప్రాయములను వెల్లడించతగిన గ్రంథములను సేకరించవలెను. ఇట్లు సేకరించుట యనగా నేమి? ప్రపంచములో ఇదివరకు జన్మించిన విద్యాధికుల యొక్కయు ఇప్పుడు జీవించియున్న విద్యాధికుల యొక్కయు అనుభవముల నొకచో జేర్చి వాని యందలి జ్ఞానము జనసామాన్యమందు వ్యాపించునట్లు చేయుటయే. ఎవరికి తగిన గ్రంథములు వారికి గ్రంథాలయమందు లభించ గలయును. శిశువులకు కథల పుస్తకములును - స్త్రీలకు గృహనిర్వాహణను గూర్చినట్టియు, శాస్త్ర సంబంధమైనట్టియు నీతిదాయకమైనట్టియు, గ్రంథములును - పురుషులకు వారు వారవలంబించు వృత్తులకు దగిన గ్రంథములును - భాషావేత్తలకు సారస్వతము మొదలగు విషయములను గూర్చిన గ్రంథములును - వయసు తీరిన వారికి ఆధ్యాత్మిక గ్రంథములును - గ్రంథాలయమందు లభించవలెను. ఇంతియగాక ప్రపంచమున జరుగుచున్న అభివృద్ధిని తెలిసికొనుటకు వార్తాపత్రికలను తెప్పించి గ్రంథాలయములం దుంచవలెను. ఇట్లు చేసినచో గ్రంథాలయములు స్థాపించిన గ్రామములయందలి జ్ఞానాభివృద్ధి సాధకము లగుటయే గాక గ్రంథకర్తలకును పత్రికాధిపతులకును సహాయకరములుగా నుండును.

రెండవవిషయము గ్రంథాలయపక్షమున జరుగగల కృషి. మనదేశము ఎన్నియో విధముల అభివృద్ధి గాంచ వలసియున్నది. మన ప్రజలకు రాజకీయ హక్కులన నేమో తెలియవు. తెలిసినవారికైనను అవి సంపాదించు కొనుమార్గములు తెలియవు. ఇట్టి జ్ఞానము దేశమంతటను వ్యాపించవలసియున్నది. వ్యక్తిస్వాతంత్ర్యమును గూర్చిన జ్ఞానము మన ప్రజల కబ్బవలెను. వ్యక్తిస్వాతంత్ర్య మనగా సంఘమును విడనాడి తన ఇచ్చవచ్చినట్లు పోవు జ్ఞానము కాదు. సాంఘిక మూలసూత్రములకు భిన్నము కాకుండునట్లుగ ప్రతివ్యక్తియు ఓర్పుతో పనిచేసి క్రమ క్రమముగ సంఘమందు సంస్కరణలను ప్రవేశపెట్టు టకు తగిన జ్ఞానము జను లందరకు నలవడవలెను. పరి శ్రమలు, చేతిపనులు, వాణిజ్యము, బ్యాంకింగు, వ్యవసా యము మొదలగు విషయములను గూర్చిన కరపత్రముల నచ్చొత్తించి జనసామాన్యమందు వ్యాపింపజేసియు, వానిని గూర్చిన యుపన్యాసము లిప్పించియు గ్రంథా లయములు జ్ఞానసాధకములు కావలెను. ప్రతి విద్యార్థి కుడును విద్యార్థియు తాను చదువుకొన్న యంశములను తనకన్న జ్ఞానము తక్కువ గలవారలకు బోధించి, కృత కృత్యుడు కావలెను. సంఘశక్తిని అభివృద్ధి చేయుటకు గ్రంథాలయములు గ్రామస్థు లందరును కూడుటకు తగిన స్థలములుగా నుండును. ఇక్కడ జనులు వివిధాం శములను చర్చించుకొనుచుందురు. ఇందువలన నూతనో త్సాహము గ్రామస్థుల మనంబులందు ప్రజ్వరిల్లు చుండును.

ప్రతి గ్రంథాలయమునకును చిన్నదిగనో పెద్దది గనో స్వంతభవన మొకటి ఉండితీరవలయును. దేవా లయము లేని గ్రామమున, దాహతీర్థము పుచ్చుకొన కూడదని మన పెద్ద లెట్టికట్టడి చేసిరో, అట్లే గ్రంథా లయమును పాఠశాలయు లేని గ్రామము నివాసార్హము కాదను యభిని వేశము ప్రజల మనంబుల బాగుగ నాట వలయును. భవననిర్మాణము చేసి అచ్చట కొద్ది గ్రంథ ములను సేకరించిన పిదప ట్రస్టుఆక్టుక్రిందనో సొసైటీసు ఆక్టు (౧౮౬౦ సం॥రం ౨౧-వచట్టము)క్రిందనో గ్రంథా లయ సంఘమునకు కట్టుదిట్టము లేర్పర్చవలయును. అట్టుకట్టుబాటులు లేనిచో అనేకలోపములు జరుగుటకు సావకాశము కలుగును. భవనమందు నవనాగరికులు వాం ఛించు కుర్చీలు, బల్లలు, సోఫాలు ఉండవలసిన యావశ్య కతలేదు. చాపలమీదనే కూర్చుండి చదువుకొనవచ్చును. మన దేశమందు నిరక్షరకుక్షుల సంఖ్య కడు హెచ్చు. కావున చదువ తెలిసినవారు చదువరానివారలకు గ్రంథ ములు చదివి బోధించవలెను. వారల ఉపయోగము కొరకు రాత్రిపాఠశాలలను స్థాపించవలెను. "మ్యాజికు" లాంతరు,గ్లోబులు,పటములు మొదలగు పరికరముల సహా యముతో జనసామాన్యమునందు జ్ఞానము వ్యాపింపచేయ వలెను. హరికథలు, నాటకములు, గ్రామఫోనుపాటలు మొదలగు జనరంజకములగు సమావేశములు గ్రంథాల యాధికారులు జరుపుచుండవలెను.

ఈ యుద్యమమందు ప్రతిమనుజుడును తన శక్తి కొలది పనిచేయుట కెంతయో సావకాశము కలదు. కావున ప్రతి దేశాభిమానియు భాషాభిమానియు గ్రం థాలయోద్యమము కొరకై పాటుపడి దేశాభివృద్ధికి కారణభూతు డగుగాక!

— వల్లూరి సూర్యనారాయణరావు,

బి. ఏ., బి. ఎల్.

## యౌవనము

యౌవనమే ప్రేమరసభరితము. శృంగారవిలాస భూయిష్టము. చమత్కారగుణ పరిపూరితము. తత్వ జ్ఞానాధారము. చిత్రవిచిత్ర కళాప్రదర్శకము. అవి యన్నియు నొక్క యౌవనమందే యిమిడియున్నవి. మనుజుల హృదయమం దివి యన్నియు యౌవనమందే మూర్తీభవించును. యౌవనమే వానికి మూలము.

— (ప్రేమలత)

# గంజాం మండలమునందు గ్రంథాలయోద్యమము

ఆంధ్రదేశమునందు గ్రంథాలయోద్యమమును వ్యాపింపజేయుటకై ౧౯౧౪ సం|| ఏప్రెలు నెలలో బెజవాడపట్టణమున ఆంధ్రదేశ గ్రంథభాండాగార ప్రతినిధులు జేరి ఒకసభ జేసి గ్రంథాలయ నిర్మాణమునుగూర్చి చర్చించి ఆంధ్రదేశమునందుగల గ్రంథాలయములను మంచిస్థితికి తెచ్చుటకును నూతన గ్రంథాలయములను స్థాపించుటకును "ఆంధ్ర దేశ గ్రంథభాండాగార సంఘ" మను పేరనొక శాశ్వతసంఘమును స్థాపించిరి. ఈ సంఘమువారు చేయబూనిన కార్యము జయప్రదముగావలెనన్న ఆంధ్రదేశమునందుగల అన్ని జిల్లాలయందును ఆయా జిల్లాలలోనున్న గ్రంథాలయముల ప్రతినిధులు గూడి జిల్లాసంఘములుగ నేర్పడి దేశగ్రంథాలయసంఘమునకు తోడ్పడినగాని గ్రంథాలయోద్యమ వ్యాప్తి కానేరదని తలంచి, కొన్ని జిల్లాలవారు మండలగ్రంథాలయ సంఘములను స్థాపించిరి. గంజాంజిల్లాలో సుమారు ఇరువది గ్రంథాలయములు ఉన్నట్లు తెలుసుకొని బారువలోనున్న శ్రీకృష్ణదేవరాయ గ్రంథభాండార కార్యదర్శిగారయిన శ్రీ తిత్తి-బలరామయ్యగారు మండల గ్రంథాలయ సంఘమును స్థాపించుటకై గ్రంథాలయ ప్రతినిధుల సభ జరిగించుటను గురించి తమ యభిప్రాయములను తెలుపగోరుచు గత సెప్టెంబరు నెలలో ఈ జిల్లాలోనున్న గ్రంథాలయ కార్యదర్శులకు ఉత్తరములు వ్రాసిరి. అందరును అత్యంత ఉత్సాహముతో తమ అంగీకారములను తెలియజేసిరి. ఈ సభ బ్రహ్మపురాంధ్రభాషాభివర్ధనీసమాజము వారి యాదరణక్రింద జరిపించు నుద్దేశము ఈ సమాజకార్యదర్శిగారు శ్రీ బలరామయ్యగారికి తెలియజేసిరి. వెంటనే శ్రీబలరామయ్యగారు జిల్లాలోనున్న గ్రంథాలయ కార్యదర్శుల అంగీకారమును బడిసిన పిమ్మట, బ్రహ్మపురమునందు ౧౯౧౭ సం|| సెప్టెంబరు ౨౩ తేదిని బ్రహ్మపురాంధ్ర భాషాభివర్ధనీ సమాజాధ్యక్షులయిన శ్రీ వరహాగిరి-వెంకటజోగయ్య పంతులుగారి అధ్యక్షతక్రింద ఉదయము ౭½ ఘంటలకు టవునుహాలులో ఈ సభ జరిగినది. నియమితకాలము మించకనే ప్రతినిధులతోడను ఆంధ్రభాషాభిమానులకు పురజనులతోడను సభ అలంకరింపబడినది. పై గ్రామములనుండి ౧౨ గురు ప్రతినిధులు విచ్చేసిరి. ౮ గంటలకు కార్యక్రమము ప్రారంభింపబడినది. ప్రథమమున శ్రీ వరహాగిరి-వెంకటజోగయ్య పంతులుగారు అగ్రాసనాధిపత్యము వహింపవలెనని కల్లికోట కాలేజి ఉపాధ్యాయులగు శ్రీ ఉన్నవ రామలింగంపంతులు, బి. ఎ. ఎల్.టి., గారు ఉపపాదించిరి. శ్రీ పోతాప్రగడ సింహాచలంపంతులుగారు ఆమోదించిరి. పిమ్మట శ్రీజోగయ్యపంతులుగారు ఈ సభయొక్క ఉద్దేశమునుగూర్చియు మండల గ్రంథాలయ సంఘముయొక్క యావశ్యకతనుగూర్చియు సంగ్రహముగా మాట్లాడిరి. తరువాత కార్యక్రమము ననుసరించి ఈ క్రింది గ్రంథాలయముల నివేదికలు చదువబడినవి:—

బ్రహ్మపురాంధ్ర భాషాభివర్ధనీ సమాజము, బరంపురము. శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయము, బారువ. ఆంధ్రభాషాభివర్ధనీ సమాజము, ఛత్రపురము. లక్ష్మీ సమాజము, ఛత్రపురము. శ్రీరామకృష్ణగ్రంథాలయము ఇచ్ఛాపురము. చంద్రశేఖరపుస్తక భాండాగారము, పలాస. కాళిదాసగ్రంథాలయము, టెక్కలి. వేమన పుస్తకభాండాగారము, అరసవిల్లి. సుజనానుమోదిని పుస్తకభాండాగారము, హీరమండలము. జ్ఞానానంద వర్ధనీసమాజము, రంభ. విజయలక్ష్మీపుస్తక భాండాగారము, బరంపురము. సత్సంగవర్ధనీ సమాజము, సోంపేట. శ్రీనాగేశ్వరరాయ పుస్తకభాండాగారము, నరసన్నపేట. శ్రీమహాలక్ష్మీపుస్తక భాండాగారము, శ్రీకాకుళము. ఎంగ్ మెన్సు అసోషియేషన్, ఛత్రపురము.

అనంతరము ఈదిగువ తీర్మానములు చేయబడినవి.

౧. గంజాంజిల్లాయందంతటను భాండాగారములను నెలకొల్పుటకును నెలకొల్పినవాని నభివృద్ధిపరచుటకును "గంజాంమండల గ్రంథభాండాగార సంఘ" మను పేరనొక శాశ్వతసంఘ మొకటి స్థాపింపబడవలెను.

౨. ఈసంఘము బరంపురమునం దుండవలెను.

3. ఈ సంఘమునకు ఒక అధ్యక్షుడు, ఒక ఉపాధ్యక్షుడు, ఒక ప్రధానకార్యదర్శి, (భాండాగారికుడు), నలుగురు సంచారకార్యదర్శులును కార్యనిర్వాహకులుగా నుండవలయును.

౪. ఈదిగువ వివరింపబడిన ప్రకారము కార్యనిర్వాహకు లెన్నుకోబడిరి:— అధ్యక్షుడు మ॥రా॥శ్రీ వరహాగిరి-వెంకటజోగయ్య పంతులుగారు పబ్లిక్‌ప్రాసిక్యూటరు, బరంపురము. ఉపాధ్యక్షుడు మ॥రా॥శ్రీ, గరిమెళ్ళ-సీతారామమూర్తి పంతులుగారు ప్లీడరు, సోంపేట. ప్రధానకార్యదర్శి (భాండాగారికుడు) మ॥రా॥శ్రీ పోతాప్రగడ సింహాచలంపంతులుగారు, బరంపురము.

సంచారకార్యదర్శులు:— మండపాక - పార్వతీశ్వరశాస్త్రిగారు, ఛత్రపురం తాలూకా. గాదె-రాజమన్నారు పంతులుగారు బరంపురం గుంనూరు తా. తిత్తి-బలరామయ్యగారు, టెక్కలి పర్లాకిమిడితాలూకాలు. పాట్నూరి స్వామిబాబుగారు— శ్రీకాకుళం నరసన్నపేట తాలూకాలు.

౫. ఈసంఘమునందు ప్రతిగ్రంథాలయము వంపునట్టి యొక ప్రతినిధి సభ్యుడుగా నుండవలెను. ఇంతియేగాక ఈ జిల్లాలలో గ్రంథాలయోద్యమమునం దభిమానము గలవారలు ౨౦ మంది సభ్యులుగ నెన్నుకోబడవలెను.

నైతీర్మానముయొక్క రెండవభాగము ననుసరించి ఈ దిగువవివరింపబడినవారు సభ్యులుగ నెన్నుకొనబడిరి. గాదె-శ్రీజగన్నాథస్వామిగారు, ఛత్రపురము. ఉన్నవ-రామలింగంపంతులుగారు, బి.ఏ., ఎల్టి, బరంపురము. త్రిపురాన-ప్రసాదరావుగారు, శ్రీకాకుళము. అప్పికట్ల-తుంబనాథంగారు, ప్లీడరు, అశికా. వొడ్డాదండం శ్రీనివాసరావుగారు, బరంపురము. భల్లెల-వెంకటరమణయ్యగారు, ఇచ్ఛాపురము. శ్రీపాద-గోపాలకృష్ణమూర్తిగారు, బి.ఏ. బరంపురము. నేమాని - వెంకటనృసింహశాస్త్రిగారు, కాలేజిపండితుడు, బరంపురము. గిడుగు-రామమూర్తిపంతులుగారు, పర్లాకిమిడి. గయినేని-ముకుందరావునాయుడుగారు, శ్రీకాకుళము. శ్రీ జగన్నాథపాడిఖడంగగారు, బారువ. గొర్కం బాలకృష్ణమ్మగారు.

౬. కార్యనిర్వాహకులు ప్రతిసంవత్సరము ఏర్పాటు కావలెను.

౭. ఈసంఘమునందు గ్రంథాలయోద్యమమునం దభిమానము గలవారందరును సంవత్సరమునకు ఒక రూపాయిచందా నిచ్చి సభ్యులుగ జేరవచ్చును.

౮. ఈసంఘమునందు జేరు ప్రతిగ్రంథాలయము సంవత్సరమునకు ఒక రూపాయి చందానివ్వవలెను.

౯. మూడుమాసముల కొకసారి ఒక్కొక గ్రంథాలయమునందు ఈ సంఘము సమావేశమై గ్రంథాలయముల అభివృద్ధిని గూర్చిన వాంశములను చర్చించుచుండవలయును.

౧౦. ఈ నైతీర్మానములలో మార్పులుగాని, క్రొత్త నిబంధనలు చేయుటకుగాని ఈసంఘమువారికి అధికారముగలదు.

౧౧. ఆంధ్రదేశమునందుగల ౧౧ జిల్లాలలో స్థాపింపబడిన ౧౧మండలగ్రంథాలయములకు శ్రీవావిళ్ల-రామస్వామి శాస్త్రులు అండు సన్స్ వారు తాము జేయుచూనిన గ్రంథసహాయమునకుగాను వారికి ఈసంఘమువారు కృతజ్ఞతా పూర్వక వందనములర్పించుచున్నారు.

## బాపట్లతాలూకా గ్రంథాలయసంఘము

క్రిందటి సంవత్సరము చరిత్రలంపినవి ౫ ను, చరిత్రనంపనివి ౫ ను కలసి ౧౦ గ్రంథాలయములీ తాలూకాయందున్నవి. ఇవియేగాక నరసాయపాలెం, గొల్లపూడి, పాలపర్రు, ఏదుబాడు, పొన్నూరు మన్నవ చోట్లను గ్రంథాలయములు నెలకొల్పబడినవి. తాలూకాసంఘమేర్పడినది. ఇందన్ని గ్రంథాలయముల యాథార్థ్యస్వభావముల నెఱుంగగోరి నేనొకటి రెండు పర్యాయములు తాలూకాయందు పర్యటన మొనర్చితిని. నే జూచినంతలో గ్రంథాలయ చరిత్రకు సరిపడునంశములనేగలిగియున్నవి. ఏ పొరపాటుననో ఒకటి రెండు

విశేషములున్నను అవి నిస్సహాపాత్రములు. గ్రంథభాండాగారము లన్నియు, గ్రంథాలయోద్యమతత్త్వమును, గ్రంథాలయోద్యమ వ్యాపకత్వమున కవలంభింపవలసిన సాధన విధానములను గ్రహించి ఆచరణలో నుంచుచున్నవని చెప్పుటకు వలనుపడదు కాని యీ యుత్సాహమే, పట్టుదలయే, భావి పురోభివృద్ధికి శుభసూచన మని చెప్పగలను. ఇనగల్లు ఆన్ధ్రవాణీ గ్రంథభాండాగారమును, పొన్నూరు రామసుబ్బరాయాంధ్ర గ్రంథనిలయమును, చేబ్రోలు గాంధి సరస్వతీనిలయమును, పెదచెఱుకూరు చిదానందసరస్వతీ గ్రంథాలయమును, గొల్లపూడి వాణీనిలయ పుస్తకభాండాగారమును, మంచాళ్ల శ్రీరామకృష్ణ పరమహంస గ్రంథాలయమును, ప్రుసులూరు బాలవిజ్ఞానానంద చంద్రోదయ గ్రంథభాండాగారమును, మన్నవ ఆంధ్రభాషాభివర్ధనీ గ్రంథాలయమును, నరసాయపాలెం విద్యాసాగర గ్రంథనిలయమును, పెదచెఱుకూరు ఆంధ్రవాణీ గ్రంథభాండాగారమును, సర్వజనుల కుచితముగ గ్రంథముల నిచ్చుచున్నవి. గ్రంథములనుకోరు ప్రతివారికి నిరభ్యంతరముగ నిడ్లకీయ దగునను నిబంధనతో నట్లొనర్చుచున్న యీ గ్రంథాలయముల కార్యక్రమ మెంతయు శ్లాఘనీయము. పచ్చలతాడిపర్రు గోక్లేవిద్యాలయమును, బ్రాహ్మణకోడూరు పరశివానంద గ్రంథాలయమును, కొండపాటూరు ఆన్ధ్రభారతీ గ్రంథభాండాగారమును, స్త్రీలకును చందాదారులకును కొన్ని నిబంధనలతో గ్రంథముల నొసంగుచున్నవి. తక్కినవన్నియు సాంఘికులకు మాత్రమే గ్రంథముల నొసంగుచున్నవి. అన్ని గ్రంథాలయములందును, తెఱచియుండిన కాలములో వారపత్రికలనో, గ్రంథములనో, చందాదారులు గాని వారలు గూడ నిరభ్యంతరముగ చదువుకొనవచ్చును. బ్రాహ్మణకోడూరు పరశివానంద గ్రంథనిలయమును, పెదచెఱుకూరు శ్రీచిదానంద సరస్వతీ గ్రంథనిలయమును, ప్రుసులూరు బాలవిజ్ఞానానందచంద్రోదయ గ్రంథనిలయమును, ఇనగల్లు ఆన్ధ్రవాణీగ్రంథ భాండాగారమును, పాఠశాలల ద్వారా బీదల విద్యాభివృద్ధికి తోడ్పడుచున్నవి. ఇనగల్లు గ్రంథాలయమును, పొన్నూరు గ్రంథనిలయమును, పెదచెఱుకూరు శ్రీచిదానంద సరస్వతీ గ్రంథనిలయమును- జాతీయాభివృద్ధికి, ముఖ్యముగ జ్ఞానాభివృద్ధికి, గొన్ని బహుమతీ పరీక్షల నేర్పఱచి వానిని సాగించుచున్నవి. ఇనగల్లు గ్రంథాలయము కొన్ని గ్రంథముల బ్రకటించుచున్నది. ఈ తాలూకాయందెల్ల చేబ్రోలు ఆన్ధ్రభారతీ గ్రంథనిలయము ప్రత్యేక మెంకరిహార్కగ భావింపబడుచున్నది. ప్రస్తుతము చేబ్రోలు గోక్లే పఠనమందిరమును, మునిపల్లె భారతీనిలయమును, ఈపూరు సాలెంకటేంద్ర నాథ గ్రంథనిలయమును, బాపట్ల బ్రహ్మాండం బాపయ్యగారి గ్రంథనిలయమును, పచ్చలతాడిపర్రు గోక్లేవిద్యాలయమును, కొండపాటూరు ఆన్ధ్రభారతీగ్రంథ భాండాగారమును, మూయబడినవి. స్థాపకులును, కార్యనిర్వాహకులును, విద్యార్థులై గ్రామాంతరములందుండుటయును, గ్రామములయందు గ్రంథాలయోద్యమ తత్త్వము తెలియకుండుటయును ఇవి మూయబడుటకు గల కారణములు. కనుక ఇకముందైనను కార్యనిర్వహణ భారమంతయు గ్రామములయందుండు వారియందుంచుట యుచితమనియును, అభివృద్ధికి శుభసూచకమనియును, గ్రంథాలయ సంస్థాపకులకు హూణవిద్యాభ్యాసకులకు ఒకమారి విజ్ఞప్తి యొనర్చుచున్నాడను. నరసాయపాలెం విద్యాసాగర గ్రంథనిలయమును మన్నవ ఆన్ధ్రభాషాభివర్ధనీ సమాజమును, కొండపాటూరు ఆన్ధ్రభారతీ గ్రంథభాండాగారమును, పచ్చలతాడిపర్రు గోక్లేవిద్యాలయమును, మునిపల్లె భారతీనిలయమును, పెదచెఱుకూరు ఆన్ధ్రవాణీ గ్రంథభాండాగారమును, ప్రుసులూరు బాలవిజ్ఞానానంద చంద్రోదయ గ్రంథనిలయమును, బ్రాహ్మణకోడూరు పరశివానంద గ్రంథనిలయమును, వీటినిసంస్థాపించినవారు ఉత్సాహవంతులును, ఉదారవంతులును, నగు యువకులేగాని వారియుత్సాహమునకు తగినంత పట్టుదలతో పని యొనర్పగలనియున్నది. "పరోపకారార్థ మిదంశరీరమ్" అను నార్యోక్తి చొప్పున "విద్యావిహీనః పశుభిస్సమానః" అను నార్యోక్తియును మనంబున నిలుపుకొని, నవీన మార్గమున పనియొనర్చి గ్రామప్రజల యభిమానముల నందికొని కార్యనిర్వాహకులయ్యెదరు గాక యని యీ గ్రంథాలయముల వారిని కోరుచున్నాము. బ్రాహ్మణకోడూరు పరశివానంద గ్రంథ

నిలయమును, ఈవూరుపాలెం దేవేంద్రనాథ గ్రంథ నిలయమును, బాపట్ల శంకర విద్యాలయమును, స్వంత భవనములు గలిగి యున్నవి. మంచాళ్ల శ్రీరామకృష్ణ పరమహంస గ్రంథాలయమును, పెదచెఱుకూరు శ్రీ చిదానంద సరస్వతీ గ్రంథనిలయమును, మన్నవ ఆన్ధ్రి భాషాభివర్ధనీ సమాజమును, ఇనగల్లు ఆన్ధ్రివాణీ గ్రంథాలయమును, భవనములను సంపాదింప నున్నవి. పునులూరు బాలవిజ్ఞాన ఆనంద చంద్రోదయ గ్రంథనిలయమును, పెదచెఱుకూరు ఆన్ధ్రివాణీ గ్రంథాలయమును, భవనములు నిర్మింప ప్రయత్నించుచున్నవి. వీరి కార్య నిర్వాహణ పరిశ్రమ ప్రయత్నములచే నీ గ్రంథాలయము లకు స్వంతభవనము లేర్పడును గాక! కాన ఆంధ్రభాషో ద్ధారకులును, ఉదారవంతులును, ధనవంతులును, నగు ఆన్ధ్రియువాశయులు శారదా మందిరముల నిర్మించ ప్రార్థించుచున్నారము. ఈతాలూకాలోగల గ్రంథాలయములన్నియు దాదాపు ౨౬౦౦ గ్రంథములను, కొన్ని వార్తాపత్రికలను, జనసామాన్యముచే జదివించి విజ్ఞాన వ్యాప్తికి దోడ్పడుచున్నవి. అట్టిగ్రంథాలయములు మాత్రము గ్రంథాలయ సర్వస్వమును దెప్పించుచున్నవి.

కోన వేంకటరాయ శర్మ,

సహాయ కార్యదర్శి.

# కాకినాడ తాలూకా గ్రంథాలయ ప్రతినిధుల ప్రథమ మహాసభ

ఈ మహాసభయును ఈశ్వర పుస్తక భాండాగార ద్వితీయ వార్షికోత్సవమును ౧౯౧౮వ సం॥ జనవరినెల ౨౦ వ తేది ఆదివారము కాకినాడ టౌను హాలులో జరగినవి. బ్రహ్మశ్రీ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రిగారు అధ్యక్షత వహించిరి. తాలూకాలో నాల్గవవంతు గ్రంథాలయములనుండి పదిమంది ప్రతినిధులు మాత్రమే వచ్చియుండిరి. రమారమి వందమంది సభ్యులు సభ నలంకరించిరి. ఆహ్వాన సంఘాధ్యక్షులగు కోకా జనార్దనరావు నాయుడు బి. ఎ. ఎల్. ఎమ్. ఎస్. గారి యుపన్యాసము చదువబడినది. అధ్యక్షులు తమ ప్రారంభోపన్యాసమున గ్రంథాలయముల ప్రాచీనతనుగూర్చియు ఉపయోగములను గూర్చియు ఉపన్యసించిరి. కార్యదర్శులగు నిడమర్తి భీమరాజుగారు ఈశ్వర పుస్తక భాండాగార ద్వితీయ వార్షికచర్యను చదివిరి. పిమ్మట యాతగిరి లక్ష్మీవేంకటరమణగారు 'గ్రంథాలయోద్యమము' అను వ్యాసమును చదివిరి. అటుపిమ్మట వింజమూరి వేంకట లక్ష్మీనృసింహరావు గారు శ్రీ ఈశ్వర పుస్తక భాండాగారమును ఆశీర్వదించుచు నవరత్నములను చదివిరి. గాడిచెర్ల సూర్యనారాయణగారు మతవిద్యనుగూర్చి యుపన్యసించిరి.

ఈ క్రింది తీర్మానములు సభ్యులచే నేకగ్రీవముగ నంగీకరింపబడినవి.

౧. క. కాకినాడ తాలూకాయందున్న అన్ని పట్టణములందును పల్లెలందును గ్రంథాలయములను పఠనమందిరములను స్థాపింపవలెనని తాలూకా ప్రజల నీసభవారు ప్రార్థించుచున్నారు.

ఖ. ప్రజలు తమ గ్రామములందుండెడి ధర్మాదాయమునుండి ఒక భాగమును గ్రంథాలయములకు సహాయము చేయుట కీ సభవారు కోరుచున్నారు.

౨. క. ప్రస్తుతము కాకినాడ తాలూకాలో స్థాపించియున్న గ్రంథాలయములకును, పఠనమందిరములకును, తాలూకా జిల్లాబోర్డులను మ్యునిసిపాలిటీ యూనియనులను ద్రవ్యసహాయము చేయుమని ఈసభవారు కోరుచున్నారు.

ఖ. పుస్తక భాండాగారములను పఠనమందిరములను ౧౮౬౦ సం. ౨౧ నెం. ఆక్టు ననుసరించి ఉచితముగ రిజస్టరు చేయుటకు ప్రభుత్వమువారి నీ సభవారు కోరుచున్నారు.

3. క. గ్రంథాలయ సంఘములు తమ గ్రామము చుట్టునున్న గ్రామములలో గ్రంథాలయోద్యమమును వ్యాపింప కృషిచేయుటకు ఈసభవారు కోరుచున్నారు.

ఖ. ప్రతి గ్రంథాలయమువారును తమ సమీప గ్రామములందుగల తాళపత్ర లిఖితగ్రంథములను సంపాదించి తమయొద్ద భద్రపరచి భాషాభివృద్ధికి ప్రోత్సాహము కలిగింపవలెనని యీ సభవారు కోరుచున్నారు.

౪. క. ఈ తీర్మానములు ఆచరణలోనికి పెట్టుటకును గ్రంథాలయోద్యమమును ఈ తాలూకాయందు వ్యాప్తిచేయుటకును యీ దిగువ నుదహరించిన ప్రకారము ప్రతిసంవత్సరము కార్యనిర్వాహక సంఘము నేర్పఱుపవలెనని యీసభవారభిప్రాయపడుచున్నారు. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, గ్రంథాలయమున కొక ప్రతినిధి.

చ. పైకార్య నిర్వాహక సంఘము నేర్పరచుటకు వలయు సాధనముల సమకూర్చుటకు యాతగిరి లక్ష్మి వేంకటరమణ గారిని తాత్కాలిక కార్యదర్శిగా నీసభ వారేర్పాటు చేయుచున్నారు.

ట. పైసంఘ కార్యస్థానము కాకినాడయం దుంచుటకే సభవారు తీర్మానించుచున్నారు.

౫. క. తాలూకా గ్రంథాలయ కార్యనిర్వాహక సంఘమునకగు ఖర్చులనిమిత్తము తాలూకాలోని ప్రతి గ్రంథాలయము సంవత్సరమున కొక రూపాయికి తక్కువకాకుండ విరాళము లివ్వవలెనని యీసభవారు తీర్మానించుచున్నారు.

చ. ప్రతితాలూకా సంఘమువారునువత్సరమునకు తమరాబడిలో మూడవవంతునకు తక్కువకాని ధనమును జిల్లాసంఘమునకు సహాయము చేయవలెనని యీసభవారభిప్రాయపడుచున్నారు.

~~~~~~~~~~~

# హితార్థదాయినీ గ్రంథాలయము

## కపిలేశ్వరపురం - రామచంద్రపురం తాలూకా

౧౯౧౪ సం॥రమున ఈ గ్రామమందలి భాషాభిమానులచే ఇది ప్రథమమున అద్దెయింట స్థాపింపఁబడినది. కాని కొలఁది కాలముమాత్రమే శ్రద్ధతోఁ బనిచేసినది. అంతలో విషూచి గ్రామమునఁ బ్రవేశించి ఈసమాజముయొక్క సాంఘికులలో నిరువురను గ్రమింగుటయేఁగాక, ఓక కార్యదర్శిభార్యను, వేరొక కార్యదర్శి కొడలనుఁ దనవాతఁ వైచుకొనినది. అంతటితో నైన సమాజఁపు దుర్దినములు తొలఁగిపోలేదు. గ్రంథాలయ అధ్యక్షుఁడైన రామన్న గారను నాయనఁగూడ గ్రహణిరోగసంబంధితుండై జీవముం గోల్పోయెను. సమాజమిట్టి దురవస్థపాలైనను అద్దెయిచ్చుట తప్పదు గనుక, సాంఘికుల వలన కనూలైన సొమ్ములో నెక్కువ భాగము అద్దెక్రింద వ్యయమైనది. ఎక్కువ ఉత్సాహముతోఁ బనిచేయుటకు నైన ఏవరించిన యాపద లడ్డువచ్చినవి. తిరిగి అద్దెయిల్లు దుర్లభమయ్యెను. ఎక్కువసొమ్ముగూడ లేదయ్యెను. సాంఘికులందరును చెదరిపోయిరి. సమాజము మూర్ఛనందినది. అట్టిస్థితియందు గ్రంథాలయ మెట్లు జీవించునో యీశ్వరా! అని నిట్టూర్పువిడిచితిమి, విచారపడితిమి, దుఃఖించితిమి. సత్కార్యసంస్థాపకుండైనఁ బరమేశ్వరుఁడు మా మొఱ నాలించెను. మాకు ధైర్యముఁదెల్పెను. నిరుత్సాహపడఁగలదని మమ్ముదోఁధించెను. మాకొక యుపాయమును బోధించెను. ఆక్షణమునుండియును భాండాగార దురవస్థమూరమయ్యెను.

మా గ్రామమున రాజమందిర మొకటి శిథిలమైయుండెను. దానిని బాగుజేయింప వలెనని మాగ్రామ నివాసులుత్సాహపడ నారంభించిరి. అతరుణమున మేముగూడ మాయుత్సాహమును దెలిపి గ్రంథాలయమునకును స్వామికిని గూడఁ జోటుండునట్లు నిర్మింతమని యట్లొనర్చిన యుభయతారకమగు ననియు నిశ్చయించి అందరము నేకీభవించితిమి. కాని అపని నిర్వహించుటకు ధనము లేదు. ఆ ధనమును సమకూర్చుటకు యకరముల పైని చందావిధించుకొని, భూమిలేని సంపన్నులను దేహియని యాచించి, రమారమి రెండువేల రూప్యముల కిమ్మతు గలిగిన దివ్యమైన భవనము నిర్మించితిమి. నిర్మాణమునను జందా వసూలువిషయమునను ఎక్కువశ్రమపడిన భక్తవర్యుని నిట వివరించుటధర్మము. ఆయన శ్రీ మేకా జానకి రామయ్యగారనియే చెప్పవలయును. ఆయన శ్రమ ధన్యమైనది. ఇప్పుడాభవనమున నే హితార్థదాయనీపుస్తక భాండాగారము దివ్యముగాఁ బనిచేయుచున్నది. ౧౦౦ మంది కూర్చొనుటకు తగిన హాలున్నది. సభలు జఱుగుచున్నవి. పురాణకాలక్షేపముగా భారతముపయోగింపఁబడుచున్నది. భాండాగారమునందు ౧౬౫ ఆంధ్రగ్రంథములు, ౫ యింగ్లీషు పుస్తకములు గలవు. అయిదు పత్రికలు వచ్చుచున్నవి.

అనుదినము మధ్యాహ్నము 3 మొదలు ౬ గం॥ల వఱకు తెరువబడియుండును. అంద ఱుచితముగాఁ జదువుకొనుచుందురు.

—క్రొవ్విడి శేష వేంకటకాశీపతి, కార్యదర్శి.
~~~~~~~~~~~

# శ్రీకృష్ణదేవరాయ గ్రంథాలయము - బారువ

౧౯౧౪ వ సం॥ మే నెల ౧౦ వ తేదిన గంజాం జిల్లా బారువయందు తిత్తి బలరామయ్యగారిచే ఈ గ్రంథాలయము స్థాపింపబడి, గ్రామస్థులచే పోషింపబడుచుండెను. ఈ బలరామయ్యగారి తండ్రిగారగు తిత్తి బాలకృష్ణయ్యగారు ఈ గ్రంథాలయమునకు రు. ౧౫౦౦ లు వ్యయముజేసి, తమ స్వంతస్థలమునందు భవనమును గట్టియిచ్చిరి. ఈ భవనముయొక్క గృహప్రవేశము చతుర్థ ఆంధ్రదేశ గ్రంథాలయ ప్రతినిధుల మహాసభ సందర్భమున ౧౯౧౭ సం॥ మే నెల ౬ వ తేదీ మధ్యాహ్నము మందసా రాజాగారగు శ్రీ రాజా శ్రీనివాస రాజమణి రాజదేవువారి ఆధిపత్యము క్రింద జరగెను. ఈ భవనమునకు శ్రీబాల కృష్ణయ్యగారు ఈ "ట్రస్టుడీడ్డు"ను వ్రాసియిచ్చిరి:—

## ట్రస్టుడీడ్డు

బలిజ కులస్థుడను శెట్టి తిత్తి గోపాలస్వామిగారి కుమారుడును అయిన తిత్తి బాలకృష్ణయ్య అను నేను యీ దిగువ సరిహద్దులుగల నివేశనము ఆవరణముతోగూడ సుమారు పొడవు ౭౨ అడుగులు, వెడల్పు ౧౭¼ అడుగులు, కలిగినటువంటిన్నీ—వాయింటికి అనుకొని పడమటగా నా స్వంతసొమ్ముతో కట్టబడినటువంటిన్నీ సుమారు రు ౧౫౦౦-౦-౦ లు ఖరీదుచేయు హాలును, యీ గ్రామమందు నా కుమార్డు తిత్తి బలరామయ్యచే ౧౦-౫-౧౯౧౪ తేదీన స్థాపింపబడిన శ్రీకృష్ణదేవరాయ గ్రంథభాండాగారమునకు సర్వజనులయొక్క యుపయోగార్థమై యీ క్రింద వివరింపబోవు షరతులకు లోబడి ట్రస్టుయేర్పాటు చేయుచు ట్రస్టీలకు స్వాధీన పర్చినాను. ఇంకటినుండి నాకుగాని నా వారసులకుగాని యెట్టి స్వతంత్రహక్కులు లేవు. షరతుల వివరము యెన్నటికి తిగాయిదా చేయువారము కాము. హద్దులు:—ఉ. నూయి కాలువ, తూ. మా యిల్లు తా॥ గోడ, ద. రోడ్డు, ప. రాజమార్గం.

## ట్రస్టీలు

౧ అన్నాభు పరసురామరాను శాస్త్రీ బి. ఏ. బి. ఎల్. గారు హైకోర్టువకీలు, బరంపురం.

౨ శ్రీ జగన్నాథపాడి ఖడంగగారు మాల్కానాను. బారువ, 3 కుర్నాం వెంకటనరహరిబుచ్చిరామ లింగంపంతులు బి. ఎ. ఎల్. టి గారు, బరంపురం ౪ తిత్తి బాలకృష్ణయ్యవారియుడు గారు ౫ సోంభొట్ల వెంకయ్యపంతులు గారు.

వీరుగాక శ్రీకృష్ణదేవరాయ గ్రంథభాండాగారమునకు అప్పుడప్పుడేర్పడు అధ్యక్షుడు కార్యదర్శిగార్లు అడిషనల్ ట్రస్టీలుగ నుండవలయును. నా తదనంతరము నా వారసులలో ముఖ్యుడు ట్రస్టీగ నుండవలయును. ట్రస్టీలలో ఖాళీవచ్చినప్పుడు మిగిలిన వారు తమ యిష్ట ప్రకారము పూర్తి చేయవచ్చును.

## షరతులు

(౧) ఈ హాలును శ్రీకృష్ణదేవరాయగ్రంథభాండాగారమందిరమని పిలువవలెను.

(౨) ఈ మందిరమునందు గ్రంథభాండాగారము నుంచవలెను.

(3) సమస్తవిషయములలో జ్ఞానాభివృద్ధి కలుగుటకును, నీతిని పెంపొందించుటకును, దుర్నీతి దురాచారములు తొలగుటకును అనుకూలములైన యుపన్యాసములు ప్రసంగములు మొదలైనవాని కొరకును, మహనీయులను సత్కరించుట కొరకును, ఈమందిరము నుపయోగించుకొనవచ్చును.

(౪) దుర్నీతి ప్రోత్సాహపరచునట్టి గాని, జాతిమతద్వేషములను పురికొల్పునట్టి గాని, రాజభక్తిని పోగొట్టునట్టిగాని సభ లిందు జరుపబడకూడదు.

(౫) ఈ హాలునందు సత్కార్యములు చేసినవారియొక్కయును, సద్వర్తనము గలవారియొక్కయును, పటములనుంచవచ్చును. బూతుబొమ్మలను దిగంబర రూపములను బెట్టగూడదు.

(౬) ఈ మందిరమును ట్రస్టీలు ఎప్పుడును విక్రయించకూడదు. తాకట్టు పెట్టకూడదు. దీని స్వంత ధనముల నుపయోగించకూడదు. అద్దెకు గాని వేరువిధముగ గాని ఇతరులకు ఇవ్వకూడదు. ఆవశ్యకములయిన మార్పులను అభివృద్ధులను జేయవచ్చును.

(౭) ఈ మందిరమునకు జేయవలసిన మరమ్మతు వగైరాపనులు గ్రంథభాండాగార కార్యనిర్వాహక సంఘము వారే బాగుచేయుచుండవలెను.

(౮) పయిని తెలియబర్చిన షరతులు ట్రస్టీలు క్రమప్రకారము అసలు జరిపించక పోయిన యెడల, లేదా పయి యుద్దేశములకు వ్యతిరేకముగ జరిగించిన యెడల, అప్పటికి నేను గాని నావారసులు గాని గంజాం జిల్లాలోని యితర పుస్తకభాండాగార కార్యనిర్వాహక సంఘముల సలహాలనుబొంది, ఆవశ్యకమయిన యెడల స్వతంత్రాధికారముతో ట్రస్టు ఆస్తిని స్వాధీనపరచుకొని కార్యములు చక్కబెట్టి, తిరిగి నూతన ట్రస్టీల నేర్పరచి వారికి ఆస్తిని స్వాధీనపర్చవలెను.

## నూతన గృహ ప్రవేశ మహోత్సవ సమయమున శ్రీ మందసా రాజావారిచ్చిన యుపన్యాసము.

ఈగ్రంథాలయమునకై మ. రా. రా. తిత్తి బాలకృష్ణయ్య నాయుడుగారి వలన, కడు దయాపూర్వకముగా నొసగబడిన ఈమందిరముయొక్క గృహప్రవేశ మహోత్సవమునకు రాగ్గలుగుటకు నాకెంతయు సంతసమగుచున్నది.

ఈయౌదార్యవంతుని మీరందరెరిగియే యున్నారు. మరియు సర్వజనోపయోగమునకై నీయన ఈమందిరము నిచ్చుటకు ఉద్దేశించుట చాల సంతోషకరముగా నున్నది. గ్రంథభాండాగారమునకు ఈవసతిని కల్పించినందులకు ఈయన కుమారుడును గ్రంథాలయ గౌరవ కార్యదర్శియునగు బలరామయ్యగారికి చాల ఖ్యాతి జెందును. ఈ గ్రంథభాండాగారము చేయు ఘనకార్యములను నే నెఱుగుదును. ఈ గ్రంథాలయమునుండి గ్రంథములు చుట్టుపట్ల గ్రామములకు తీసికొనిపోయి అన్నితరగతుల జనులకును బాగుగా చదివి తెలిపి యిచ్చునట్టి ఏర్పాటులు గావింపబడినవి. జనసామాన్యముయొక్క విద్యాభివృద్ధిని ప్రోత్సాహపరచుట ముఖ్యకర్తవ్యము. పల్లెలయందు గాని పట్టణములందు గాని గ్రంథాలయములు జ్ఞానాభివృద్ధికి ప్రబల సాధనములు. పూర్వకాలమున గ్రామములయందలి ప్రజలు, పురాణములు ఇతిహాసములు మున్నగు గ్రంథములను చదివించి వినుచుండెడివారు. ఆకాలమున రాజులయొక్కయు జమీందారులయొక్కయు పోషణక్రింద అనేక గ్రంథములు సమకూర్పబడుచుండెను. ఆస్థాన పండితులు గ్రంథములను వ్రాయుటయు, సేకరించుటయు జేయుచుండిరి. రాజులకు వాఙ్మయపోషణమెల్లప్పుడొక గొప్ప క్రీడగానుండెడిది. ఈకాలమునకూడ రాజుల యమూల్యాగారములందు మిక్కిలి ఉపయోగకరములైన పురాతన వ్రాతప్రతులనేకములు గాననగును. ఇవి జాగరూకతతో పరిశీలింపబడవలెను. ఆ కాలమున జనసామాన్యముయొక్క విద్యావశ్యకతను రాజులు ఎల్లప్పుడు తమ మనస్సులయందుంచుకొనుచుండిరి. స్థితిగతులిప్పుడు మారినవి. మనమిప్పుడు ఎక్కువ పూనికతో పనిచేసి జనసామాన్యమును మనవెంట అభివృద్ధిమార్గమున దేవలసియున్నది. దేశమునందలి సామాన్యజనులందరును విద్యావంతులు గానియెడల మనమెట్లు సమర్థియందును పలుకుబడియందును అభివృద్ధినిపొందగలము? ఈ గ్రామములయందలి రైతులు మున్నగు జనసామాన్యమునకంతకును జ్ఞానదీపికను ప్రసాదించుటకై మనమెల్లరము శక్తివంచనలేక పాటుపడవలసియున్నది. జనసామాన్యము విద్యావంతులైనగాని ఏవిధమైన అభివృద్ధియు జరుగనేరదు. ఎట్టి విద్య నివ్వవలయును? ఏవిధముగా నివ్వవలయును? అను విషయములను శ్రద్ధతో పరిశీలించి ఉపయోగించవలయును

పల్లెటూళ్లయందు గ్రంథాలయముల ప్రయోజనము బహువిశేషము. అవి బీదలను నాగరికులనుగ జేయును. జనులెల్లరును పుస్తకములను గాని వార్తాపత్రికలను గాని కొనిచదువజాలరు. ఇతరదేశములలో, ఔదార్యవంతుల కలనను, ప్రభుత్వము వారి వలనను స్థాపింపబడిన గ్రంథాలయములు జ్ఞానాభివృద్ధికి మిక్కిలి ఉపయోగకరములుగా

మన్నవి. అమెరికా దేశమున, కార్నిజీమహాశయునిచే స్థాపింపబడిన ఉచిత గ్రంథాలయములును, బరోడా యందు యశోవంతుడగు తత్సంస్థానాధీశునిచే నెలకొల్పబడిన ఉచితగ్రంథాలయములును, ఇట్టి ఉన్నత సత్కార్యములకు ప్రబలమైన తార్కాణములు.

గంజాము మండలముల, ఉత్కళ, ఆంధ్రవాఙ్మయముల యభివృద్ధికై ఇట్టి గ్రంథాలయము లేర్పాటగుచుండుట చాలసంతోషకరము. ఉత్కళ, ఆంధ్రగ్రంథములను బాగుగా పరిశీలించి సేకరింపవలెను. ఇట్టి గ్రంథాలయములు దట్టమైన వలనుబోలి,ఒకదానికొకటి దృఢసంబంధమును గలిగి దేశమున విరివిగా స్థాపింపవలెను. ఈగ్రామమున మ॥రా॥శ్రీ, వెంకయ్యపంతులుగారు జేయుచున్న సత్కార్యము మీరందరెరిగినదే. ఆయనతోడను,ఖడంగాగారితోడను పరిచయము కలిగియుండుటయే మిగుల ఆనందకరము. ఈగ్రంథాలయమునకు జయమగుగాక. ఈ గ్రామమున జరుగుచున్న ఆంధ్రదేశ గ్రంథాలయమహాసభకు మనరాజధానిలోని వివిధభాగములనుండి, ముఖ్యులగు ప్రతినిధులు విచ్చేసిన ఈశుభతరుణమందు బాలకృష్ణయ్యనాయుడుగారు ఈమందిరమును దానము జేసినదెంతయు సమంజసముగానున్నది. దాతను దైవము ఆశీర్వదించును, ఇతరపౌరులును ఈయౌదార్యవంతుని మార్గదర్శకత్వ మనుకరించి, గ్రంథములు, ఇంకనితరములగు యవసరమైన సామగ్రులు మొదలగు వానిని దయచేసి, ఈజిల్లాలోని వివిధభాగములయందు జ్ఞానమును వ్యాపింప జేయుటకై ఈగ్రంథాలయమును మిగుల ఉపయోగ కరమయిన సంస్థాపనముగ నొనర్తురని నమ్ముచున్నాను.

~~~~~~~~~~

# శ్రీకృష్ణదేవరాయల పుస్తకనిలయము

## చెరుకుమిల్లి - భీమవరం తాలూకా

ఈ గ్రామము భీమవరం తాలూకాలోచేరి, భీమవరమునకు పశ్చిమముగా సుమారు ౧౦ మయిళ్లదూరమున, ఈ తాలూకాకును కైకలూరు తాలూకాకును సరిహద్దుగా ఉన్న ఉప్పుటేరునకు తూర్పుటొడ్డున గలదు. జనసంఖ్య ౧౬౦౦. ఆయకట్టు ౧౬౫౦ యకరములు. సర్కారునకు రు ౭౫౦౦ లు శిస్తు చెల్లుచున్నది. ఇచ్చట క్షత్రియులే ప్రాముఖ్యులయియున్నారు. ఈ గ్రామమున ఆంగ్లేయభాషాజ్ఞానము లేకపోయినను పూర్వకాలమునుండియు పురాణపఠనాసక్తిగలిగి అక్షజ్ఞానముగలవారు ఉండుచువచ్చిరి. ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము వ్యాపించిన నాటినుండియు ఈ గ్రామమున పుస్తకభాండాగారము నొకదానిని నెలకొల్పనుద్యుక్తులమయి యుంటిమి. తుదకు శ్రీ వల్లూరి సూర్యనారాయణరావు పంతులుగారి అధిపత్యముక్రింద నలనామ సం॥ వైశాఖ బ॥ నవమి గురువారమునాఁడు ఈ పుస్తక భాండాగారమును స్థాపించితిమి. దీనిని స్థాపించి నేటికి సుమారు ౧౧ మాసములు మాత్రము గడచినవి. ౫౭ గురు సభ్యులుగలరు. ఆఱు మహాజనసభలు మాత్రమే జరుపబడినవి. ఈ సభలకు సగటున ౬౨ రు హాజరైరి. ౧. ఆంధ్రపత్రిక ౨. దేశమాత 3. కృష్ణాపత్రిక అను ఆఱు పత్రికలను తెప్పించుచున్నాము. స్త్రీలకు గృహలక్ష్మి పత్రికను తెప్పించుచున్నాము. రెండు గ్రంథమాలలను తెప్పించుచున్నాము. తీరికకాలములయందును రాత్రులయందును గ్రామస్థులచే గ్రంథములును పత్రికలును పఠింపబడుచున్నవి. ఉదారవంతులచే రు ౭౨లు ఖరీదుగల ౧33 ఆంధ్రపుస్తకములు బహుమతిగా నొసంగబడినవి. మేము రు ౨౦-౧-౯ ఖరీదుగల 3౧ గ్రంథములను మాత్రముకొంటిమి. సగటున దినమునకు హాజరు ౧౫ గురు. చదివినపుస్తకములు ౧౮౦. ఇండ్లకు తీసుకొన్న పుస్తకములు ౧౬. ఇదియునుగాక శ్రీ మహాభారతమును, ఉత్తరరామాయణమును, ప్రాచీనపద్ధతిని పురాణశ్రవణము జరిగినది. ఈ వత్సరము చందాలవలనను విరాళముల వలనను రు ౬౭-౧-౦ వసూలైనవి. అందులో పత్రికలు, పుస్తకములు, బల్లలు మొదలగువానికిగాను రు ౬౪-౧౦-3 వ్యయమయ్యెను; గాన నిలువ రు ౨-౬-౯ లు.

——పెనుమెత్స చిట్టి తిరపతిరాజు, కార్యదర్శి.
~~~~~~~~~~

# ఆంధ్రవాణీ గ్రంథాలయము - ఇనగల్లు

## "నళ" నామ సంవత్సర వృత్తాంతము.

ఏదేశమైనను, విజ్ఞానపుంజములచే విలసిల్లినగాని నభివృద్ధిఁ బొందజాలదు. అట్టి విజ్ఞానబీజమును, మనస క్షేత్రములందు నాటుటకు విద్య ముఖ్యసాధనము. విద్యాసౌకర్యము జనసామాన్యమంతటి కుచితముగాఁ గలుగఁజేయుట్ల రాజశాసనాధీనము. అట్టి రాజశాసనాధికారమంతయు నధికార శాసనసభ్యులకేము. అధికార శాసనసభ్యులందఱు జెప్పరు బ్రిటనువారలు. వారు హిందూదేశపుఁ బ్రజల నంధకారకూప ముండొక్కపరిఁ వేయుట సాధ్యమా యని ప్రశ్నించుచుందురు. ఇట్టి స్థితిలో భారతీయు లభివృద్ధిఁజెందు టెట్లుఁ బొసఁగును. భారతజాతి యిదివర కొకప్పుడు నాగరకాగ్రగణ్యమై వెలసినదిగాని, మృగప్రాయులవలె సంచరించినది గాదు. కావున తన పూర్వౌన్నత్యమునకై ప్రయత్నించుట విధి. అందులకై నితరులఁ జేజాచుటవలన ప్రయోజనముండదు. కాన,స్వయంకృషి విహితధర్మము. ఐక్యమైకమత్య బలసాధనముచే సంభవము. అద్దానిఁ జేకూర్చుటకు గ్రామపంచాయతీ సంఘములు బునాది. వానిని సమకూర్చ, జనసామాన్యమునకు విద్యనిచ్చి జ్ఞానోత్పత్తి గలిగించి యభివృద్ధినొందింపగలవి గ్రంథాలయములని జెప్పదగు. ఇంతయేల దేశీయమహాజనసభ ముప్పదొకటి వత్సరములనుండియుఁ జేయజాలని పనిని తగుమైన కార్యనిర్వాహకులును, ప్రోత్సాహకులును అభివృద్ధికిఁ దేగలిగిరేని, కొలది వత్సరములలో గ్రంథభాండాగారములుఁ జేయఁగలవని ఘంటాపథముగా నుడువదగును. ఇట్టి యాశయముల మదినిడుకొనియే ఈ గ్రామమందుఁ బ్రప్రథమమున రాక్షసనంవత్సరపు గవ పటిదినములయందు, ఆన్ధ్రభాషా సేవకుఁడగు నొక యువకునికలన, ఆన్ధ్రవాణియను పేరిట నొక పుస్తక భాండాగారము నెలకొల్పఁబడినది. అయ్యది తొలుత నొక్కనిచే ప్రారంభింపఁబడినను, మంచికార్య మగుట వలన మరువత్సరమందుఁ గొందరుయువకు లాతనికిఁ జేదోడు వాదోడైబనిసేయుటవలన నభివృద్ధికొచ్చునూచనలఁగన్పట్టెను. అట్లే ౧౯౧౬ సంవత్సరమందనగా నల వత్సర మార్గశీర్షమునుండి గ్రామనాయకులగుఁ బెద్దల మనములఁగూడ నాకర్షించి, నేఁడీ సరస్వతోత్సవముఁ జేయగల యంతటి స్థితికి రాగలిగినది. అయిన నీయాన్ధ్రవాణీ గ్రన్థాలయము మన గ్రామమున నొక యపూర్వ విజ్ఞాననిధి గాగలందుల కింకను గ్రామమందున్న వారందరి సాయముఁ గావలసియున్నది. కాన, గ్రామవాసు లందఱుఁ దగువిధమైన ప్రోత్సాహ మొసంగెదరు గాక యని విన్నవించుచున్నాను.

ఒక యాన్ధ్రభాషాసేవకుడు రు ౨౩౭-౮ ల విలువ గల ౨౬౧ గ్రంథముల నుచితముగా నిచ్చి యమూల్య సహాయమును జేసెను. ఇంకను నలుగురుయువకులు ౨౦౨ గ్రంథముల నిచ్చిరి. చందా ధనమువలన కొన్న గ్రంథములు ౨౧. వెరశి ౪౮౪ గ్రంథములు గలవు. గృహములకు గ్రంథములను దీసికొనిపోయిన వారి సంఖ్య ౨౩౨. ప్రతిదినమును వచ్చు పాఠకుల సంఖ్య ౬. ఈ వత్సరము ఆదాయము రు ౩౦-౫-౩; వ్యయము రు ౩౦-౨-౩. మూడుపత్రికలు దెప్పింపబడుచున్నవి.

—రత్నాకరం వెంకటప్పయ్య,
అధ్యక్షుడు.

## కన్నెముద్దు.

నన్నుగాంచినయంత నానాతి మదము
లోఁద కన్నులుమెఱయ ముద్దాడియుండె,
తీపివస్తుల గొనిపోవు దినములార!
వదలగాబోదు డిద్దాని వ్రాసుకొంట!

ఘోరశోకాంబు నిధిలోన గూలితినుడు,
కలిమియారోగ్యమును నెడుగం టెననుడు,
మోదమునకింపెను వయస్సుముదిరెననుడు,
కాని కడపటజేర్చు డీకన్నెముద్దు!

* అధికార్ల సూర్యనారాయణ మూర్తిగారు

# "భారతీయుల ప్రార్థన"

## దేశీయమహాసభలో చదువఁబడిన
## సర్ రవీంద్రనాథుని గీతమునకు ఆంధ్రీకరణము

దేవదేవ! ఈ జీవయాత్రానగంబు
మా కనుగ్రహించితి వీవు మహిమ మీఱ;
శక్తిసామర్థ్యముల నెల్ల జతనుపఱచి
కూర్చు నీ గౌరవము నిల్పుకొనఁగనిమ్ము,
మా యునికి నాశ్రయించియే నీ యశస్సు
మలయుచుండెడి నను మాట మఱవవలదు.
అస్మదాత్మల నిర్జించు నధికృతులను
ధిక్కరించి నీకై నిరోధింతుమయ్య.
దాస్యమునకు లోఁబడెడి హృదయములందు
నీ ప్రతాపంబు చల్లారి నివురుగమ్ము;
దుర్బలత యాత్మ వంచించు ద్రోహి గాన,
జీవబలము క్షీణించిన తావకాధి
పత్య మన్నృతదేవతపాలఁ బడు భయార్తి;
ఈ యథార్థమ్ము మమ్ము గ్రహింపనిమ్ము.
పట్టి మము బానిసలఁ జేయు పట్టులందు
ఎట్టి సుఖమునైన నిరాకరించుటరువు,
అరయ వేసవి మధ్యందినార్కునట్లు
నీకు మా దుఃఖ మెత్తి యందిచ్చుటకును
ఊర్జితం బగు శక్తి మా కొసఁగుమయ్య;
మా సమారాధనంబు సమస్తగతుల
ప్రేమ వికసించి పనిలో ఫలించునట్లు
దృఢతమప్రత్యయము ప్రసాదింపుమయ్య;
ఇదియె మా ప్రార్థనంబు లోకైకనాథ!
చుట్టుపట్టులవారెల్ల వట్టిదుమ్ము
కొఱకు దీక్షనై పోరాడుకొనుచునుండ,
సారవత్త్రేపుతత్త్వంబు గారవించి
అనదలను దుర్బలులను నోనాడకుండ
మేము వర్తించెదముగాక యో మహాత్మ!
స్వార్థపరు లయ్యు, నీకొఱ కని వచించి,
పోరి యొండొరుఁ జంపుచున్నారు వారు;
భ్రాతృమాంసబుభుక్షాప్రభావమునను
వారు పోరాడుకొనుచున్నవార, లింక
తావకాగ్రహంబు నెదిర్చి చావఁగలరు.

సత్యయోగ్యతలకు మానవగత మైన
యశ్వరాంశకు ప్రత్యగాత్మైక్య మనెడి
మహిత తావక దివ్యసామ్రాజ్యమునకు
ధన్య మాత్మీయ మైన స్వాతంత్ర్యమునకు
శక్తి మీఱంగ సకలకష్టముల కోర్చి
స్థిరతరంబుగ మేము నిల్చెదముగాక!
మా ప్రయాణంబు ప్రారంభ మయ్యె నిదిగో!
నావికాగ్రణి! నీకు వందనము లయ్య;
అల్లదె తుపాను పట్టె భయంకరముగ,
అల్లకల్లోలముగ నున్న యలల కంటె?
ఐన, సాగింతుమయ్య ప్రయాణ మిపుడె.
హానికరమైన యంతరాయంబు లెన్నొ
దారిలో వేచియున్నవి దారుణంపు
టార్తి కలిగింప, అదియు నీ కర్పితంబు.
'భయము పోఁగొట్టు' మనెడి విహ్వలనినాద
మదె తుపాను మధ్యమునుండి విదిత మయ్యె.
అలసుల నిమిత్తమై మేము నాలసించి
వెనుక పడకుండెదముగాక! భీతివలన
సందియంబులవలనను సత్వర మగు
కాలగతి మందగిల్లక క్రాలుఁగాక!
కాలమును కార్యభరమును గాంచు కొలఁది
నీకు మాకును సములై నెగడుచుండు;
శాశ్వతం బైన జీవంపు సాగరమున
సంచలించెడి నీదు శ్వాసంబ కాదె
చావుబ్రతుకులు? సర్వలోకావనాఢ్య!
కొలఁది సాయఁబు సమకూర్చుకొనుచు కొలఁది
హితుల మెలమెల్ల నెట్లొ లెక్కించుకొనుచు
స్వాంతమందున విసిగి వేసారనీక,
అహరహంబును నీవు మాయండ నుండు
వాఁడ వనియును మేము నీవార మనియు
ఎల్లయెడల నెక్కుడుగ మ మ్మెఱుఁగనిమ్ము!

— కాళ్లకూరి గోపాలరావు.

# గ్రంథవిమర్శనము

## ౧. అపూర్వసంఘసంస్కరణము. *

ఆంధ్రభాషయందు హేళనకావ్యము లంతగా లేవు. కాని, కాలక్రమమున నాంగ్లవాఙ్మయసంసర్గము వలన నేఁడు సారస్వతమహావృక్షమునఁ గూడ నీ శాఖ తలయెత్తుచుండుట యెంతయు సంతోషదాయకము. హేళనకావ్యము లన నేమి? మానవస్వభావమును గాని మానవకార్యములను గాని విమర్శించి వానిని హాస్యాస్పదము గావించు గద్యపద్యకావ్యములకు హేళనకావ్యము లని పేరు. కాని, వ్యక్తుల నిరసించుచు, కేవలము వచ్చి తిట్లకుఁ గడంగు గ్రంథమున కీ నామ మన్వయింపఁజాలదు. ఇట్టి గ్రంథము సారస్వతమున నొక స్థానము నాక్రమింప ననర్హము. కావున హేళనకావ్యమునకు చక్కని భావయు సరళ మగు హాస్యరసమును ప్రధానలక్షణములు. సంఘమునందలి లోపముల నారసి, వానిని వెల్లడిచేసి, తన్మూలమున దాని నైతికసంరక్షణము గావించుట హేళనకారుని విధ్యుక్తధర్మము. కావున, అతను సంఘవ్యక్తుల శీలపరిశీలనము చేసి, వారి వారి లోపముల నెల్ల లోకమునకు తెల్లము గావించి, వారియెడల నెల్లరకు నసహ్యము నిరసనము వొడము నట్లు చేయును. ఇందు మూలమున హేళనకావ్యములు వినాశకారకములే గాని, ఉద్ధారకసాధనములు గావని విస్పష్టము కాఁగలదు. నూతనసౌధనిర్మాణమునకు పూర్వము ప్రాచీనగృహమును కూలఁద్రోయు శిల్పికారుని రీతి హేళనకారుఁడు కూడ సంఘోద్ధరణమున కత్యవసర మని మనము గుర్తింపవలెను. ఇతని పరిహాసోక్తులవలన మానవులు తమ వర్తనమును సవరించుకొందు రనియు, అందు మూలమున వారికి నైతికాభివృద్ధి చేకూరు ననియు తలంచుట వట్టి భ్రమ. ఇందులకు మన యనుభవజ్ఞానమే తార్కాణము. కాని, ఒక వ్యక్తియందలి లోపముల నితరు లనుకరించి సంఘమును చెఱుపకుండఁగ నిరోధింప యత్నించుటయే అతని ముఖ్యధర్మము. కావున, ఇట్టి హేళనకారుఁడు "ఖండనముతో పని చాలింపక నన్మార్గదర్శనము కొంత కలిగింపవలె" ననువారు అతని ధర్మముల నెఱుంగ రని వేఱె చెప్ప నవసరము లేదు. మరియు, హేళనకారుని ప్రధానలక్షణము నిష్పక్షపాతబుద్ధి. అతఁ డిట్టి పక్షపాతవిరహితభావముతో దేశమందలి లోపముల నెదకి లోకమునకు వెల్లడింపవలయును. అందు మూలముననే అతని కెవ్వరును సరిపడరు. ఏ యుద్యమమును అతని సంపూర్ణామోదమును పడయఁజాలదు. అందఱు మానవులయందును అన్ని యుద్యమములయందును కొంత సత్యమును, కొన్ని లోపములును ఉండును గావున అతఁడు ఆశయాపూరితమానసుఁడై అందలి లోపములఁ దొలఁగించు నుద్దేశముతో వానిని జనులకు తేటతెల్లము గావింపవలయును. అందు మూలమున "వీరి కెవ్వరును సరిపడినట్లు గానము ... వీరికిఁ బ్రాఁతది పనికిరాదు, క్రొత్తది మొదలే గిట్టదు; ఇఁక నేది పనికివచ్చునో మనకుఁ జెప్పరు." అను విమర్శనము అసంగతము, అప్రస్తుతము" లని యెల్లరకును బోధపడఁగలదు.

ఈ "అపూర్వసంఘ సంస్కరణ" మను గ్రంథ మొక హేళనకావ్యము. ఆంధ్రదేశమున ప్రఖ్యాతిఁ గాంచిన శ్రీ కాళ్లకూరి గోపాలరావు గారీ గ్రంథమును రచించిరి. ఈ గ్రంథ మన్ని విధముల నపూర్వముగ నున్నదని చెప్ప నగును. ఏల యన, గ్రంథకర్తలు సాధారణముగ తమ గ్రంథములకు సానుభూతిపూర్వకము నుపోద్ఘాతమును వ్రాయించి, ప్రచురించుకొనుచుండ, వీరు స్వతంత్రభిన్నాభిప్రాయభూయిష్ఠముగా శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు వ్రాసిన పీఠికను చేర్చియుండిరి. మరియు, వీ రంతటితో తృప్తిఁ జెందక, దానికి తగిన ప్రత్యుత్తరముగ "స్వవిషయము"ను మిగుల సామర్థ్యముతో వ్రాసి, నూతనపంథ ననుసరించిరి. ఇఁక ముఖ్యమైన విషయమేమనః ఆంగ్లమున "స్టైలు" ననుసరించి, వ్రాయఁబడిన స్వతంత్రహేళన

* ఈ గ్రంథము కలయువారు గ్రంథకర్తగారికి ౮, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మద్రాసు. అని వ్రాయవలెను. వెల ౮ అణాలు.

కావ్యములలో నిది మొదటి దని చెప్పవచ్చు. ఇదివఱకు వేమన అద్వితీయ హాస్యరసగ్రంథమును వ్రాసి యున్నాఁడు. కాని, అతనికి ఆంగ్లవాఙ్మయ సంసర్గము లేదు. రా॥బ॥ వీరేశలింగము పంతులు గారు స్విఫ్టు ననుకరించి "సత్యరాజా దేశయాత్రలు" మున్నగువానిని రచించిరి గాని, అవి స్వతంత్రగ్రంథములు గావు. మన కవి గారిని ఆంగ్లభాషాసంసర్గము మాత్రమే యీ గ్రంథరచనకు పురికొల్పిన దని మా యభిప్రాయము కాదు. వేమనశతకమును వీ రనుకరింప యత్నించినట్లు గ్రంథమున ననేక స్థలముల సులభముగఁ గానవచ్చుచున్నది. "చంద్రరేఖావిలాపము"ను వీరు సంస్కరించి ప్రకటించుటచే, వీరి కీ రచన పట్టుపడుట కా గ్రంథము కొంత తోడ్పడిన దని యూహింపవలసి యున్నది. ఇఁక వీరేశలింగము గారి ప్రహసనముల ప్రభావమునుగూర్చి వేఱుగ వ్రాయ నవసరము లేదు.

మతము, సంఘము, రాజకీయములు, వ్యక్తులు—ఇవి హేళన కావ్యములకు లక్ష్యములు. ఆంగ్లసారస్వతమున నిందులకు ప్రత్యేకముగ నుదాహరణములగు హేళనకృతులు గలవు. కాని, మన వాఙ్మయమున ఈ శాఖ బాగుగ వృద్ధి నొందకుండుట వలననో, మరి యే కారణముననో, ఆంధ్ర హేళన గ్రంథముల యందు, రాజకీయములు తక్క ఇతరలక్ష్యము లన్నియు సమ్మిళితములై నవి. "అపూర్వసంఘసంస్కరణము"న నున్నవింత యే మన: ఈ నాలుగు లక్ష్యములను ఇందు కవి గారు మిశ్రితము గావించి యీ గ్రంథమునకు "అపూర్వ" నామము సార్థక మగుట కింకొక యవకాశము కల్పించిరి. ప్రత్యేకవ్యక్తుల శీలము దెలుపు భాగములును, సంఘదుస్స్థితిని తెల్లము గావించు పద్యములును, రాజకీయపరిస్థితులను గూర్చిన కవి యభిప్రాయములును, మతవిషయిక విమర్శనములును, వేయేల, దేశక్షేమకరములగు సమస్తచర్చలును ఇందు కానవచ్చుచున్నవి.

ఇందు తోఁక గోల్పోయిన నక్క తోడినక్కలను తోఁకలు తెగఁగోసికొనుటకు ప్రోత్సాహపఱచుటయు, అందుల కొక వృద్ధజంబుకము ప్రత్యుత్తర మొసఁగి ఆవాక్యముల పరిగణింపరా దని యెల్లర నిరుత్సాహపఱుచుటయు కథాసారాంశము. హిందూదేశస్థితిగతులను గాంచి, దేశోపకారమున కని స్వార్థపరత్వచింతతో కృషి సలుపువారల నీ కవి గారు గ్రంథమున తీవ్రముగ నిరసించిరి. వీ రీ ఖండనమును సదుద్దేశముతో చేసిరని యీ క్రింది పద్యమువలన వ్యక్తము కాఁగలదు.

"ఆ. దీనికతన నెవ్వఁడేని యాత్మ ప్రవ
ర్తనము సంస్కరించుకొనినఁ జాలు;
అదియె నా శ్రమమున కక్షరలక్షలు
గాఁ దలంచి ముదము గాంచువాఁడ."

ఈ గ్రంథమున కవి గారు స్వార్థపరత్వమును మనసునకు తనివి తీర నిందించి, ఆత్మలాభమునకై దేశసేవ చేయువారలను నిందించిరి. ఇంతే కాని, దేశసేవ గావించువా రెల్లరును స్వార్థపరులే యని తలంచి, వారి నెల్లరను కవి గారు తమ హేళనమునకు గురి చేయలేదు. మరి వీరు కార్యశూరులనె గాని వాక్శూరులను లక్ష్యము చేయరని

"వ్రాఁతలను కూఁతలను గాదు చేఁతలందు
చూపవలయును మన మనశ్శుద్ధి నెపుడు"

అను మాటలవలన తెల్లమగుచున్నది.

వీ రింతటి సద్భావముతో గ్రంథరచనకు పొందలిడినను, మానవస్వభావమును పరిశీలించిన కొలఁది దాని యెడల వీరికి గౌరవము తగ్గి అందు సుగుణములే లేవనెడి యభిప్రాయము వీరికి కలిగినట్లు ఈ గ్రంథమున నచ్చటచ్చటఁ గానవచ్చుచున్నది. ఈపద్యమును తిలకింపుఁడు.

తే. "ధూర్తులును స్వార్థపరతైకమూర్తు లరయ,
ఎన్నఁడును మానవుల విశ్వసింప రాదు;
అన్నిటను వారు లోకమం దధమగుణులు"

ఇంతటి వాక్పారుష్యమున కవి గారు మానవస్వభావఖండనము గావించుట కేమి కారణమో? మానవసంఘ మింతటి దుస్స్థితి కింకను రాలే దనియు, అట్టి యవస్థ దానికి సంభవ మైనయెడల నది సంస్కరింప దుస్సాధ్య మనియు మా యభిప్రాయము. మానవునియందు దైవస్వభావానుగుణము లగు సుగుణము లుండుటచేతనే ప్రపంచము నిలిచియున్నది.

కాని, ఈ పుస్తకము దుర్నీతివర్తనమునకు కుటిల స్వభావమునకు వజ్రాయుధమువంటిది. దీనిని చదివి యెల్లరును తమయందలి లోపములను గుర్తించునంతటి సామర్థ్యముతో కవి గారీ గ్రంథమును వ్రాయుటయే ప్రశంసనీయము. ఇందు కవి గారి చేతినుండి తప్పించుకొనిన వారు గానరారు. న్యాయవాదులను గూర్చి,

"న్యాయవాదుల కగు సత్కృత్యములు గూడ
వాదమును ధర్మమును బాధపఱచు టొప్ప."

అని వ్రాసియున్నారు. నాగరకమును గూర్చి,

"లేని యోగ్యత ప్రకటింపఁబూను టొండె
నాగరకలక్షణాగ్రగణ్యము తలంప."

అని సెలవిచ్చియున్నారు.

జాతిభేదములను కవి గారిట్లు నిరసించిరి.

తే. "వర్ణభేదంబున సజాతివైర మూని
సర్వదా పరస్పరవినాశనము గోరి
కారణంబులు వెదకెడి క్రూరమతులు."

ఈ విధముగ నెల్ల విషయంబులను గూర్చియు తాను స్వతంత్రాభిప్రాయములను నిర్భయముగ నొసంగి, పిమ్మట భాషాప్రయుక్తరాష్ట్రవిభజనము (౨౨౦) జాతీయ విద్యావశ్యకత (౧౨౫) మున్నగు ముఖ్యవిషయములను సరసముగ వివరించిరి.

శైలివిషయమున నీగ్రంథమున కత్యుత్తమస్థానము నొసంగక తప్పదు. పద్యములు సహజధోరణిం గలిగి ధారాళముగ నున్నవి. నప్పిడి పద్యములు మచ్చునకైనను గానరావు. ఈ గ్రంథమునందలి పద్యము లన్నియు సామెతలుగ వాడ నను వగుటయే కవిత్వశైలి ప్రాశస్త్యమును వెల్లడించుచున్నది. ఈ క్రింది పద్యపాదము లిందుల కుదాహరణములు.

"కాలు జాఱిన నగువారు కారె యొరులు? (౧౦)
"క్రొత్త వింత ప్రాత రోఁత కాదె?" (౧౬)
"ఆత్మగౌరవ మొకటి నిరాకరింప
ఖ్యాతికై చేయరాని గార్యంబు లేదు." (౯౦)

ఇట్టి వెన్నియో గలవు. గ్రంథవిస్తరభీతిచే నింతటితో విరమించితిమి.

ఇందు ఆంధ్రభాషయందలి సామెతల ననేకములను కవి గారు ధారాళముగ నుపయోగించియున్నారు. ఇందు ముఖ్యముగ నొక విషయమును గుర్తింపవలసియున్నది. పద్యములయందెచ్చట నొక్క యనావశ్యకమగు పదమైనను గానవచ్చుటలేదు. ఏ పదమును తొలఁగించినను పద్య మర్థము కాదు. ఇది గొప్ప లక్షణము. కావుననే, యిందలి పద్యము లొక్కప్పుడు తిక్కనశైలిని జ్ఞప్తికిఁ గొనివచ్చుచుండును.

ఇట్టి యుద్గ్రంథమును రచించి శ్రీ గోపాలరావు గారు ఆంధ్రవాఙ్మయాభివృద్ధికి తోడ్పడి రనుట కెంతయుఁ సంతోషించుచున్నారము.

(మ. సాం.)

## ౨ చిత్రలేఖనము. *

జయపురమునివాసు లగు తలిసెట్టి రామరావు పంతులు గారీ వత్సరమునందు చిత్రలేఖన విద్యను గురించి రచించిన ఆంధ్రగ్రంథము మన మాతృమూర్తికి వినూత్నాలంకారప్రాయమై చిత్రకళాభ్యాసకు లగు విద్యార్థిబృందమునకు పరమోపకారియై తనరారగలదు. ఆంధ్రభాషయందు చిత్రకళాగ్రంథములు లేనేలేవు. ఏ దేశమునందైనను నే కాలమునందైనను విద్వాంసులను బట్టియే గ్రంథసముదాయ ముద్భవించుచుండును. ఆంధ్రదేశమునం దింతవరకును చిత్రకళాగ్రంథములు కొఱతపడి యుండుటకు కారణము తచ్ఛాస్త్రజ్ఞులు లేకపోవుట గాని వేరు కారణము కానేరదు. కళాప్రదర్శనమునకు చిత్తసంస్కారముతో పాటు, శాస్త్రపారంగతులును, శాస్త్రగ్రంథములును, సృష్టివైచిత్ర్యము నుపాంగములు. ఆ యంగత్రయసమ్మేళనమునందే కళాప్రపంచనిర్మాణము సుసాధ్యమగును. ఆంధ్రదేశమునందు చిత్రకళాప్రపంచ నిర్మాణమునకు కావలసి యుండిన సృష్టివైచిత్ర్యమునకు కొదువలేదు. నేత్రపర్వమును, వివిధరామణీయకవిలసితమును,

---

* ఈ గ్రంథము వలయువారు వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండు సన్సు, ఎస్ప్లనేడు, మద్రాసు అని వ్రాయవలెను. వెల రు. ౧-౪-౦.

చిత్త సంస్కారజనకమై మహోన్నతాదర్శోద్భాసితమై అలరారు మహేంద్రగిరి ఆంధ్రదేశమునందే కలదు. విశాఖపట్టణ మండలమునందలి సింహాచలము ప్రకృతివైచిత్ర్యమునకు పుట్టినిల్లు; అక్కడి, విచిత్రములను జూచుచు వచ్చినకొలదిని మనోత్తేజము కలిగి, మానవునకు తన్మయత్వమును, తన్మూలముగ ఆత్మోపలబ్ధియు కలిగితీరును. సింహాచలమునందలి మాధవధార స్వర్గీయ సౌందర్యమును ధిక్కరించుచుండును. అక్కడి, నిసర్గ తేజము ఇటలీ దేశమునందలి ఆల్ప్సుగిరుల సౌందర్యమును జ్ఞాపకము చేసి, నూతనలోకమును దృక్పథము చేయుచుండును. ఆంధ్రదేశమునందలి దండకారణ్యము వివిధ కళా సుశోభితము. మహానందీశ్వరమునందును, శ్రీశైలమునందును, తిరుపతియందును, ప్రకృతికన్య అవారితముగను, విచ్చలవిడిగను, సర్వతోముఖముగను విహరించి, కళాపరిపూర్ణులందు తన సౌందర్యరాశిని వర్షింపజేసి, వారిని తన తేజమునందు లీనము గావించుచుండును. ఆంధ్రదేశము కళాస్థానము లగు తరంగిణులకు నిలయము. వివిధ నగరములను చూపరులకు కళా విశేషమును బోధించుచున్నవి. కాని దేశమునందలి ప్రకృతి సంపదకును, ప్రజల కళా కౌశలమునకును, చిత్తస్థైర్యమునకును సంయోగ మింతవరకును కలిగి వివిధకళలను వికసించని లోపము చిత్రకళయందును కనిపించుచున్నది. ఆంధ్రదేశమునందలి చిత్రకారుని మనోవీథిని ఆంధ్రరసరంగము నాట్యమాడుటకు బదులు, ఆంధ్రేతర రసజగత్తే స్ఫురించునట్లు ప్రకృతపు దశయందు చెప్పవలసి యుండును. ఆంధ్ర చిత్రకారుడు రచించు చిత్రములను దిలకించు ఆంధ్రేతరునకు ఆంధ్రుల హృదయము శూన్యమై ఆంధ్రులు ఆంధ్రేతరుల రసార్ణవమందు పడిపోయి బహిర్గతము కాలేక పోయిరా యను సంశయము నకాస్పదమగుచున్నది. ఆంధ్రుల హృదయ మెన్నడును రసశూన్యమై పోయి యుండలేదు; ప్రస్తుతము గాని, భావికాలమునందు గాని యట్లెన్నడును జరుగనేరదు. ఆంధ్రుల ప్రత్యగ్వ్యక్తి కారణాంతరములచే వికసింపక మందీభూతమగుటయే యిందుకు కారణమని నా యభిప్రాయము. ఆంధ్రులెప్పుడు తిరిగి తమ ప్రత్యేకసంపద యగు రసార్ణవమునందు క్రీడింప మొదలిడుదురో అప్పుడు ఆంధ్రులకు ప్రత్యేక లక్షణలక్షితమగు సాహిత్యము, కళ, సంగీతము, శిల్పము, చిత్రలేఖనము వగ్గడి, ఆంధ్రమాత సర్వాలంకారభూషితయై ప్రకాశించి, వారిని దీవించి, వారికి వరముల నొసగి, వారిని తన అంకశయ్యయందు నెలకొల్పుకొని పాలించును. ఆంధ్ర చిత్రకళను ప్రకాశింపజేయని లోపము ఆంధ్రులది గాని తదితరులది కానేరదు. ఆంధ్రదేశమునందు చిత్రకళ నభ్యసించి పరదేశములకు ఉన్నత జ్ఞానసంపాదనముకొరకు పోవువారు తమకు సలక్షణమైన కళాకౌశలమును వృద్ధిచేసికొని ఆంధ్రులకు మార్గదర్శకులగుటకు బదులు తమకు విలక్షణమైన కళా సేవయందు నిమగ్నులగుచుండుట సంతాపకారణము గాని సంతోషదాయకము కాదు. ఆంధ్రరసపోషణమునకును, కళా విజృంభణమునకును రామారావుగారి గ్రంథము చాలవరకు తోడ్పడు ననుటకు సందియము లేదు. ఆంధ్రమునందు చిత్రకళాగ్రంథములు లేనిలోపమును దీర్చుటకై వారీ గ్రంథమును వ్రాసి యుండిరి. వారి ప్రథమ ప్రయత్నము ఆంధ్రకళాసౌధనిర్మాణమునకు పునాది కాగలదు.

రామారావుగారి గ్రంథము రెండుఖండములుగ నున్నది. ఒక్కొక్క ఖండమునందు భాగపంచకమును, వానియందు చిత్రలేఖనకళాపరిణామమునకు వర్తించు వివిధవిషయములును గలవు. జంతువులను, చెండులు మున్నగు స్వల్పవస్తువులను, వృక్షములను, పక్షులను, ఇండ్లను, వివిధకోణాకృతి గల ఘనపదార్థములను వ్రాయుటకు నభ్యసింపవలసిన సంవిధానమును బాలురకును చదువువారికిని సుగ్రాహ్యమగునట్లు ప్రథమఖండమునందలి మొదటి రెండుభాగములందును వరుసగ గ్రంథకర్త తెలియజెప్పియుండిరి. సౌందర్యముచేతను, రామణీయకవిశిష్టము నగు ప్రకృతినిచిత్రము లనేకములు భరతవర్షమునం దలరారుచున్న వని ప్రారంభమునందే చెప్పియుంటిని. కళాపరిపూర్ణతకు కావలసిన, ఆశ్చర్యజనకము లగు ప్రకృతిప్రదేశములను చిత్రించు విధానమును మూడవభాగమునందు గ్రంథకర్త వ్యక్తముచేసి

యుండిరి. నాల్గవభాగమునందు మనుజుని రూపలేఖనమును గురించియు, పంచమ భాగమునందు ఛాయాపటములను విస్తృతముగ వ్రాయుపద్ధతిని గురించియు ద్వితీయఖండమునందలి ప్రథమ భాగమునందు చిత్రములకు రంగువ్రాయుటను గురించియు, రెండవ భాగమునందు విశేషించి ప్రదేశపటములను రంగులతో చిత్రించుటను గురించియు, మూడవభాగమునం దుదహరించియుండిన వృక్షతతిని చిత్రించు విధానమునందు వృక్షస్వభావము మున్నగు విషయములను గురించియు, రామారావుగారు చిత్రకారుల కుపయుక్తములైన విషయముల నెన్నిటినో తెలియజేసి భారతవర్షమునందలి స్పృష్టివై చిత్రములను చిత్రించుట కనువైన మార్గములను ప్రదర్శించి ఇతర భారతీయులతో పాటు ఆంధ్రులును, చిత్రలేఖనవిద్యయందు త్తీర్ణులై ప్రసిద్ధిని గాంచుటకు మార్గదర్శకులైరని చెప్ప సాహసించిన యెడల అతిశయోక్తి దోషముకలుగ నేరదు. నాల్గవభాగమునందు వివిధరంగుల యుపయోగములను వారు వ్యక్తీకరించి ఐదవభాగమునందు వివిధాంశములను తెలియజేసి యుండిరి. రామారావుగారెంతయో కృషిచేసి వ్రాసిన గ్రంథము ఆంధ్రుల మన్ననకును, ప్రోత్సాహమునకును పాత్రము కాగలదని చెప్పవచ్చును. పాలకు లాగ్రంథమును పాఠశాలలందు పఠనీయముగ నేర్పరచినయెడల చిత్రకళ నభ్యసించవలసిన విద్యార్థులకు ప్రయోజనకరముగ నుండును. పాండిత్య జ్ఞానమక్కరలేకనే చదివి విషయమును గ్రహించుటకు వీలగునట్లు వ్రాసిన రామారావుగారి గ్రంథము ఆంధ్ర బాలుర హస్తసీమలందును, నారీమణుల పాకశాలలలోను, జనసామాన్యపు పాలిటి విద్యాశాలలని చెప్పదగిన గ్రంథాలయపీఠముల నలంకరించి తీరును. గ్రంథకర్తయు, గ్రంథ ప్రకాశకులగు వావిళ్ల రామస్వామిశాస్త్రి సోదరులును ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులు.

—క. ల. న.

# విజ్ఞప్తి

ఈగ్రంథముతో గ్రంథాలయసర్వస్వముయొక్క రెండవసంపుటము ముగిసినది. అనివార్యములగు ఇబ్బందులవలన ఈ సంపుటమునందలి 3, ౪ సంచికలను ప్రకటించుటయందాలశ్యమైనది. అందుచేత ఆ రెండు సంచికలనుకలిపియే, ఇపుడు ప్రకటించియున్నారము. చందాదారు లీలోపమును మన్నించెదరని తలచుచున్నారము. కాగితములయొక్క ధర అమితముగ పెరిగిపోయియున్నది. దినదినమును పెరిగిపోవుచున్నది. పటములు వేయుటకు కావలసిన "ఆర్టు" కాకితము కావలసిన ఆకృతియందు దొరకుటయే లేదు. ఇట్టి స్థితియందు గ్రంథములను ముద్రించుట దుర్లభమైపోయినది.

గ్రంథాలయోద్యమము ఆంధ్రదేశమునందు దినదిన ప్రవర్ధమానమై వెలయుచున్నది. బరోడారాష్ట్రమునందు, ప్రభువుల సహాయముచేతనే గ్రంథాలయములు స్థాపింపబడుచున్నవి. ఆంధ్రదేశమందన్ననో స్వయం సహాయముమీదనే ఈ యుద్యమము ఆధారపడియున్నది. అమెరికాయందువలె మనదేశమందు "కార్నిజీ" వంటి దాతలదాతృత్వ మింకను ఈ యుద్యమము పైపునకు మరలలేదు. "బరోడా" యందువలె ప్రభువుల సహాయమింకను ఈయుద్యమముపట్ల లభింపలేదు. ఇతర దేశములయందువలె ప్రోత్సాహములేకపోవుట యటుండ ఆంధ్రదేశము నందింకను పెద్దలయొక్క మనోదృష్టియందీ యుద్యమమునకు స్థానమేర్పడలేదు.

అందుచేత గ్రంథాలయములు స్థాపించుటయందును, నిర్వహించుటయందును, ఉత్సాహవంతులగు యువకులు, తీవ్రకష్టపరంపరలను లోను గాకలసివచ్చుచున్నది. గ్రంథాలయనిర్వాహకు లీ యాటంకముల నన్నిటిని సరకుచేయక తమ సంకల్పము సఫలమగునందాక మిక్కిలి ఉత్సాహముతో కార్యములను నిర్వహించుచున్నారు.

భారతవర్షమున కంతకును, భారతవర్షమున నేల—ప్రపంచమునకంతకును ఆంధ్రదేశమున యున్న గ్రంథాలయోద్యమము ఆదర్శ న్నది. ఇట్లు వ్రాసితిమని స్తో

ప్రపంచమునందు ఎవ్వరికైనను, స్వస్వరూపానందము లభించినగాని ఆత్మస్వత్వమును బొందజాలరు. అదే విధమున, మనయుద్యమముయొక్క స్వస్వరూపానందము ననుభవించినగాని, ఉద్యమమునందున్నతస్థానము నాక్రమింపజాలము. కావున మనయుద్యమమును నిరసించుకొనిన లాభములేదు. ఈ యుద్యమముయొక్క శ్రేష్ఠతను గ్రహింపవలెను. గ్రహించి అనుభవింపవలెను. అప్పుడుగాని, ఆంధ్రదేశగ్రంథాలయోద్యమము ప్రపంచమున కంతకును ఆదర్శప్రాయ మని గోచరింపదు.

ఇట్టి మహోత్కృష్టమైన ఉద్యమ ఆశయములను, భారతవర్షమునకును, తద్వారా ప్రపంచమునకంతకును గూడ ఒసంగుట మన విధ్యుక్తధర్మమైయున్నది. ఈ ధర్మమును నిర్వర్తించుటకై ప్రస్తుత స్థితియందు గ్రంథాలయసర్వస్వమునకు ఆంగ్లేయభాగమును గూడ జేర్చుట అత్యంతావశ్యకమైయున్నది. ఆంధ్రేతరులతో మన యుద్యమమునుగూర్చి మాట్లాడినప్పుడీ యావశ్యకత బాగుగ గోచరించినది. అందుచేత రాబోవుసంచిక నుండి గ్రంథాలయ సర్వస్వమునకు ఆంగ్లేయభాగమును గూడ జేర్చుటకై నిశ్చయించుకొంటిమి. ఇంతేగాక, మూడవ సంపుటము నుండియు సంవత్సరమునకు ఆరు భాగములు చొప్పున ప్రకటించుటకై, ఏర్పాటును జేసితిమి. చందా మునుపటివలెనే యుండును కాని ఆంధ్రభాగమును ఆంగ్లేయభాగమును రెండును గూడ కావలసినవారు రు ౪లు నియ్యవలసియుండును. ఆంధ్రభాగము మాత్రము కావలసినవారు ఆరుభాగములకు (సంవత్సరమునకు) 3 రూపాయలనుమాత్ర మియ్యవలసియుండును. కావున చందాదారులందరును తమకు రెండుభాగములును కావలసియున్నదియు, లేక ఆంధ్రభాగము మాత్రము కావలసియున్నదియు వెంటనే తెలుపుటకు కోరుచున్నారము.

## వావిళ్లవారి సహాయము.

మద్రాసునందున్న వావిళ్ల వేంకటేశ్వర శాస్త్రులు అండు సన్సువారు, ఆంధ్రదేశమున గల జిల్లాలన్నిటియందును స్థాపించునట్టి ౧౧ మండల గ్రంథాలయములకును, నైజాము రాజ్యమునందేర్పడునట్టి మండలగ్రంథాలయమునకును, ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘమునకును, తముచే ప్రకటింపబడినట్టియు, ప్రకటింపబడబోవునట్టియు గ్రంథముల నన్నింటిని ఇచ్చెద మని తమంతట తామె వాగ్దాన మొనర్చిరి. వారి గ్రంథము లింతవరకును ప్రకటింపబడినవే రు ౬౫౦ ల విలువ గలిగి యున్నవి. వావిళ్ల వారి వాగ్దానముతో, ఆంధ్రదేశ గ్రంథాలయోద్యమమునందొక నూతనశకము ఏర్పడినదని చెప్పిన అతిశయోక్తి గానేరదు. వారి వాగ్దానము వలన, మన మిప్పుడు మండల గ్రంథాలయములను వెంటనే స్థాపింపవలసిన యావశ్యకత బాగుగ గలిగినది. వారి ప్రోత్సాహమువలన మండల గ్రంథాలయములు త్వరగ స్థాపింపబడు నటుకు సందియము లేదు. మండల గ్రంథాలయములు స్థాపింపబడిన యెడల గ్రంథాలయోద్యమము ప్రతి జిల్లాయందును విరివిగ వ్యాపించునటుకు సందియము లేదు. కావున మండల గ్రంథాలయములను వెంటనే స్థాపించి, ఈ యమూల్య సహాయమును బొందెదరు గాక యని కోరుచున్నాము.

## నలనామ వత్సర గ్రంథాలయ చరిత్ర.

నలనామ సంవత్సరమునకు గ్రంథాలయముల చరిత్రను గ్రంథాలయ సర్వస్వమునందే ముద్రింపవలయునని తలంచి, వేరుగ ప్రకటింపలేదు. గ్రంథాలయ సర్వస్వముయొక్క ఈ రెండు సంచికలను ముద్రించు నప్పటికి, పింగళ సంవత్సరాంతము కూడ వచ్చినది. అందుచేత ఇప్పుడు నలనామ సంవత్సర గ్రంథాలయ చరిత్రను ముద్రించుట యుక్తముగ నుండదను తలంపుతో, దానిని ముద్రించుటను మానితిమి. పింగళనామ సంవత్సర చరిత్రను, కాళయుక్తి సంవత్సర ప్రారంభమునందే ప్రకటించుటకై ప్రయత్నించెదము.

...౩ పుట మొదలు 200 పుటలవరకును చెన్నపురి “ఇండియా ప్రింటింగువర్క్సు” ...బడినది.

# ఉ చి త ము

## పుస్తకభాండాగారముల కుచితము.

సకల పుస్తకభాండాగారాధికారులకును విన్నవించునది యేమనగా దక్కన్ హైదరాబాదాయిలాకా బాగు అంబరుపేట వాస్తవ్యులగు అన్నగారి వెంకటకృష్ణరావుగారిచే రచింపబడిన,
1 శ్రీకృష్ణకథాపదక ప్రాతిధైర్యశతకం, 2 సర్వసంబోధన కృష్ణశతకం, 3 హనుమంత శతకం, 4 విశ్వేశ్వరశతకం, 5 శ్రీరంగశతకం, 6 రామకథా ప్రతివాదక ధైర్యశతకం, 7 శ్రీహరిశతకం, 8 జీడికంటి రామశతకం, 9 లక్ష్మీశతకం, 10 శ్రీకృష్ణనామాంకితస్త్రీవిరహసీసశతకం, 11 అద్భుతరామాయణం అను నీ గ్రంథములను గ్రంథభాండాగారములకు నుచితముగ బంప సిద్ధముగానున్నారు. కావున కావలసిన భాండాగారాధిపతులు టపాలాఖర్చులకుగాను రెండణాలనుపంపించిన నీక్రింద వివరించిన చిరునామాదార్లు పంపించగలరు. వారిచే నచ్చొత్తింపబడిన పంచాంగము అనగా క్యాలండరు సహా పంపించగలరు.

చిరునామా - వంటెద్దు నాగయ్య అండ్ సన్సు,
రాజమండ్రి.

---

## ఉ చి త ము .

ఇదివరకు ప్రకటింపబడి నిల్వ ఉన్నవరకు కృష్ణాజిల్లా సంఘమువారి ప్రచురములును, కృష్ణామండలసభల తాలూకు రిపోర్టులు కృష్ణాజిల్లాలోని గ్రంథాలయములకు పంపబడును. పోస్టేజికిగాను ౨ అణాలు పంపవలెను.

చిరునామా - కొడాలి శివరామకృష్ణరావు,
మచిలీపట్నము.

---

# వంగూరి సుబ్బారావుగారి గ్రంథములు



### (1) ప్రథమముద్రణము

1 లలితకుమారి (రసపుత్రులనవల) రు 0-10-0
2 కాంచనమాల (చిన్నవింతనవల) 0-3-0
3 మాయ (గూఢచారినవల) 0-6-0
4 ప్రభాతము (చరిత్రవిషయికమగునవల) 0-12-0
5 ఈసబునీతికథలు బొమ్మలతో 2 భా. 1-0-0
6 అరేబియన్ నైట్సుకథలు(చక్కనితెలుగు) 1-4-0

### (2) ద్వితీయముద్రణము

7 ఇందిర (ఇప్పుడు దొరకదు)
8 వీరపత్ని 0-1-0
9 సుశీల 0-1-0
10 కడపటికోరిక 0-1-0
11 ప్రభావతి 0-1-0
12 రోహిణి 0-2-0
13 రత్నపురి 0-2-0
14 ఆశ 0-1-0
15 అగ్ని 0-1-0
16 స్వయంకృతాపరాధము 0-1-0
17 విచిత్రవివాహము 0-1-0
18 రక్తలేఖ (ప్రతులు లేవు)

### (3) తృతీయముద్రణము

19 గులేబహారు 0-4-0
20 యతికిరబతి. (ప్రతులులేవు)
21 సుభాషిణి ,,
22 తిరుమల ,,
23 చంద్రవదన ,,
24 రుక్మిణి డిటో
25 బసివిరెడ్డి డిటో
26 మహాలక్ష్మి 0-1-0
27 రాయలరాజనీతి 0-4-0

### (4) ముద్రణమునకు సిద్ధముగనున్నవి

28 రుద్రమదేవి
29 వలపుమందు

### (5) సిద్ధమగుచున్నవి

30 కలికాలనిర్ణయము
31 పాచనసోమనాథుఁడు

(Telugu Men of letters)

ఈ గ్రంథములు వలయువారు :—

వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండు సన్సు
192. ఎస్ప్లనేడు, చెన్నపురి
అని వ్రాసికొనవలయును.

238.
RSVM01A107

# చెన్నపురాంధ్రసభ—విద్యాశాఖ

## గ్రంథాలయోద్యమము

సభాధ్యక్షుఁడు: రావు బహదూర్ పి. త్యాగరాయసెట్టి గారు, బి. ఏ.
శాఖాధ్యక్షుఁడు: వేదము వేంకటరాయశాస్త్రి గారు.
గ్రంథాలయాధికారి: సామి వేంకటాచలము శ్రేష్ఠి గారు.

ఆంధ్ర హాల్
9, బ్రాడ్వే
మద్రాసు. 10-1-1918

అయ్యా,

ఈ రాజధానీనగరమం దనాదిగ సుసంపన్ను లైన యాంధ్రమహాజను లధికసంఖ్యాకు లున్నను, అనేక కారణములచే ఆంధ్రవ్యక్తిత్వము క్రమక్రమముగ క్షీణించి చిరకాలము దుర్బలముగ నుండెను. ఈ వ్యక్తిత్వమును పునరుద్ధరించి ఆంధ్రుల యైకమత్యమునకును సర్వతోముఖమైన వారి యభివృద్ధికిని తోడ్పడెడి యుద్దేశముతో ఇటీవల చెన్నపురాంధ్రసభ వివిధశాఖలతో స్థాపింపఁబడియుండుట జగద్విదితము. అచిరకాలములోనే (ఇక్కడి వారును బైటివారును చేరి) ఇంచుమించు 1,000 మంది సభ్యులను సమాకర్షించుట యొక్కటె యేతత్సభాప్రాశస్త్యమునకు ప్రబలనిదర్శనము. రాజులు జమీందారులు భూస్వాములు రాజతుల్యులగు వర్తకశిఖామణులు ఉభయశాసనసభాసభ్యులు ఉద్యోగులు విద్వాంసులు కవీశ్వరులు మున్నగు వివిధమహాజనుల యాదరణమునకును ఈ సభ యాస్పద మగుట కడుంగడు ప్రశంసనీయము. ఇపుడీ సభ పూర్వము 'ఓక్సు ఎక్స్చేంజి హాలు' అనఁబడు మహాభవనమునకు మాఱుట కూడ సభాభ్యుదయస్థితికి తార్కాణము.

ఇట్టి యీ సభకు సంబంధించిన విద్యాశాఖ ఇంతవఱకుఁ గావించిన పనులు (అనఁగా, సభలు సమావేశపఱచి ఆంధ్రజాతీయతాప్రబోధమున కవశ్య మైన యుపన్యాసము లిప్పించుట, భాషాభ్యుదయమున కవశ్యము లైన విషయములను ఆంధ్రపౌరసభలలో చర్చించి నిర్ధారణ చేసి అధికారులకు నివేదించుట, విజయదశమీబహుమాన పరీక్షల నేర్పఱచుట మొదలగు కార్యములు) ప్రజారంజకములై ప్రయోజనకరములుగ పరిగణింపఁబడినను, ఇంకను గావింపఁబడవలసిన పని యెంతయో కల దనుట నిర్వివాదాంశము. ఈ రాజధానీనగరమున, ఇట్టి సభ యుండియు, సాంగోపాంగ మైన గ్రంథాలయ మొకటి లేకపోవుట మిగుల శోచనీయము. గ్రంథాలయమును స్థాపించుట విద్యాశాఖవారి కార్యక్రమములోని ప్రధానాంశము. గ్రంథాలయస్థాపనమునకు ఆంధ్రగ్రంథములతోఁ బాటు అవశ్యము లైన సంస్కృతాంగ్లేయగ్రంథములు కూడ సేకరింపఁబడవలసియున్నవి. వానిని భద్రపఱచి యుపయోగపఱచుటకు విశేష మైన దారుసామగ్రియు నవశ్యము.

ఈ మహాకార్యమును సాధించుటకు పెక్కు వేల రూప్యములు కావలసియున్నవి. సుసంపన్న మైన యాంధ్రజనబాహుళ్యము గల యీ రాజధానీనగరమందు అంద ఱాంధ్రుల యభిమానమునకును పాత్ర మైన యీ సభ వలయు ద్రవ్యమును సముపార్జించుట కష్టసాధ్యము కా దనెడి ధైర్యముతో గ్రంథాలయోద్యమ మిపు డుపక్రమింపఁబడినది. ఈ యుపక్రమణమునకు పూర్వమే గ్రంథాలయాధికారి సామి వేంకటాచలము శ్రేష్ఠి గారు, తమ యౌదార్యాతిశయమును భాషాభిమానమును వ్యక్తపడ, 1,000 రూప్యముల విరాళము నొసంగుట ఎంతయు శుభసూచకము.

కొన్ని ముఖ్యకారణములచేత ఈ గ్రంథాలయస్థాపనకార్యము, సాధ్య మగునెడల త్వరలోనే నెఱవేఱుట మిగుల లాభకరముగ నూహింపఁబడుచున్నది కనుక, సభ్యులును విద్యాభిమానులగు తదితరమహాజనులును అందఱును యథాశక్తి నీ మహోద్యమమునకు సకాలమున తోడ్పడి సభోద్దేశమును నెఱవేర్పఁ బ్రార్థితులు.

సభాసహాకార్యదర్శులు:
కాశీనాథుని నాగేశ్వరరావు,
కుల్లి నరసింహారావు నాయఁడు.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,
కాళ్లకూరి గోపాలరావు,
విద్యాశాఖాకార్యదర్శి.

తా. క.—ఈ యుద్యమమునకు మహాజను లొసంగెడి విరాళములు 'మద్రాసునందలి ఇండియన్ బ్యాంకి' యొక్క 'ఎస్ప్లనేడ్ బ్రాంచి' (Esplanade Branch of the Indian Bank, Madras) లో చెన్నపురాంధ్రసభయొక్క గ్రంథాలయనిధి (The Madras Andhra Sabha Library Fund) పేర జమకట్టునట్లు పంపఁబడవలెను.

PRINTED AT THE ANDHRA PATRIKA PRESS, MADRAS.

| | |
|---|---|
| | మనసు ఫౌండేషన్<br>పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVM01 A107 |
| పుస్తకం పేరు | గండాలఘట్టా నర్సప్పలు |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 91 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | no |
| లేని పేజీలు | 1 to 146 |
| తయారు చేసినది | Sandhya |
| పేజీలు విడదీసినది | Sandhya |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | Pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | No |
| పరిస్థితి | good |